


రూ. 6/-
-88
దేశంలో అత్యధికంగా కొని చదువ తున్న తెలుగు మాసపత్రిక



Imageads 2418 Tel

OBM-824 TG



స్థాపకుడు: వి.వి.రాఘవయ్య

మేనేజింగ్ ఎడిటర్: లీలావతి రాఘవయ్య

సంపుటి 27 జూన్-88 సంచిక 5

"ఇదండీ వరస"

కథలు

జంక్షనులో బడ్డీ	చాగంటి సోమయాజులు	8
పాడుకల	బలివాడ కాంతారావు	46
సింహాసనం	పి.వి.ఆర్. శివకుమార్	67
ముగ్గురు గుమాస్తాలకథ	రాచకొండ విశ్వనాథశాస్త్రి	76
బ్రహ్మదేవుని మహాసభ	కాళ్ళూరి జోగారావు	90
గుస్సా	శంకరమంచి పార్థసారథి	105

సీరియల్స్

మంచుపర్వతం	యండమూరి వీరేంద్రనాథ్	30
డెత్ ట్రాప్	తోటకూర ఆశాలత	56
డిక్టేటర్	సూర్యదేవర రామ్మోహన రావు	98

ఫీచర్స్

హ్యూమరాలజీ-68	యర్రంశెట్టి శాయి	20
కంప్యూటర్ టీజింగ్	కంప్యూటర్	62
పదవ్యూహం-16	యూష్ని	74
అబద్ధాల పోటీ		88

మహోన్నత కార్యానికి చప్పట్లు	4
ఆశాజ్యోతి - కిరణం - బాల భవన్	60

ఈ నెల ప్రత్యేక నవలానుబంధం:

అరణ్య మరణం - కాదంబరి కిరణ్ కుమార్

ఈ నెల ముఖచిత్రం: కృష్ణ, రాధ

జ్యోతి పి. బి. నెం. 1824, హైదరాబాదు-20. ఫోన్-44104



పి.మోహనరావు

ఫిబ్రవరి 12, 1988 సాయంత్రం 6 గంటల

30 నిమిషాలు. వేదిక డి. యమ్.ఎన్. కాంప్లెక్స్. తేనాం పేట మద్రాసు.

షుమారు 3,000 ముంది విద్యార్థులు అత్యంత ఉత్సాహంతో చప్పట్లు చరుస్తున్నారు. అలా అయిదు నిముషాలు ఆ ప్రాంతమంతా చప్పట్లతోహోరెత్తి ఆగిపోయింది.

అప్పుడు ఆ నిశ్శబ్దంలో నెమ్మదిగా ఒక్కొక్కసారే ఒకవ్యక్తి చప్పట్లు వినిపిస్తున్నాయి. ఆ వ్యక్తి చప్పట్లు అలా 67 గంటల ఐదు నిముషాలపాటు, సుదీర్ఘంగా మ్రోగుతూనే ఉన్నాయి.

ఆ చప్పట్ల విలువ ఐదు లక్షల రూపాయలపై చిలుకే! ఆ ధనం హిందూ మిషన్ హాస్పిటల్, తాంబరం వారి నూతన భవన నిర్మాణానికి, రోటరీ క్లబ్, మద్రాసు నార్త్ వారి పోలియోప్లస్ ప్రోగ్రామ్‌కి దానం చేయబడింది.

ఈ ప్రపంచ రికార్డ్ చప్పట్లు చరిచిన వ్యక్తి శ్రీ జయరామన్. వయసు 32 సంవత్సరాలు. ఉద్యోగం ఒక జాతీయ బ్యాంకులో అగ్రికల్చరల్ ఆఫీసరుగా. ఈ ప్రపంచ రికార్డు సాధించి గిన్నిస్ బుక్ ఆఫ్‌వరల్డ్ రికార్డ్సులో పేరు నమోదు చేయించుకొన్న శ్రీ జయరామన్ జ్యోతి మాసపత్రికకిచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో అత్యంత ఆసక్తికరమైన విషయాలు తెలిపారు.

మధురై జిల్లాలోని కుగ్రామం లక్ష్మీపురంలో ఒక పేద వ్యవసాయ కుటుంబంలో జన్మించిన శ్రీ జయరామన్ చిన్నతనంలో రోజూ 6 మైళ్ళ దూరంలో ఉన్న స్కూల్‌కు నడిచి వెళ్ళి చదువుకొన్నారు. ఆయన మొట్టమొదటిసారిగా చూసిన పట్టణం "కోయంబత్తూరు" - కాలేజీ చదువు సందర్భంగా కాలేజీరోజుల్లో పర్వతారోహణ, సైక్లింగ్, ట్రెక్కింగ్‌ల్లో ప్రవేశమున్న ఖర్చు తక్కువగా ఉండే ఆ... కోసం వెదక



శ్రీ జయరామన్‌ను అభినందిస్తున్న సినీనటులు శ్రీ జయశంకర్, డిస్కోశాంతి. ఆ ప్రక్కనున్న వారు శ్రీ.ఎమ్.బి. నిర్మల్ (సీనియర్ మేనేజర్, ఐ.ఓ.బి. తేనాంపేట) క్లాప్ ఫర్ ఛారిటీ కార్యక్రమాన్ని రూపొందించి, నిర్వహించారు.

సాగారు. సరిగ్గా ఆసమయంలోనే ఆయన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్సు పుస్తకం కొనటం సంభవించింది. అందులో జమైకా దేశస్థుడు అశితాఫర్‌మాన్ అనే అతను యాభై గంటల పదిహేడు నిముషాల పాటు చప్పట్లు చరిచి ప్రపంచ రికార్డ్ సాధించిన విషయం చదివి తానూ ఆ రికార్డును బద్దలు కొట్టాలని నిర్ణయించుకున్నారు. ఆ విషయం భార్య కళావతితో అంటే ఆవిడ నవ్వేసింది పట్టువదలక పెరంబలూరు తాలూకా రోటరి క్లబ్ సభ్యుల్ని ఒప్పించి మొదటి సారిగా డిసెంబర్ 1985, 13 నుండి 15వ తారీఖు వరకూ నిర్విరామంగా 54 గంటలపాటు చప్పట్లు కొట్టి ప్రపంచ రికార్డును పటా పంచలు చేశారు. వారి కుటుంబ సభ్యులందరూ పత్రికలలో ఈ వార్త చూచి సంభ్రమాశ్చర్యాలలో మునిగిపోయారు. ఊరికే ప్రపంచ రికార్డును సాధించే విషయంగానే కాక దీనివల్ల ఏదైనా ప్రజోపయోగం కలగాలని తాను నమ్ముతానని శ్రీ జయరామన్ అన్నారు. ఈ ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకొని గత ఫిబ్రవరిలో "క్లాప్ ఫర్ ఛారిటీ" పేరిట 67 గంటల సుదీర్ఘకాలంపాటు చప్పట్లు చరిచారు.

ఉత్తరాలు

స్వచ్ఛంగా వస్తున్న మన 'జ్యోతి'కి అభినందనలు. అబద్ధాలపోటీ, కంప్యూటర్ టీజింగ్ శీర్షికలు ఆసక్తికరంగా ఉన్నాయి. మాటకట్లు మెదడుకి మేత పెడ్తుంది.

యర్రంశెట్టి శాయిగారి హ్యూమరాలజీ 'జ్యోతి'కే హైలైట్. ఎడిటర్‌గార్కి మనః పూర్వక అభినందనలు.

వేల నాగేశ్వరరావు
అనకాపల్లి

మే'88 జ్యోతి సంచిక ఎన్నో విశేషాలతో ఎంతో అందంగా ముస్తాబై మాకందింది. అమల ముఖచిత్రం అందంగా ఉంది. "పాతికేళ్ళ సాహసం" చిత్రాలతో చక్కని విషయాలతో బాగుంది. అలనాడు, నేడు ఈ రజతోత్సవంకూడా డాక్టర్ అక్కినేని నాగేశ్వర్రావుగారి సమక్షంలో జరగడం బాగుంది. మద్రాసులో జరిగిన రజతోత్సవం విశేషాలు కూడా బాగున్నాయి.

యర్రంశెట్టి శాయిగారి 'హ్యూమరాలజీ-62' పబ్లిషర్‌గారొస్తున్నారు శీర్షికలో నవలా రచయితల బాధలు, పబ్లిషర్ల ఆగడాలు చక్కగా ఉన్నాయి. ఈరోజుల్లో రచయితలు ఏ విధమైన ఇబ్బందులెదుర్కొంటున్నారో వివరంగా తెలిపారు. పబ్లిషర్లు నవలలను తూకంలో కొనడం చూస్తుంటే రచయితల దీనస్థితి ఎలాఉందో చదువుతున్నంతసేపు బాధగా అనిపించిందిమరి. ముగింపుకోసం ఎదురు చూస్తున్నాం. ప్రతినెలా ఓమంచి నవలతో మా అనుబంధం, అభిమానం పెరుగుతుందేతప్ప తరగడం లేదంటే నమ్మండి మరి.

పోలోజు వెంకటాచారి
హెచ్.సి.ఎల్ టౌన్‌షిప్

25 సంవత్సరాల గడిచిపోయిన కాలాన్ని తిరిగివర్తమానంగా రజతోత్సవ సంచిక ప్రత్యక్ష పరిచింది - ప్రతి తెలుగువాడికి రజతోత్సవ సంచిక ఆవిర్భావం పండుగే! తెలుగు సామెతలనుండి మేము ఆనాడు చదవలేని వయస్సులో వచ్చిన హృద్యమైన కథలు - బాపుగారి కార్టూన్లు, ఆరుద్ర కూనలమ్మ పదాలు ఓహో ఒక్కసారే తెలుగు వాడికి గొప్ప అదృష్టంగా అందించారు! ముఖ్యంగా పురాణంగారి 'సీతజడ' చదివే యోగం కలిగింది - ఇంతే కాకుండా అరుదుగా లభ్యమయ్యే 'అజంతా' గారి కవిత న్యూస్‌రీల్ - మాకు శాశ్వతంగా లభించింది. ఒక వ్యక్తి జీవితంలో 25 సంవత్సరాలు ఎంత ముఖ్యమో 'జ్యోతి' రజతోత్సవ సంచిక అంతకన్నా ప్రాముఖ్యాన్ని కలిగి ఉంది - జ్యోతికి మా అభినందనలు.

తందాసై రాఘవాచార్యులు
వి.వి. చందన్‌రావ్
నిజామాబాద్

ఏప్రిల్ సంచిక రాకపోవడం మాకు చాలా బాధాకరంగా వుంది. 'మే' సంచిక కూడా చాలా ఆలస్యంగా వచ్చింది. "రజతజ్యోతి వెలుగులు" శీర్షికన ప్రచురించిన రెండుకథలూ ఆణిముత్యాలే.

వి. రాము
గుంటూరు

88 మార్చి సంచికలో నిఖిలేశ్వర్‌గారి కథ "విద్యాయామృత మశ్నుతే" చదివాను. యవ్వనంఅంతా ధారపోసి వయసు ఉడిగిన తరువాత, ఏపనీ చేయలేక కేవలం పెన్షనుపై ఆధారపడి బతికేవారి అవస్థ దుర్భరం. పెన్షనురాక ఆత్మహత్యలు చేసుకున్నవారు ఎందరో ఉన్నారు. ఆఫీసుకు విచారించటానికి వెళ్తే, నేరం ఇంకోళ్ళపైకి నెడ్తూ ఉంటారు. ఏ ఆఫీసరు స్వతంత్రించి నిర్ణయాలు తీసికోడు. ఏవైనా కేసులుఉంటె ఉద్యోగం చేసినన్నాళ్ళు పరిష్కరించరు. తీరా రిటైరు అయిన తరువాత కేసులు పరిష్కరించలేదు అంటారు. పోనీ కనీసం సగం పెన్షను అయినా రిటైరు అయిన వెంటనే ఇవ్వవచ్చునుకదా? అదీలేదు. ఉద్యోగ విరమణ చేయగానే ఆవ్యక్తి ఒక దొంగగాను, దోషిగాను పరిగణింప బడ్తాడు. ఉద్యోగులలో లంచగొండితనానికి ఇది కూడా ఒక కారణం.

నిఖిలేశ్వర్‌కి అభినందనలు.

కొండేపర్తి
హైదరాబాద్

రచయిత (త్రు) లకు విజ్ఞప్తి

జ్యోతిలో ప్రచురణ కోసం తమతమ రచనలు తిరిగి మేము తెలియచేసేంత వరకూ పంపవద్దని మనవి చేస్తున్నాము. మా కార్యాలయంలో ఎంపిక చేయబడి ప్రచురణ కావలసిన రచనలు చాలా ఉండటంవల్ల ఈవిధంగా కోరుతున్నాము.

—సంపాదకులు

నూతలపాటి సాహితీసత్కారం అందుకొంటున్న "నిర్వికల్ప సంగీతం"

గంగాధరం సాహితీ కుటుంబం (రిజి) ప్రతి సంవత్సరం మేనెల 29వ తేదీన శ్రీ నూతలపాటి గంగాధరం వర్ధంతినాడు అందజేస్తున్న "నూతలపాటి సాహితీ సత్కారం" ఈ సంవత్సరం శ్రీ వాడ్రేవు చినవీరభద్రుడుగారి వచన కవితా సంకలనం "నిర్వికల్ప సంగీతం"కు లభించింది. న్యాయ నిర్ణేతలుగా డా॥ కె.వి. రామకోటిశాస్త్రి; శ్రీ నాగభైరవ కోటీశ్వరరావు; శ్రీ ఆర్. ఎస్. సుదర్శనం వున్నారు.

సుప్రసిద్ధకవి, విమర్శకుడు కీ.శే. నూతలపాటి గంగధరం 18వ వర్ధంతి సభలో కవికి రూ. 1500/- మరియు యోగ్యతాపత్రం ఇవ్వబడుతుందని కార్యదర్శి ఎస్. మునిసుందరం తెలియజేస్తున్నారు. ఈ అవార్డుపోటీలో పాల్గొన్న కవులందరికీ సంస్థ ధన్యవాదములు తెలియజేస్తూంది.

జంక్షనులో బడ్డీ

చాగంటి సోమయాజులు

"ఎందుకు నాకీ ఆపద తెచ్చి పెట్టావు ఎల్లమ్మతల్లీ? ఏనాడు నీ మొక్కు చెల్లించలేదు ఎల్లమ్మతల్లీ!" అని గోలు గోలుమని రామయ్య గుడిసెలో పెళ్ళాం పిల్లలమధ్య ఏడుస్తూ ఎల్లమ్మని ప్రశ్నించాడు.

ఎల్లమ్మ వాళ్ళ ఇలవేలుపు. ఎల్లమ్మ సిరులకి (సిరులు-జాతర) ఏటా కొత్త కోక, కోడిపిల్లా మొక్కు చెల్లిస్తారు. ఇంటపుట్టిన తొలి ఆడపిల్లకి ఎల్లమ్మ పేరు తరతరాలై పెట్టుకొస్తున్నారు. రామయ్య మేనత్త ఎల్లమ్మ. వాడి తండ్రి మేనత్త ఎల్లమ్మ. పెళ్ళయి కాపరానికెళ్ళిన వాడి పెద్దకూతురు ఎల్లమ్మ. అందర్నీ తర తరాలై ఎల్లమ్మ కాపాడుతున్నది. అందుకే ఎల్లమ్మతల్లికి దయతప్పి ఎందుకు ఉత్పాతం తెచ్చిపెట్టింది అని రామయ్య ఎల్లమ్మనే గోలపెట్టి అడుగుతున్నాడు. పూర్వం వాళ్ళయింటి ముసలమ్మకి ఎల్లమ్మ పూని మంచి చెడ్డలు చెప్పడం ఉండేది. ఇప్పుడు ఎల్లమ్మ యింట్లో ఎవరి వంటిమీదా వాలి పూనడంలేదు.

"ఏమిటి సాధనం ఎల్లమ్మతల్లీ!" అని పొలికేక పెట్టేడు. ఆ కేక విని పక్కింటి పోలిగాడు గుడిసెలోకి దూరేడు.

"ఏమైందిరా రామయ్యా?" అని అడిగాడు.

"ఈడిగోల మమ్మల్ని కొట్టేసింది పోలిగా" అని ఏడ్చింది రామయ్యపెళ్ళాం సీతమ్మ.

"ఎవరిగోల ఏంచేస్తుంది ఎల్లమ్మ చూస్తే. తల్లికెందుకో దయ తప్పింది" అన్నాడు రామయ్య.

"ఎల్లమ్మా పోలేరమ్మా కాదురా నీకే టొచ్చిందని ఏడుస్తున్నావు? ముందది సెప్పరా" అన్నాడు పోలిగాడు.

"దిక్కుమాలిన మునిసిపాలిటీవోరు బడ్డీ తీసెయ్యమన్నారు!" అని ఏడ్చింది సీతమ్మ. వాళ్ళ బతుకే బడ్డీ!

వాళ్ళ గూడెంలోకి పోయే జంతి ఒక ఇరుకు గొంది. అందులో ఎద్దుబండి పోలేదు. ఈమధ్య రిషాలు వస్తున్నాయి. ఆ గొంది పాతిక గజాలు సాగి రోడ్డుని కలిసి మూడురోడ్ల జంక్షను అయింది. ఆ జంక్షనుదగ్గర ఘురికాల్వ మలుపు తిరుగుతుంది. ఆ మలుపుమీద రామయ్య బడ్డీ ముప్పయ్యేళ్ళయి ఉన్నాది.

"ఇది రామునాయుడి దెబ్బ?" అని వెంటనే అన్నాడు పోలిగాడు.

రామునాయుడు వాళ్ళవార్డు కౌన్సిలరు. అందర్నీ అమ్మా, బాబూ అంటూ కాళ్ళా వేళ్ళా బతిమాలి, గెడ్డాలు పట్టుకొని కులపోళ్ళనందర్నీ కూడగట్టి కులంబలంతో కౌన్సిలరయి కూచున్నాడు. వాడిమీద పోటీ చేసినవాడు వేలు ఖర్చుపెట్టినా గూడెంలో టెంకిజెల్ల కొట్టేశారు. నిన్న మొన్నటిదాకా రామునాయుడు గోచీ పెట్టుకుని ఎడ్లని తోలుకెళ్ళినవాడు, బండి రాముడు కావలసినవాడు చిలకకట్టుకట్టి, జలతారు కండువా పైమీద వేసుకుని కౌన్సిలరయి కూచున్నాడు!

"అమ్మ! ఎంతమాటన్నావురా! రామునాయుడు సిన్నప్పట్నుంచి దద్ద, దద్దంటూ నన్నొగ్గడురా! అడు నా జోలికొచ్చినాడంటే నాను నమ్మను!" అన్నాడు రామయ్య.

"అడిదెబ్బేనని నా నమ్మకం! ఇప్పుడు కాసినా అడే కాయాల. అడికాడికే ఎళ్ళు. ఆ కాయితం సూపెట్టు" అన్నాడు పోలిగాడు.

వెళ్ళాడురామయ్య రామనాయుడింటికి. నాయుడు యింటిరూపే మారిపోయింది. వీధరుగుమీద ఇనపమడత కుర్చీలున్నాయి ఇనప ఈజీఛైరులో కూర్చుని ఉన్నాడు రామునాయుడు. తెల్లారేసరికి చుట్టూ జనం నిండిపోయారు. రామయ్యని చూడగానే రామునాయుడు కుర్చీలోంచి లేచిపోయి "దద్దాదా! ఏమిలాగొచ్చావు?" అని ఆలింతదూరంనుంచే తియ్యగా నోరారా పలకరించాడు. రామయ్య ప్రాణం అమ్మయ్య అని కుదట పడ్డాది.

"కౌన్సిలేరువికదా నాకేటొచ్చిందో తెలియదా? సూడీకాయితం!" అని నోటీసు అందిచ్చాడు. చూసి ఆశ్చర్య పడిపోయాడు రామునాయుడు.

"ఎంత పనైపోయింది! ఊళ్ళో చాలా బడ్డీలకి గాలొచ్చింది. అందులో నీది ఉందనుకోలేదు. కనుక్కుంటాను. ఇప్పుడే వెళతాను. నోటీసు నాదగ్గరే ఉణ్ణీ. దద్దా నువ్వింటికెళ్ళు. అంతా నేను చూసుకుంటాను-" అన్నాడు కౌన్సిలేరు రామునాయుడు.

"అమ్మయ్య! రామునాయుడూ బడ్డీ మా బతుకుసుమా! ఈ ఆపద గట్టెక్కితే ఎల్లమ్మకి గొఱ్ఱెపిల్లని ఏటేసి తెచ్చి నీకిచ్చుకుంటాను. ఎల్లమ్మే నీకాడికి తీసుకొచ్చింది. యింక నీదేభారం" అన్నాడు రామయ్య.

"దద్దానువ్వెళ్ళు మద్దేన్నం నీ యింటికొచ్చి ఏ కబురూ చెపతాను. నానంతా చూస్తాను ఎళ్ళు" అని సాగనంపాడు. అమ్మయ్య ఇంక ఫరవాలేదు - అని చల్లబడ్డాడు రామయ్య. కొండంత ధీమాతో నాకేమని రామయ్య ఉన్నాడు.

మధ్యాహ్నం రామునాయుడు అన్ని వివరాలూ కనుక్కొని రామయ్య యింటికి వెళ్ళి చెప్పాడు. ఏమిటి చెప్పేడు?

"దద్దా పెద్ద చిక్కే వచ్చింది. నీ వొక్కడికే రాలేదు. వూళ్ళో మున్నెన్నలభై బడ్డీల వాళ్ళకొచ్చింది. ట్రాఫిక్కు పెరిగిపోయింది. జంక్షన్లలో బడ్డీలన్నీ పీకిమన్నారు. అసాధ్యంగా వొచ్చింది. ఎలాగా అని తటపటాయిస్తున్నాను" అని

గుడిసెలోకి దూరి నిండు అభిమానంతో చెప్పాడు రామునాయుడు. పక్కనుంచే వింటున్న పోలిగాడు లోపలికి దూరేడు.

"అసాధ్యం వొచ్చింది గనకనే నువ్వు సాధ్యం చేయాలి" అన్నాడు పోలిగాడు.

"చేస్తానురా. అదే తటపటాయిస్తున్నాను. కమీషనరు పీక్షను తీసేసుకున్నాడు. అక్కడే చిక్కుగా ఉంది. ఏదో అస్త్రం వేస్తానులే!" అన్నాడు రామునాయుడు.

"రామునాయుడూ! నువ్వాడుతున్న మాటలు నాక్కేటీ తెలవడంలేదు. సల్లటీ మాట సెపతావని పిల్లాది సూస్తున్నావు. పిల్లలూ మావూ యిప్పుడే గంగలోపడ్డం? బడ్డీ మా బతుకు. నువ్వెరగందుందా?" అని ఏడ్చింది సీతమ్మ.

రామయ్య గోడకి జేరబడి పక్కకి వాలిపోయాడు. నోటంట మాట రాలేదు.

"ఎంతమాటన్నావు సీతమ్మా! బడ్డీ వొగ్గేస్తామా? బతుకులో బుగ్గేస్తే వూరుకుంటామా? అందికే తటపటాయిస్తున్నాను" అన్నాడు రామునాయుడు.

ఛటామని రామయ్య లేచాడు.

"ఇదిగో నీబడ్డీ ఇక్కడ బతుకు. అన్నీ అర్థరు తేకపోయినావా నుయ్యో గొయ్యో సూసుకుంటాను" అన్నాడు.

"ఎందుకురా అటువంటి మాటలు, ఈ కాయితంమీద సంతకం చెయ్యి" అని కాయితం తీసి దానిమీద తాను రాయించింది తానే చదివాడు. రామునాయుడు చాలా బాగా రాయించాడు. చాల బాగా చదివాడు. అంతవాడౌతాడని చిన్నప్పుడు ఒక్కరనుకోలేదు. గూడెం మొత్తానికి మొనగాడనిపించుకున్నాడు,

మహారాజశ్రీ కమీషనరుగారి దివ్య సన్నిధికి రామయ్య రాసుకున్న పిటీషను దాఖలాయిది. బడ్డీ చరిత్ర అందులో పూర్తిగా ఉంది.

రామయ్యకి పదేళ్ళు పట్టున లేనప్పుడు తండ్రి చచ్చిపోతే రామయ్యతల్లి పిల్లల్ని పెంచడానికి వేరేమార్గం లేక గొందిచివర జంక్షనులో కాలవ మలుపుమీద అడ్డంగా రెండు చెక్కలువేసి తొలిసారిగా దుకాణం పెట్టింది. నీడకి పెద్ద తాటేకుల గొడుగు నిలబెట్టింది. దానికింద కూచుని కొబ్బరుండలు, చక్కిలాలు, జంతికలు, బూరెలు, పుణుకులు జంగిళ్ళలో పెట్టి అమ్మేది. బతాణీలు, కొమ్ము శనగలు, మురీలు బుట్టలతో పెట్టి గిద్దలతో, సోలలతో అమ్మేది. ఉడకెట్టిన దుంపలు, కర్రపెండలం ముక్కలు, తేగలు, మొక్కజొన్న పొత్తులు అమ్మేది. వేరుశనక్కాయలు గుడ్డలమీద పోగులుపెట్టి అమ్మేది.

ఆ దుకాణంతోటే రామయ్యని పెంచి పెద్దవాణ్ణి చేసింది. దాంతోటి ఆడకూతురికి పెళ్ళి చేసింది. దానికి పురుళ్ళు పోసింది. రామయ్యతల్లి చచ్చి స్వర్గాన్ని ఉన్నాది.

ఆ రోజులు వెళ్ళాయి. ఆ మనుషులు వెళ్ళిపోయారు. అప్పుడు వాళ్ళ వార్డుకి భుజంగరావుగారు కౌన్సిలరుగా ఉండేవారు. ఆయన గుఱ్ఱపు బగ్గీ మీద వచ్చేవారు. వార్డు వాళ్ళ ఏ యిబ్బంది చెప్పుకున్నా పట్టించుకునేవారు. రామమందిరం చుట్టూ ఉన్న మునిసిపల్ స్థలం ఆ ప్రభువే యిప్పించాడు. ఇప్పుడు మందిరం చుట్టూ కొబ్బరిమొక్కలు పువ్వుల మొక్కలు వేశారు. గూడేనికి గొప్ప రాం

మందిరమే. ఊర్లో ఇంకే రాంమందిరానికి ఆ అందంలేదు.

అంతేనా? రాంమందిరం అంత విశాలంగా కట్టించిందెవరు? మందిరం వెనక తాలింఖానా పెట్టించిందెవరు? హంసలు చెక్కిన సెమ్మె మందిరం మధ్యది - ఇచ్చిందెవరు? ఆ ప్రభువే!

ఆ ప్రభువే జంక్షనులో బల్లమీద దుకాణం పెట్టుకుని రామయ్య తల్లిన్ని బతకమన్నాడు. దుకాణం పెట్టుకోడానికి కాయితం పుట్టించాడు. సంతకం రాని తల్లి చేత వేలుముద్ర వేయించి కాయితాలు యిప్పించాడు. ఏహో అప్పణ్ణుంచి బడ్డీకి పన్ను కడుతున్నారు.

రామయ్య పెద్దవాడై గొడుగుతీసి బడ్డీ వేశాడు. కిళ్ళీ కొట్టుగా మార్చాడు. తల్లి అమ్మినవన్నీ అమ్ముతూ చుట్టా, బీడీ, సిగరెట్లు, సోడా వగైరాలు పెంచాడు. గూడెంలో ఎవరికేం కావలసినా రామయ్య కొట్లో కొనుక్కోవలసిందే. అమాయకుడు. ఎల్లమ్మని నమ్ముకుని బతుకుతున్నాడు. చుట్టలు చుట్టుకుంటూ బడ్డీలో కూర్చొని బతికేడు; బతికేస్తున్నాడు.

శనివారం రాత్రి రాంమందిరంలో భజన చేసేటప్పుడు రామయ్య కంఠమే మీదికిలేచి ఎంత దూరానికైనా వినబడుతుంది. రామయ్య దైవ భక్తి ఆబద్ధపు భక్తి కాదు. అమాయకంగా బడ్డీమీద బతకడమే కాక బాగా డబ్బు చేశాడు. ఎంత చేశాడో ఎవరికీ తెలియదు కాని చేసేడని సీతమ్మ మెడలో బంగారమే చెబుతూ ఉంటుంది. అందుకే గూడెంలో కన్నెర్రగా ఉంది.

రామయ్య బడ్డీకి గాలి వచ్చిందంటే గూడెంలో అంతేకావాలి అనుకుంటున్న వాళ్ళు ఉన్నారు. గూడెమంతా గుప్పుమంది. పైకంతా అన్యాయం దానికేదో ఉపాయం చూడాలనే అంటున్నారు,

రామునాయుడు పిటీషను పకడ్బందీగానేడుంది. ముప్పైఏళ్ళాయి పన్నులు కట్టుకుంటూఉన్న బడ్డీ తీసెయ్యమండం న్యాయం కాదని దాని సారాంశం. రామయ్య సంతకం చేశాడు. ఎల్లమ్మ మీద భారం ఉంచేడు.



ఇంతకీ ఏమైంది? ససేమిరా పనికి రాదు తీసెయ్యాలన్నారు! ట్రాఫిక్కుకి అడ్డంగా ఉంది. అసలా గొందిని వెడల్పు చెయ్యవలసి ఉంది. గుడిసెలు అడ్డం లేకపోతే రోడ్డు వెడల్పు అయిపోయేదే! మునిసిపాలిటీకి డబ్బులేదు గాని గుడిసెలు పీకేసి రోడ్డు విశాలం చెయ్యవలసిన పథకాలు ఉండడం ఉన్నాయి. యిళ్ళనే పీకెయ్యవలసి వుండే బడ్డీల నుంచుతారా?

ఒక్క పొలిగాడేకాదు. గూడెంలో ఆడా మొగా రామునాయుణ్ణి నిలదీసి అడిగేశారు. "ఏమిటీ ఘోరం?"

"రోజులలాగున్నాయి!" అన్నాడు రామునాయుడు.

"కుడీ ఎడమా లేదా? ఉపాయం చూడాలి" అన్నారు గూడెంవారు.

"ఇప్పుడు మనుషులతో మాటాడగలమా? వాళ్ళ దాహాలు ఎలాగున్నాయి? ఏనుగు తొండాలు జాపుతున్నారు" అన్నాడు రామునాయుడు. అక్కడికి వచ్చింది. ఎల్లమ్మకి గొఱ్ఱెపిల్లని బలివేస్తానన్నాడు రామయ్య. మనుషులు బలికోరేవారు ఉన్నారు. ఎల్లమ్మకి బలివెయ్యకపోయినా ఊరుకుంటుంది. మనుషులకి బలివెయ్యకపోతే ముప్పు వొచ్చిపడుతుంది!

"పారేశాం సాయనా! పారేశైనా బడ్డీ



మాకు నిలబెట్టు" అన్నాది సీతమ్మ.

"అలాగ్గాచెయ్యి" అన్నాడు పోలిగాడు. రామయ్య నోటంటమాట రాలేదు.

"ఆ మాట మీ నోటితోటంటే బాగుంటుంది. నా నోటితోటంటే నేనేదో తినేసినట్టుంటుంది" అన్నాడు రామునాయుడు.

"దద్ద దద్దంటావు. దద్దనేం చేస్తావో చెయ్యి, ఎవడికియ్యాలోయియ్యి" అన్నాడు బాధతో రామయ్య.

"ముందు రెండు వందలు జతపెట్టు అదీ చూసేదాం" అన్నాడు నాయుడు.

ఆ రాత్రే రామయ్య రామునాయుడి ఇంటికి వెళ్ళి రెండువందలు ఇచ్చాడు.

మర్నాడు ఆఫీసుకెళ్ళి రామునాయుడు వచ్చాడు.

"పైసా ఎవడికీ ఇయ్యలేదు" అన్నాడు.

"పనైందా ?" అన్నాడు ఆదుర్దాగా రామయ్య.

"పనౌతుందంటే యియ్యనూ ? ఎందుకు నీ డబ్బు పాడు చెయ్యడం. ఇందా నీ డబ్బు" అని తిరిగి యిచ్చేశాడు డబ్బు. పనికాలేదు. జంక్షనులో బడ్డీ ఉండడానికి ఎంత మాత్రం అవకాశం లేదు.

"ఎల్లమ్మతల్లో! ఎల్లమ్మ తల్లో !" అని నెత్తిమీద చేతులు పెట్టుకుని ఏడుస్తూ రామయ్య కుంగిపోయాడు.

"ఏడిస్తే ఏం లాభంరా. ఉపాయం చూడాలి. నాకొక్కటి తట్టింది. చెప్తా విను .... దద్దా."

"నేను దద్దని కాను. దద్దమ్మని. ఇంక నాకేం చేస్తావు నువ్వు"

"వినరా దద్దా"

"చెప్పు"

"జంక్షను దగ్గర ఇంక బ్రహ్మతరం కాదు. అక్కడ ట్రాఫిక్ రద్దీ ఎక్కువైంది. ఐతే ఒక్కటీ చెయ్యొచ్చు. ఏమిటంటావా ? జాగ్రత్తగా విను. ఇప్పుడు నీ బడ్డీ వుందా దాన్ని ఒక్క పదడుగులు గొందిలోకి జరిపి కాలువ మీదపెట్టుకుంటావా చెప్పు. ఒక్క పదంటే పదడుగులలోపుకి జరుపుకో. ఆర్డరు వేయించియిస్తాను. గూడెం మధ్యలో ఉంటుంది. ఏ బేరం ఎక్కడికిపోదు. ఆలోచించి చెప్పు" అన్నాడు రామునాయుడు.

"గగనమైన ఆలోసన సెప్పినావు రామునాయిడూ ! సెయ్యి. గూడెం బేరమెక్కడికిపోదు" అన్నాడు పోలిగాడు,


"ఓ సెయ్యి. అది సాలు" అన్నది సీతమ్మ.

"బాగుంది ఎల్లమ్మ దయతో అలా చేయించు. జరుపుకుంటాను. అదికాన" అన్నాడు, రామయ్య,

"చెప్పేనుకాని దానికి దూతలున్నారు, ఖర్చు అవుతుంది" అని నసిగి చెప్పాడు రామునాయుడు.

"ఇయ్యనే యిచ్చాను, రెండొందలు. అప్పతేనే తెచ్చాను. రెండొందలూ పట్టికెళ్ళు" అన్నాడు రామయ్య.

రామునాయుడు డబ్బు మళ్ళీ పట్టుకెళ్ళాడు. మరో పిటీషను రాయించాడు. కాస్త పదడుగులు గొందిలోపుకి బడ్డీని జరిపి పెట్టుకోనివ్వమని అర్జీవిన్నపములు. ఈ మాటు పట్టుకెళ్ళిన రెండువందలు ఇంటికి తిరిగి రాలేదు. ఆర్డరు మూడో రోజుకి పడిపోవలసిందే. అంతా అయిపోయింది. మరి ఏ కారణం చేతో కమీ



షనరు సంతకం అయి కాయితం బైటకు రాలేదు.

రామునాయుడు దిగాలు పడిపోయాడు. డబ్బుపోయి శని పట్టుకుంది.

"కమీషనరు ఎందుకు సంతకంచెయ్యలేదు ?" అడిగేడు పోలిగాడు.

"కొద్ది రోజుల్లో ఆయన బదిలీ అయి వెళ్ళిపోతున్నాడు. రాబట్టుకోవాలని ఆశ ఉండదా ?" అన్నాడు రామునాయుడు.

"సచ్చిపోనాము" అన్నాది సీతమ్మ.

"చేస్తానన్నాడు. కాయితం దగ్గరకొచ్చే సరికి నిలబెట్టేశాడు" అన్నాడు రామునాయుడు.

"ఏపాటి ఇస్తే సరిపోతుంది ?" అని ప్రశ్నించాడు పోలిగాడు.

"అమ్మో కమీషనరుగారికి మనం ఇచ్చుకోగలమా !" అన్నాడు నాయుడు.

"మరి రెండొందలెవరికి ముట్టినాయి ?" ప్రశ్నించాడు పోలిగాడు.

"కింది దూతలకిరా"

"పెద్ద దూతకెంత ?"

"ఐదొందలకి తక్కువైతే ముట్టడు! అమ్మో మనమిచ్చుకోలేము ?" అన్నాడు నాయుడు.

"అదింకొందవతగ్గిన పెట్టెయ్యమను" అన్నాడు పోలిగాడు.

"అమ్మో ఎక్కడతేము ?" అని ఏడ్చింది సీతమ్మ.

"ఇదంతా ఎందుకిలాగొచ్చింది ?" అని నెత్తి మొత్తుకున్నాడు. రెండుచేతుల్తో రామయ్య.

"దద్దా ఇప్పుడు లోకమలాగుంది" అన్నాడు నాయుడు.

"ఐతే నన్నేటి సెయ్యమన్నావు ?" అడిగేడు రామయ్య.

"ఈ కమీషనరు ఎలాగూ పోతున్నాడు. మరొకడొస్తాడు. అంతవరకూ ఉందాం !" అన్నాడు నాయుడు.

"క్రింది దూతల కిచ్చిన రెండొందల మాటో ?" ప్రశ్నించాడు పోలిగాడు.

"తిరిగి నా కొడుకులు ఇస్తారా ? అందుకే తటపటాయిస్తున్నాను. అవి గంగపాలు కాకుండా ఆర్డరేయించుకు రావాలి"

"మా మెక్కడి నుండితేము ఐదొందలూ" అని మూలిగింది సీతమ్మ.

"రేపు మళ్ళా కమీషనరు గారితో చెప్పి చూస్తాను. ముప్పై ఏళ్ళ బడ్డీ ఉన్నాడు. బడ్డీ పీకిస్తే వాళ్ళ పీకకోసుకు పోతుంది అని చెపుతాను మళ్ళీ" అన్నాడు నాయుడు.

"ఇనకపోతే?" ప్రశ్నించాడు పోలి గాడు.

"కొత్త కమీషనరు వొచ్చేదాకా ఉంచాం" అన్నాడు నాయుడు.

"కోళ్లు తినేవోడుపోయి గొర్రెలు తినే వోడువస్తే?" ప్రశ్నించాడు పోలిగాడు.

"మనదృష్టం ఎలాగుందో మరోసారి కమీషనరు గారితో చెప్పి చూస్తాను, తరువాత ఆలోచిద్దాము" అని రామునాయుడు వెళ్ళి పోయాడు.

చెప్పేశాడు పోలిగాడు. ఇదంతా రామునాయిడి నాటకమే. పచ్చి మోసము. పచ్చగా ఉన్నాడని పట్టుకున్నాడు. చిలుం వదల కొట్ట దలచు కొన్నాడు.

"రామయ్యా ఇకలాభంలేదు. ఎక్కడ ఏడుస్తావో ఏడువు. ఐదొందలూ ఆడి మొఖాన్న పారేసి. ఆబడ్డీ నిలుపుకో" అని సలహా యిచ్చాడు పోలిగాడు.

"ఇదంతా రామునాయుడి మోస మంటావా" అని అడిగాడు రామయ్యా.

"తప్పకుండా"

"తొలిడబ్బు తీసికెళ్ళి తిరిగిచ్చేశాడు"

"మనకి నమ్మకం పుట్టొద్దా!"

"ఐదొందలూ తినేసి పనిసెయ్యక పోతే?"

"అది నిక్కచ్చిగా ఆడిగి నలుగుర్లో ఇద్దాం" అన్నాడు.

రామయ్యా ఐదువందలూ రాము నాయుడికి షరతు మీద ఇచ్చాడు. జంక్షనులో బడ్డీ పది అడుగులలోపుకి పెట్టుకో డానికి ఆర్డరు కాయితం కమీషనరుగారి దస్కత్తుతో వారు బదిలీ మీద వెళ్ళిపో కుండానే వచ్చేసింది. ఆ తరవాతే కమీష నరు గారు వెళ్ళి పోయారు.

రామయ్యా యిచ్చిన ఏడు వందల రూపాయలు ఇంట్లో నగదు రూపంగా ఉన్న డబ్బే. ఐతే పదిమందికీ తెలియ కుండా మెళ్ళో నానూ, పట్టెడా సీతమ్మ తీసేసి పెట్టెలో పడేసింది. బంగారం బంగారంలాగ కనబడుతూ ఏడువంద లిచ్చారంటే గూడెం గొల్లు మంటుంది.

రామయ్యా జంతిలోకి బడ్డీ జరుపు కున్నాడు. ఎల్లమ్మకి మొక్కు కున్నం దుకు నమ్ముకున్నందుకు గుడ్డిలోమెల్ల. ఏడువందలకి గాలివచ్చినా గూడెంలో బడ్డీ గూడెంలోనే ఉంది. రామయ్యా ఎల్లమ్మకి వేట వేసి రామునాయుడికి ఇచ్చేశాడు. మళ్ళా బుర్రొంచుకుని కూని రాగాలు తీస్తూ బడ్డీస్థలంలో మార్పు వచ్చినా అదే బడ్డీమీద కూర్చొని చుట్టలు చుట్టుకుంటూ అమ్ముకుంటున్నాడు. ఒక్క ఖాతాపోలేదు. బేరం పిసరు తగ్గలేదు.

పోలిగాడికి మాత్రం రామునాయుడు మీద కసిపోలేదు. చాలా ఆరాలు తీసాడు.

"ఇదంతా ఈడినాటకమేరా. ఏడొం దల్లో పద్దైనా గుమాస్తాలకిచ్చాడో లేదో ఈడే కాజేశాడు. ఎళ్ళిపోయిన కమీషనరు గారు దేముడురా. కానీ లంచం పుచ్చుకో లేదని వూరంతా కోడై కూస్తున్నాది. ఊళ్ళో పెద్ద ఆయన్ని బదిలీ చేయొద్దని కాయితాలు పెట్టినారుట?" అన్నాడు పోలిగాడు.

"పోన్నేరా .... పోయిండబ్బురాదు. ఆడిపాపాన్ని ఆడేపోతాడు. ఎల్లమ్మ సూస్తున్నాదికదా?" అన్నాడు రామయ్యా.

"ఎవుళికీ ఏపాపం చేసినా వోళ్ళది కాదు. బగమంతుడిమీద బారమేసి బతుకు తున్నాము. మీదివోడి దయవుంటే మిద్దె యిల్లుమేడౌతాది" అన్నది సీతమ్మ.

"ఆడికి ముందేటి జరిగినా ముందు మనకి ఏడొందలొదిలినాయి. మళ్ళీ వోట్లెలక్సన్లు రావా అప్పుడివాకొడుక్కి గూడెమంతా ఎదురు తిరిగి కాజా ఇవ్వాలి" అన్నాడు పోలిగాడు.

వార్డులో రెండువిధాలుగా చెప్పుకుంటు న్నారు. లంచం పుచ్చుకున్నా రాము నాయుడితో చెప్పిన పని అవుతుంది అనే మాటే పైకి వచ్చింది. వార్డులో చాలా మంది గృహస్థులకి మునిసిపాలిటీతో అది వరకు లేని తగాదాలు తలెత్తడం రాము నాయుడు మధ్య పడడం నాలుగు డబ్బులు పుచ్చుకోడం నిజమే. కొత్తగా కొంపలు కట్టుకున్నా, పాకేసినా, ఇల్లు మరమ్మత్తు చేసినా, ఇంతా అంతా అని పుచ్చుకోడం ఎవరికీ ఏ ఇబ్బంది లేకండా చూస్తూ ఉండడం ఉంది.

ఐతే ఏమంటాడూ అంటే వాడికి జీతవా బత్తెవా ఆపాటి చూసుకోకపోతే ఆడి దినమెలాగ వెళుతుంది అంటారు. ఊరికే ఎవరూ ఇవ్వరుకదా? ఉపకారం చేస్తే కాస్త పుచ్చుకోడం తప్పేముంది? అని అంటారు.

రామయ్యాబడ్డీ పూర్తిగా పీకించిస్తే వాడి బతుకేంగానూ అనే ప్రశ్న వస్తున్నది. ఉపకారం చేసినా చేశాడనరు కొందరు. తినేశాడు అంటారు. ఎంత తానుతిన్నాడు దూతల్కెంత ఇచ్చాడు అనేది ఆరా తియ్యరు.

ఐతే రామునాయుడు కొన్నిందు అయిన దగ్గరనుండి ఘనంగా బతుకు తున్నాడు. జోరుగా ఖర్చుపెడుతున్నాడు ఉపకారస్తుడంటున్నారు. అపకారస్తు డంటున్నారు.

ఇది ఉపకారమా అపకారమా? కొత్త కమీషనరుగారు వచ్చిన కొద్దిరోజులకి రామునాయుడు పనికట్టుకుని రామయ్యా యింటికి వచ్చాడు.

"దద్దా కొత్తకమీషనరుగారువచ్చారు. నువ్వు కాయితం పెడితే నీ బడ్డీ నీ దూమ్మాలుచోటికి జంక్షనుకి మార్చి వొచ్చు. పెడతావా?" అని అడిగాడు.

"మళ్ళీ మార్చా - ఒకతూరి మార్చి నందుకు పాతిక రూపాయిలైనాయి"

"ఏమో చూసుకో, ఇప్పుడు మార్చుకో వొచ్చు. జంక్షను: ఆలోచించుకో. కాని ఒక్కటుంది. నీకు రెండువందలు ఖర్చు అవుతుంది" అని కూడా నాయుడు చెప్పాడు.

"అమ్మో! ఇప్పటికే అప్పులపాలయి నాను" అన్నాడు రామయ్యా.

"నీయిష్టం దద్దా. నీకు చెప్పాలికదా? చెప్పేను. ఆలోచించుకో, వారం నాడు చెప్పు" అన్నాడు. సీతమ్మ వొప్పుకో లేదు. పోలిగాడు జంక్షనుకి వెళ్ళడం మంచిదన్నాడు. రెండువందలు లంచం తినేసరికి వొద్దురా అనేశాడు.

శనివారం రాంమందిరంలో అంతా భజనకి సిద్ధంగా ఉండగా రామునాయుడొచ్చి.

"దద్దా ఆలోచించావా?" అని అడిగాడు.

"మళ్ళా ఎందుకు ? ఇప్పుడు నాకేం లోటులేదు" అన్నాడు రామయ్య.

"జంక్షనులో బడ్డీ, చిరకాలంనుంచి ఉన్నావు. అవకాశంగా ఉంది. నీయిష్ట మొచ్చినట్టే చెయ్యి" అన్నాడు నాయుడు. పదిమందిలో చెప్పేడు.

"వొద్దునాయుడు. నేను మరి కదల్లేను ఏదో ఇలాగ మీ మధ్య బతకనియ్యండి చాలు" అన్నాడు రామయ్య.

శ్రీవారం తిరక్కుండా జంక్షనులో కాలువ మలుపుమీద పది అడుగుల పొడుగున బ్రహ్మాండమైన బడ్డీ తెచ్చి అమర్చేశారు. ఎత్తుకాళ్ళ మీద ఎనిమిదడుగుల ఎత్తున లేచింది. పక్కనుంచి తలుపులు, వెనక్కి కిటికీలు ఉన్నాయి. అందమయిన పెయింటు వేసి పెద్ద పట్నాల పద్ధతిలో బడ్డీ తయారయింది. పెద్ద సిగరెట్టు పెట్టెలు, బీడీల కట్టలు, సోడాబుడ్లు, కలర్లు, రంగురంగుల గాజు జాడీలు ఒకటేమిటి అన్ని సామానులు అందంగా అమర్చి ముందుకి పొడుగ్గా ట్యూబులైటు బిగించారు.

బడ్డీ రామునాయుడి మేనల్లుడి పేరన మొదలైంది. సరిగ్గా రామయ్య పూర్వం బడ్డీఉన్నచోట్లోనే పెట్టారు.

రామయ్యపని అయిపోయింది. వాడి బడ్డీ గొందిలో నాలుగడుగులు ఎత్తుని వికృతరూపాన్ని పొందింది.

సాయంకాలం చీకటయిందంటే రాము నాయుడి బడ్డీ ట్యూబులైటుతో గూడెంకి జంతి, మూడురోడ్ల జంక్షను పట్టపగలై పోతున్నాది. అక్కడ బెంచీలు, కుర్చీలు వేసేసి రామునాయుడు కూర్చుంటాడు. ఎంతోమంది వచ్చి కూర్చుని టప్పాలు కొడుతుంటారు.

రామునాయుడి కిళ్ళీ బడ్డీకి జనం వచ్చి పోతూఉండడం వెంటనే ప్రారంభమైంది. ఆ బడ్డీలో నాటుసారా అమ్మకం ఉంది. ప్రజలకి తాగుడు కావాలి - విరగబడి వస్తున్నారు. అక్కడ ధైర్యంగా తాగొచ్చు బోర విరుచుకెళ్ళ వచ్చు. అది రాము నాయుడి దుకాణం. అక్కడేభయంలేదు.

రామునాయుడి బడ్డీతో గూడెంకి ఎక్కడలేనికళా వొచ్చింది.

పట్నానికి ఏడుమైళ్ళ దూరంలో పాలెం ఉంది. రోడ్డువార గ్రామం. రామయ్య బడ్డీ ఎత్తేశాడు. పాలెం రోడ్డు వారదాన్ని నిలబెట్టాడు. అది వాడి గ్రామం. ఇదివరకు సంపాదించిన డబ్బుతో చిన్న మడిచెక్క అక్కడ కొనుక్కున్నాడు. అక్కడికి వలస పోయాడు. అక్కడ బడ్డీ నిలబెట్టి ఎల్లమ్మకి కోడిపిల్లని మొక్కు చెల్లించాడు. ఎల్లమ్మ పట్నం నుంచి కదిపి పాలెంకి ఎందుకు పంపిందో ఆ తల్లిమీద భారం వేసే రామయ్య అక్కడికి పోయాడు. ఎల్లమ్మ రామయ్య ఇలవేలుపు.

రెండు విధాల అంటున్నారు. రాము నాయుడు మొదటినుంచీ ప్లేనువేసి రామయ్యని జంక్షను నుంచి గెంటేశాడని కొందరు, అదేంకాదు రామయ్యదే పొరపాటు. తెలివితక్కువ ముండాకొడుకు. జంక్షనులో తిరిగి ఇప్పిస్తాను వెళ్ళదద్దా అంటే వెళ్ళాడా అంటారు కొందరు. రెండు విధాలా అంటున్నారు.

రామయ్య ఇంట్లో ఎవరికీ ఈ మధ్య ఎల్లమ్మ పూనడంలేదు. పూనడం ఉంటేనా ఎల్లమ్మ నిజం చెప్పేసేది. ♦♦♦

హ్యూమరాలజీ-63

"నిజంగా మీరు అరౌండలిస్తున్నారా?" అడిగాన్నేను.

అవునయ్యా! తెలుగు మీడియంలోనే చెప్తున్నాకదా-"

నేను రంగారెడ్డివేపు చూశాను.

"అయితే మనం వెనక్కువెళ్ళి వాడి డబ్బు వాడికిచ్చేసి మన నవలలు మనం పట్టుకొచ్చేద్దాం-" అన్నాడు శాయిరామ్ ఆవేశంగా.

"అవును! పదండి" అన్నాడు యాద గిరి

అందరం కోపంగా మళ్ళీ జెగజ్జెట్టీ పబ్లిషర్స్ ఆఫీస్‌లోకి నడిచాము. ఆ సన్నటివ్యక్తి మమ్మల్నిచూసి చిరునవ్వు నవ్వాడు.

"నవలలేమయినా అమ్మకానికి ఉన్నాయా?" ఆప్యాయంగా అడిగాడు "ఒకోనవలా ఎంత బరువుంటుంది?"

మావళ్ళు మండిపోయింది.

ఆయిదు నిమిషాల్లోనే అతను మమ్మల్ని మర్చిపోవటం చూస్తే అది నిజమా, నటనా అనే అనుమానం మొదలయింది.

"మేము ఇంతకుముందేగా వచ్చి వెళ్ళింది? అప్పుడే మర్చిపోయారా?" ఆశ్చర్యంగా అడిగాడు చంద్రకాంత్.

"ఓ! మీరా! సారీ! రండి! నవలలు రాసుకొచ్చేశారా?" ఆత్రుతగా అడిగాడతను.

మాకు మతి పోతోంది అతని ప్రశ్నలకు,

"పదినిమిషాల్లో ఎలా రాస్తామండీ?" చిరాగ్గా అన్నాడు శాయిరామ్.

"అందరూ తలోచెయ్యివేస్తే ఎంతలోకిసార్! కిందటేడు నేనలాగే రాయించాను. రామవరప్పాడునుంచి ఎనిమిది మంది ఆడవ్యవసాయ కూలీలను తీసుకొచ్చి రాత్రికిరాత్రి ఆరునవలలు తయారు చేయించేశాను. కాంపిటీషన్‌సార్! అంత ఫాస్ట్‌గా బిజినెస్ చేయకపోతే దెబ్బతినేస్తాం. అసలే గవర్నమెంట్‌తో వ్యవహారం - గవర్నమెంట్‌వాళ్ళ వ్యవహారం మీకు తెలీందేముంది? ఎదురుగ్గా ఎవడువచ్చిగా కనబడితే వాడిదేరాజ్యం- ఇంతకూ మళ్ళీ ఎందుకొచ్చారుమీరు?"

యర్రంశెట్టి శాయి

పబ్లిషర్ గారొస్తున్నారు

"మేము మా నవలలు మీకిచ్చే అభిప్రాయం మార్చుకున్నామని చెప్పటానికొచ్చాము-" అన్నాడు రంగారెడ్డి.

అతను ఆశ్చర్యపోయాడు.

"అదేమిటి? ఎందుకనిఅలా?"

"లేకపోతే ఏమిటయ్యా? పెద్దమనిషివిగదాని నీదగ్గరకొస్తే మమ్మల్ని మోసంచేస్తావా?"

అతను మరింత ఆశ్చర్యపోయాడు.

"నేను మోసం చేశానా మిమ్మల్ని?"

"ఆహ్! వేరే పబ్లిషర్స్ నవలకు అరౌండలిస్తున్నంట - నువ్ రెండొందలే ఇయ్యబోతివి - నీయవ్వ ఇది మోసంగాదనయ్యా?" మండి పడుతూ అడిగాడు యాదగిరి.

"ఓహో! అయితే ఇది తప్పకుండా ఆ నవలాంతకరావ్ పనయి ఉంటుంది. సరే వాడి మాటలే మీకు రుచి అయితే మీ నవలలు తీసుకపోండి! నా వెయ్యి రూపాయలూ నాకిచ్చేయండి-"

దొరికిందే ఛాన్సని అతని డబ్బు అతనికిచ్చేసి నవలలు తీసేసుకున్నాము.

బయటకు నడుస్తూంటే వెనుకనుంచీ నవలాంతకరావ్‌ని తిట్టటం వినిపిస్తోంది.

"నా కొడుకు - నా బేరాలన్నీ చెడగొడుతున్నాడు. ఇదిగో ఇంకోసారి ఆలోచించుకుని మీ నవలలు పట్టుకెళ్ళండి మళ్ళీ తిరిగి వచ్చారంటే ఈ సారి నవలకు వందే ఇస్తాము-"

మేము తిన్నగా నవలాంతకరావ్ ఇంటికి వెళ్ళాము.

అప్పుడు ఇంట్లోని నవలలన్నీ ఒక పెద్ద ప్రైవేట్ రిక్షాలోకి చేరుస్తున్నాడతను. 'ఏ నవలయినా అర్రూపాయలే' అని రాసి ఉంది.

"నవలలన్నీ తెచ్చేశామండీ" అతన్తో ఆనందంగా చెప్పాడు శాయిరామ్.


"మంచిపని చేశారు. లేకపోతే ఎంత నష్టపోయే వాళ్ళో చూడండి-"

"చాలా నష్టపోయేవాళ్ళమండి -"

నన్నడిగితే - గంగోత్రీ పబ్లికేషన్స్‌లో మీకు మంచి రేటు దొరుకుతుంది. కృష్ణ ఒడ్డునే ఉంటుంది వాళ్ళాఫీస్! అక్కడికి వెళ్ళండి -"

"అదేంటండి - మీరు తీసుకోరా?"

"నవలల పబ్లికేషన్ మానేశానుకదా! ప్రస్తుతం గవర్నమెంట్ లైబ్రరీలకు నవలలు అంటగట్టే బిజినెస్‌కి బ్రోకర్‌గా



పని చేస్తున్నాను."

"మరి ఇందాక మాతో అలా ఎందు కన్నారు?"

"నేనయితే ఆరొందలిచ్చేవాడిని అన్నాను గానీ ఇప్పుడు ఇస్తానని చెప్ప లేదుగా –"

గోపాల్రావ్‌కి కోపం ఆగలేదు. చటుక్కున అతని చొక్కా పట్టుకున్నాడు.

"రాస్కెల్ మమ్మల్ని మోసం చేస్తావా?"

అతను బిగ్గరగా అరవటం మొదలు పెట్టేసరికి ఆ వీధిలో వాళ్ళందరూ పరుగుతో వచ్చేశారు. అరగంట పట్టింది మాకు అక్కడినుంచి బయట పడటానికి.

నాలుగడుగులు వేశామోలేదో ఓ వ్యక్తి పరుగుతో వచ్చాడు మాదగ్గరకు.

"నవలలేమయినా ఉన్నాయా సార్! గవర్నమెంట్ లైబ్రరీస్ బ్రోకర్నిసార్! ఫస్ట్‌క్లాస్ బిజినెస్ చేయిస్తాను. ఎంతచెత్త నవలయినాసరే–మూడువేల కాపీలు అంట గట్టేయవచ్చు."

"నీ కమీషన్ ఎంత?"

"చాలా మార్జినల్‌సార్! హైద్రాబాద్‌లో టెన్‌పర్సెంట్, జిల్లాలలో ఫిఫ్టీపర్సెంట్ నాకు టెన్‌పర్సెంట్ – నా ఖర్చులకు ఫైవ్ పర్సెంట్. చూస్కోండి ఎంత లాభమో మీకు –" ఉత్సాహంగా అన్నాడతను.


"అంటే పబ్లిషర్‌కి ముప్పయ్ శాతం మిగులుతుందా?" అడిగాడు రంగారెడ్డి.

"అందులో పదిపర్సెంట్ రచయితకూ, పదిపర్సెంట్ మీకూ, పదిపర్సెంట్ ప్రొడక్షన్‌కాస్టూ–"

"ఏడ్చినట్టుంది – పదండి" అన్నాడు జనార్థన్.

మేము నడుస్తూంటే అతను బతిమాలుతూ వెనకే రాసాగాడు.

"సార్! మీబుక్స్ నాకే ఇవ్వండి, ప్రస్తుతం దీపావళి డిస్కౌంట్ అయిదు శాతం ఇస్తున్నానందరికి చూస్కోండి మీకెంత ప్రాఫిట్టో?"



అతనిని వదిలించుకుని అందరం ఓ హోటల్లో కూర్చుని కాఫీ ఆర్డరు చేశాము.

"అవునూ – వాడూ వీడూ ఎందుకు? ఈ నవలలు మనమే పబ్లిష్‌చేస్తే" అన్నాడు సాయిరామ్ హఠాత్తుగా.

అందరం ఆలోచనలో పడ్డాం.

"కానీ మనం వాటిని అమ్మటం ఓ పెద్ద సమస్యకదా?" అన్నాడు గోపాల్రావ్.

"ఇలాంటి బ్రోకర్లను పెట్టుకుంటే అంతా వాళ్ళే చూసుకుంటారు" అన్నాడు రంగారెడ్డి.


వెంటనే తిరుగుప్రయాణం కట్టాము.

వారంరోజులు అందరం సెలవుపెట్టి మూడు నవలలు ప్రింట్ చేయించేశాము. ఒకోనవల లక్షప్రతులు అమ్ముడవుతుందని చంద్రకాంత్ చెప్పినా ఎందుకయినా మంచిదని ఒకోటి అయిదువేల కాపీలు మాత్రమే వేశాము. అన్ని పత్రికల్లో పబ్లిసిటీ ప్రారంభించాము. ప్రముఖ అజ్ఞాత రచయిత శ్రీచంద్రకాంత్ ఛటోపాధ్యాయ్ గారి ఫలానా నవలలు దీపావళికి విడుదల. కావలసినవారు వెంటనే ఎ.33/6/1 నిర్భయ్‌నగర్ కాలనీ, హైద్రాబాద్‌ని సంప్రదించండి. ఆ మర్నాటినుంచీ పుస్తకాలు కొనేందుకు ఏజంట్లు, పాఠకులు, రెంట్ బుక్‌స్టాల్‌వాళ్ళు కాలనీలో క్యూలు కడతారని మా అందరికీ నమ్మకం.

ఆరాత్రి పన్నెండు గంటలకు కాలనీ మధ్యలోనుంచి బిగ్గరగా ఏడుపులు, కొన్ని గొంతులు ఆ ఏడుపు ఓసర్ని ఓదార్చటం వినిపించేసరికి నేను తలుపు తెరుచుకుని బయటకు పరుగెత్తాను కంగారుగా. అప్పటికే కొంతమంది ఆడామగా పోగయి ఉన్నారు. మధ్యలో కూర్చుని ప్రింటయిన నవలలు వళ్ళో పెట్టుకుని వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు చంద్రకాంత్.

"ఏమిటి? ఏంజరిగింది?" అడిగాను రంగారెడ్డిని.

"మరేంలేదు. తన నవలను పుస్తక



రూపంలో చూసుకునేసరికి కొంచెం మతి చలించినట్లుంది" అన్నాడు జాలిగా.

అందరం అతనిని ఓదార్చసాగాము.

"నా తల్లులూ, తండ్రులూ అందరూ మీరే! పూర్వజన్మ సుకృతంవల్లే నేనీకాం నీలోకొచ్చాను. లేకపోతే జీవితమంతా అజ్ఞాత రచయితగానే మిగిలిపోయేవాడిని" ఏడుపు ఆపి మధ్య మధ్యలో మాట్లాడుతున్నాడతను.

"అయిందేదో అయిపోయిందికదా! ఇంక ఊరుకో" అన్నాడు శాయీరామ్.

"మీకు తెలీదుసార్! నైన్త్‌క్లాస్ చదివేప్పుడు నాకు కల వచ్చింది. నేనుకూడా షేక్‌స్పియర్ అంత గొప్ప రచయితనయిపోయినట్లూ, నా పుస్తకాలన్నీకూడా కాలేజి విద్యార్థులకు టెక్స్ట్‌పుస్తకాలుగా పెట్టినట్లూ - ఇన్నాళ్ళకు నా కలలోకొంత భాగాన్ని మీరు నిజంచేశారు -"

అతనిని ఓదార్చి వాళ్ళింటికి పంపించేసరికి రెండయిపోయింది.

ఆ తరువాత ఇంకమాకు నిద్రపట్టలేదు.

ఉదయం జరగాల్సిన బుక్ రిలీజ్ ఫంక్షన్‌కి ఏర్పాట్లు ప్రారంభించాము. మామూలుగానే శాయీరామ్‌మైక్ ఎరేంజ్‌మెంట్స్ చూస్తున్నాడు.

ఫంక్షన్‌తర్వాత జనమంతా 'క్యూ'లో నిలబడి చంద్రకాంత్ పుస్తకాలుకొనుక్కోడానికి ప్రత్యేకమయిన ఏర్పాట్లు చేశాడు చంద్రకాంత్. క్యూలో నిలబడ్డవాళ్ళకు దాహమేస్తే మంచినీళ్ళు ఇవ్వటానికి పార్వతీదేవి ఓ చలివేంద్రంకూడా ప్రారంభించింది.

తెల్లారిపోయింది.

తొమ్మిదిగంటలకన్నా జనం రావటం మొదలయిపోయింది. బుక్‌రిలీజ్ ఫంక్షన్ ఇంతమంది జనం ఎలా వచ్చారా అని అందరం ఆశ్చర్యపోతున్నాము. ఎందుకంటే అది కేవలం ఫార్మాలిటీకోసం మా కాలనీవాళ్ళ పదిమందీ కలసి చేయాల్సిన కార్యక్రమం. ఆ పుస్తకాల్ని జనార్థన్



రిలీజ్ చేస్తానని బ్రతిమాలుతే సరేనని వప్పుకున్నాం. రాత్రానుజనం మరీ ఎక్కువయిపోయారు. ముఖ్యంగా యువకులు, విద్యార్థులు, విద్యార్థినులు ఎక్కువ సంఖ్యలో వచ్చేశారు. ఆజనాన్ని చూసి చంద్రకాంత్ మళ్ళీ ఏడవటం ప్రారంభించాడు. నాకూ రంగారెడ్డికీ పళ్ళుమండిపోయింది.

"మళ్ళీ ఏమొచ్చింది? ఎందుకేడుస్తున్నావ్?" అడిగాడు రంగారెడ్డి.

"నా పుస్తకాల్ని ఇంతమంది యువకులు అభిమానిస్తున్నారంటే-తెలుగు ప్రజలకు రచయితల మీద ఎంత ప్రేమ ఉందో, మళ్ళీ రచయితలను ఎంత గౌరవిస్తున్నారో తెలుస్తోంది. ఇంత గొప్ప అభిమానాన్ని నేను భరించలేను" అంటూ మళ్ళీ ఏడవసాగాడు.

ఫంక్షన్ మొదలయింది. జనార్థన్ పుస్తకాలు రిలీజ్ చేయగానే జనంలోనుంచి కలకలం బయల్దేరింది.

"ఏడీ-చిరంజీవి కావాలి - చిరంజీవి ఎక్కడా?" అంటూ అరుస్తున్నారు కొంతమంది మాకిదేమీ అర్థం కాలేదు.

"ఏ చిరంజీవి కావాలి మీకు?" వేదిక మీద నించే అడిగాడు రంగారెడ్డి.


"హీరో చిరంజీవి కావాలి-కావాలీ-"

అరే సాలే-సినిమాహీరో చిరంజీవికో బులారే-" ఎవడో తిట్టాడు.

రంగారెడ్డికి కోపం వచ్చేసింది ఆ తిట్టుతో.

"అరే-తుమ్‌సాలే - తేరాబాప్‌సాలే-తేరీ బహిన్‌సాలే-" అంటూ అయిదు నిముషాలు హిందీలో మాట్లాడాక అతను తగ్గాడు. ఈలోగా జనంలోనుంచి యాదగిరి దూసుకొచ్చేశాడు.

"చూసినా! ఈ కిరికిరంతా ఎందుకయిందనుకున్నవు! మనోళ్ళకూ తెల్వకుండ. మన జనార్దన్ అన్న పోయి ఊరంతా స్పీకర్ ప్రకటనలు గుప్పించేశాడు. ఎక్కడ చూచినా పెద్ద ఎత్తున వాల్



పోస్టర్లు! ప్రముఖ రచయిత చంద్రకాంత్ రచించిన నవలలు యువకుల ఆరాధ్య దైవం, ప్రముఖ సినీనటుడుచే ఆవిష్కారం –" అని రాశాడందులో అందుకని అందరూ చిరంజీవే వస్తున్నాడనుకున్నారు –"

అప్పుడర్థమయిందిమాకు, జనమందరినీ బ్రతిమాలి మా ఉద్దేశ్యం యువకుల హీరో అంటే జనార్ధనేనని సర్ది చెప్పేసరికి తల ప్రాణం తోకకొచ్చింది. జనార్ధన్ మీద కొంతమంది టమోటాలు, రాళ్ళువిసిరాక ఎవర్దారిన వాళ్ళు వెళ్ళిపోయారు.

వాళ్ళెవరయినా అడిగితే పుస్తకాలు అమ్మేద్దామని కూచున్న చంద్రకాంత్, పార్వతిదేవి సాయంత్రం వరకూ ఎదుర్చూసి చూసి విసిగిపోయారు.

ఆ తరువాత వారం రోజులు కూడా గడచిపోయినయ్‌గానీ ఒక్క పుస్తకం కూడా అమ్ముడు పోలేదు.

విజయవాడనుంచి చంద్రకాంత్ పుస్తకాలు కావాలని ఓ వందమంది బుక్ షాప్స్ వాళ్ళు ఆర్డర్స్ ఇచ్చారుగానీ వాళ్ళకు అరవై శాతం కమిషన్ ఇవ్వాలనీ, ఆ డబ్బుకూడా మరో సంవత్సరం తర్వాత ఇస్తామని రాశారు.

అందరం ఎటూ తోచక తలపట్టుక్కూచున్నాము.


"ఇంకలాభంలేదు! ఇంక వీలయినన్ని కాపీలు డిస్ట్రిక్ట్ లైబ్రరీస్‌కి తోశేద్దాం" అన్నాడు శాయీరామ్.

"అవును – అదేమంచిది" అన్నాడు రంగారెడ్డి.

వెంటనే అందరం ఆ కార్యక్రమంలోకి దిగిపోయాము.

"ముందు మన పుస్తకాలు ఎప్రూవెల్ లిస్ట్‌లోకి రావాలి. ఆ లిస్ట్‌లో ఉన్న పుస్తకాలే జిల్లా గ్రంధాలయాలు కొంటాయ్" చెప్పాడు గోపాల్రావ్.

"మరి ఆ లిస్ట్‌లో మన పుస్తకాలు



రావాలంటే ఎంత పర్సెంటేజ్ ఇవ్వాలి" అడిగాడ్ చంద్రకాంత్.

"టెన్‌పర్సెంట్ ఖర్చవుతుంది –" వీళ్ళు చాలా మంచాళ్ళు! బేరమాడే రకం కాదు" చెప్పాడు గోపాల్రావ్.

"అయితే కానిచ్చేద్దాం! ఇంక ఆలస్యం ఎందుకు?" అన్నాడు రంగారెడ్డి.

రెండురోజుల్లో లిస్ట్‌లో చంద్రకాంత్ నవలల పేర్లు వచ్చేశాయ్. వెంటనే ఆ లిస్ట్‌లు తీసుకుని జిల్లాల పర్యటన ప్రారంభించాం. లైబ్రరీ సెక్రటరీలను, కమిటీ మెంబర్స్‌నీ, చైర్‌మెన్‌నీ అందరినీ కలుసుకుని పర్సెంటేజ్‌లు చాలా వేగంగా ఫిక్స్ చేసేస్తూ పుస్తకాల సప్లయ్‌కి ఆర్డర్స్ తీసుకోసాగాము.

పది రోజుల్లో అంతా సెటిలయిపోయింది. మూడువేల కాపీలు అమ్మకాలు జరిగి పోయాయ్ ఓరల్‌గా.

అందరం ఆ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని కాలనీలో బీర్ పార్టీకూడా ఏర్పాటు చేసుకున్నాము. ఆ మర్నాడు వచ్చింది జి.వో

తెలుగుదేశం ప్రభుత్వం లైబ్రరీలు పుస్తకాలు కొనటాన్ని నిషేధించింది. చంద్రకాంత్ మొఖం పాలిపోయింది. ఉండుండి పిచ్చిమాటలు మాట్లాడటం మొదలుపెట్టాడు. అతనికి పిచ్చిఎక్కిందేమోనన్న అనుమానంకూడా కలిగింది మాకు.


కొద్దిరోజుల పాటు మాకూ మనసు మనసులోలేదు. కాలనీ ఫండ్స్ అన్నీ పుస్తకాల ప్రింటింగ్‌కి ఉపయోగించేశాం. ఏక్షణాన్నయినా మా మెంబర్స్ ఏదయినా ఫంక్షన్ ఆర్గనైజ్ చేయమని కోరితే ఏం చేయాలో తెలీని అయోమయస్థితిలో పడిపోయాం.

ఓరోజుమళ్ళీ అర్ధరాత్రి ఏడుపు వినిపించేసరికి అందరం బయటకు పరుగెత్తాము.

చంద్రకాంత్ మామూలుగానే వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు.

గోపాల్రావ్ అతనిని ఓదారుస్తున్నాడు.

యాదగిరి ఆనందంగా, ఎగ్జయిట్‌మెంట్‌తో మాట్లాడుతున్నాడు.



"చాలా తేలికన్నా - మా చిన్నాన్న గిట్లనే తన్రాసిన పుస్తకమొకటి శాంక్షన్ చేయిపించిండు ..."

"ఏమిటి శాంక్షన్ చేయించటం ?" అయోమయంగా అడిగాను.

"అదే మన చంద్రకాంత్ తంబి బుక్స్‌ని మన హైస్కూల్‌కిగానీ, కాలేజీకిగానీ నాన్‌డిటైల్డ్ టెక్స్ట్‌బుక్స్‌గా వేయడానికి కోషిష్ చేద్దం !"

నాకు నవ్వొచ్చింది.

"నీకేమయినా పిచ్చెక్కిందా ? టెక్స్ట్‌బుక్స్‌గా రావాలంటే అది రచించినవారికి చాలా పెద్దపేరు ప్రఖ్యాతులుండాలి-లేదా ఎకడమిక్ క్వాలిఫికేషన్స్ ఉండాలి-"

"నీయవ్వ - మీకు తెలీదు, ఇంకొకరు జెప్తే ఇనరు-నడవండ్రి వాతో-" అన్నాడతను కోపంగా.

చంద్రకాంత్ లేచి యాదగిరిని కౌగలించుకుని బావురుమన్నాడు.

"నైన్త్‌క్లాస్‌లో నేనుకన్నకలలాలూకా రెండోభాగంకూడా నిజమయేట్లు చేస్తున్నావన్నా ! నువ్వే నా తల్లివి, తండ్రివి !"

అతనిని అతికష్టంమీద వదిలించుకుని బయల్దేరాము.

ముందు యాదగిరి చిన్నాన్న ఇంటికి వెళ్ళాము. సంగతి విని అతనే చెప్పాడు.


"ఇది చాలా చిన్నవిషయం బిడ్డా ! షేక్‌స్పియర్ ఏమిచెప్పిండో ఎరుకనా?"

"ఏమిచెప్పిండు ?"

"బేర్స్ బై గ్లాసెస్
లయన్స్ బై నెట్స్
ఎలిఫెంట్స్ బై పిట్స్
అండ్ మెన్ బై ఫ్లేటర్"

"ఇప్పుడెందుకు జెప్తున్నావ్‌మాకు ?" చిరాగ్గా అడిగాడు యాదగిరి.

ఇంకా సమజ్ కాలేదా ? పొగడ్తకు లొంగని మనిషి దునియాల లేడు. ఎడ్యుకేషన్ మినిష్టరూ, యూనివర్సిటీ చైర్మన్‌లు, టెక్స్ట్‌బుక్ కమిటీ మెంబర్లు - అందర్నీ పొగడండ్రి! రెండోరోజు మీరేం



పుస్తకం రాసినగానీ మన కాలేజీ, యూనివర్సిటీల్లో టెక్స్ట్‌బుక్‌గ వస్తది."

గోపాల్రావ్ హఠాత్తుగా ఆయన కాళ్ళమీద పడిపోయాడు. "ఆహా ! ఎంతగొప్ప సూత్రం చెప్పారుసార్ !" అన్నాడు ఆనందభాష్పాలు రాలుస్తూ.

అందరం ఇంటికి చేరుకున్నాం.

మా చంద్రకాంత్ పుస్తకాలు టెక్స్ట్‌బుక్‌లుగా రావటానికి ఎవరెవరి సహాయ సహకారాలు కావాలో లిస్ట్ తయారుచేశాం. వాళ్ళందరికీ సన్మానాలు ఏర్పాటుచేసేయాలని నిర్ణయించుకున్నాం.

ఆ తరువాత మా కెవరికీ క్షణం తీరిక లేకపోయింది.

రెండు నెలల్లో పదహారు సన్మానాలు జరిపాము మా కాలనీలో. ఆ సన్మాన వివరాలు అన్ని న్యూస్‌పేపర్లలో కవర్ చేయించాం. అలా కవర్ చేసేందుకు ఆ న్యూస్ పేపర్ జర్నలిస్ట్‌లకు ముందే సన్మానం చేసేశాం. చివరకు అశుభ సమయం రానే వచ్చింది.

మా చంద్రకాంత్ రాసిన మూడు నవలలూ తెలుగు నాన్‌డిటయిల్స్‌గా ఎన్నికయిపోయాయ్.

ఆ రాత్రి మళ్ళీ చంద్రకాంత్ ఏడుపు వినిపించింది,

కిటికీ తెరచి చూశానుగానీ అతనొక్కడే కూర్చుని కనిపించాడు.

అందరూ కిటికీలు తెరిచి చూస్తున్నారుగానీ ఎవరు బయటకు రావటంలేదు.

బహుశా అందరూ నాలాగానే ఆలోచిస్తూండి ఉంటారు.

చంద్రకాంత్ మాకు ఎంత కావలసిన వాడయినా అతను రాసిన చెత్త పుస్తకాల్ని పాఠ్యగ్రంథాలుగా మన తెలుగు పిల్లలు చదవటం ఎందుకో మాకు ఎబ్బెట్టుగాఉంది. ఎందుకంటే వాటికి ఎలాంటి విలువలూ లేవని మా మనసుల్లో మాకు తెలుసు -


కానీ ఇప్పుడింక చేసేదేముంది ?

అంచేత కిటికీ మూసేసి నిద్రలోకి జారిపోయాను. ***

యండమూరి వీరేంద్రనాథ్

ఇంటర్వ్యూకి నాల్రోజులుందనగా షుభాష్ వెళ్ళిపోయాడు. బరువైన హృదయంతో అతడికి వీడ్కోలు చెప్పింది. జీవితంలో మళ్ళీ తాము కలుసుకుంటామా అన్న అనుమానం వచ్చింది. ఐ.పి.సి. 497 గుర్తొచ్చి నవ్వొస్తుంది. ఒక వివాహిత స్త్రీ, ఆమె ఇష్టమయినా సరే – ఆమె భర్తకు ఇష్టం లేకుండా వేరే పురుషుడితో లైంగిక సంబంధం కలిగి వుంటే అది నేరం. అంటే, వివాహమైన స్త్రీ భర్త ఆస్తి అన్నమాట. అవివాహిత స్త్రీకి ఈ పట్టింపులేదు. అదే తన భర్తకు మరో స్త్రీతో సంబంధం వుందని భార్య నిరూపించినా అది విడాకులు పొందటానికి సాయపతుందేతప్ప, అతడిని శిక్షించడానికి సాయపడదు. భారత శిక్షాస్మృతిలో తప్ప మరే దేశంలోనూ ఈ 497 సెక్షన్ లేదు. తన గురించి తన భర్తకు తెలిస్తే తనకి ఎంత శిక్ష వేయమని కోరతాడు కోర్టుని? పెళ్ళయిన మొదటి రాత్రే తన చెల్లెలితో 'కులికిన' ఇతడు తను చేసిన దోషం గురించి ఏ విధంగా వాదిస్తాడు? ఇండియన్ పీనల్‌కోడ్ మొగవాడికి ఆ సౌలభ్యం కలుగ జేసిందని వాదిస్తాడా?

ఆమె బలవంతగా ఆలోచనల్ని పారద్రోలింది. కొన్ని రోజులు గడిచాయి. ఆమెకి అతన్ని చూడాలని, కనీసం ఒకసారైనా మాట్లాడాలనీ బలంగా అనిపించేది. నిద్రలో హఠాత్తుగా మెలకువ వచ్చి మరి నిద్ర పట్టేదికాదు.



జరిగిన కథ:-

వైజయంతి, విశాల, అనూరాధ, భార్గవి స్నేహితురాళ్ళు. వైజయంతికి ఎస్.పి.గా ఉత్తరప్రదేశ్‌లో పోస్టింగ్ వస్తుంది. ఆమె సంసారం అంతంత మాత్రంగా ఉంటుంది. ఆ సమయంలో తన స్నేహితురాలు అవంతి గుర్తుకొస్తుంది. ఆమెను చూడ్డానికని అమెరికా వెళతుంది.

విశాలదో విచిత్ర మనస్తత్వం. ఆ ఇంట్లో తనదే పై చేయి కావాలన్న ఆరాటం. అదే దృక్పథంతో భర్తను ఓ దద్దమ్మగా చేస్తుంది. వాళ్ళింటికి విశాల ఆడబిడ్డ సునీత వస్తుంది. అన్నయ్య సంసారం చూసి బాధపడుతుంది సునీత.

అనూరాధ ఓ భావుకురాలు. ఓ రోజు తోటలో ఆమె కూర్చుని ఉన్నప్పుడు ఓ కొత్త వ్యక్తి ప్రవేశిస్తాడు.

ఆ కొత్తగా వచ్చిన వ్యక్తి పేరు మోహన్. మోహన్, అనూరాధలు ప్రేమలో పడతారు. అతను ఓ కారు మెకానిక్. వాళ్ళిద్దరు ఇంట్లో ఎదిరించి పెళ్ళిచేసుకుని వేరే కాపురం పెడతారు. అనూరాధకు ఉద్యోగం వస్తుంది. మోహన్‌కు అనూరాధ బాబాయి కూతురు రాజీతో సంబంధం ఉంటుంది.

అనూరాధ మోహన్‌ల సంసారం చాలా అసంతృప్తిగా సాగుతోంది. మోహన్ పెళ్ళికి ముందు చూపించినదంతా అసహజమైన ప్రేమేనని అర్థమైంది.

అనూరాధ తన కొలీగ్ సుభాష్‌కి మానసికంగా దగ్గరవుతుంది.

–ఇక చదవండి

అంతర్ముఖం

ఇంటర్వ్యూలో అతడు సెలెక్టయినట్టు, ట్రయినింగ్ మొదలయినట్టు ఉత్తరం అందుకుంది మరికొన్ని నెలలు గడిచాయి. తొలివర్షపు జల్లు తాకిడి నుంచి ఆమె కొద్దిగా తేరుకుంటూ వుండగా అతన్నించి వుత్తరం వచ్చింది.

రాధా,


ప్రేమించిన మనసుకి కావల్సింది మరో ప్రేమించే మనసు. ప్రేమ తప్ప జీవితంలో ఇంకేమీలేదు" అని చిన్నప్పుడు నేను చదివిన పుస్తకాల్లోంచి నేర్చుకున్నాను. నీ పరిచయంతో అది నిజం అని గాఢంగానమ్మేను. కానీ తరువాత తరువాత ప్రేమ అన్నది జీవితంలో ఒక భాగం అని అనుభవం నేర్పింది ఒకప్పుడు నేనెంత మామూలుగా ఆలోచించానో అర్ధమవుతూంది దీన్నే మెచ్యూరిటీ అంటారేమో! ఏడాదికేడాది మారే భావాల్నే మెచ్యూరిటీ అంటారని, ప్రతిసారి ఒక కొత్త భావం మనసులో మెదిలినప్పుడు – ఆహే, ఇంతకుముందు నేనెంత ఇమ్మెచ్యూర్‌గా ఆలోచించే వాడిని – ఇప్పుడు కదా సర్రిగ్గా ఆలోచించ గల్గుతున్నాను – అని జీవితపు ప్రతి స్టేజిలో పధ్నాలుగో ఏటినుంచీ చచ్చేవరకూ అనుకుంటూనే వుంటాడనుకుంటాను. ఇలా నిరంతరం మెచ్యూర్ అవటానే, తన చర్యలకు సమర్థనీయమైన వాదనని కల్పించుకోవటంగా అభివర్ణించాడో రచయిత. అయినా సరే ఈ విషయం నీకు చెప్పాలనిపిస్తోంది నీకు చెప్తే అదో సంతృప్తి (మళ్ళీ ఆత్మవంచన అని నవ్వుకోకు ప్లీజ్)

మనం గడిపిన కొద్ది రోజుల్నీ మధుర స్మృతులుగా మిగుల్చుకుని జీవితం అంతా సంతోషంగా గడిపేయగలనన్నాను. నా ప్రేమ కూడా నీ ప్రేమకు తీసిపోయిందేమీకాదు అన్నాను. నీతో కలిసింతర్వాత మరో స్త్రీని అంత తపనగా దగ్గరకు తీసుకోగలనా అని అనిపించింది. ఇదంతా మనస్ఫూర్తిగా నిజమే అనూరాధా. నన్ను నమ్ము కానీ కాలం అన్నది పాములాంటిది. నిర్ణయాల్ని కొండ చిలువలా చుట్టుకుని బిగిసడిలే వరకూ వదలదు. ఇదంతా ఎందుకు వ్రాస్తున్నానంటే నేను పెళ్ళి చేసుకోబోతున్నాను. అంతా సెటిలయిపోయింది. ఆమె గురించి తెలుసుకోవాలనుకుంటున్నావు గదూ? ఆమె ఒక అభాగ్యురాలు. పెళ్ళయి ఆరునెలలయినా కాకుండానే భర్తను పోగొట్టుకుంది. భర్త పోయేనాటికే గర్భవతయిన ఆమెకు యిప్పుడో బాబు ప్రస్తుతం నాతో బాటు ట్రెయినింగులో ఉంది. నువ్వెవరో చెప్పకుండా మన ప్రేమ గురించి మాత్రం చెప్పాను మేము ఇద్దరం ఒకరినొకరం అర్థం చేసుకుని తోడుగా ఉండగలమనే నమ్మకం యిద్దరికీ కలిగింది పదిహేను రోజులలో మా పెళ్ళి చాలా నిరాడంబరంగా జరుగుతుంది నీ శుభాకాంక్షాలు వుంటాయని తెలుసు ఉంటాను మరి.

—సుభాష్

పి.యస్. ఆమెని నేను పెళ్ళి చేసుకోవటానికి కారణం కేవలం ఆమె అభాగ్యురాలు కావటం మాత్రమే కాదు.

అనూరాధా కళ్ళలో నీళ్ళు తిరిగాయి. అవి ఆనంద బాష్పాలో, విషాదాశ్రువులో ఆమెకే అర్థం కాలేదు ఒక చాప్టర్ మాత్రం క్లోజ్ అయింది.



అనుకున్న సమయానికి యిల్లు పూర్తయింది. అప్పుడే రాధకు మరో ప్రమోషన్ కూడా వచ్చింది. ఆ సంతోషాన్ని పంచుకునే వాళ్ళే కరువయ్యారు.

కొత్త యింటికి మారదాం అనగానే మోహన్ గొడవ పెట్టాడు. వెళ్ళేటట్లయితే తమతోపాటు ఉంటున్న తమ్ముడి కుటుంబాన్నీ తీసుకెళ్ళాలని అతడి వాదన రాధ ససేమిరా అంది ఒకసారి మొదలయితే అదలా కొనసాగుతూనే వుంటుందని ఆమెకు బాగా తెలుసు.

"ఎప్పుడయినా ఓ వందో, రెండువందలో కావాలంటే సాయం చేద్దాం. వాళ్ళు విడిగా వుండడమే మంచిది" అంది.

"డబ్బు సంపాదిస్తున్నానని ఎంత అహం నీకు! వాళ్ళకు కావలసింది డబ్బు కాదు. మన ఆసరా. ఏదో చిన్న ఉద్యోగంలో అవస్త పడుతున్నాడు ఈ సమయంలో ఒంటరిగా వదిలేస్తే యిబ్బంది పడతాడు. నీకు నేనున్నానని చెప్పి తీసుకొచ్చాను ఇప్పుడు నా సుఖం చూసుకు వెళ్ళిపోతే నలుగురూ ఏమనుకుంటారు?"

"నీకు నీ వాళ్ళ గురించి తప్ప నా గురించి, మన పిల్లల గురించి ఆలోచన రాదా? వాళ్ళని తీసుకొచ్చావు కాదనలేదు. అతడికి ఉద్యోగం దొరికింది వాళ్ళ బ్రతుకు వాళ్ళని బ్రతకనీ"

"నాకంత స్వార్థంలేదు ఇల్లు పెద్దదేగా వాళ్ళుంటే నీకేం యిబ్బందని?"

"అందులో రెండు గదులు అద్దెకు యిస్తున్నాను"

మోహన్ కోపంగా చూశాడు. "అయితే నన్ను ఒక మాట అడగాల్సిన అవసరం లేదన్నమాట నీ యిల్లు కదూ? వెళ్ళు. వెళ్ళి ఒక్కదానివీ సంతోషంగా బ్రతుకు" అని కోపంగా బయటకు వెళ్ళిపోయాడు. ఆమె అలాగే కూర్చుండి పోయింది.

స్కూలునించి వచ్చిన పిల్లలకు బట్టలయినా మార్చదు తోటికోడలు. ఓ

అయిదువందలు యింట్లో యిచ్చేయగానే బాధ్యత తీరిపోయిందనుకుంటాడు - మరిది. ఇక పిల్లల బాధ్యత మొత్తం అనూరాధాదే 'ఇంట్లో పళ్ళేమీలేవు. వచ్చేటప్పుడు అరటిపళ్ళు కొనుక్కురా అక్కయ్యా. యాపిల్స్‌కూడా బాగా దొరుకుతున్నాయట కదా? ఓ అరడజను తీసుకురా, అలాగే బిస్కెట్లు కూడా అని తోటికోడలు ఆజ్ఞాపిస్తుం దామెను. ఆఫీసునించి చచ్చిచెడీ పనిచేసి వస్తే పిల్లలు పాలు కూడా తాగి ఉండరు. భార్యాభర్తలిద్దరూ ఏ షికారుకో వెళ్ళి వుంటారు ఉదయం వెళ్ళేలోపల అన్నీ చేసిపెట్టి వెళ్ళాలి వచ్చి రాగానే అన్ని పనులు చేసుకోవాలి. ఎందుకు యిలాంటి వాళ్ళకోసం కష్టపడడం? తను స్వార్థపరురాలే అయితే తన హక్కులకి సంబంధించినంత వరకు మాత్రమే స్వార్థపరురాలు.

అనూరాధ యిల్లంతా కలయచూసింది. ఆ యింట్లో ప్రతి చిన్న వస్తువూ తను కష్టపడి సంపాదించిన డబ్బుతో కొన్నదే అంతా తీసుకుపోయినా అడిగే హక్కు ఎవరికీలేదు అయినా అవసరమైన వస్తువులు మాత్రం సర్దుకుంది.

"మొగుడి మాట వినకుండా ఎదురు తిరగడం మా యింటా వంటా లేదు. నాలుగు తన్నినా నోరు మూసుకుని కాపరం చెయ్యాల్సిందే మంచిసంబంధాలు ఎన్ని వచ్చినా నోరుమూసుకుని కాపరం చెయ్యాల్సిందే మంచి సంబంధాలు ఎన్ని వచ్చినా కాదని యిది చేసుకున్నందుకు మంచి పాఠమే నేర్పుతుంది" అత్తగారి సణుగుడు.

కల్లో, గంజో తాగి భర్తతో ఉండాలి తప్ప విడిగా పోయి పంచభక్ష్యపర మాన్నాలు తినే ఆశ ఆడవాళ్ళకు ఉండటం మొదటిసారి చూస్తున్నాం - తోటికోడలు తనలో తను పైకి అంటోంది.

సామాన్లు ట్రక్కులో వేస్తోంటే వచ్చాడు మోహన్. జరుగుతున్నదంతా చూసి అగ్గిమీద గుగ్గిలమయ్యాడు.

"పోతే పో - పిల్లల్ని మాత్రం యివ్వను. ఏ కోర్టు కెళతావో చూస్తాను" అని అరిచాడు. రాధ ఒక్కక్షణం అతడివైపు కన్నార్పకుండా చూసింది యుగయుగ లైనా ఈ పురుషాహంకారం తగ్గదా? ఇద్దరాడవాళ్ళు ఆ పురుషుడినే సపోర్టు చేయ టం - ఏ లాజిక్కూ అర్థం చెప్పలేని నగ్నసత్యం.


పిల్లలను అడ్డుపెట్టుకుని తనను అణచాలని చూస్తున్నారు అది ఆమె ముందుగా వూహించినదే. ఆమె లొంగలేదు.

"పోనీ మీ పిల్లలను మీరే జాగ్రత్తగా పెంచుకోండి నేను పోతున్నాను" అంది కామ్‌గా.

వాళ్ళు ఆ సమాధానం వూహించలేదు. అవాక్కయి చూస్తూ ఉండిపోయారు

కొత్త యింట్లో మొదటిరాత్రి ఏడుపుతో గడిచింది వారం రోజులు అంత పట్టుదల గానూ నిలబడగలిగింది వారం తర్వాత చిన్నదాన్ని తీసుకొచ్చాడు మోహన్.

"నీకంటె ఏ దిగులూలేదు. చక్కగా వున్నావు అదేమో నీ కోసం బెంగ పెట్టుకు జ్వరం తెచ్చుకుంది" అంటూ వదిలేసి వెళ్ళాడు మరోవారం తిరక్కముందే



పెద్ద పాప కూడా వచ్చేసింది.

"నువ్వేమో కనిపారేశావు పోషించాల్సింది మేమా?" అన్నాడు తన పరిస్థితు లకు అనుగుణంగా కొత్త వాదనలు నిర్మించుకోవటం మనిషికి కొత్త కాదని మున్నేగా అనుకుంది. ఏది ఏమైతేనేం రాధ తృప్తిగా నిట్టూర్చింది. మోహన్ యిప్పటికయినా వచ్చేస్తే క్షమించడానికి సిద్ధంగా వున్నదామె.

"అమ్మా, నాన్నగారు వెరీబాడ్. నన్ను రోజూ కొట్టేవాడు. పిన్ని సరిగ్గా అన్నం కూడా పెట్టేదికాదు. నేను అడిగినా పెట్టేదికాదు మనం అక్కడకు వెళ్లొద్దు" అంది మల్లిక.

అత్తయ్య కూడా వచ్చింది నన్ను రోజూ కొట్టేది అంది రోజా జాలిగా.

ఇంకేం ఫర్వాలేదమ్మా ఇకనుంచీ మీకేం కావాలన్నా నేను తెచ్చి పెడతాను, అంటూ కన్నీళ్ళతో గుండెలకు హత్తుకుంది. తనెంత (పైకి కనబడే) స్వార్థపరురాలు!

అనుకున్నట్లుగానే కొద్ది రోజులకి మోహన్ వచ్చాడు. ఏవో కబుర్లు, సమర్థిం పులూ చెప్పాడు. ఇకనైనా సక్రమంగా వుంటే బావుండుననుకుంది. రెండు రోజులు సరిగానే ఉన్నాడు. ఆ మర్నాడు రాధకి జీతం రాగానే ముందు బ్రతిమిలాడి తరువాత దెబ్బలాడి కొంత డబ్బు తీసుకుని వెళ్ళాడు.

రోజు రోజుకీ అతడు తాగుబోతుగా, జూదరిగా మారుతున్న విషయం ఆమెకు తెలుస్తూనేవుంది, భార్య ప్రవర్తనతో విసిగిపోయి అతడలా తయారవుతున్నాడని అత్తగారు అందరి దగ్గరా చాటింపు వేస్తోంది.

డబ్బు కావాలనుకున్నప్పుడల్లా రావడం. గొడవచేసి అవసరం అనిపిస్తే తన ఎదురుగానే పిల్లల్ని కొట్టి, సాధించి డబ్బు తీసుకెళ్ళడం అలవాటయిపోయింది మోహన్‌కి.

సునీత వచ్చి యిల్లు అద్దెకి అడిగినప్పుడు తనకు తోడుగా వుంటుందని, బాగా

తెలిసిన అమ్మాయని రెండు గదులు అద్దెకు ఇచ్చేసింది. ఆమె జీవితంలో అదో మలుపు పుస్తకాల మీద అభిరుచి ఆ యిద్దర్నీ దగ్గరకు చేర్చింది. విశ్వం సునీత కోసం ఆ పోర్షన్‌కి వచ్చేవాడు. అతడికి పఠనాభిరుచి ఉంది.

క్రమేణా విశ్వం ఆ యింటికి తరచు రావడం సాగించాడు. గంటల తరబడి కూర్చుని పుస్తకాల గురించీ, ఆచార వ్యవహారాల గురించీ మాట్లాడుకునేవారు.

అప్పుడప్పుడు మోహన్ రావడం, డబ్బుకోసం గోడవ చేయడం కాస్త అల జడి కలిగిస్తున్నా విశ్వం సునీతల స్నేహంలో త్వరగానే కోలుకుంది రాధ.

కానీ విశ్వం మనసే ప్రస్తుతం బాగాలేదు. జీవితంలో మొదటిసారిగా 'ప్రేమ' అంటే ఏమిటో తెలుస్తోందతడికి కళ్ళు మూసినా, తెరచినా రాధ రూపమే కనిపి స్తోంది. ఆమెను చూడకపోతే రోజు గడిచేలాలేదు. జయతో పెట్టుకున్న సంబంధం లాంటిది కాదిది 'ఆమెను చూడాలి, కాసేపు మాట్లాడాలి, అప్పుడే అతడికి తృప్తి అంతకుమించి మరేం అవసరం లేదనిపిస్తుంది. కాని రాధకావిషయం చెప్పాలంటే భయం. ఆమె నిస్సహాయతను ఆధారంగా చేసుకుని తను కూడా ఓ అవకాశం కోసం చూస్తున్నాడనుకుంటుందేమోనని భయపడ్డాడు.

అనూరాధకు విశ్వంలో నచ్చిన విషయాలు మరో రెండున్నాయి.


"అందరిలాగా" అతడు ఆమె భర్తని తిడుతూ ఆమెకు దగ్గరవ్వాలని ప్రయత్నించడు మోహన్‌ని దారిలోకి తీసుకురావడం సాధ్యపడుతుందేమోననే ఆలో చిస్తాడు.

"నాకు మోహన్‌మీద కోపం రావడంలేదు. నీమీద సానుభూతి చూపించాలనీ లేదు అతడిమీదే జాలి కలుగుతుంది. నీలాంటి భార్యను పొందీ అతడు జీవితాన్ని సుఖమయం చేసుకోలేక పోతున్నాడు" అనేవాడు అతడికి స్త్రీల పట్లగల గౌరవాన్ని తెలుసుకుని ఆమె ఆశ్చర్యపడేది సాధారణంగా మగవాళ్ళు తనలాంటి స్త్రీలు గురించి ఉన్నతంగా ఆలోచించరు ఆలోచించినా పైకి చెప్పరు.

మన ఆచారాలూ, మనం గొప్పగా చెప్పుకునే సంస్కృతీ మన స్త్రీలను అధమ స్థితిలోకి తోసేశాయి భార్య విద్యావంతురాలయితే ఎక్కడ తన అహానికి, స్వార్థానికి అడ్డుపడుతుందోనని ఆ అవకాశమే లేకుండా చేశాడు మొగవాడు. భర్త చేతిలో ఎలాంటి హింసనయినా భరించి అతడిని పూజించే స్త్రీయే గౌరవనీయురాలన్నారు పెద్దలు. చాలా పటిష్ఠమయిన సామాజిక వ్యవస్థ యిది అదే అన్నది ఆమె సునీతతో.

"కాని స్త్రీకి పురుషుడి కంటె ముందుగా మరో స్త్రీయే శత్రువవుతోంది కదా?" అని అడిగింది సునీత దానికి విశ్వం జవాబు యిచ్చాడు.

"తరతరలుగా అజ్ఞానంలో మగ్గడం వల్ల వచ్చిన అనర్థమిది తనో బానిస నని, పురుషుడు తనకన్న అన్ని విధాల గొప్పవాడని ఆమె రక్తంలో జీర్ణించుకు పోయింది. పైకి చెప్పకపోయినా 'కొడుకు పుట్టాడు' అనగానే ఆమె చాలా సంతోషి స్తుంది. తనలాంటి 'అబల' మరొకటి జన్మించలేదని సంతోషపడుతుంది. ఎంత



విజ్ఞానవంతురాలయినా, విద్యావంతురాలైనా కూతుర్నీ, కొడుకునీ పెంచే విధానంలో తేడా చూపిస్తుంది. ఆ విధంగా తల్లే బిడ్డకు శత్రువవుతోంది. ఇన్ని తరాలుగా పాతుకు పోయిన ఈ అభిప్రాయాలు ఒక్కసారిగా తొలగిపోవు. ఇది సంధియుగం ఇప్పటికే కొంత మార్పు వచ్చింది. త్వరలోనే స్త్రీ తన బానిస భావాన్ని విడనాడి నిజమైన స్వాతంత్ర్యాన్ని సాధించుకుంటుంది ఇది మాత్రం తథ్యం"

ఈ రకమైన సంభాషణలు ప్రతిరోజూ చోటు చేసుకునేవి. తన మనసులోని భావాలన్ని అతడినించి వింటుంటే తృప్తిగా అనిపించేది అనూరాధకు.

కొద్ది నెలలు గడిచాయి మనసులో మాట దాచుకోలేక బయటపెట్టేశాడు విశ్వం. ఆమె ఆశ్చర్య పోలేదు.

అతనన్నాడు -"ప్రేమ అంటే ఎవరిమీదో ఎందుకో తెలియకుండా జరిగిపోయే ఒక అబ్‌స్ట్రాక్ట్ ఫీలింగ్‌కాదు' ఈమె గుణవంతురాలు నా మనసుకి నచ్చిన అందమైనది కాబట్టి ఈమెను ప్రేమించవచ్చు, అని ఆలోచించుకుని ప్రేమించడం నిజమైన భార్య భర్తల ప్రేమయినా అది ఆ బంధంవల్ల వచ్చిందే. ఇతడు నా భర్త ఇతడికి నేను సేవ చేయాలి, అన్న నియమంతో భార్య అన్నీ చేసి పెడుతుంది. 'నా కోసం ఈమె యింత కష్టపడుతోందే' అన్న కృతజ్ఞతా భావంతో భర్త ఆమెను ప్రేమిస్తాడు. నా కనిపిస్తుంటుంది. "మా మధ్య చుట్టరికమే లేకుండా మేమిద్దరం అపరిచయస్థులుగా ఉంటే నన్ను నా భార్య ప్రేమించగలిగేదా అని. బహుశా ఇద్దరం ఒకరినొకరు అసలు యిష్టపడకపోయేవాళ్ళం. జీవితంలో మొదటిసారిగా ప్రేమను అనుభవిస్తున్నాను కాబట్టి ఈ నిజం తెలిసిందిప్పుడు 'నువ్వు నన్ను ప్రేమించాలి' అని అనుకోవడంలేదు. కారణం అది స్వతహాగా రావలసిందికాని చెప్పి తెప్పించుకునేదికాదు. నన్నో స్నేహి తుడిగా భావించు చాలు. నీకే అవసరం వచ్చినా అడగడానికి సందేహించకు. నీకోసం కాదు, నా తృప్తి కోసం చేస్తాను. కానీ నేను నిన్ను ప్రేమిస్తున్నానన్నమాట మాత్రం నిజం"

అనూరాధ మాట్లాడలేదు. అతడిమీద గౌరవం ఉందికాని అది ప్రేమగా ఆమె మనసు అంగీకరించడంలేదు. అతడు విశాల భర్త అని తెలిసినందువల్లనా అని తనను తానే ప్రశ్నించుకుంది. విశాల స్వభావం తెలిసినది కాబట్టి అతడికి యింట్లో సుఖం లేదంటే అనుమానించలేదు, కానిజాలితప్ప అంతకుమించిన భావం ఏదీ కలగడం లేదామెకు. ఈ విషయం ఫ్రాంక్‌గా చెప్పేసిందికూడా. అయినా అతడది సీరియస్‌గా తీసుకోలేదు. ఆ జవాబుని ముందుగానే వూహించినట్లుగా ప్రవర్తించాడు. ఆ తర్వాత వాళ్ళ స్నేహం బలపడింది.

* * * *

ఎప్పటిలాగే సాయంత్రం ఆ యింటికి వచ్చాడు విశ్వం, సునీత గదికి బయట తాళం కనిపించింది. రాధ ఇంటి గుమ్మం ఎక్కబోతూ ఆగిపోయాడు. లోపలనుంచి ఏదో ఘర్షణ వినబడుతోంది.

"నువ్వు నా భార్యవు. నీ దగ్గరకు రాక ఏం చెయ్యమంటావు ? అయినా నీక్కూ "ఆ" అవసరంలేదా లేక ఎవడయినా తీరుస్తున్నాడా ?" వెకిలిగా వుందా స్వరం.

"నేను నీకు అందుబాటులోలేను. వెళ్ళిపో, సునీత పిల్లలు వచ్చే వేళయింది.

"రానీ వాళ్ళముందు సిగ్గుపడడానికి నేనేం నీ దొంగప్రియుణ్ణా. లీగల్‌గా నీ మీద నాకు హక్కుంది" బలంగా లాగిన చప్పుడు.

విశ్వం ఏం చెయ్యాలో తోచక నిలబడిపోయాడు. తను జోక్యం చేసుకోవలసిన విషయం కాదది. కాని అలా వదిలేసి వెళ్ళబుద్ధీ కావడంలేదు. గుండెల్ని ఎవరో పట్టుకుని పిండుతున్నట్లుగా బాధ. ఆగలేక బెల్ కొట్టాడు గట్టిగా.

కాస్సేపు లోపల నిశ్శబ్దం.

"వెళ్ళిపో, వాళ్ళు వచ్చినట్లున్నారు. నీలో పశువుని ఆ పిల్లల ముందు బయట పెట్టకు ఇదిగో డబ్బు.

"సరే పోతున్నా మళ్ళీ రానని సంతోషపడకు. నీకు బుద్ధి చెప్పడం ఎలాగో నాకు బాగా తెలుసు" అంటూ తలుపుతీసి ఎదురుగా కనిపించిన విశ్వాన్ని చూసి చప్పున ఆగిపోయాడు.

"నేను సునీత అన్నయ్యని మా సునీత లోపలగాని ఉందా ?" అడిగాడు విశ్వం ఏమీ తెలియనట్లుగా.


అతడి వైపు తేరిపార చూసి, ఏదో అర్థమైనట్లు తల పంకించి, అక్కడి నుంచి విసురుగా వెళ్ళిపోయాడు మోహన్. విశ్వం లోపలకు అడుగుపెట్టాడు. డైనింగ్ ... నికి ప్రతీకలా కూర్చుని ఏడుస్తోంది అనూరాధ.

"రాధా" అతడి స్వరంలోని ఆప్యాయత, ఆవేదనకు చలించినట్టుగా తలెత్తి చూసింది. మరుక్షణం అతడి చేతుల్లో వాలిపోయింది.

జీవితంలో కామాలే గాని, ఫుల్‌స్టాప్‌లుండవు.

* * * *

తరచి చూస్తే ప్రతి మనిషి జీవితం ఒక కథే అవుతుంది. కేవలం సినిమాల్లో,



కథల్లో జరుగుతాయనుకున్న సంఘటనలు జీవితంలోనూ మరింతమెలో డ్రమటిక్‌గా ఎదురుపడవచ్చు. దాదాపు పదిహేనేళ్ళ క్రితం నాటి స్నేహితురాలు 'విశాల'-భర్త తన జీవితంలోకి అలా ప్రవేశిస్తాడని అనూరాధ కలలో కూడా వూహించలేదు. అదలా జరిగిపోయిందంతే. సుభాష్ విషయంలో ఆలోచించినంత సీరియస్‌గా విశ్వం గురించి ఆలోచించలేదామె. భయపడనూలేదు. నా సంతోషం, సుఖం గురించి లేశమైనా ఆలోచించని ఈ సంఘానికి నేనెందుకు జవాబు చెప్పాలి ఎందుకు భయపడాలి అన్న ఈ విప్లవ ధోరణిలో పడిపోయింది. నిశ్చయంగా విశ్వం పట్ల ఆమెకున్నది ప్రేమకాదు, సమాజం పట్ల కసి అంతే.

సునీత భర్త విదేశాల్నుంచి అనుకోకుండా తిరిగి రావడంతో ఆమె వెళ్ళిపోయింది. విశ్వం వీలయినప్పుడల్లా ఆమెను కలుస్తూనే ఉన్నాడు. ఏ అవసరం వచ్చినా అడగకుండానే అండగ నిలబడుతున్నాడు. భవిష్యత్తు గురించి భయంకరమైన ఆలోచనలు రాకుండా నవ్వుల్లో ముంచెత్తుతున్నాడు.

అనూరాధ కోరుకునేదల్లా ఒకటే. కనీసం తన పిల్లలయినా తనను అర్థం చేసుకోగలిగితే చాలని, పిల్లలు విశ్వంవస్తే సంతోషంగా పిలవుతున్నారు. ఇదంతా ఎవరికీ ఇబ్బందిలేదు. తెలియనంతవరకూ విశాల ... క్కూ .... డా.

రోజులు గడచి పోతున్నాయి.

ఏప్రిల్‌నెల దగ్గర పడుతోంది.

* * * *

"ఏమిటి పాతిక రూపాయలు తక్కువగా వున్నాయి ?" తండ్రి కంఠం గద్దిస్తోంది.

"ప్రిన్సిపాల్‌గారు రిటైర్ అయ్యారు. ఆయనకు ఫేర్‌వెల్ పార్టీకని అందరి దగ్గరా కలెక్ట్ చేశారు" తల్లి చెబుతోంది.

"ఫేర్‌వెల్ పార్టీకి పాతిక రూపాయలా, నన్నడక్కుండా ఎందుకిచ్చావ్ ?"

"అందరూ యిస్తున్నారు నేనుఒక్కదాన్ని యివ్వకపోతే బావుండదు అందులో

వాళ్ళు ముందుగానే కట్ చేసుకుని మరీ యిచ్చారు జీతం"

"ఏడవలేకపోయావ్. మొన్నటి నెలలో కొన్న చీరకి యాభై రూపాయలు ఇన్‌స్టాల్‌మెంట్-కట్టాలి. ఇలాంటి ఖర్చుల్ని ఏదో రకంగా వదిలించుకోవాలని ఎన్నిసార్లు చెప్పాను ? నీ మాట నీదేకాని నా మాటకు విలువెక్కడలే"

అది కాదండి. ఇప్పటికే స్కూల్లో అందరూ నన్నో పిసినారి అని గేలి చేస్తుంటారు. ఇప్పుడు మనకేం తక్కువయిందని అందరిలోనూ నవ్వుల పాలవడం?"

"బాగానేఉంది నలుగురి కోసం ఆలోచిస్తూంటే మన విషయం పట్టించుకునే వాడెవడు ? మన పిల్లల్ని పైకి తీసుకురావాలి. వాళ్ళకేలోటూ లేకుండా చెయ్యాలి అది మన ధ్యేయం వాళ్ళకివన్నీ అర్థం కావు. మరోసారి యిలాంటి పని చెయ్యక వెళ్ళు వెళ్ళి కాఫీ తీసుకురా."

"అలాగే యిప్పుడే పట్టుకొస్తాను. కాని చీరకి యాభై రూపాయలు ...


"ఈ సారికి పాతిక కట్టు, వచ్చేనెలలో మిగతాది యిస్తానను. నీకు బుద్ధి వచ్చేది యిలాగే" ఆయన గద్దించారు. ఆవిడ వంటింట్లోకి వెళ్ళింది.

పన్నెండేళ్ళ భార్గవికి యిలాంటి సంభాషణలు కొత్తకాదు. అలా కొనసాగిన సంభాషణ చివరకు తండ్రి తల్లిపై చెయ్యి చేసుకోవడంతో ముగుస్తుంటుంది. అలా జరగని రోజున ఆ అమ్మాయికి చాలా సంతోషంగా ఉంటుంది. అందరి యిళ్ళలోనూ తల్లి యింట్లోనే ఉండి వంటచేసి పెడుతుండడం, తండ్రి బయటకు వెళ్ళి డబ్బు సంపాదించుకు రావడం ఆమె గమనించింది. కాని అందరిలోనూ వ్యతిరేకంగా, గొప్పగా తన తల్లి ఉద్యోగం చెయ్యడం ఆమెకు గర్వంగా అనిపించేది కాని ఉద్యోగం చేసే ఆ స్త్రీ కష్టాలు ఇప్పుడిప్పుడే తెలుస్తున్నాయామెకు. తండ్రి ఆఫీసునుంచి ఇంటి కొస్తున్నాడంటేనే దిగులుగా వుంటుంది.

తల్లి ఇందుమతి జీతం అణాపైసలతో లెక్క చెప్పి తండ్రికిస్తుంది. ఆ డబ్బు లోంచి యాభై రూపాయలు ఆమె ఖర్చులకిస్తాడు ఆయన. ఆ తర్వాత ప్రతి పైసాకు లెక్కలు అడుగుతునే ఉంటాడు, అతడో చీరకొంటే ఆమెమురిసిపోతుంది. కొనడు.

ఇక యింటి పనుల విషయానికొస్తే పనిమనిషిని కూడా పెట్టుకోకూడదు. ఉదయమే అన్ని పనులూ చేసుకోవాలి. ఆయన ఏడింటికి నిద్రలేచి 'కాఫీ' అని పొలికేక పెడతాడు. అది యిచ్చేలోపల పదిసార్లు అరుస్తాడు. కాఫీ తాగాక పేపరు పట్టుకుని ఓ గంటసేపు కూర్చుంటాడు. ఆ తర్వాత స్నానానికి నీళ్ళు త్వరగా పెట్టలేదు, బట్టలు యిస్త్రీ సరిగా లేదని సణుగుతూనే ఉంటాడు. అతడికి టిఫిన్ పెట్టి, మధ్యాహ్నానికి బాక్సులో పెట్టియిచ్చి తర్వాతే తన పని చూసుకోవాలావిడ. ఇంత చేసి ఆమె స్కూల్ తొమ్మిదిన్నరకి : (అతడి ఆఫీసు పదింటికి)

సాయంత్రం కాస్త త్వరగానే వస్తుంది కాబట్టి అతడు వచ్చేలోపల నీట్‌గా తయారయి కాఫీ, టిఫినతో సిద్ధంగా ఉండాలి. ఏ కారణం చేతనైనా కాస్త ఆలస్యంగా వచ్చి సిద్ధంగా ఉండకపోతే అతడికి వొళ్ళు మండిపోతుంది.



అనూరాధ జీవితానికి కాస్త ఎక్స్‌టెన్షను భార్గవి తల్లి జీవితం. అయితే అనూరాధలో వున్న తెగింపు ఆవిడలోలేదు. సమాజం దృష్టిలో పదహారణాల హిందూ ధర్మపత్ని. భార్గవికి మాత్రం తల్లిని చూస్తే జాలి, కసి, కోపం అన్నీ

వాళ్ళకు ఇద్దరు పిల్లలు పెద్దది భార్గవి. ఒక సంవత్సరం చిన్నవాడు వినోద్. వాళ్ళను పెంచడంలో కూడా అతడి మాటే నెగ్గాలి. వాడు మగపిల్లవాడు. చిన్నవాడు కాబట్టి తండ్రిలా మరోరకం అధారిటీ చెలాయిస్తుంటాడు. తండ్రి అతడిని నెత్తినెక్కించుకుంటాడు.

పదో తరగతి పాసయ్యే వరకు ఈ వాతావరణంలోనే పెరిగింది భార్గవి. భార్గవిని హాస్టల్లో చేర్పించడం ఇందుమతికేమాత్రం యిష్టంలేదు. భర్తకి ట్రాన్స్‌ఫర్ అవడంతో ఆమెకూడా తప్పని సరిగా ట్రాన్స్‌ఫర్ చేయించుకోవాల్సిన అవసరం వచ్చింది. ఆయనకు భార్గవి ఎల్లవేళలా పక్కనే ఉండాలి, ఇరవై నాలుగ్గంటలూ అతడి అవసరాలని కనిపెట్టుకుని మసలుతూండాలి. అలాగని యింట్లోనే కూర్చో కూడదు ఉద్యోగం చేసి డబ్బు సంపాదించాలి.

"వయసు వచ్చిన పిల్లను పరాయి వూళ్ళో వదిలేస్తే ఎలాగండీ ?"

"అయితే చదువు మానిపించేద్దాం, మనతో పాటే ఉంటుంది. కాని మా వూళ్ళో కో-ఎడ్యుకేషన్ కాలేజీలో మాత్రం చేర్పించను" అన్నాడు ఖచ్చితంగా.

భార్గవికి చదువంటే ఉన్న ఇంట్రెస్టు తెలిసిన ఆవిడ మరి మాట్లాడలేదు. కొద్ది రోజులు దిగులుగా అనిపించినా త్వరగా ఆ హాస్టల్ వాతావరణానికి అలవాటు పడింది. ఇంటికంటె హాస్టల్ బాగున్నట్లనిపించింది. మంచి స్నేహితురాళ్ళు దొరికారు. సరదాగా గడిపేవారు విశాల అంటేనే ఆమెకు కాస్త పడేదికాదు. హాస్టల్లో ఉండి చదువుకునే అమ్మాయిలంతా ఐరి తెగించినవాళ్ళని విశాల ఉద్దేశ్యం. ఆమెను ఏడిపించడానికి భార్గవి అన్నీ కట్టుకథలల్లి చెప్పేది. రోడ్డు మీద వెళ్ళే అబ్బాయిల్ని హాస్టల్ గోడ అవతల్నుంచి కన్నుకొట్టి పిలుస్తాం- అని కోసేది. విశాల మొహం గంటుపెట్టుకుని మూతి ముడుచుకుంటే తెగ నవ్వేది. రెండేళ్ళు అతి సరదాగా గడచి పోయాయి. డిగ్రీ కూడా

అక్కడే చదవాలనుకుంది. కాని తండ్రికి మళ్ళీ గుంటూరు ట్రాన్స్‌ఫరవడంతో వెళ్ళి పోయింది.

ఇంటి పరిస్థితుల గురించి అప్పటికే ఒక అవగాహన ఉంది కాని, ఆ తీవ్రతను పూర్తిగా అర్థం చేసుకునే వయసూ, బుద్ధీ యిప్పుడే వచ్చాయి ,తల్లి పరిస్థితిలో యింకా ఏ మార్పులేదు. ట్యూషన్లు చెప్పి మరి కొంత డబ్బు సంపాదించడం తప్ప. తండ్రి సంపాదనలో కొరతలేదు. పై సంపాదన కూడా చాలా వుంటుందని వింది సంపాదించడంలోనూ తప్పులేదు. కాని అది అనుభవించడానికి హక్కులేదు. పైసా ఖర్చు పెట్టాలన్నా పదే పదే ఆలోచిస్తాడాయన. చెరోనాలుగు జతల బట్టలతోటే గడుపుతున్నారు. అందర్నీ అలాగే వుండాలని శాసిస్తాడు. ఇంటర్ వరకూ ఎలాంటి బట్టలు వేసుకున్న ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. డిగ్రీలో చేరాక భార్గవి చాలా బాధ పడవలసి వచ్చింది. తమ్ముడి కున్న స్వేచ్ఛ ఆమెకి లేదు. ఫిజికల్‌గానూ ఆర్థికంగానూ.

ఆమె హైదరాబాద్‌నించి తిరిగి వచ్చిన రోజునే ఒక ఘర్షణ జరుగుతోంది. భార్యను సినిమాకు పెళ్దాం రమ్మని గొడవ చేస్తున్నాడు తండ్రి. కూతురు ఆ రోజే వూర్నించి వచ్చింది. ఆమెను వొదిలి సినిమాకు వెళితే ఏం బావుంటుంది. అందరం కలిసే వెళదాం" అంటుంది ఇందుమతి. అది కుటుంబంతో చూసే సినిమాకాదు అందులోనూ వయసులో ఉన్న ఆడపిల్లలతో చూసేది అసలేకాదు అని అతడి వాదన. అలాంటి సినిమాకు వెళ్ళకపోతేనేం ఇంట్లో పని కూడా ఏమీకాలేదు. అని ఆవిడ తప్పించుకోవడానికి చూసింది.

"బావుంది దానికోసం నేను సినిమా చూడ్డం మానేయాలా? నాకా సినిమా చూడాలనివుంది ఈ రోజు కాకపోతే కుదరదు" అని అరిచాడు ఎప్పటిలాగే ఆయన వాదనే నెగ్గింది. బయలుదేరుతూ భార్గవికి చెప్పడానికికూడా సిగ్గుపడిందావిడ ఆయనే చెప్పాడు-

"భార్గవీ సినిమాకు వెళుతున్నాం ఈ పూట వంట చేసేసి వుంచు, తమ్ముడికి బంగాళాదుంపలు వేపుడు యిష్టం అది చేసి పప్పుచారు కూడా చెయ్యి చాలు" అని తండ్రి అంటూంటే ఆశ్చర్యపోయింది.


ఆమెకు వంట చేయడం అసలు రాదు.

"దానికేం చాతనవుతుందని నేను వచ్చి చేస్తాలే" అంది ఇందుమతి.

"తెలియకపోతే తెలుసుకోవాలి, ఆడపిల్ల కదూ ఇంత వయసు వచ్చి వంట రాదని వూరుకుంటారా? ఏదో ఒక రకంగా చేసెయ్" తండ్రి ఆజ్ఞాపించి వెళ్ళి పోయాడు వెనుకే లేగదూడలా తల్లి.

ఆడపిల్ల, మగవాడు అనే ఈ అంతర్యం స్వంత తల్లి తండ్రులతోటే మొదలవుతోంది. స్త్రీల మీద గౌరవం లేని మగవాడిని పెళ్ళి చేసుకున్న ప్రతి స్త్రీ జీవితం తన తల్లిలాగే అవుతుంది కాబోలు.

భార్గవి అన్నం వండింది. అది మెత్తగా చిమిడిపోయింది. బంగాళాదుంపలు



ఉడకబెట్టింది. అవిసరిగ్గా ఉడకలేదు పై రోలు రేస్తే ఎంతకిరాలేదు. అలాగే కోసి వేపుడు చేసింది. ఉప్పు కారం ఎంత వెయ్యాలో తెలియదు. మొదటిది తక్కువా రెండోది ఎక్కువా అయ్యాయి. పప్పులోనే ఉప్పు కారం వేసి ఉడక బెట్టింది. అదెంతకీ ఉడక్క పోవడంతో దింపి అలాగే ఉంచేసింది.

వేడి వేడిగా అన్నంలో పచ్చడి కలుపుకు తినేసింది. ఆమెకేం బాధలేదు హాస్టల్లో భోజనం రుచి చూశాక ఏదయినా బాగానే అనిపిస్తుంది. అప్పుడు వచ్చాడు బజార్లో షికారు తిరగడానికి వెళ్ళిన ఇంటి సుపుత్రుడు.

"అమ్మా, అమ్మా" ఇంట్లోకి అడుగు పెడుతూనే కేకలు వేస్తున్నాడు. భార్గవి మాట్లాడలేదు.

"అమ్మేది? అంతలా అరుస్తుంటే వినిపించుకోవేం?" చదువుకుంటున్న ఆమె దగ్గరకు వచ్చి అడిగాడు.

"లేరు సినిమాకు వెళ్ళారు" ముక్తసరిగా జవాబిచ్చింది.

"వచ్చి అన్నం వడ్డించు త్వరగా, ఆకలి దంచేస్తోంది" బాత్రూంలోకి వెళుతూ ఆజ్ఞాపించాడు. భార్గవికి వొళ్ళు మండిపోయింది కుర్చీలోంచి కదల్లేదు.

"ఏమిటి మొద్దులా కూర్చున్నావ్? అన్నం వడ్డించమంటే" ముఖం తుడుచుకుంటూ వచ్చాడు వినోద్.

"నేను చదువుకుంటున్నాను. కనుపించటంలా? వెళ్ళి వడ్డించుకు తిను అన్నీ టేబుల్ మీదే ఉన్నాయి" విసురుగా అంది.

"పెద్ద గొప్పగా చదువుతున్నావులే ఐయ్యేయస్ పరీక్షలు దగ్గరకొస్తున్నాయి కదూ, పిచ్చిగా వాగక లేదిరా" ఎగతాళిగా అన్నాడు.

"ఇది ఏ పరీక్షా కాదు. డిటెక్టివ్ నవల చదువుకుంటున్నాను. నన్ను డిస్టర్బ్ చేయకు. ఆకలయితే వడ్డించుకు తిను" అంతే కామ్‌గా అంది.

"నాన్నరానీ, నీ పని చెప్తాను" కోపంగా వెళ్ళిపోయాడు. పళ్ళేలూ, గిన్నెలు

కిందా మీద పడుతున్న చప్పుడు.

రెండు నిముషాల్లో మళ్ళీ

"ఎవరు వంట చేసింది ?"

"నేనే చేసాను బాగాలేదా ?"

"నీ మొహంలా వుంది"

నాకు చేతనయినట్లు చేశాను నచ్చకపోతే నువ్వే వండుకో"

"ఇంక నయం అంట్లుకూడా తోమమన్నావు కాదు"

"తప్పేముంది ? హాస్టల్లో అవసరం అయితే నీ ప్లేటు నువ్వు కడుగుకోవడంలా ?"

"నీకు బాగా పొగరెక్కింది. దించడమెలాగో నాకు తెలుసు" దగ్గరగా వచ్చాడు. విసురుగా మీదకు రాబోయిన చేతిని పట్టుకు ఆపింది భార్గవి.

"నామీద చెయ్యి బడితే ఆ వెంటనే నా చేతిదెబ్బ రుచి చూడాల్సి వస్తుంది"

వినోద్ చెయ్యి లాక్కుని విసురుగా వెళ్ళి పోయాడు.

తల్లి తండ్రులు ఆలోచనారహితంగా ప్రవర్తించే తీరు పిల్లల మీద ఎలాంటి ప్రభావం చూపిస్తుందో ఆ అమ్మాయికి తెలిసి వస్తోంది. అక్క అనే ఆప్యాయత లేదు. అమ్మ అనే గౌరవంలేదు. తండ్రి గారాబం అతడినో పశువుని చేసేస్తోంది. భవిష్యత్తులో ఎంతమంది స్త్రీలు అతడివల్ల బాధపడవలసి వస్తుందో ?

తల్లీ తండ్రీ సినిమానుంచి రావడం వినోద్ ఎదురుగా వెళ్ళి జరిగిన విషయం గోరంతలు కొండంతలుగా చేసి చెప్పడం వినిపిస్తునే వుంది. కాని భార్గవి కదల్లేదు. హాస్టల్ జీవితం చాలా ధైర్యాన్నే నేర్పిందామెకు.

ఎవరో వెనకనుంచి జుట్టుపట్టుకుని లేపడంతో బాధతో కెవ్వున అరిచింది,

"ఎంత పొగరే నీకు ? మగవాడి మీదే చెయ్యి చేసుకుంటానంటావా ? ఏదీ నన్ను కొట్టు చూద్దాం. డొక్క చీల్చేయగలను రా స్కేల్ ఆడదానివి అణిగి మణిగి వుండాలి" విసురుగా ఆమెను కిందకు తోసేశాడు తండ్రి

నేను వాడిని కొట్టలేదు అబద్దం చెపుతున్నాడు. అయినా నేను చేసిన తప్పేమిటి ? వంట చెయ్యడం రాకపోయినా నాకు తెలిసినట్లు చేసే పెట్టాను. వడ్డించుకు తినలేడా ?"

కోపం బాధని మింగేస్తోంది.

ఏం వడ్డిస్తే అరిగిపోతావా ? డిటెక్టివ్ నవలలూ సెక్స్ నవలలూ చదువుతావా? పైగా ఎదిరించి అడుగుతున్నావు" ఆమె చెంప అదిరిపోయేలా కొట్టాడు.

భార్గవి తలెత్తి తండ్రివైపు చూసింది క్షణంసేపు కన్నార్పకుండా చూసింది, ఆ తరువాత నెమ్మదిగా తమ్ముడి దగ్గరకి నడిచింది. వాడి మొహంలో చిరునవ్వు సన్నగా, గర్వంగా కదలాడుతూంది. క్షణం ఆగింది. ఆ తరువాత ఆమె చెయ్యి మెరుపుకన్నా వేగంగా కదిల వాడి చెంపల్ని ఇటూ అటూ వాయించేసింది అప్పటి కప్పుడే బూరెల్లా ఊరేయి అవి.

(సశేషం)



పాడుకల

బలివాడ కాంతారావు

ఇది పాడుకల. ఇదివరకు మా చిన్నాన్న నాలుగుసార్లు కలలో కనిపించారుకానీ యీసారిలా కలలో నాతో మాటాడలేదు. ఆతని భార్యా, పిల్లలున్నా, చచ్చి ఐదేళ్ళయినా వాళ్ళకి కలలోన లీలగానైనా కనిపించనివాడు నాకే యెందుకు కనిపించాలని నా పెళ్ళాం యిదివరకు విసవిసలాడిందంటే కారణం లేకపోలేదు. చచ్చినవాళ్ళు కలలోరావటం కలగన్నవాళ్ళకి మంచిది కాదట. అతను పల్లెటూర్లో గతించినా పట్నంలో కొన్నేళ్ళున్నాడు. అప్పుడు నేను వాళ్ళింట్లో చదువుకునేవాడ్ని. నాకే కొన్ని నమ్మకమైన పనులు అప్పచెప్పేవాడు. నేను యేదైనా రహస్యంగా వుంచుతానని ఆయనకు నమ్మకం కుదిరివుంటుంది.

ఈ పాడుకల యించుమించు వేకువఝామున వచ్చింది కాబట్టి దీని ఫలితం త్వరలో తెలుస్తుందంటారు. చిక్కేమిటంటే కలలో మా చిన్నాన్న వీరాస్వామి నాతో మాటాడటం వలన అతని మాటల్లోని చిక్కును తెలివివచ్చి యెంత ఆలోచించినా పరిష్కారం చెయ్యలేక తికమకపడుతుంటే మా ఆవిడ సగం కళ్ళు తెరచి చూసి —

"మళ్ళీ కలలో కనిపించారా మీ చిన్నాన్న?" అని వెగటుగా ప్రశ్నించింది.

"కనిపించడమేకాదు - నాతో మాట్లాడేడుకూడాను" అనుకోకుండా అనేసి - యిలా నోరు జారేసి యెంత పొరపాటు చేసానని లోలోపల నొచ్చుకుంటుంటే -

"ఇదేమిటీన్యాయం? చచ్చినవాడు మీతో మాటలేమిటి? ఇంతకీ యేం అన్నారు?" అంటూ లేచిపోయింది.

కల చెప్పితేగానీ వదలనని మాఆవిడ నన్ను పీకి పట్టు పట్టడంవలన కల చెప్పక విధిలేక పోయింది.

"ఏటిఒడ్డున పొదలు కనిపిస్తున్నాయ్. ఒంటరిగా నేను వెళ్తున్నాను. ఆ పొదల మధ్యలో ఒక పొడుగాటి పాతిన కర్రకు ఒక దిష్టిబొమ్మ కట్టివుంది. తెల్లనిషర్టు మీద నల్లని కోటు. నేను చూస్తుండగానే ఆ దిష్టిబొమ్మ కదలి వయసులో మా చిన్నాన్న ఉంగరాల జుత్తుతో యెలా హుషారుగా కదిలేవాడో అలాగే నావేపు



కదలి వచ్చి నా యెదరగా నిల్చొని అన్నాడు. "నిన్ను నమ్మినందుకు నాకు తోడు నీడగా ఆరుగుర్ని పంపించావురా! అంతేచాలు..." అంటూ సంతోషంతో పక పక నవ్వుతుండగా చప్పున తెలివి వచ్చేసింది. తెలివి రాకపోతే అతను బతికున్న రోజుల్లో సంతోషంగా నవ్వినప్పుడు గట్టిగా యెదరగా వున్న మనిషిని ఆలింగనం చేసే అలవాటు కలలో కూడా తప్పక పోయేదేమో?

ఈ భల్లూకవు పట్టునించి బతికొననుకుని యింతకీ ఆ వచ్చిన ఆరుగురెవరని ఆలోచనలో పడగా అతను చనిపోయిన తరువాత మా కుటుంబాలలో చనిపోయిన వాళ్లు ఐదుగురే దొరికారు లెక్కకు. అంచేత ఆరోమనిషెవరని మా ఆవిడ

ఆలోచనలనుకూడా ఈ చిక్కుని పరిష్కరించడానికి ప్రవేశ పెట్టక తప్పలేదు. మా ఆవిడ లెఖ్ఖ మొదలుపెట్టింది.

"మీ నాన్నా - మా నాన్నా గుండె పోటుతో పోయారు. మా చిన్నాన్నలిద్దరిలో ఒకాయన నెలరోజులు మంచంమీద వుండిపోతే యింకోకాయన మూ డేళ్ళు ముడుకులు పడిపోయి జబ్బుతో నానా అవస్థపడిపోయాడు. అతని మేనల్లుడు స్కూటర్ యేక్సిడెంటులో పోయాడుకదా అంతే -"

మళ్ళీ మళ్ళీ లెఖ్ఖ వేసినా ఐదుగురే తేలింది.

"అయ్యబాబోయ్ - ఆరోచావుకబురు యేక్షణంలో వింటామో ?" భయంతో ఆమె అన్నా, మా బంధువుల్లో యెవరు అనారోగ్యంగా వున్నారాని యిద్దరం పర్యావలోకనం చేసాం. ఎవరూ మా వూహలకు దొరకలేదు. ముసలాళ్ళెవరైనా వున్నారా అంటే వున్న యిద్దరూ వయసుతో వున్నవాళ్ళకన్నా ఆరోగ్యంగా వున్నారు. చావు యెవరు చెప్పగలరు ? బస్సు ఫుట్‌బోర్డుమీద ప్రయాణం చేస్తే, స్కూటర్‌మీద స్పీడుగాపోతే, రైల్లో నిద్రపోతుండగాకూడా యీ కలికాలంలో యేక్సిడెంట్లు తప్పించుకోలేక పోతున్నాం కదా ! ఇలా కల వచ్చిందన్న వైనం యెవరికీ చెప్పకూడదనుకున్నా యిది మా కుటుంబాల్లో బాష్పవాయువులా అల్లుకుపోయింది. స్కూటర్లు వున్నవాళ్ళు ఎంతో అవసరం అయితేగాని వాహనాలను బయటకు తీయటంలేదు. ప్రయాణాలు విధిలేక చేస్తున్నారు. ఎవరికైనా రొంపచేసినా డాక్టరును చూస్తున్నారు. ఇలా రోజులు నెలలుగడచినా అనుకున్న అఘాయిత్యం యేమీ జరగలేదు. చివరకు నా కలమీద వ్యాఖ్యానాలు నా చెవిలోనే పడ్డాయి.

"సరిగ్గా వినలేదు కామోసు. బహుశ ఐదుగురన్నది ఆరని విన్నాడేమో పొరపాటున ?"

"కలలో చచ్చినవాడు మాటలాడాడంటే నమ్మగలమా ?


"కన్నకొడుకులూ, పెళ్ళాం వుండగా వీడికెందుకు కనిపిస్తాడు ?"

"అసలు కలంటూ కన్నాడా ?"

"అందరికీ భయపెట్టడానికి ఈ జోక్ వదిలాడు. మనమంతా ఫూల్స్‌లా నమ్మాం."

ఇంత రాద్ధాంతం జరిగాక నామాట అబద్ధంకాదు. నాకల నిజం అని నిరూపించుకోవల్సిన బాధ్యత నానెత్తినేపడింది. నిరూపించడానికి నాకున్నసాక్ష్యంయేదీ ? అసలు మా ఆవిడనించే యీ గొడవంతా జరిగింది. ఈ విషయం దాచుకోకుండా టామ్‌టామ్ చేసిందెందుకు ? నిజం చెప్పినందుకు నామీదే మావాళ్ళంతా రాళ్ళు రువ్వుతున్నారనిపించింది. ఏంచెయ్యడం? నాకు కనిపించినట్లే వాళ్ళావిడకూ కలలో కనిపించి నాతో అన్నట్లే అనకూడదూ ? ఆలా కనిపించి చెప్పమని చచ్చిన చిన్నాన్నకు మొక్కుకున్నా ఏమీ జరగలేదు. మా కుటుంబాలలో యే ముసలాడు పోయినా నామీద రుద్దిన అసత్యపువాదు పోదు ...

ఆ ఆరోవాడెవడు ? తోడుగా మగాళ్ళే వుండాలని లేదుగా ! ఆడమనిషీవుండొచ్చుగా ! చప్పున నాకు గుర్తు వచ్చింది. పట్నంలో వున్నప్పుడు మా చిన్నాన్న



నన్ను అప్పుడప్పుడు రహస్యంగా ఒక యింటికి పంపించేవాడు. జిలేబీలో, పకోడీ పొట్లాలో, ఒకోసారి సంపంగి పూలదండో నాతో ఆ యింటికి పంపించేవాడు. ఆ సత్తియ్యమ్మ బజారులో కూరగాయలు కూడా అమ్మేది. ఆ రోజుల్లో వయ్యారంగా చీరచుట్టుకున్న దొరసానిలా వుండేది. వయసులో వున్నానికి పూజలా వున్నది వయసు ముదిరాక అమావాస్యకు ఆరగింపయిన తేనె పట్టులా మారింది. ఆ ఆరోది ఆవిడ కాకూడదా అని ఆ యింటికి వెళ్ళాను. కనుక్కుంటే తేలింది సత్తియ్యమ్మ పోయి పదేళ్ళయిందట !

నిరాశతో రోజుల తరబడి ఆలోచనలో పడ్డాను. మంచివార్త, మంచి నడవడిక, బ్రతుకు తెరువు, అంతా మంచిని కాంక్షించే మనుషులు చెడుగును వినలేరు, సహించలేరు. పుట్టుక ఆనందం, చావు భయం. చావు పుట్టుకలున్నంతకాలం మంచికలలతో పాటు పాడు కలలూ వుంటాయి. కానీ యికముందు పాడుకల యెప్పుడూ బయటకు పొక్కనివ్వకుండా వుంచాలనే నిర్ధారణకు వచ్చాను.

ఇంతలో నాకో అపవాదు వచ్చింది. మా చిన్నాన్న భార్య మంగళగౌరి మంచం పట్టింది. ఒక్కనాడు ముక్కుచీది యెర్గని మనిషి యిలా మంచం పట్టిందంటే మనసులో పుండులా పెరిగిన బెంగకాక మరేమిటన్నారు. ఆవిడకుబాగుకావాలంటే నేను వెళ్ళి ఆవిడతో చెప్పాలి.

"ఆవేళ తప్పు చెప్పాను. ఆరుగురు కాదు ఐదుగురే" అని చెప్పాలట.

ఈ అబద్ధం చెప్పి ఆవిడ ప్రాణం రక్షించమని మా ఆవిడకూడా ఒత్తిడి చేసింది.

"ఇప్పటివరకు సత్యహరిశ్చంద్రుడిలా తెచ్చుకున్న పేరును అబద్ధంఆడి పూరితీసేమ్మంటావా ?". అని కోపం తెచ్చుకున్నాను.

"కల నిజం కాదుకదా ! ఆలాంటప్పుడు కలమీద మీ అబద్ధం అబద్ధం యెలా అవుతుందిలెండి. వెళ్ళండి."

"ఇలాచెప్తే అసలు నా మాటంటేనే నమ్మకం పోతుందికదా ! నేను ఆరును

ఐదుగా యెంతమాత్రం మార్చను" అని భీష్మించి కూర్చున్నాను.

"కలగన్న మీరు మార్చక ఇంకెవరు మారిస్తే నమ్ముతారు.?"

"ఆ చచ్చినవాడికి పెళ్ళాంమీదఅంత మమకారంవుంటే ఆవిడ కలలో కనబడి ఆరుని ఐదు చెయ్యమని మొక్కు!" అన్నాను కోపంగా.

ఎంత నచ్చచెప్పినా అబద్ధం ఆడడానికి ఒప్పుకోక పోవటంతో "పోనీ వెళ్ళి ఆవిడకి కాస్త ధైర్యం చెప్పండి. కలలు నిజమైపోతాయా? ఇంతకీ అతనేమన్నాడు? ఆరుగురుని తోడుగా పంపించావన్నాడు గానీ ఐదుగుర్ని పంపించావు, ఆరోవాడ్ని కూడా పంపమని అనలేదుగా - ఏదో పొరపాటు జరిగి వుంటుంది."

"పొరపాటా?"

"ఈ చచ్చిన ఐదుగురితో అతనెప్పుడూ జగడం ఆడలేదు. వాళ్ళంటే యిష్టపడేవాడటగా! తోడుగా పంపించారన్నా రే - అతనంటే యిష్టపడ్డవాళ్ళనే తోడుగా వుంచుకుంటారుగానీ, ఆవిడ్నెందుకు వుంచుకుంటాడు?"

"ఎప్పుడూ యింట్లో పోట్లాటేకదా! అతను జీవించినంతకాలం యీ పెళ్ళాన్ని కాల్చుకతిన్నాడు. నువ్వన్నది నిజమే. ఆరోవ్యక్తి యీావిడెల్లా అవుతుంది?"

"అంచేత యెలాగో ఒకలాగ ఆవిడకి ధైర్యం తెప్పించి బతికిస్తే మనకొచ్చిన అపవాదు పోతుందని" ఆవిడ ప్రాధేయపడడం వలన బయలుదేరి మా పిన్ని వున్న గ్రామం వెళ్ళాను.

మా పిన్ని మంచంమీద నీరసంగా పడివుంది. మందులు తినటం మానేసిందట. ఆహారంతగ్గించేసిందట. నన్ను చూసాక కొంతసేపటికి దగ్గరగా రమ్మని మెల్లగా -

"నీ కల నిజం అవుతోంది నాయనా"

"ఇదేమిటి పిన్నీ - మీ అమ్మ ఎనభైయ్యేళ్ళు, మీఅత్త ఎనభైఐదేళ్ళు చూసింది. మీరు యింకా డెభ్భయిమూడులోనే వున్నారుకదా జట్టుసారం వస్తుంది అంటారు. మీకేంకాదు" అన్నాను.

"నేనూ అలాగే అనుకున్నాను. చచ్చిన మనిషికి దేవుడి అంశ వస్తుంది, ముందుకు జరగబోయేది చెప్పగలరు"

"అదేంటి పిన్నీ అలా అంటావు? చిన్నాన్న పోయాక ఒక పెద్ద జ్యోతిష్యుడు నువ్వు రెండేళ్ళకే చచ్చిపోతావన్ని చెప్పినా బెంగపెట్టుకుని మంచం యెక్కలేదు. అలాంటిది నా కలతో యింతగా మనస్సు జార్చేసావేమిటి?"

"మా అందరికీ కాదని నీ కలలో వచ్చి యెందుకు చెప్పారు? నువ్వంటే యిష్టం, అబద్ధం యెరుగని వాడివని"

"ఆ ఆరోమనిషి నువ్వని అనలేదుకదా! నువ్విలా తిండి మానేసి నీరసించావంటే యింకేదో కారణంవుంటుంది" మెల్లగా చెవి దగ్గర "కొడుకులూ - కోడళ్ళూ తిట్టున్నారా - కొట్టున్నారా?"

"అబ్బే ... అబ్బే - లేదురా ..."

"అయితే - యిదిగో నీకిష్టమైన బన్నురొట్టెలు తెచ్చాను. తించేగానీ వీల్లేదని" గబగబ సంచిలోని ఒక బన్నుతీసి ఒక ముక్కను చిదిమి ఆమెనోటిలో కుక్కాను. ఈ బలవంతంతో కొద్దిగా తిని మంచినీరు అడిగింది. ఎంగిలి పడ్డ సగం ముక్క వాళ్ళ కుక్కకు వేద్దామని ....

"చిన్నాన్న నల్లని జూలు కుక్కపిల్లని పెంచేవారు ఏదదీ?"

కాస్త కదలి దిండుని ఆనుకుని కూర్చొని

"అదా! అతను పోయాక నెల రోజుల్లోనే బెంగపెట్టుకుని చచ్చింది."

నేను చప్పున ఒక గెంతు గెంతి "ఇప్పుడు అరోడితెల్సింది-గుర్తువచ్చింది ఆ కొయ్యదగ్గర ఒక నల్లని బొచ్చుకుక్క పడుకునివుంది. అది అరిచివుంటే బాగా గుర్తున్ను" అని అబద్ధం ఆడాను.

"ఆయన బ్రతికుండగా అంతగా అరిచేది. అతను పోగానే యింకో కుక్కను చూసైనా అరిచేదికాదు. మౌనరోగంతోనే చచ్చిపోయిందిరా."

"హమ్మయ్యా" అని "పిన్నీ-నాకల గురించి యిక మరచిపో" అని దగ్గరగా వెళ్ళాను. ఆవిడ మాటాడలేదు. తాగిన నీటిని కన్నీరుగా మార్చిన తలపులేమిటా అని ప్రక్కనే ఒంటరిగా కూర్చుంటే కొంతసేపటికి పొగనించి లావా బయట పడినట్లు ఆమె పరితాపం బయట పడింది.

"నాయనా! కలలో జరిగింది యిలలో జరగదన్న సామెత నాకు తెలుసురా! చచ్చిపోతానని బెంగ పెట్టుకోలేదు. నీ కలలో కనిపించి తోడూ - నీడా గురించి ఆయన అన్నదగ్గరనించీ నా మనసు పెరికి పెరికి యిప్పటికీ చిందర వందర చేస్తోందిరా..."

"బ్రతికుండగా నిన్ను కాల్చుక తిన్నాడు కదా - ఎందుకలా బాధపడిపోతావు పిన్నీ?" అన్నాను సానుభూతితో.


"అయ్యో!" అంటూ నొసటిని తాకుకుంటూ "అగ్నిసాక్షిగా అతన్ని కట్టుకున్నదాన్ని - అతను బతికుండగా తోడూ నీడా కాలేకపోయాను."


"అదెలా?"

"నా రుసరుసలతో పరస్త్రీల వద్దకు పరుగెత్తినట్లు చేసాను. అతన్ని పిల్లలు శత్రువులుగా చూసారంటే - కారణంనేనే. అతని తోడూ నీడకు దూరం చేసిన నా మొండిపట్టు అతన్ని తాగుడుకు దింపింది.

నన్నుతిట్టీ, కొట్టీ మన చుట్టాలలో చెడ్డపేరు తెచ్చుకున్నారు. అతనిని క్షమించి సేవచేసి, తోడుగా, నీడగా వుండలేకపోయానే అన్న బాధ యిప్పుడు చంపుకు తింటోంది. ఇప్పుడు చెయ్యాలన్నా చెయ్యగలనా? అయ్యో! ఏమీ చెయ్యలేని నా బతుకు అంతా ఒక 'పాడుకలే' అయిపోయిందికదా అని కుమిలి కుమిలి చివరకు యీ మంచం పట్టాను నాయనా" అని కన్నీరు తుడుచుకుంది.

తెలివేసివుండి ఒక పాడుకల కంటున్నాననిపించింది. ఈ కల గురించి ఇంకెవరికీ చెప్పకూడదని నిర్ధారించుకుని వెళ్ళిపోయాను. ●●●





బొబ్బిలి శ్రీనివాసరావు ద్రాక్షారామ
ప్ర. పెళ్ళిలో ఏడడుగులు నడుస్తారెందుకు?
జ. నమ్మకం కలిగించటానికి

జి.రమేష్‌బాబు ప్రత్తిపాడు
ప్ర. ఈనాటి రాజకీయ నాయకులకు, గూండాలకు తేడాఏమిటి?
జ. ఊసరవెల్లికి తొండకి ఉన్న తేడా

డి. సత్యనారాయణ కర్నూలు
ప్ర. "అన్నగారు రావణుడు" - వెంగళరావు "రావుగారు విభీషణుడు" - ఎన్.టి.ఆర్. మరి సీత ఎవరు?
జ. ఆంధ్రదేశ్

చలపాక ప్రకాష్ విజయవాడ
ప్ర. జనన మరణాలెందుకు?
జ. ఋణాల కోసం

బహుమతి పొందిన ప్రశ్న:-
పీల నాగేశ్వరరావు అనకాపల్లి
ప్ర. ఈ 20వ శతాబ్దపు అంచులోవున్న 'స్త్రీ' మూఢత్వాల ముసుగులో నుండి బయటకు రావాలంటే?
జ. మగాడు 18 నుంచి 19 వ శతాబ్దంలోకి రావాలి.

వి. దీప ఖైరతాబాదు
ప్ర. ఒకవేళ ప్రతిపక్షాలే విజయం సాధిస్తే ప్రధాని ఎవరు?
జ. పిచ్చిదానా! ప్రతిపక్షాలు విజయం సాధిస్తే ప్రభుత్వం పడిపోతుంది

టి. వాణి గుర్తూరు
ప్ర. మనిషి బాధల్లో నున్నప్పుడు వేదాంత ధోరణిలో మాట్లాడుతాడెందుకు?
జ. వేదాంతానికి పిచ్చికి దగ్గర సంబంధం ఉంది గనుక

ప్ర. విడుదలైన ప్రతి చిత్రం 100 రోజులు ప్రదర్శింప బడాలంటే?
జ. రెండు వారాలకే వంద రోజుల పోస్టర్స్ వేసేయాలి

అరుణకుమారి గుంటూరు
ప్ర. కోర్టులో న్యాయదేవత కళ్ళని నల్లగుడ్డతో కడతారెందుకు?
జ. మాచింగ్ కోసం

ధనంజయరావ్ విశాఖపట్టణం
ప్ర. "ఏం తల్లీ! కంప్యూటర్? అన్ని రంగాలలోను తల దూర్చిన నువ్వు పాలిటెక్స్‌ని ఎందుకు వదిలేసావు?"
జ. పర్సెంటేజీ లెఖ్ఖలు ఫీడ్ చేసిన దాని కంటె ఎక్కువయాయ్ కనుక

కృష్ణారావు గుంటూరు
ప్ర. అన్న ప్రధాని - రాజీవ్ మన ముఖ్యమంత్రి అయితే ఎలా ఉంటుంది?
జ. పవర్‌కట్ దేశమంతా ఉంటే మన రాష్ట్రంలో 7% కట్ మాత్రమే ఉంటుంది.

బి.జయశేషసాయి రామచంద్రపురం
ప్ర. గాంధీ కలలుకన్న ప్రపంచాన్ని సృష్టించడానికి మీ కంప్యూటర్స్ ముందడుగు వేస్తే...?
జ. కంప్యూటర్లు అడుగులు వేయవని గ్రహించుము.

అంకం సత్యప్రసాద్ బండారులంక
ప్ర. దానాంలో ఏ దానం గొప్పది?
జ. ఇతరులు మన కిచ్చేది

వేమూరి కృష్ణ హైదరాబాదు
ప్ర. మన భారత దేశం యింత బీద స్థితిలో ఉంచి కదా, యిప్పుడు పార్లమెంట్, అసెంబ్లీ, మున్సిపాలిటి, పంచాయితి, ప్రజా పరిషత్, మండలం .... యిన్ని రకాల ఎలక్షన్స్ ఎందుకు కంప్యూటరూ?
జ. కొద్ది మందిని ధనవంతులుగా మార్చటానికి

టి.వి. కృష్ణయ్య గుర్తూరు
ప్ర. మారని మనిషిని విమర్శించి లాభమేంటి? విమర్శలవల్ల లాభాలు న్యాయా?
జ. ఉల్లాడ్

కె.యాదగిరి వరంగల్
ప్ర. ఆకుపచ్చ కార్డులు గలవారికి వారుణి వాహినిని కూడా తక్కువ ధరలో సప్లయ్ చేస్తే ...?
జ. మంచి నీటి కొరత సమస్య తీరిపోతుంది.

బి.ఉమా శంకర్ పిఠాపురం
ప్ర. రూపాయికి విలువ పడిపోతున్నట్లే 'రాజకీయ' విలువ కూడా దిగజారి పోతున్న దెందుకు?
జ. వ్యభిచారిణి కట్టుకున్న చీర లాంటిది కనుక

యన్. శ్రీనివాసరావు కర్నూలు
ప్ర. ఈడొస్తే నీవేం చేస్తావు?
జ. ఆడిస్తా

టి. అండమ్మ గుర్తూరు
ప్ర. మనిషి తన జీవిత కాలమంతా కష్టపడ్డా సంపాదించనిదేది?
జ. శ్రమకు తగ్గ ప్రతిఫలం

పెద్ది. సందీప్ కరీమ్‌నగర్
ప్ర. 'రాష్ట్రపతి పాలన' బదులు కంప్యూటర్ పాలన, పెడితే?
జ. ఎన్‌ఛాదా సర్వీస్ ఇంజనీర్ అవుతాడు

పోలాశి రమేష్‌బాబు గురజాడ
ప్ర. ప్రేమకు పెళ్ళికి తేడా ఏమిటి ?
జ మూడోనెల

జె. సూర్యనారాయణ తాళ్ళపూడి
ప్ర. స్విట్జర్లాండుకు ముఖ్యమంత్రి ఎవరు? మరియు ప్రధానమంత్రి ఎవరు? మీ పత్రికలో ఏమని ప్రచురిస్తారు?
జ స్వీడన్‌లో బోఫోర్స్ కంపెనీ అధినేత పేరు ముఖ్యంగానీ ప్రధాన మంత్రి పేరుకాదు

అలవల లక్ష్మి తెనాలి
ప్ర. మీరు జోస్యం చెబుతారా? అయితే 2800 లో భారత ప్రధాని, 2009 లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రెవరో చెప్పరూ! ప్లీజ్
జ రాహుల్‌గాంధీ చంద్రబాబు నాయుడు

కె. సింధు ఏలూరు
ప్ర. రవిగాంచనిది కవిగాంచును అంటా రేమిటండి ?
జ దరిద్రం

టి. అనసూయాదేవి ఖాజీపేట
ప్ర. సంఘసేవకులమనే వారిని నమ్మితే?
జ నమ్మినవారినికూడా సంఘ సేవకులని దూషిస్తారు

బి. సత్యనారాయణ శ్రీకాకుళం
ప్ర. మొన్న రేడియో, నిన్న టేపురికార్డర్లు, నేడు టి.విలు, మరి రేపు?
జ "రియల్ షో"

కాజ నందిని ఏలూరు
ప్ర. నేడు మన దేశ పరిస్థితి ఏమిటి?
జ బ్రిటిష్‌వారు మన్దేశంలో అడుగు పెట్టక ముందున్న పరిస్థితి

డి.వి.యస్. రాజు తూరంగి
ప్ర. ఈ మద్య ఎడిటర్లంతా సీరియల్స్ వ్రాసేయడం మొదలెట్టారేమిటి?
జ ఇంగ్లీష్ నేర్చుకున్నారు కనుక

ప్ర. మూగజీవాలకు మాటలొస్తే ?
జ పదవినుంచి తొలగించ బడతారు

కొప్పర్తి జనార్ధన్ నెల్లూరు
ప్ర. యన్.టీ.ఆర్. లాగా మంత్రులు కూడా ఒక్క రూపాయి జీతం తీసుకొంటే ?
జ అందరికీ చంద్రబాబు నాయుడే దిక్కవుతాడు.

జె. కృష్ణ కంబయ్య తాడిపత్రి
ప్ర. స్విస్ బాంకుల్లో బ్రాండ్స్, దోపిడీలు మోసాలు వుండనే వుండవా?
జ పర్సెంటేజీలుంటాయ్

టి. శ్రీధర్ వరంగల్
ప్ర. కోట్లకు పడగలెత్తిన పెద్ద మనుషులందర్నీ రాజకీయాలనుండితరిమేస్తే?
జ రాజకీయాల్లోకి దరిద్రం వస్తుంది

పీలా నాగేశ్వరరావు అనకాపల్లి
ప్ర. 'విద్యలేనివాడు వింత పశువు' అన్నా పెద్దలే 'చదువుకున్నాడికన్నాచాకలాడుమేలు' అని ఎందుకన్నారు?
జ డ్రైక్లీనర్స్‌ని చూసి

జి. రమేష్‌బాబు ప్రత్తిపాడు
ప్ర. ఈ నాటి 'రచనలు' ఎటు పయనిస్తున్నాయి?
జ ఇంగ్లీష్ ఛానెల్‌లోకి

కె. ప్రకాష్ తాళ్ళపూడి
ప్ర. ఇంటికి దీపం ఇల్లాలైతే మరి భర్త?
జ మరో దీపానికి ప్రియుడు



సెన్సేషన్

''లుక్‌హియర్ ...'' అంటూ ఒక ఫైల్ కపిల ముందుకి విసిరాడు మధు.

గతంలో అతడిలో అంతటి ఎగ్రెసివ్‌నెస్‌ని చూడని కపిల అతడి ప్రవర్తనకు తొలుత షేక్ అయింది; తర్వాత ఆ ఫైలు చూసి మరింత షివర్ అయింది. గత పక్షం రోజులుగా వివిధ దిన పత్రికల సర్క్యులేషన్ హెచ్చుతగ్గుల నివేదిక అది! 'సుప్రభాతం' దినపత్రిక సర్క్యులేషన్ గణనీయంగా పెరగడం — 'మహోదయ' సర్క్యులేషన్ తగ్గుముఖం పట్టడం స్పష్టంగా తెలుస్తోంది. ''మిస్ కపిలా! నాకు నా పత్రిక సర్క్యులేషన్ ముఖ్యం. నా పత్రిక సర్క్యులేషన్ పెరుగుతుందనుకుంటే నేను ఏ రాజకీయ నాయకునితోగాని, ఏ సంస్థతోగానీ తగాదా పెంచుకోవడానికైనా వెనుకాడను. ఐ వాంట్ సెన్సేషనల్ జర్నలిజం. దట్సాల్...'' అంటూ సమాధానంకోసం తృటికాలం పాటు ఆమె ముఖంలోకి చూసి, ''ఓ.కె.. బ్యూరో చీఫ్‌గా ఏమేం స్టోరీస్ ప్లాను చేస్తున్నావో చెప్పు'' అడిగాడు.

ఇటువంటి ప్రశ్న మేనేజింగు డైరెక్టర్ నుంచి వస్తుందని ఊహించని కపిల సమాధానం చెప్పలేక మౌనముద్ర అయింది. ''పి.టి.ఐ., యు.ఎన్.ఐ., న్యూస్ బులెటిన్స్ ప్రెస్ నోట్స్‌తో నా పేపరు ఫ్రంట్ పేజీ కనిపించగూడదు. ఐ వాంట్ సమ్ థింగ్ డిఫరెంట్ ఫ్రమ్ అదర్స్. స్పీక్ ఔట్...'' ఆయన మాట్లాడటంలేదు; అరుస్తున్నాడు.

కొత్త అనుభవాన్ని చవిచూస్తోంది కపిల. ఇప్పటివరకు ఏ పత్రిక యజమాని అలా సూటిగా రిపోర్టర్‌ని పిలిచి మాట్లాడినట్టు దాఖలాలులేవు. ఆ పని మధు చేస్తున్నాడు. అతడికి ఏదో ఒక సమాధానం చెప్పాలి. ఆ చెప్పే సమాధానంకూడా తనను తాను సమర్థించుకోవడమేగాక, ఎదుటివ్యక్తిని ఎడ్యుకేట్ చేసేదిగాకూడా వుండాలి. అందుకే అన్నది కపిల — సార్! సెన్సేషనల్ జర్నలిజం పేరిట 'ఎల్లో జర్నలిజం'కు తావివ్వకూడదు. మనం ఒక వార్త ప్రచురిస్తే దానిని పబ్లిక్ అనుమానించగూడదు. కేవలం సర్క్యులేషన్ పెంచుకోవడానికి రీడర్స్‌ని అట్రాక్ట్ చేయడానికి చీప్ జిమ్మిక్స్ చేస్తున్నాం అన్న అభిప్రాయం పాఠకునికి కలగకూడదు. ఈ ఒపీనియన్ వస్తే ఆ పేపరుకి క్రెడిబిలిటీ వుండదు'' అన్నది కపిల.

''నో మిస్ కపిలా! ఆడదానికి పురాణాలతో చాలా వ్రతాలు నిర్దేశించారు. కాని మగవాడికి ఏకపత్నీవ్రతం అనే ఒకేఒక వ్రతము న్నా అది శ్రీరామచంద్రుని పాత్రద్వారా చూపించారేగాని మగవాడు ఆ వ్రతాన్ని విధిగా ఆచరించాలని ఏ పురాణంలోనూ నొక్కి వక్కాణించలేదు. ఈరోజున పబ్లిక్ ఇమేజ్ వున్న మంత్రులు, అధికారులు ఎందరో వున్నారు. వారిలో నూటికి తొంభై శాతం మందికి చాటుమాటు వ్యవహారాలుంటాయి. వారికి లంచాలు ఇచ్చి పుచ్చుకోవడం అతి సాధారణమైన విషయం. పోలీసు స్టేషన్లో చిత్రహింసలు, తప్పుడు కేసులు బనాయించడం సర్వసాధారణం.

పోలీసులు దొంగ సారా దుకాణాలపై దాడి చేస్తారు. సారా కుండలు బద్దలుకొడతారు. కాని మెష్‌లపైనున్న ఆ సారా కుండల క్రింద నేలలో బేసిన్స్ వుంటాయి. తిరిగి ఆ బేసిన్స్‌లోని సారాని కుండలలో నింపి అమ్ముతారు. పోలీసు రికార్డులో దాడి జరిపినట్టుంటుంది. ఎవరో కూలివాడు నిందితుడుగా న్యాయస్థానంలో శిక్ష అనుభవిస్తాడు. ఇహ అక్రమ సంబంధాల వల్ల

జరిగిన కథ:—

స్పెషల్ మెజిస్టీరియల్ పవర్సుతో నగరంలో శాంతి భద్రతల్ని పునరుద్ధరించడానికి నియమింపబడిన ఎస్. పి. రంజిత్ రాష్ట్ర హోంమంత్రి ప్రశంసలందుకుంటాడు. అదే నగరంలో పట్టపగలు పదిమందీ చూస్తుండగా ఓ కాలేజీ విద్యార్థినిని కిడ్నాప్ చేసి రేప్ చేస్తారు. ఆ అగంతుకుడ్ని ఉరికంబ మెక్కిస్తానని ప్రతిజ్ఞ చేస్తాడు రంజిత్. ఆర్. టి. సి. బస్సులో ప్రయాణం చేస్తున్న ఓ ముసలమ్మని బస్సు ఆపి అందర్నీ భయపెట్టి బస్సునుంచి దింపి చెట్టుకి ఉరిదీసి రంజిత్‌కి ప్రతి సవాలు విసురుతారు. పోలీసు వైఫల్యానికి నిరసనగా పోలీసుల నిషేధపు ఉత్తర్వులని ధిక్కరించి బంద్‌కి పిలుపు ఇస్తాడు వెంకట్. ప్రశాంతంగా సాగే ఊరేగింపులో అరాచకం చెలరేగి దారుణ మారణకాండ జరుగుతుంది. ఆ అరాచకాన్ని, ఫోటోలతోసహా పత్రికకి అందించి యజమాని ప్రశంసలందుకుంటుంది లేడీ రిపోర్టర్ కపిల. రిటైర్డ్ డి. యస్. పి. రామచంద్రుడి కూతుర్ని ఇంట్లోనే రేప్‌చేసి మర్డర్ చేస్తారు. ఎస్. పి. రంజిత్ కలప కుంభకోణంలో చిక్కుకుంటాడు

—ఇకచదవండి

తోటకూర ఆశాలత

హత్యలు, దాడులు జరగడమన్నది అతి సాధారణమైన విషయం. ఈ విషయాలను కేవలం వార్తగా క్లుప్తంగా ఇవ్వకుండా ఒక కథలా ఫిక్షన్ జోడించి ఇవ్వండి. మధు చెబుతున్న విషయంలో కొంత వాస్తవం వున్నదన్న విషయాన్ని గ్రహించింది కపిల. "మీరు చెప్పింది చేయాలంటే రిపోర్టర్స్ నెట్‌వర్క్ బాగుండాలి"

"ఏది ఎలా వుంటే పని సక్రమంగా జరుగుతుందన్నదినిర్ణయించవలసింది మీరు. నేను కోరుకున్న రిజల్టు రావాలంటే మీకు ఏం కావాలన్నది పేపరుమీద ఇవ్వండి. సమకూర్చే బాధ్యత నాది..." అన్నాడు.

"ష్యూర్..." అంటూ వెళ్లడానికి లేచి నదల్లా, "కపిలా!...." అన్న పిలుపుతో ఆగిపోయింది.

"భోజనం వేరు — టిఫిన్ వేరు.

ఇప్పుడు మనం డిస్కస్ చేసిందంతా 'టిఫిన్' మాత్రమే. భోజనం వేరే వుంది. అంటే, రాష్ట్రప్రభుత్వాన్ని అవకాశంవుంటే కేంద్రప్రభుత్వాన్ని అతలాకుతలం చేసే కుంభకోణాలు బయటపెట్టాలన్నది నా పథకం. ఇప్పుడు మనం అసలైన పోరాటాన్ని ప్రారంభించబోతున్నాం. ఆ ప్రయత్నంలో మునిగివున్న మనల్ని పోటీవారు దెబ్బతీయకుండా ముందుజాగ్రత్తగా 'టిఫిన్' ఏర్పాట్లు చూడు" అన్నాడు.

"బై ఆల్ మీన్స్..." అంటూ శెలవు తీసుకున్నది కపిల. టేబుల్‌మీదున్నసిగరెట్ ప్యాకెట్ తీసి సిగరెట్ వెలిగించాడు. క్రమక్రమంగా పొగ గదంతా ఆవరించుకుంటోంది. అతడి మనసులో అస్పష్టంగావున్న ఆలోచనలు ఒక రూపాన్ని సంతరించుకుంటున్నాయి.

సెయింట్ లూయిస్ కాన్వెంట్

లంచ్ అవర్ పూర్తయింది

ఎల్.కె.జి క్లాసు —

లంచ్ పూర్తిచేసిన పసిపిల్లల్ని ఆయా సాయంతో వారి కుర్చీలలోనే నిద్రపుచ్చడానికి ప్రయత్నిస్తోంది క్లాసు టీచరు సోని.

అభం — శుభం తెలియని పసికూనలు —

ముడివిప్పని మల్లె మొగ్గలు —

టీచరు ప్రక్కకు వెళ్లగానే ప్రక్క కుర్చీలో ఉన్న వారిని చూసి వెక్కిరింతగా నవ్వుతున్నారు.

తోటకూర కాడలా, ఆకుచాటు మొగ్గలా అప్పటివరకు తల్లి కొంగుచాటున పెరిగిన ఆ పసివారు ఎక్కడ అగ్గిన పడతారోనని ఆ క్లాసు టీచరు హైరానా పడుతోంది.

అయినా ఆమెకూ తెలుసు — తాను తల త్రిప్పగానే ఓ పాప ప్రక్కనున్న మరో పాపని గిల్లుతుందని; ఇంకొక పాప వేరొక పాప జుత్తు పట్టుకుని లాగుతుందని! అలా ఒకర్నొకరు గిల్లుకోవడం, గిచ్చుకోవడం వారికొక వేడుక మాత్రమే గానీ కోపతాపాలు కావనీ ఆ టీచరుకి తెలుసు. ఆ పసిడి మొగ్గలు ఆ టీచరుకి ఎంత ముద్దొస్తున్నారో, వారి చిలిపి పనులూ అంత ముద్దుగా ఉన్నాయి. వారు చూస్తుండగా తాను ఎక్కడ పెదవి కదిపితే వారు నెత్తినెక్కుతారోనని నవ్వుని పెదవుల చాటున దాచుకొని, బింకాన్ని ప్రదర్శిస్తూ ఆ టేబుల్స్ మధ్య తిరుగుతోంది.

క్లాసు టీచరు అడుగుల సవ్వడి దగ్గరవ్వగానే ఎవరికి వారు 'గప్‌చుప్' మంటూ కళ్లు మూసుకుంటున్నారు; టీచరు తమ దగ్గర్నుంచి వెళ్లిపోయిందనుకోగానే కళ్లు తెరుస్తున్నారు. ఎదుటి కుర్చీలో ఉన్నవార్ని "వ్వె .. వ్వె ..." అంటూ వెక్కిరిస్తున్నారు.

పూలతోటలో పండువెన్నెలనాటి రాత్రి విహరించే మహద్భాగ్యం — పసిపాపల నడుమ కాలక్షేపం చేసే అవకాశం ఎంతమందికి దక్కుతుంది? చూస్తుండగానే ఆ చిన్నారుల అల్లరి చిల్లరి పనుల నడుమ కాలాన్ని మర్చిపోయిందామె. చూస్తుండగానే సాయంత్రం నాలుగు గంటలయింది.

అంతే!!

ఆయా దగ్గర చాక్లెట్ తీసుకున్న ఆ పసివాళ్లు ప్లేగ్రౌండులోకి పరుగెత్తారు. అక్కడవారు ఆడుకోవడానికి వీలుగా రకరకాల బొమ్మలున్నాయి. ఆ బొమ్మలలో ఓ కొత్తబొమ్మ కనిపించడంతో పిల్లల దృష్టంతా ఆ బొమ్మపైనే పడింది. ఆ బొమ్మకోసం పోటీ ప్రారంభమయింది. ఆ బొమ్మ ఒకరి చేతిలోనుంచి మరొకరి చేతిలోకి మారుతోంది. ఒకరి వెంట అందరూ పరుగెత్తుతున్నారు. అంతటా కేరింతలు.

తమలము వేసిన పెదవుల్లా —

కలువలతో నిండిన కోనేటిలా —

ఆ ప్లేగ్రౌండు కళకళలాడుతోంది. అదిగో సరిగ్గా అదే సమయంలో జరగరానిది జరిగింది. ఒకపాప రెండుచేతుల్లోని ఆ బొమ్మని మరోపాపాయి బలవంతాన లాక్కుంది. ఈ పాపాయి నుంచి మరోపాపాయి అలా ఆ బొమ్మను చేజిక్కించుకునే ప్రయత్నంలో ఆ పసిపిల్లలు ఒకరిమీద మరొకరు పడ్డారు. దానితో ఆ బొమ్మలో నిక్షిప్తంగా ఉంచిన బాంబు పేలింది. అప్పటి వరకు పసిపిల్లల కేరింతలతో ప్రతిధ్వనించిన ఆ ఆటస్థలం హాహాకారాలతో నిండిపోయింది. దేవతలు నర్తించిన ఆచోటు రాక్షసకేళీ విలాసమందిరంగా మారింది.

అంతటా రక్తపాతం —

మనసుని పిండించే దృశ్యం

కొండల్ని సైతం కంట తడిపెట్టించే విషాద ఘటన —


ఆ స్కూలులో పనిచేస్తున్న, చదువుకుంటున్న వారంతా ఒక్క ఉదుటున బయటకు పరుగెత్తుకొచ్చారు. ఆ భీతావహానం నుంచి ముందుగా తేరుకున్న ప్రిన్సిపాల్ సిస్టర్ జాక్విలన్ ఏడుస్తూ తన ఆఫీసు గదిలోకి పరుగెత్తింది. టెలిఫోను రిసీవర్ అందుకుని పోలీసులకి ఫోను చేయడానికి డయల్ త్రిప్పబోయింది.

అంతే!!

బ్రహ్మాండమైన శబ్దంతో ఆ టెలిఫోన్ పేలింది. తెల్లని దుస్తులలో ఆకాశం నుంచి దిగివచ్చిన దేవదూతలా —

పెదవులపై చెరగని చిరునవ్వుతో శాంతమూర్తిలా కనిపించే ఆ క్రిష్టియన్ నన్ రక్తపు ముద్దలా మారిపోయింది.

(సశేషం)



ఆశాజ్యోతి కిరణం

బాలభవన్

పిల్లలలో రకరకాల కళాభిరుచులుంటాయి. వాటిని గుర్తించి, సరయిన ప్రోత్సాహం ఇవ్వకపోవడం వల్ల వాళ్ళలోని కళ బయటికిరాదు. కొన్నాళ్టికి ఆదరణలభించని వాళ్ళకళ పూర్తిగా మరుగున పడిపోతుంది. ఇలా ఎంతో మందిలోని కళాభిరుచి మ్రొగ్గలోనే త్రుంచి వేయడంలో ఆ కళకే తీరని ద్రోహం చేసినట్లవుతోంది.

కాబట్టి పిల్లల్లోని కళాభిరుచిని పసిగట్టి, తగిన ప్రోత్సాహాన్ని అందించాల్సిన బాధ్యత తల్లి దండ్రులమీదవుంది. ఈవిషయంలో తల్లి దండ్రులకీ సంపూర్ణ సహకారాన్ని అందించే సంస్థ బాలభవన్!

హైద్రాబాద్ పబ్లిక్‌గార్డెన్స్‌లో బాలభవన్‌లో 5 నుంచి 14 సంవత్సరాల బాల బాలికల కళాతృష్ణని పెంపొందించడానికి సంగీతంలోను, వీణ, తబల; సితార, వయోలిన్. మృదంగం మొదలయిన వాయిద్యాలను నేర్పడంలోను, భరతనాట్యం. కథక్, మొదలయిన నృత్యాలని నేర్చుకోడానికి; పెయింటింగ్, బొమ్మల తయారీ, కార్పెంటరీ, టైలరింగ్, ఫోటోగ్రఫీ మొదలయిన వాటిలో శిక్షణ నివ్వడానికి తరగతుల్ని నిర్వహిస్తున్నారు. అంతేకాదు అయిదో తరగతి నుంచి పదవ తరగతి వరకు చదివే విద్యార్థులకు సైన్స్ క్లబ్ కూడా బాలభవన్‌లోవుంది. రకరకాల సైన్స్ ప్రాక్టికల్స్ అక్కడ చేసుకోవచ్చు. విద్యార్థులకొచ్చే అనుమానాలని తీర్చడానికి, దగ్గరుండి ప్రాక్టికల్స్ చేయించడానికి బోధకులున్నారు.

పుస్తకాల్ని మించిన మంచి మిత్రులు లేరంటారు. తీరిక వేళల్లో పుస్తకాలు చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చు. పిల్లలకి అవసరమైన, విజ్ఞానాన్ని పెంపొందించే రకరకాల గ్రంథాలున్న గ్రంథాలయం కూడా బాలభవన్‌లో వుంది. పిల్లల్లో రచనా పటిమ పెంపొందించడానికి వ్యాస రచన పోటీలు లాంటివి కూడా అప్పుడప్పుడు నిర్వహిస్తుంటారు. ఇవే కాకుండా రకరకాల ఇండోర్ గేమ్స్ ఆడుకోడానికి ఇక్కడ అవకాశముంది. గ్రహాల గురించి పిల్లలకి వివరించడానికి ప్లానిటోరియమ్ వుంది.

పిల్లలకి ట్రాఫిక్ రూల్స్ వివరించడానికి చిన్న పోలీస్‌స్టేషన్ కూడా ఇక్కడ వుందండోయ్. పోలీస్ మామయ్య వచ్చి పిల్లలకి ట్రాఫిక్ రూల్స్ గురించి చెబుతుంటాడు. అంతేకాదు బాలభవన్‌లో వున్న ఆడిటోరియమ్‌లో విజ్ఞానాన్ని, వినోదాన్ని పెంపొందించే చిత్రాలు చూపిస్తుంటారు.

.... పిల్లలకి అదో అద్భుతమైన ప్రపంచం.

అన్ని రకాల అభిరుచుల్ని పెంపొందించుకోవడానికి అది ఆలవాలం!

ఏ అభిరుచీ లేనివాళ్ళకి అక్కడ చక్కటి కాలక్షేపం...సత్కాలక్షేపం!

ప్రతీరోజూ అక్కడికి ఎంతోమంది పిల్లలు వచ్చి తమకు ఇష్టమైన విద్యలో ప్రావీణ్యతని పెంపొందించుకోడానికి వస్తుంటారు. బాలభవన్‌లోకి అడుగు పెడితే చాలు పిల్లల మయం. కొందరు నృత్యం నేర్చుకునే వాళ్ళయితే, మరి కొంతమంది రకరకాల వాయిద్యాలు నేర్చుకోవడంలో తన్మయత్వాన్ని అనుభవిస్తున్నవాళ్ళు, ఇంకొంతమంది సంగీతం నేర్చుకునేవాళ్ళు, కంప్యూటర్ గేమ్స్ ఆడేవాళ్ళు ... బాలభవన్‌లోకి అడుగు పెట్టినప్పటి నుంచీ పిల్లలందరూ బిజీబిజీ.

పిల్లల అభిరుచిని పసిగట్టడం కష్టం. అన్ని రకాల కళలకీ నిలయమైన బాలభవన్‌లాంటి ప్రదేశంలో పిల్లల్ని విడిచి పెడితే వాళ్ళ అభిరుచిని తేలిగ్గా పసికట్టేయవచ్చు ... ఆ కళలో వాళ్ళకి శిక్షణ ఇప్పించవచ్చు. చదువుకుంటూనే తీరిక సమయల్ని కళాభిరుచిని పెంపొందించుకోవడానికి వెచ్చించుకొవచ్చు.

ఎటువంటి కళాభిరుచీలేని పిల్లలు కూడా అటువంటి ప్రదేశంలో సంచరి.



సితారని అభ్యసిస్తున్న బాలలు

స్తుంటే ఏదో ఒక కళవేపు మొగ్గుజూపు తారు.

పిల్లల్లో నేర్చుకోవాలనే జిజ్ఞాస ఎక్కువగా వుంటుంది. అటువంటి వాళ్ళ వుత్సాహాల్ని ఇటువంటి వాటివైపు మళ్ళించక పోతే వాళ్ళ ఆలోచనలు అడ్డదారులు పట్టే ప్రమాదముంది. చిన్నప్పటి నుంచీ పిల్లలకి చదువుతోపాటు ఇలాంటి కళల వేపు మొగ్గుజూపేట్లు చూస్తే యువతరంలో వస్తున్న వెర్రి తలలను కూడా కొంత వరకూ అరికట్టవచ్చు.

ఏ తరగతిలో చూసినా అయిదు నుంచి పధ్నాలుగేళ్ళ పిల్లలతో కళకళలాడి పోతున్నాయి. అన్ని రంగాల్లోను అనుభవజ్ఞులు శిక్షణ నిస్తున్నారు.

"మీరు ప్రతిరోజూ పిల్లలకి ఎంత సేపు శిక్షణ ఇస్తుంటారండి?" సితారాలో శిక్షణ నిస్తున్న ఇన్‌స్ట్రక్టర్ని అడిగాను.

ఖచ్చితంగా ప్రతీరోజూ ఇంతసేపు శిక్షణని పొందాలని విద్యార్థుల్ని మేము నిర్బంధించమండి వాళ్ళ ఉత్సాహాన్ని బట్టి నేర్పిస్తుంటాము. ఓ పక్క, అభిరుచి వున్నవాళ్ళు ఎంత సేపు నేర్చుకున్నా నేర్పుతాము ..." అన్నారు.

కొంతమంది పిల్లలు విడివిడిగా తమంతట తాము వచ్చి నేర్చుకుంటుంటే కొంతమంది తమ పాఠశాలల ద్వారా వచ్చి నేర్చుకుంటున్నారు. విద్యార్థులకు వీలుగా వుండడం కోసమని కొన్ని ప్రాంతాలకి బాలభవన్ బస్సులు వెళ్ళి వాళ్ళను తీసుకొచ్చి దింపేస్తుంటాయి.


"పాఠశాలలనుంచి డాన్స్ నేర్చుకోవడానికి మూకుమ్మడిగా వచ్చే పిల్లలు తమ పాఠశాలల్లో వార్షికోత్సవాలుగాని మరియ ఉత్సవాలుగాని జరుగుతుంటే నృత్యనాటికలు నేర్పించమని అడుగుతుంటారండి. విడివిడిగా నేర్పడమేకాక ఇలాను తర్ఫీదు ఇస్తూంటాము" అన్నారు తమదగ్గరకి డాన్స్ నేర్చుకోడానికి వచ్చే పిల్లలగురించి చెబుతూ డాన్స్ టీచర్.

"ఇదిగో ఈ బొమ్మ చూడండి. ఇది ఆరేళ్ళ అబ్బాయి వేసిన బొమ్మ ... వాడివూహను మనం మెచ్చుకుని తీరాలి. ఇటువంటి పిల్లలెందరో రోజూ ఇక్కడికి వచ్చి డ్రాయింగ్ నేర్చుకుంటూ వుంటారు. వీళ్ళని, వీళ్ళ ఉత్సాహాన్ని చూస్తూంటే ముందుముందు వీళ్ళెంత మంచి ఆర్టిస్టులవుతారో అనిపిస్తుంది" అన్నారు పెయింటింగ్ నేర్పే మాష్టారు. ఆ ప్రదేశమంతా పిల్లలు వేసిన రకరకాల రంగుల బొమ్మలతో చూడముచ్చటగా వుంది,

"సంవత్సరం పాటు మనసుపెట్టి నేర్చుకుంటే ఓ స్థితికి వచ్చేస్తారు. ఈ కుర్రాడు సంవత్సరంనుంచి తబలా నేర్చుకుంటున్నాడు. ఎట్లావాయిస్తాడో వినండి" అని తబలా మేష్టారు అనగానే ఆరేళ్ళ కుర్రాడు చక్కగా తబలా వాయించాడు.

అలా ఆ బాల కళాకారులమధ్య తిరుగుతుంటే గంటలు నిముషాల్లా గడిచి పోయాయి. అందరి మొహాల్లోనూ ఉత్సాహం, పట్టుదల! ఎవ్వరూ బలవంతాన నేర్చుకోడానికి పట్టుకొచ్చినవాళ్ళు కారు. వాళ్ళ ఉత్సాహంతో వాళ్ళు నేర్చుకొంటున్నవాళ్ళు. అందుకే బాలభవన్‌లో అంత కళ వుట్టిపడు తోంది.


పిల్లల్లో కల్పనాశక్తి పెంపొందించే



మట్టి బొమ్మలు చేయడం నేర్చుకుంటున్న బాలలు



తబలా వాద్యం నేర్చుకుంటున్న బాలలు



స్కేటింగ్ నేర్చుకుంటున్న బాలురు

దానికి, రచనా తరగతులు లాంటివికూడా నిర్వహిస్తే బాగుంటుందేమో!

బాలభవన్‌లో తరగతులకు హాజరవడానికి సంవత్సరానికింత అని నామమాత్రంగా రుసుము వసూలు చేస్తారు. వాళ్ళ ఉత్సాహానికి తగ్గ ప్రోత్సాహాన్నిస్తారు.

హైద్రాబాద్‌లో పబ్లిక్‌గార్డెన్‌లోనేకాక మలక్‌పేట, సికింద్రాబాద్‌లలోకూడా బాలభవన్ శాఖలున్నాయి. రాష్ట్రంలో చాలా ప్రదేశాల్లో బాలభవన్‌లు, బాలకేంద్రాలు వున్నాయి. పిల్లల్లోని కళాభిరుచిని పెంపొందించడానికి వుద్దేశింపబడినవే ఈ కేంద్రాలు.

బాలభవన్ డైరెక్టర్ కుమారి వాసిరెడ్డి సీతాదేవిగార్ని కలిసాము.

"మనదేశం మొత్తంలో ఫుల్‌ఫ్లెజెడ్ గవర్న్‌మెంట్ డిపార్ట్‌మెంట్‌గా బాలభవన్ వున్నది మనరాష్ట్రంలోనేనండి. చాలా రాష్ట్రాలలో బాలభవన్ అటానమస్ బాడీగావుంది. ఢిల్లీ తర్వాత పెద్ద బాలభవన్. మనది అన్నిజిల్లా కేంద్రాలలోను కలెక్టర్స్ ఆధీనంలో మాగ్రాంట్స్‌తో బాలభవన్‌లు నిర్వహించబడుతున్నాయి. మండల్ కేంద్రాలలో బాలకేంద్రాలున్నాయి. సంవత్సరానికి పది చొప్పున బాలకేంద్రాలని విస్తరింపజేయాలనే సంకల్పంలో వున్నాము.

ఇక్కడ శిక్షణ నివ్వడంలో పిల్లల్ని ఇక్కడ మేము నిర్బంధించం. కొంతమంది పిల్లలు ముందు ఏ డాన్సో నేర్చుకుంటామంటారు. వారం రోజులుకూడా తిరక్కముందే తబలా నేర్చుకుంటామంటారు. ఆ తర్వాత వయొలిన్ అంటారు. ఇలా కొంతమంది అభిరుచులు మొదట్లో తెగ మారతాయి. అఖరికి

వాళ్ళకి ఇష్టమైన కళని కనుక్కోగల్గుతారు. అందుకని ఎవ్వర్నీ మేము మీరు ఇదే నేర్చుకోవాలని నిర్బంధించం. వాళ్ళు మారుతుంటే వప్పుకుంటాం. ఆఖరికి వాళ్ళకిష్టమైన కళ దొరకగానే వాళ్ళు దానికే అంకితమైపోతారు. అంతవరకూ ఓపిక పడతాము. ఇలా చేయడంవల్ల వాళ్ళ అభిరుచిని సరిగ్గా కనుక్కున్న వాళ్ళమవుతాం. అప్పుడు వాళ్ళు శ్రద్ధగా నేర్చుకుంటారు. బాలభవన్‌లో శిక్షణ పూర్తయ్యేసరికి బేసిక్స్ పూర్తిగా అర్థమవుతాయి. పిల్లలందరి దృష్టిని ఇలాంటి సత్కాలక్షేపాలవేపు మళ్ళించాల్సిన అవసరం ఎంతో వుంది. కేవలం వాళ్ళకి కళల్లో తర్ఫీదు నివ్వడమేకాకుండా వాళ్ళ ఆలోచనలు చెడువేపు మళ్ళకుండా కాపాడిన వాళ్ళమూ అవుతాము. బాలభవన్‌లోకి అడుగుపెట్టిన తర్వాత ఇంతమంది పిల్లల్ని ఇలా చూస్తుంటే ఎంతో ఉత్సాహంగా వుంటుంది. నన్ను చూడదల్చుకున్న పిల్లలెవరైనా వుంటే ఏసమయంలోనయినా కలవడానికి అవకాశం కల్పించాను. వాళ్ళు వచ్చి సరాసరి నన్ను కలుస్తుంటారు ..." అన్నారు బాలభవన్ డైరెక్టర్ కుమారి వాసిరెడ్డి సీతాదేవిగారు.

వేసవి కాలం శలవులు వచ్చాయంటే చాలు బాలభవన్ నిండా పిల్లలే అయిదు నుంచి పధ్నాలుగు సంవత్సరాల లేత గులబీలతో బాలభవన్ వింత కాంతుల్ని విరాజిమ్ముతుంటుంది, పబ్లిక్ గార్డెన్స్‌కే తలమానికంగా తయారవుతుంది. మామూలు రోజుల్లో అయితే స్కూల్ అయిపోయిన తర్వాత షిఫ్టులలో వచ్చి పిల్లలు నేర్చుకుంటూ వుంటారు. శలవుల్లో పగలంతా పిల్లలమయం బాలభవన్. తాము నేర్చుకునే శిక్షణ పూర్తికాగానే లైబ్రరీలోనో, సైన్స్ క్లబ్‌లోనో, ంంప్యూటర్ గేమ్స్ దగ్గరో లైన్ కడ్తేస్తుంటారు పిల్లలు. పిల్లల ఆలోచనలు పెంపొందించుకోవడానికి ఉపయోగపడే 'బాలభవన్' సేవని కొనియవల్సిందే. •••



సింహాసనం

పి.వి.ఆర్. శివకుమార్

గోధూళివేళ-మేతకోసం సుదూర తీరాలకి వెళ్ళే పక్షులన్నీ తిరిగి గూళ్ళకి చేరుదునేవేళ ... శతవర్షాలు దాటి, శతాధిక శాఖోపశాఖల్తో విస్తరించిన వృక్షరాజం పక్షుల కిలకిలారావాల్తో ఎంత సందడిగా వుంటుందో...

ఉదయం పదిగంటలవేళ ఆ ప్రభుత్వ కార్యాలయశాఖా అంతే సందడిగా వుండటం పరిపాటి. 'రాజు వెడలె రవి తేజములలరగ' అన్నట్టుగా, ముందుగా కారుహార్న్ చప్పుడు, ఆ వెనక ఆఫీసు ప్యూన్ బ్రీఫ్‌కేసుతో ప్రవేశం, అతడి వెనకే హుందాగా మేనేజర్ గారి ఆగమనం - జరిగే వేళకి అంతా సర్దుమణిగి సీట్లకి అతుక్కుని కూర్చోటం అక్కడి దిన చర్య.

అయితే ఆరోజు వాతావరణం, అందుకు కొంత భిన్నంగా వుంది. పదకొండు గంటలు దాటి పోయినా ఇంకా కారు చప్పుడు వినరాలేదు. రాజుగారి రంగప్రవేశం జరగలేదు. కారణమూ తెలియలేదు!

"ఏమయ్యిందివేళ? గురువుగారు శలవు గాని తీసుకున్నారా?"


"శలవా? ముందుగా తెలియందే శలవు తీసుకోవటం ఆయన రికార్డులోనే లేదే!"

చిన్న గుమస్తాలు మొదలు హెడ్ గుమస్తా దాకా అంతా చర్చలో మునిగి తేల్తుండగా ఆఫీసు ప్యూన్ అప్పలయ్య వంటరిగా వచ్చాడు - ఆ పిడుగులాంటి వార్త తీసుకుని!

ఆఫీసుకి బయల్దేరాలని మామూలుగానే లేచి తయారవుతున్న మేనేజర్ గారికి ఉదయం ఎనిమిది గంటలవేళ హఠాత్తుగా హార్ట్ ఎటాక్ వచ్చిందిట! వెంటనే హాస్పిటల్లో చేర్చారట.

హుటాహుటిన స్టాఫంతా హాస్పిటల్‌కి బయల్దేరారు. కానీ వాళ్ళు హాస్పిటల్‌కి చేరుకునేదాకా ఏమీ ఆగలేదు. మేనేజర్ గారి ఇహలోక యాత్ర ముగిసిపోయింది.

ఇంతవరకూ చెప్పింది ఉపోద్ఘాతమే! ఇక్కడే మొదలయింది అసలు కథ!



పోయి నోళ్ళు అందరూ మంచోళ్ళే! అలాగని పోయినోళ్ళతో పాటు మనమూ పోలేం కదా! అందునా గవర్నమెంటు (పని నడిచినా/నడవకపోయినా) ఆఫీసన్నాక అది నడిచితీరాల్సిందే కదా! అందుకే, పోయిన మేనేజర్‌గారి స్థానే మరో మేనేజర్‌గారు వచ్చేదాకా చిన్నాఫీసర్‌గారే ఆ ఆఫీసుకి అధిపత్యం వహిస్తారని ఆర్డర్ వచ్చింది. చిన్నాఫీసర్‌గారు మేనేజర్ గదిని తాత్కాలికంగా ఆక్రమించేరు. గదినయితే ఆక్రమించారుగానీ, గతించిన మేనేజర్‌గారి కుర్చీని మాత్రం ఆక్రమించలేదాయన. అందుక్కారణం సదరు దివంగత మేనేజర్‌గారి మీద భక్తి శ్రద్ధలే అనుకుంటే మనం పొరబడినట్లే!

సదరు కుర్చీకో చిన్న కథవుంది. ఆ కుర్చీ ఆ శాఖ ప్రారంభమయిన నాటి నించీ ఎందరో మేనేజర్లు ఆ కుర్చీలో కూర్చున్నారు. ప్రమోషన్ల మీదో, రిటైర్మెంటు మీదో నిష్క్రమించేరు! అందరు మహానుభావులు కూర్చున్న ఆ కుర్చీమీద తను ఎప్పటికయినా కూర్చోవాలని ఆయనకో గొప్ప కోరిక వుండేది. ఆ కోరిక తీరి ఆయన మేనేజర్ అయ్యేనాటికి ఆ కుర్చీ 'మరింక నేను సేవలు చేయలేనంటూ' విరిగి కూర్చుంది. అయితే సెంటిమెంటు బద్ధులైన మేనేజర్‌గారు దాన్నే రిపేర్లు చేయించి వాడటం ప్రారంభించేరు. దానా దీనా అదిప్పుడు మరింత దీనావస్థలో పడింది.

రానున్న కొత్త మేనేజర్‌గారికి ఈ కుర్చీని సమర్పించి ఆయన ఆగ్రహానికి గురికావటం చిన్నాఫీసర్‌గారికి యిష్టం లేకపోయింది. అందుకే మరో నదరైన 'సింహాసనాన్ని' తెప్పించి రానున్న మేనేజర్‌గారికి అర్పించి ఆయన మెప్పు పొందాలని ఆయన దూరాలోచన చేశారు. అంతదాకాకూడా ఆ కుర్చీలో తను కూర్చోరాదనీ నిశ్చయించుకున్నారు. అందుకే తన కుర్చీనే ఆ గదిలో వేయించుకు కూర్చున్నారు. కూర్చున్న వెంటనే బెల్లు కొట్టి అప్పలయ్యని పిల్చేరు. అతనిద్వారా హెడ్ గుమాస్తాకి కబురెట్టేరు.



"మనం వెంటనే ఒక మాంఛి సింహాసనంలాటి కుర్చీ తెప్పించాలి. రాబోయే మేనేజర్‌గార్ని కూర్చోమని ఈ విరిగి, అతుకులుపడి ఊగిసలాడుతున్న కుర్చీని చూపించలేంకదా! అంచేత ఓ కొత్తకుర్చీ కోసం కొటేషన్లు తెప్పించండి" అని ఆర్డర్ వేశారు.

"అలాగేసార్! లోకల్ ఫర్నిచర్ మాన్యుఫాక్చరర్స్ అందరి దగ్గరినించీ లేటెస్ట్ మోడల్ కుర్చీలకి కొటేషన్స్ తెప్పిస్తాను."

"అహఁ... అలా వొద్దు. లోకల్ మాన్యుఫాక్చరర్స్ అంటే... రేపు ఆడిటర్లు వొచ్చి, ఈ కొటేషన్స్‌లో ఏవో లొసుగులున్నాయని ఈకలు పీకి మన పీకలకి చుడతారు.

అందుకే... నేషనల్ లెవెల్లో పేరుబడ్డ ఫర్నిచర్ కంపెనీలనించి కాటలాగులూ, ధరల పట్టికలూ తెప్పించండి,

వాటిలోంచి ఎన్నుకున్నామంటే, ఏ గొడవా వుండదు."

చిన్నాఫీసర్‌గారి ముందుచూపుకి హెడ్ క్లర్క్‌కూడా సంతోషం వేసింది.

"అవశ్యం అలాగే కానిద్దాం" అన్నారు.

ఆరోజే అన్ని ప్రసిద్ధ కంపెనీలకి రాశారు. కేటలాగులూ, ప్రైస్‌లిస్టూ పంపించమని.

* * *

రెండువారాలు గడిచి పోయినయ్. కొత్త మేనేజర్‌గారి సెలెక్షన్ జరిగిపోయింది. హెడ్డాఫీస్‌నించి ఆయనకి ఆర్డర్లు కూడా వెళ్ళిపోయినయ్. సదరు కాపీ ఈ శాఖకూడా వచ్చింది.

చిన్నాఫీసర్‌గారికి కంగారు పుట్టింది.

"కుర్చీ ... కుర్చీ..." అనుకుంటూ హెడ్‌క్లర్క్‌ని పిల్చారు.

"ఇదిగో ఈ ఆర్డర్ కాపీ చూడండి. మన ఆఫీస్‌కి మేనేజర్ సెలెక్షన్ జరిగింది. అయితే ఆయనగారికి ఆ బ్రాంచ్‌లో రిలీవ్ కావటానికి మరోనెల వ్యవధి అవసరమట! అందుకే ఆ తర్వాతే వచ్చి ఇక్కడ చార్జి తీసుకుంటారని హెడ్డాఫీస్‌కి వాళ్ళు రాశారు."

"మంచిదిసార్" అన్నాడు హెడ్, ఆర్డర్నీ, ఉత్తరాన్నీ చదివి.

"మంచిది సరే, మరి కుర్చీసంగతి?"

"అవి...ఒక మూడు కంపెనీలనించి కొటేషన్స్ వచ్చాయండి. మరో రెండు కంపెనీలనించి యింకా రావాల్సివుంది."

"రావల్సిన రెండు కంపెనీలకి టెలిగ్రాం పంపండి. వచ్చిన మూడు కొటేషన్లూ యిలా తీసుకురండి" చెప్పాడు హడావిడిగా ఆయన.

ఫైలు తెచ్చాడు హెడ్ గుమాస్తా.

ఇద్దరూ కల్సి ఆ ప్రైస్ లిస్టులూ, కేటలాగులూ తిరగేశారు.

ఆ మూడు కేటలాగుల్లోనూ వున్న కొన్ని డిజైన్లు యిద్దరికీ నచ్చాయి.

మళ్ళా తిరగేసి, నచ్చిన డిజైన్లన్నిటిలోకీ ఖరీదైన ఒక మోడల్ సెలెక్ట్ చేసుకున్నారు. అది దేశంలో బాగా పేరుబడ్డ ఫర్నిచర్ తయారీ సంస్థవారి మోడల్.

"వెరిగుడ్! ఈ సంస్థపేరు చూసే మన మేనేజర్‌గారు గుమ్మైపోతారు! ఇహ యీ మోడల్ చూస్తే ఆయన రాచఠీవి అబ్బినట్టు మురిసి పోవల్సిందే!"

అన్నాడు హెడ్ గుమాస్తా.

అవునన్నట్టు తల వూపాడు చిన్నాఫీసర్‌గారు. అంతలో ఆయన దృష్టి అదే ధరల పట్టికలో మరో పేజీ వైపుమళ్ళింది.

"అరె! ఇక్కడింకా కొత్త మోడల్స్ ధరలు యిచ్చారయ్యా! అబ్బో... దీని ఖరీదు అయిదువేల రెండొందలట!"

అన్నాడు గుడ్లు మిటకరిస్తూ.

హెడ్ గుమాస్తా కూడా చూశాడది. నిజమే, ఆ మోడల్ కుర్చీ ధర మరీ ఎక్కువగా వుంది.

"దీనిడిజైన్ చూద్దాం కేటాలాగ్‌లో," అంటూ కేటలాగ్ తెరిచాడు.

ఆ కేటలాగ్‌లో సదరు మోడల్ లేదు!

"వెంటనే యీ కేటలాగ్ పంపమని ఆ కంపెనీకే టెలిగ్రాం యివ్వండి!" అన్నాడు చిన్నాఫీసర్‌గారు.

"అలాగే" అన్నాడు గుమాస్తా.

నాలుగు రోజుల తర్వాత జవాబొచ్చింది ఆ కంపెనీ నించి – 'సదరు కేటలాగ్ అవుటాఫ్ ప్రింట్ అనీ-ప్రింట్ కాగానే పంపుతామనీ!'

"నాకొంద! వాడు ప్రింట్ చేసేదాకా మన అవసరం ఆగుతుందేమిటి? సరే... పోనివ్వండి... ఇంత ఖరీదుకి తగ్గ ఠీవి ఆ కుర్చీకి ఎలాగూ వుంటుంది! వెంటనే ఈ కుర్చీకి ఆర్డర్ పంపండి." అన్నాడు చిన్నాఫీసర్.

"ముప్పైశాతం అడ్వాన్సూ, మిగతా డెబ్బై శాతమూ బాంక్ డాక్యుమెంట్ల ద్వారా చెల్లించాల్సి వుంటుందండి!"

పేమెంట్ టరమ్స్ చదివి చెప్పాడు హెడ్.

"ఓ. కె. అలాగే పంపించండి" "ఇవాళే చెక్కూ, ఆర్డరూ పంపించండి" అన్నాడు చిన్నాఫీసర్‌గారు.

ఆర్డర్ అడ్వాన్స్‌తో సహా వెళ్ళిపోయింది.

* * *

మరో మూడు వారాలు గడిచాయి, మేనేజర్‌గారు మరో రెండ్రోజుల్లో వస్తున్నట్లు టెలిగ్రాం అందింది ఆ బ్రాంచ్‌కి.

చిన్నాఫీసర్‌గారు కంగారుగా బెల్లు వాయించారు. హెడ్ రాగానే టెలిగ్రాం చూపించారు.

"అయ్యా....కుర్చీ గురించే కదండి"

"అవునూ....అవును!"

"ఏం ఫర్వాలేదు! కుర్చీ వచ్చేస్తోందండి!"

"ఎప్పుడు? ఎప్పుడయ్యా?"

"రేపటెల్లుండిలోగా వచ్చేస్తుంది. ఇవాళే బాంక్‌నించి డాక్యుమెంట్స్ రిలీజ్ చెయ్యమని యింటిమేషన్ వచ్చిందండి! ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసుకి ఫోన్ చేశాను. వాళ్ళ దగ్గరకి యింకా పాకింగ్ కేస్ రాలేదుట! వాళ్ళ బ్రాంచ్‌కి ఫోన్ చేసి వెంటనే కనుక్కోమని చెప్పాను. ఏదిఏమయినా సరే రేపటెల్లుండిలోగా మెటీరియల్ మనకి డెలివర్ చెయ్యాలని మళ్ళా ఫోన్ చేసి చెప్తాను."

వివరించాడు హెడ్.

"ఓ.కె. అలాగే చెయ్యండి! ఎల్లుండిలోగా ఆకుర్చీ మన ఆఫీసుకి రావాల్సిందే"

"చిత్తం."

గదిలోంచి బయటకి వస్తూనే మరో ఫోన్ కొట్టాడు హెడ్, ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసుకి. అకౌంటెంట్‌ని పిల్చి బాంక్ డాక్యుమెంట్స్ రిలీజ్‌చేసి తీసుకురమ్మని చెప్పాడు.

* * *

ఎల్లుండి రావటానికి మూణ్ణిమిషాల్ మాత్రమే పట్టింది చిన్నాఫీసర్ గారికి.


గంటకోసారి చొప్పున ట్రాన్స్‌పోర్ట్ కంపెనీకి ఫోన్ చేయిస్తూనే వున్నాడాయన హెడ్ చేత.

చివరికి యివాళ ఉదయం లారీ వూరి పొలిమేరలకి చేరిందనీ, అక్ట్రాయ్ కట్టి, మధ్యాహ్నం వేళ్టికి పాకింగ్‌కేస్ డెలివరీ చేస్తామని చెప్పారు ట్రాన్స్‌పోర్టర్లు.

నమ్మకం కుదరటానికి హెడ్ గుమాస్తాని కార్లో అక్ట్రాయ్ పోస్ట్‌దగ్గరకి పంపించి మరీ చూసిరమ్మన్నాడు చిన్నాఫీసర్‌గారు.

హెడ్ గుమాస్తా తిరిగొచ్చి,

"అవున్సార్! నిజమే! మన ప్యాకింగ్ కేసు లారీలో వుంది. మరో గంటలోగా ఆఫీసుకి చేరుస్తానన్నాడు" అని చెప్పాక ఆయననుదుటి చెమటలు తుడుచుకున్నాడు



మేనేజర్‌గారు విచ్చేసేది రేపుదయం ఫ్లైట్‌లోనే మరి! ఇంత శ్రమపడీ ఆ కుర్చీని తెప్పించేక, అది మరొక్కరోజు ఆలస్యమైనా ... తనప్లాన్ చెడిపోతుంది! మేనేజర్‌గారు వచ్చి ఒక్కపూట ఆ పాత కుర్చీలో కూర్చున్నా యింతశ్రమా వృథాయేకదా! సదరు సింహాసనాన్ని ఆయనకి సగౌరవంగా స్వాగతం పలికేలా ఏర్పాటు చేయటమే తనధ్యేయం మరి!

అనుకున్నట్టే మధ్యాహ్నం మూడింటికి దిగింది లారీలోంచి ఆ ఆఫీసు ముంగిట సదరు పాకింగ్ కేసు!

సంబరంగా దానిదగ్గరకు నడిచారు చిన్నాఫీసర్‌గారు. ఆయనవెంటే "హరి వెంటన్ సిరి, లచ్చివెంట నవరోధ వ్రాతముల్ ...." అన్నట్టుగా హెడ్‌గుమాస్తా, మిగతా స్టాఫ్‌కూడా నడిచారు.

ఇద్దరు అటెండర్లనీ పిల్చి కేసు వూడదీసేపని అప్పజెప్పాడు హెడ్‌గుమాస్తా.

టక్ టక్ మని వాళ్ళు సీళ్ళమీద సుత్తిదెబ్బలు కొడుతుంటే, అవి తన బట్టతలమీదే పడుతున్నట్టుగా కంగారు పడిపోయాడు చిన్నాఫీసరుగారు!

"భద్రం .... భద్రం .... నెమ్మదిగా కొట్టండి! లోపలున్న కుర్చీకి తగలగల్దు" అంటూ అరిచాడు. అక్కడికి ఆ లోపల కొత్త మేనేజర్‌గారే కూచున్నట్టూ, ఇద్దరటెండర్లూ కల్సి సదరు మేనేజర్‌గారి మీదే సుత్తి దెబ్బలు వేస్తున్నట్టూ విలవిల్లాడిపోతూ!

అటెండర్లు ఎలాగో అలా తంటాలు పడి, చివరికి ఆ పాకింగ్‌కేసు చెక్కలు వూడదీశారు. ఆ లోపల ముదురు నీలం రంగు ప్లాస్టిక్ కవరుతో కప్పబడి ముసుగులో వున్న కొత్త పెళ్ళికూతురులాగా ముడుచుకు కూర్చుంది ఆ సింహాసనం.

స్వయంగా సదరు ప్లాస్టిక్ కవర్ని పైకి లాగారు చిన్నాఫీసర్‌గారు.

'కెవ్వు' మన్న కేక వెలువడింది ఆ వెంటనే అయన నోటినించి!

అంతా ఆదుర్దాగా ముందుకి తొంగి చూశారు! అందరికీ వున్నఫళంగా నిలువు గుడ్లు పడ్డాయి!

"ఇదేమిటయ్యా ఇది తగలడింది?" అరిచాడు చిన్నాఫీసర్‌గారు.

"కేటలాగ్ పంపమంటే ప్రింట్‌లో లేదని కొంప ముంచాడుసార్ ఆ కంపెనీ వాడు!"

వాపురుమన్నాడు హెడ్ గుమాస్తా!

చిన్న గుమాస్తాలందరికీ ఆశ్చర్యంతో కన్న పొట్ట చెక్కలయ్యేలా నవ్వొస్తోంది. అయితే మయసభలో పాంచాలినిచూసి పండిపడ్డ సుయోధన సార్వభౌముడు గుర్తువచ్చి నోళ్ళని రెండు చేతుల్తోనూ ముఖం తుడుచుకుంటున్న ఫోజులో మూసుకున్నారు వాళ్ళు.


"అయిదువేల రెండొందలు! అవి కాక టాక్సులు, ట్రాన్స్‌పోర్ట్, అక్ట్రాయ్, నా బొంద .... యింతఖర్చు .... అవతల్ని శరవేగంతో దూసుకొచ్చేస్తున్న మేనేజర్‌గారు! ముందుగా ఈ కుర్చీ కేసునే టేకప్ చేసి మన భరతం పడతారు! పాతకుర్చీని అలాగే ఆయనకిఅప్పజెప్పినా సరిపోయేది! ఇప్పుడు ఆ పని ఎలాగూ తప్పక పోగా, కొత్త ప్రమాదం కొని తెచ్చుకున్నాం."

"చచ్చామయ్యా హెడ్డూ!"

ముచ్చెమటల్తో ముఖం తడిసిపోగా, గొంతు మాత్రం పొడారి పోయింది చిన్నాఫీసర్ గారికి!

అసలు సంగతేమిటో, తనని పనిగట్టుకుని ఆ ఆఫీసుకి ఎందుకు పిలిపించారో ఎంత మాత్రం అర్థంకాక అలాగే ఆశ్చర్యంగా నిలబడి పోయివుంది - నిజమైన సింహాసనంలాగే మెరిసిపోతున్న-ఆ దివ్యమైన, మంగలిషాపుల్లో వాడబడే ఖరీదైన మంగలి కుర్చీ!!! ♦♦♦

యామిని పదవ్యూహం-16



చిరునామా: ____________________


ఆధారాలు

నిలువు :—

1. ముఖపద్మం 2. ...,దయచేయండి 4. శివుని జట మొక్కగా మొలిచింది 5. కనుగొంటిని అన్నాడు ఆర్కిమెడీస్ 6. నిషాతో ఖాదర్‌భాయి పెళ్ళి 10. ఆరమరికలు లేకుండా జరిపించండి 11. వచ్చినవాడు శ్రీరాముని మనుమడు 12 బ్రహ్మ 15. వీరాదేమాట పాట్లిమ్మై ధరచెల్లు 16. సుకుమారి 18. కావున మధ్య మాయమైతే అంతా అడవి 20, తల్లక్రిందులయిన చెట్టు

అడ్డం :—

1. తపస్సుకుమెచ్చి ఇచ్చేను కోరుకో 3. దయతో కూడుకున్నవాని 7. పీపాట ఆపకపోతే అటునుంచి వస్తుంది జాగ్రత్త 8. బిందువులను కలుపు మార్గమా? 9. భయమేల జనమా? దీనికి దేవుళ్ళే పడిపోతారు 13. పాతకాలం విసినకర్ర 14. ముత్యపుచిప్ప నిరీక్షిస్తున్నది 17. వేణువువంశం 18. అవును అనకపోతే అంతే 19. ఇది మనసుకు నచ్చినవారితో జరిగితే ఇంకేంకావాలి 21. దేవనర్తకి మగడు 22. వర్తించు.



పదవ్యూహం-15 విజేతలు

1) టి. శ్రీధరు, వరంగల్. 2) వి.డి.యస్. ఆచార్యులు, హన్మకొండ. 3) గడిగ సంజీవరెడ్డి, నూతనపల్లె. 4) శ్రీరామోజీ, పావులూరి. ఎ. ఇ. ఇబ్రహీంపట్నం. 5) శ్రీమతి బి. పద్మమోహన్, గూటి. 6) వి.వి. పార్వతీశం, వరంగల్. 7) బి. సురేష్‌బాబు, సికింద్రాబాద్. 8) కొత్త లక్ష్మీతులసి, కంచెర్లపాలెం. 9) అలవర్తి వెంకటేశ్వరరావు, నందివెలుగు. 10) డా॥ కె.జి. జయరామిరెడ్డి, కర్నూలు. 11) సత్తి వెంకటరెడ్డి, కవిటం. 12) యన్. సుధామాధవి, హైద్రాబాదు. 13. యస్.వి. రమణయ్య, కోదాడ 14. కె.యస్.ఆర్. శర్మ, విజయవాడ

సబంధనలు:

1. ప్రతినెల పూరించిన పదవ్యూహం మా కార్యాలయానికి 20 వ తేదీలోగా చేరాలి.
2. సంచికలో గడులే వాడాలి. విడి కాగితములపై గళ్ళు గీసి నింపరాదు.
3. గళ్ళనుడిపై చిరునామా తప్పక వ్రాయాలి.
4. నుడికట్టు పంపే కవరుపై "పదవ్యూహసంఖ్య" ని తప్పక వ్రాయాలి. బహుమతి మొత్తం రూ.100/- విజేతలు ఒకరికంటే ఎక్కువైతే బహుమతి మొత్తాన్ని పంచి పంపుతాము.

మునసుబు గుమాస్తాల కథ
[ఆమెతో నలుగురు]


కలెక్టరాఫీసులో కస్సీలు దొరకని సెక్షన్లో పనిచేస్తూన్న రవి, "రవికాదు, నాపేరు శని" అని తరుచుగా సరదాగా అంటూంటాడు. అతను దుఃఖానికి నవ్వు పూతలు పూసుకోగలడు.

ఓ నెల పదోతారీఖున పొద్దున్నే ఆరు గంటలకి ఇంకా మంచంమీద పడుక్కొని గాఢనిద్రలో లేని రవిని అతని భార్య గట్టిగాతట్టిలేపి, పక్కన కూర్చొని, అతనికి అసలు విషయం గుర్తుచేసింది.

"ఈ పూట ఎక్కడికైనా వెళ్ళి ఎవరి దగ్గర్నించైనా ఎలాగైనా తలైనా తాకట్టు పెట్టి ఓ పాతిక పట్టుకొస్తాఁ వన్నారు. గుర్తుందా? మరంచేత. లెండి మరి. వేగిరం లెండి. లెండి. బాబూ లెండి వేగిరం లేచి వెళ్ళి మీరీరోజు ఆ సొమ్ము తేకపోతే నేను మరింక ఈ కాపరం చెయ్యలేను. ఒక్క నిమిషం మరింక బతకలేను. ఆ ఇంటావిడ మళ్ళీ వచ్చిందంటే- ఇప్పుడే చెప్తున్నాను నామాట నమ్మండి- నేనివాళ ఉరిపోసుకు చస్తానేకాని మరి బతకను. దాన్తోపాటు, దాని మేనల్లుట. వాడు కూడా ఒస్తాడు. మీరేమో ఆఫీసుకి వెళ్ళిపోతారు. చిట్టిగాడు- స్కూలుకి వెళ్తాడు. నేనూ పాపా బితుకూ బితుకూమంటూ కూర్చుంటాం. సరిగ్గా మధ్యానం అయేసరికి మేనత్తా మేనల్లుడూ తిన్నగా గదిలోకి, అడగనైనా అడక్కుండా ఒచ్చేసి, ఇదిగో ఈ మంచంమీదే ఈ పక్కమీదే దబాయించి కూర్చొని "తే అద్దె తే" అంటూ గంటదాకా కద్రలు- తలుపులేసేస్తే తీసేదాకా దబదబ బాదేస్తారు. ఆ మేనల్లుడు జోళ్ళయినా విప్పడు. వాడు మాట్లాడ్డు కాని వాడి నవ్వూ వాడి చూపు చూశ్కేదు మీరు. వాణ్నిలా చూస్తుంటే వాడ్ని పొడిచి చంపేయాలనైనా అనిపిస్తుంది. లేకపోతే, అది చెయ్యలేనప్పుడు, పొడుచుకు చావాలనైనా అనిపిస్తుంది. నిన్న మధ్యానం వాళ్ళొచ్చే వేళకి పక్క చుట్టేసి మంచం ఎత్తేసి దాని మీద నా బ్లూ చీర ఆరేసి నేను పెట్టెమీద కూర్చొన్నాను. నా కర్మ కాలిపోయి వాళ్ళొచ్చేసరికి ఆ చీరె ఆరిపోయింది. వాడు తిన్నగా ఒచ్చి ఆ చీరె తీసి, మంచం వాల్చుకుని దానిమీద ఆ చీరె వరుచ కూర్చున్నాడు. నెత్తిమీద నిప్పుల కుంపటి కుమ్మరించేసి వాణ్ని నిలువునా కాల్చెద్దా మనిపించింది- చేతకాని కోపం ఎంతొస్తే మట్టుకు ఏం లాభం?- నేనా చీరె పుటం పెట్టినా కట్టుకోలేను. వాళ్ళ దెబ్బ వాళ్ళ మొహాన్న పారేస్తేగాని నేను మరింక బతక జాలనుగాక బతకజాలను. ఈ అవమానాలు నేను భరించలేను. భరించలేను. నిన్నరాత్రి మంచంమీద పడుక్కోకుండా చాపమీద ఎందుకు పడుక్కున్నానని మీరంటే నేనేవీఁ చెప్పలేకపోయేను. పెదివె కదిపితే ఏడుపులో

రాచకొండ విశ్వనాథశాస్త్రి

మునిగిపోదునన్న మాట. మంచంగురించీ చీరె గురించే కాదు. నిన్న ఆ ఇంటిది ఏఁవన్నాదో చెప్పడానికి సిగ్గేసి ఒళ్ళు చచ్చిపోయి మీతో చెప్పలేకపోయేను. "అమ్మా! ఆడదాన్ని నన్నలా హింసించడం బావుందా!" అన్నాను. అంతే అన్నాను. దానికి ఆవిడ ఏఁవందో తెల్సా? తల్చుకొంటే నా మన నంతా మరిగిపోయింది- ఆపలేని దుఃఖం ఒస్తోంది. మనం ఎవరియెడల ఏ పాపం చేసేం? ఏ పాపాలైనా చేసేవాఁ? చేస్తే, విధంగా హింసించడం? అయినా, కట్టెదుట పాపాల్చేసే మనుషుల్నే 'ఏవ్రా ఎందుకు చేసేరు?' అని అడగడానికి నోర్లేదు మనకి. మరింక ఆ దేఁవుణ్ని ఇంకేం అడగ్గలం? కాని ఏడవకుండా ఉండలేంకదః దాని కూడా నోళ్ళు కట్టేస్తారా? కట్టేసీయండి. ఏడ్చి మనం సాధించే దేఁవుంది గనకః కాని నిన్న మధ్యానం అదన్న మాటలు.... [బోలెడ్డబ్బూ తగలేసి, ఉత్తిపుణ్యానికి నిన్నూ నీ మొగుణ్ని ఇందుమీద పందబెట్ట



తెలీకచేసేవేఁమోగాని తెలిసీ చెయ్యలేదు కద. కాని, తెలిసీ తీరి కూర్చొని ఇంత మంది నిరపరాధుల్ని అంతమంది ఇలా ఈ విధంగా హింసిస్తుంటే, పట్టపగలు పది మంది యెదటా ఇంతలేసి అన్యాయం ఇలా జరుగుతూంటే లోకం ఇంకా ఎందుకు మండి మసైపోడంలేదో నాకు తెలీడంలేదు. ఇన్ని దుఃఖాలు పెట్టీకంటె, పోనీ, ఒక్కసారే మనందర్నీ కాల్చి చంపేసి ఆ దేవుడు వాళ్ళనే హాయిగా బతకనివ్వకూడదా? ఎందుకు మనల్ని పుట్టించడం? ఎందుకి దానికి కొనుక్కోలేదు పిల్లా నేనీ ఇల్లుః అంత పుణ్యానికే పోవాలంటే నా మేనల్లుడే ఉన్నాడు. నిన్ను కాకపోతే నీలాటివాళ్ళని పదిమంది నైచ్చి వాణ్ని పందబెట్టగల నిక్కడః తెల్సిందా? అపాటిదానికి నీ మొగుడికెందుకు ఇల్లిచ్చుకోడం? అద్దిమ్మంటే నోరుందికదా అన్చెప్పి పెద్ద కబుర్లాడకుః మేఁ వూఁ అడగలం అపాటి అద్దానికి అపాటి నోళ్ళు మాకూ ఇచ్చేడు. భగవంతుడు. నీకున్న పౌరుషం నీ మొగుడికే ఉంటే అపాటి అద్దెడబ్బును మా మొహాన్ని

ఎప్పుడో పారేసును. అంతపాటైనా చేతకాని వాడికి ఈ యిల్లూ మంచం నువ్వూకూడా ఎందుకు? అంతగా కావాలంటే మా ఇల్లే దొరికిందేమిటి? పోయి ఏ చెట్టుకిందో ఉండ రాదా? కాణీ అద్దె ఇవ్వక్కర్లేదు కద? ఆడదాన్నిట! హింసట్ట! పెట్టేస్తున్నాంట! ఏం? నా అద్దె నాకు పారేక నన్నిలా ఎండలో తిప్పి నన్ను హింసలు పెట్టడం లేదా నువ్వు? నే నాడదాన్ని కానా?! ఆడదెవరో మొగాడెవరో తెలీకుండానే కాపరం చేసి పిల్లల్ని కన్నానా??] ఆ మాటలన్నీ చెప్పడానికి నాకు నోర్రావడంలేదు. మనం ఈ యింట్లోంచి పోదాం! చెట్టుకిందికే పోదాం మనకి ఈ యిళ్లెందుకు. ఈ వూళ్లెందుకు ఈ నౌకరీ చాకిరీ లెందుకు? పక్షులు బతకడంలేదా! చెట్లకిందికే పోదాం. అవీ లేకపోతే అపాటి పడి చావడానికి నూతుల్లేవా?! గోతుల్లేవా?! అంతకీ ఏదీ లేకపోతే, మహా సముద్రం లేదా? అందులోకి పోతే అక్కణ్నుంచి మనల్నెవ్వరూ పొమ్మన్లేరుకద!" అంటూ కళ్లొత్తుకుంది రవిభార్య.

రవి భార్యకి ఇరవై మూడేళ్ళుంటాయి. ఆవిణ్ని చూస్తే పచ్చగా బరువుగా పళ్ళతో నిండిపోయి వడదెబ్బకి వ డి లి పో యి ఎండలో జాలిగా నిల్చున్న లేత బొప్పాయి మొక్క గుర్తుకొస్తుంది. రవి కంటికి ఆమె ఎప్పుడూ, తిండిలేని సీతలాగా, ఆకల్తో అడివిలో తిరిగే దమయంతిలాగా కనిపిస్తుంది. రవికి ముప్పయ్యేళ్లున్నాయి. అతను చీకటికొట్లో ఎండుగడ్డి వేడిలో ముగ్గబెట్టి బలవంతంగా పండబెట్టిన లేలేత మామిడి కాయిలా పండిపోయుంటాడు.

అతని తలమీది జుట్టు చాలాకాలంనించీ రాలిపోతోంది. వర్షంలో తడిసిపోయి పాడై పోయి చెడిపోయిన కొత్తచీపుల్లా ఉంటున్నాదిప్పుడతను. వాళ్ళిద్దరికీ ఎనిమిదేళ్ళ కొడుకూ అయిదేళ్ళ కూతురూ ఉన్నారు.

భార్యచెప్పే మాటలన్నీ వింటూ మంచం మీద వెల్లకిలా పడుక్కున్న రవి ఆవిడ తల తన గుండెకి చేర్చుకున్నాడు. అంతా చెప్పి లేచి ఆమె కళ్ళొత్తుకుంటుంటే, చివరికి ఉండబట్టలేక, "అత్తముండనీ అల్లుడు వెధవనీ చంపేస్తాను." అన్నాడు రవి.

"దేవుడూ గవర్నమెంటూ అంతా వాళ్ళ పక్షవే ఉంటే మీరూ నేనూ ఏం చెయ్యగలం? ఏం చెయ్యలేకపోయినా ఆ దేవు డొక్కసారి కనిపిస్తే- కనిపించడు. కనిపిస్తే పేదవాళ్ళంతా గుద్దుపికి చంపేస్తారని భయం! నామట్టుకు నేను ఓ బుగ్గపోటైనా పొడవకపోతే నా మనసు శాంతించదు. అందుకే కనిపించడు పెద్దమనిషి! పోన్లెండి. ఉణ్నీయండి. అందర్నీ వాళ్ళ పక్షవే ఉణ్నీయండి. నిండా మునిగేక ఇంకేం భయం? భయపడద్దు మనం. వాళ్ళకి అద్దె ఇవ్వొద్దు మనం. అంతగా అయితే ఏ బైరాగి సత్రానికైనా పోదాం కాని వాళ్ళకి అద్దె ఇవ్వొద్దు మనం." అంది రవి భార్య.

భార్యకి బాధతప్ప మరేం తెలియదని రవికి తెలుసు. తను చెయ్యలేని పనులేవిటో కూడా అతనికి తెలుసు. వెళ్ళి, చంపలేడు. పిల్చి దేవుణ్ని పలికించుకోలేడు. అర్జీ రాసుకునైనా గవర్నమెంటునేదీ అడగలేడు. సంసారంతో బైరాగిసత్రంకి పోలేడు. కట్టగట్టుకు సముద్రంలోకి ఉరకలేడు.

అందుచేత, సరిగ్గా ఏదోగంటకల్లా, పాతిక రూపాయల అప్పు వేటకి, గదిలోంచి బైటికి నడిచేడు రవి.

సుధ పేరు సుధాకర్. కలెక్టరాఫీసులో

కొద్దిగామాత్రం కన్నీలు దొరికే సెక్షన్లో పనిచేస్తున్నాడతను. వయసు పాతిక గుమాస్తా, బ్రహ్మచారి. కొంచెం అందంగా కొంచెం టెక్కుగా షోగ్గా అతను గుమాస్తాగా మారిన పడుచు బ్రెయ్‌నీ కలెక్టర్లా ఉంటాడు.

బట్టలమీద మోజుకొద్దీ పెళ్ళి మానుకున్నాడు సుధ. అతనికి సినీమాల సరదా, నాటకాల పిచ్చికూడా ఉన్నాయి. ఆ పిచ్చి సరదా మోజులకీ పెళ్ళికీ సహజ వైరం ఉంది. పెళ్ళి చేసుకున్న గుమాస్తాల బాధల్ని పక్కన్నిలబడి మరీ చూసేడు సుధ. అందుచేతనే అతనికి భయం పెళ్ళంటే. కాని, అతనికి ఆడదంటే చిక్కని మోజుంది. పెళ్ళి లంకె తగుల్చుకోకుండా అతను చిలకొట్లతో కాలక్షేపం చేస్తున్నాడని అందరికీ తెలుసు. అతనికి తల్లి తండ్రి అన్నదమ్ములూ అప్పచెల్లెళ్ళూ ఎవరూ లేరు. ఒక చిన్న మేడమీద ఒక చక్కని చిన్న గదిలో కాలక్షేపం చేస్తున్నాడతను. సమస్త బంధువుల్తోనూ అలరారుతూన్న గుమాస్తాలతన్ని "లక్కీఛాన్సుగాడు!" అంటారు.

సుధకి టెర్లిన్ షర్ట్సు అంటే ఇష్టం వున్నట్టే సుశీలకి నైలాన్ చీరలంటే ఇష్టం ఉండేది.

సుశీల ఒకప్పుడు ఎమ్బీబియెస్ చదువుదామనుకొంది. మరొకప్పుడు సినీమాల్లో చేరిపోదామనుకొంది. ఓనాడు 'కష్టజీవులు' సినిమా చూసి హీరోయిన్లాగ ఏ మంచి కూలివాణ్ణయినా పెళ్ళాడేద్దునా అనుకొంది. మరోనాడు. వాళ్ళ వీధిలోనే ఉన్న సరసుడూ శైతాగుబోతూ జూదగాడూ దొంగా దగాకోరూ అందగాడూ అయిన నడికాలపు గూండాని అందర్నీ ధిక్కరించి పెళ్ళాడి పరమ పతివ్రతగా ఉంటూ తన పాతివ్రత్య బలంచేత వాణ్ని పరమ భాగవతోత్తముడిగా మార్చేద్దునా అనుకొంది. ఓసారి ఏ అమెరికా అయినా ఎగిరిపోదునా అనుకొంది. మరోసారి, తనని ఏ పడుచు చీఫ్ మినిస్టరో, రాజాసాహెబో, కలెక్టరో లేక నాలుగు కార్లున్న - కంట్రాక్టరో పెళ్ళాడకూడదా అనుకొంది.

ఆ అనుకోడాలూ ఊహలూ అవన్నీ ఆమెకి పద్దెనిమిదేళ్ళు నిండకముందు.

ఇప్పుడుకాదు. ఇప్పుడామెకు ఇరవైరెండేళ్లు దాటేయి. సుధ పనిచేసే సెక్షన్‌లో టైపిస్టుగా చేరిన తరవాత సుధని చూసేక అతన్తో పరిచయం అయాక ఆమెకి నగలూ నైలాన్ చీరెలూ అక్కర్లేకపోయేయి. సుధని పెళ్ళాడి ఆ మేడమీద ఆ చక్కని చిన్న గదిలో అతన్తో కాపరం చెయ్యడం అదే కావాలనుకొంది; అదే చాలు. తనదే స్వర్గం అనుకొంది.


మొదటిరోజుల్లో ఓరోజు మధ్యాహ్నం సుధతో ఏదో మాట్లాడుతున్నట్టు మాట్లాడుతూ తన ఫ్లాస్క్ తీసి మర్యాదకి ఇచ్చినట్టు తన కాఫీ కొంత అతని కిచ్చింది

సుశీల. అక్కణ్ణించి కాఫీలు ఇచ్చి పుచ్చుకోవడాలు ప్రారంభమయేయి. ఓనాడు - ఇద్దరూ కలిసి హొటేల్కి వెళ్ళిన మొదటి రోజున - అతను బిల్లు చెల్లిస్తే, "ఒద్దు ఫ్రీరివాళ చెల్లిస్తే, రేవు మరెవరైనా చెల్లిస్తానంటారు." అంది సుశీల. "నేనుండగా మరెవరైనా చెల్లించనిస్తానా?" అని అతనందే సిగ్గునవ్వు నవ్వి మనసులో అతని మాటల్ని దాచుకోంది. మూడుసార్లు అతనితో కలిసి సినిమాకి వెళ్ళి నాలుగోసారి వెళ్ళినప్పుడు మాత్రం అతన్ని తన కుడి చెయ్యి మాత్రం పట్టుకోనిచ్చింది. ఆ రాత్రి అతనితో రిక్షాతో కూర్చొనిరాడానికి చాలా సిగ్గుపడింది. ఓరోజు సాయంత్రం అతను చాకెట్‌పీస్ కొనిస్తే "చెప్పకుండా ఎందుకొన్నా"రని మారాం చేసింది. "రేపు టిష్యూచీరె కొంటాను. అని అతనంటే" "ఒద్దు. డబ్బు ఖర్చు." అంది సీరియస్‌గా. అదే సాయంకాలం బాగా చీకటిపడ్డాక బీచిని మసక వెన్నెల్లో అతన్ని ఒక్క ముద్దుమాత్రం పెట్టుకోనిచ్చి ఆ తరవాత ఎందుకో దుఃఖం రాగా కళ్ళు తుడుచుకొంది. తననతను ఓదార్చబోతే కొంత మేరవరకు మాత్రం ఓదార్చనిచ్చింది. "టిష్యూచీరె కొనేదా?" అని అతను మళ్ళి అడగ్గా సరేనన్నట్టు తలఊపి, "నీ ఇష్టం" అంది అతన్ని పెళ్ళాడ్డంకోసం ఆమె తహతహలాడిపోయింది.

సుధమాత్రం ఆడవాళ్ళు మగవాళ్ళకీ మగవాళ్ళు ఆడవాళ్ళకీ రాసేకథలు చదివేడు కాబట్టే వాటిలో నాయకుల్లా "నాది ప్రేమా, వాంచా? ఆమెది వాంఛా లేక ప్రేమా?" అని తర్కిస్తూ కూర్చున్నాడు. తర్కం తేల్లేదు కాబట్టి ఆమెతో పెళ్ళి సంగతి మాట్లాడ్డం మానేసేడు.

సుశీల అమర్నాడు ఆఫీసుకి ఆలస్యంగా వచ్చిన సుధని దూరంనించి నవ్వుతూ పలకరించి నవ్వుతోనే దగ్గరకి రమ్మంది. అతను 'పనిలో మునిగిపోయి' రెండుగంటలయేక ఆమెదగ్గరికి వెళ్ళేడు. వెళ్ళేక, అతను ఫ్రీగా మాట్లాడకపోవడం గమనించి ఆమె కూడా ముక్తసరిమాటల్తో సరిపుచ్చింది. ఆ సాయంకాలం, "ఇంకా పందకాయితాల పనుంది. నాకోసం వెయిట్‌చెయ్యకు!" అన్నాడతను. సరేనని వెళ్ళిపోయిన సుశీల ఆ మర్నాడు అతన్ని నవ్వురాకుండా నవ్విన పెదవుల్తో పలకరించింది. మాట్లాడ్డం మాత్రం మానేసింది. రెండు, మూడు, నాలుగు, ఐదురోజులు మాట్లాడ్డం మానేసింది. ఆమె తనతో మాటలు మానేసిందన్న సంగతికి బాధపడ్డ సుధకి తనామెతో మాట్లాడలేదన్న సంగతి గుర్తురాలేదు. ఆ రోజున మాత్రం ఆమె ఆఫీసుకి వస్తూండగా వరాండాలోనే ఆపి ప్రేమా కోపం అభిమానం అన్నీ ఒక్కుమ్మడిగా ఒక్క ప్రశ్నలో ఇమిడ్చి "టిష్యూచీర కొనేదా, ఒద్దా?" అని బింకంగా అడిగేడతను. సుశీల అతని కళ్ళల్లోకి సూటిగా చూసి, "నా నిర్ణయంతో మరింక పనిలేదు. నిర్ణయించుకోవల్సింది మీరు." అంది 'భావగర్భితంగా'. "నన్ను పెళ్ళాడదల్చుకొంటే చీరెకొను. లేకపోతే నాకు నీ చీరెలూ ఒద్దు, నువ్వూ వద్దు." అని ఆమె చెప్తోందని స్పష్టంగా బోధపడింది సుధకి.

"ఇద్దరి జీతాలూ కలిసి ఇద్దరికీ సరిపోవా?" అనుకొంటూనే ఉన్నాడు ఆ రోజల్లా ఆఫీసులో సుధ. కాని, ఇద్దరు ఒకఏడాదిలో



ముగ్గురవుతారు. ముగ్గురు మరికొంత కాలంలో నలుగురైదుగురవొచ్చు. అంతలో బాధలమబ్బులూ కష్టాలవర్షాలూ తయారవుతాయి. సినీమా ఉండదు, నాటకాలుండవు; దోసె కాఫీ సిగరెట్లుండవు! చెప్పులుండవు, సైకిలుండదు; బస్సులుంటాయికాని వాటిలో ప్రయాణాలుండవు; పాలు వెన్న రొట్టె ఏదీ ఉండదు! పెరుగు, కక్కలు, కాయగూరలు టూత్‌పేస్టు, హేరాయిలు, పేపర్లు, పత్రికలు, నావెల్సు, ఏవీఉండవు. బట్టలు! బట్టలుండవు. గొప్ప తగ్గింపుధరల వారాల్లో ఇద్దరు బట్టలు కొనుక్కోవాలి. చవక నూలు గుడ్డలు ఎంచుకోవాలి. అంతకిమించి గత్యంతరం ఉండదు. మరింక పిల్లలు, జబ్బులు, మందులు, చావులు? ఏంబ్రతుకు బ్రదర్! భయంవేస్తోంది.

"ఏంచెయ్యడం?" అని మధ్యాహ్నం లంచ్‌లో ఓ స్నేహితుణ్ని సలహా అడిగేడు సుధ.

"సుధా బ్రదరూ! పెళ్ళాడకముందు ఇన్ని ఆలోచించే గుమాస్తాగాడివి ఆడి మాత్రం ఏం సుఖపడాలి?" అన్నాడతను.

అయితే- సుధకి సుశీలతో సుఖపడాలనే తీవ్రమైన కోరికమాత్రం లేకపోలేదు.

ఆ సాయంకాలం అతను ఆఫీసునించి రూంకి వస్తూ దార్లో పావలా షేవ్‌చేయించుకొని, రూంకి వచ్చి స్నానంచేసి, బజారుకి వెళ్ళేవాళ్ళా ఫుల్‌గా డ్రెస్సై టాయ్‌లెట్ అయి మంచంమీద కూర్చొని, "టిష్యూచీరె కొనదవా? మానవా?" అని తర్కిస్తున్నాడు. అతనికేమీ పాలుపోడంలేదు. అప్పుడతని చేతిలో సరిగ్గా ఇరవైతొమ్మిది రూపాయల నోట్లూ, ఒక ఇచ్చరూపాయీ ఉన్నాయి. ఆలోచించి ఆలోచించి చివరికతను ఆ ఇచ్చరూపాయి టాస్‌చేసి పెళ్ళో బ్రహ్మచర్యమో తేల్చిపారేద్దామనుకున్నాడు.

అంతలో బాబులు (అనే జగన్నాథం) వచ్చి సుధ పెళ్ళిప్రయత్నం ఆపుచేసేడు.

"మళ్ళీ మా జీతాలరోజున ఇచ్చేస్తాను ఒక్కముప్ఫయ్! ప్లీజ్ ప్లీజ్! నీ గెడ్డంపట్టుకు బతిమాల్తాను." అన్నాడు జగన్నాథమనే బాబులు.

"ఉండండి! మండుతుంది. ఇప్పుడే షేవ్ చేయించేను." అన్నాడు సుధ, ముఖం

వెనక్కిజరుపుకొని. (పెళ్ళాడి పాత్రైపోతే వారాని కాకసారే షేవు!)

"ఆయితే చేతులిలా ఇయ్యి" అన్నాడు బాబులు.

"ఉండండి. ఎంతకావాలి మీకు?"

"ఒక్కముప్పయ్!"

ఆ'ముప్పయ్'ని మూడుపైసల్లా ధ్వనింప జేసేడు బాబులు.

"పట్టుకువెళ్ళండి." అని సంతోషంతో ఆ సొమ్ము అతనికిచ్చేసి, "హమ్మయ్య". అని నిట్టూర్చేడు సుధ. చీరె కొనడానికి డబ్బులేదుకాబట్టి అది కొనడవా, మానడవా అనే సమస్యేలేదు. అది పరిష్కరించే బాధా లేదు. వచ్చే నెల చూసుకోవచ్చు.

ఆ వచ్చేనెల వచ్చివెళ్ళింది. మరోనెల వచ్చి అదికూడా వెళ్ళింది. ఇంకోనెలకూడా తొందరగావచ్చి లక్షపనులు చక్కబెట్టి చక్కావెళ్ళింది. మూడునెల్లూకూడా కోట్ల కొద్దీ జనంచేత కోట్లకొద్దీ పనులు చేయించేయిగాని సుధచేతమాత్రం టిష్యూచీరె కొనిపించలేకపోయేయి. అంతలో నాలుగో నెల నెమ్మదిగా దొంగలావచ్చి సుశీలని చల్లగా కారెక్కించి ఒక రిటైర్డు పోలీసు ఆఫీసర్తో పెళ్ళికి రెజిస్ట్రార్‌వారి ఆఫీసుకి తీసుకుపోయింది.

పెళ్ళిరోజు పొద్దున్నే సుశీల సుధ రూంకి వచ్చి, శుభలేఖ స్వయంగాఇచ్చి, పెళ్ళికి రమ్మని పిల్చి, "మా పెళ్ళికి సాక్షిసంతకం మీరుకూడా చెయ్యాలి. తప్పకరండి." అంటూ నవ్వుతూ అతని ముఖంలోకి చూసి, ఆ వెంటనే కోపంతో ముఖం ఎరుపు చేసుకొని, అంతలోనే దుఃఖంతో వెక్కి వెక్కి ఏడ్చింది. ఆ నవ్వు అతన్తో, ఈ పరిస్థితికి కారణం నువ్వేసుమా!" అంది. ఆ కోపం అతన్ని, "నా దుస్థితికి కారణం నువ్వే కదా?" అని నిలదీసి అడిగింది. ఆ దుఃఖం అతన్తో, "నేన్నాశనం అయితే అందుక్కారణం నువ్వే నువ్వే!" అని జలజలా రాల్తూ జాలిజాలిగా చెప్పింది.

అప్పణ్నుంచీ సుధాకర్ కొంతకాలం దేవదాసుగా తిరిగేడు. తన బాధకి తను (కూడా) కొంతకారణం అని అతనికి తెలుసు. అంచేతనే అతనికి మరీ బాధగా ఉంది. కాని, "సుశీల నన్నర్థంచేసుకో లేదు." అని సమాధానపర్చుకొందికి ప్రయత్నం చేసేడు. గుమాస్తాగాడు పెళ్ళి చేసుకొంటే బట్టకీ భోజనానికీ వాచిపోయే ప్రమాదం ఉంది కదా! అలా భయపడ్డంలో నా తప్పేం ఉంది? సంఘం అలా వుంది. అందుకు నేనేం చేసేది? సంఘంలోవున్న పెద్దతప్పు నామీత్తోస్తే ఎలా?- అని అతను బాధపడీ చాలా చిరాకుపడ్డాడు. పోనీ, నాతో 'ఇదిగో సుధా! నువ్వు నన్ను పెళ్ళాడకపోతే నేను చచ్చిపోతాను. లేకపోతే నీమీద కోపంచేత ఏ ముసిలాణ్నయినా ఎవణ్నయినా పెళ్ళాడేస్తాను!' అని సుశీల స్పష్టంగా చెప్పేస్తే ఎంతబావుణ్ను!.... కాదు! నాదే తప్పు, నాదే తప్పు- కాదు! సంఘం దీతప్పు. పువ్వులాటి పెళ్ళిని మాకు పెద్దపులికోరలా తయారుచేసిన పెద్దల సంఘందీ తప్పు!

అలా బాధపడుతూ చిరాకుపడుతూ కాలం గడుపుతున్నాడు సుధ. ఈలోగా సుశీల ఉద్యోగం మానేసించి. ఆమె పెళ్ళి జరిగి అప్పుడే రెణ్నెల్లయింది. రెండురోజుల్నుంచీ సుధాకర్ మూడ్ పూర్తిగా మారిపోయింది. ఇప్పుడతను లోకులంతా బహు దుర్మార్గులూ పరమ రాస్కెల్సూ అనే


సారీ దేవా! నువ్వె మరీ ఇంత సడన్‌గా వచ్చేస్తావనుకోల్లా!

చీకటి కోపంతో ఉన్నాడు.

ఉదయం ఎనిమిదిగంటలకి అత నటువంటి డార్క్‌మూడ్‌లో ఉండగా రవి నెమ్మదిగావచ్చి భయం భయంగా పాతిక రూపాయలు అప్పడిగేడు.

"ఇవ్వను, ఇవ్వనుకాక ఇవ్వను. ఎందుకివ్వాలి?" అనేద్దామనుకున్నాడు సుధ.

కాని అంతలోనే అతనికి కొంచెం, అతి కొంచెం ఒక్క మూడుమిల్లిమీటర్ల చిరునవ్వొచ్చింది. లోకులంతా ద్రోహులనీ దుర్మార్గులనీ ఈ సుధకి తెలుసు. తెలిసినా ఈ సుధాకరుడు వారికి మేలుచెయ్యడం మానడు. ఏదో తెలియనితనంవల్ల ఆమె యెడల ఎట్టితప్పిదం చేసినా ఈసుధాకరుడు దానశీలుడనీ దయార్ద్రహృదయుడనీ ఆ సుశీలకూడా ఒప్పుకుతీరాలి. అవును ఎంతో మంచివాడు మా సుధ.

ప్రకాశంగా రవితో, "ఇప్పుణ్నాదగ్గిర అయిదున్నాయి. అందాకా పట్టికెళ్ళు. మిగతా ఇరవై ఇవాళ పదో తారీక్కదూ? ఇవాళే రైల్వేవాళ్ళ జీతాల్రోజు. బాబులు నాకు సొమ్మివ్వాలి. అడిగితెస్తాను. సాయంకాలం రా!" అన్నాడు సుధ. అతనికి రవిని చూసి చిన్నమెత్తు అసూయా ఎక్కువగా జాలీ కలిగేయి. "అయితే, సాయంకాలం నా మాట మర్చిపోకుస్మా? మర్చిపోతే చచ్చిపోతాను!" అంటూ లేచి వెళ్ళిపోబోతున్న రవిని ఆపి,

"రవీ! పెళ్ళిచేసుకున్న గుమాస్తాకి పరమవీరచక్రం ఇవ్వొచ్చు రవీ!"అన్నాడు సుధ.

"మిగతా ఇరవై ఇస్తే నాకు ప్రాణాలిచ్చినట్టే లెక్క." అన్నాడు రవి.

జీతాలరోజేకాని బాబులు ఆఫీసుకి వెళ్ళలేదు. తోడిగుమాస్తాకి తన జీతం పుచ్చుకొనే ఆథరైజేషన్ లెటరిచ్చి సెలవుపెట్టి ఇంటిదగ్గరే ఉండిపోయేడు.

బాబులికి రవీంద్రనాథ్ ఠాకూరంటే ఇష్టం లేదు. ఎంచేతనంటే అతనికి కాబూలీ భయం ఉంది. చెల్లులేని వడ్డీలు చెల్లించి చెల్లించి మరి చెల్లించలేక చేతులెత్తి నిల్చున్న బాబుల్ని కాబూలీవాడు సివిల్ జెయిల్‌కి పంపిద్దామని చూసేడు. నేను ఇచ్చుకోగలిగిన్ని ఇచ్చుట మానివేయడం లేదనిన్నీ, నేను కానీ పాకలకుండా కాలక్షేపం చేస్తున్నవాడిననిన్నీ" బాబులు కోర్టువారికి నిరూపించుకొని జెయిలు తప్పించుకున్నాడు. జీతంలో మిగతా అప్పులవాళ్ళ

కోతలు అప్పటికప్పుడే పోతూనే ఉండడం చేత కాబూలీవాడికి ఆఫీసుగేటు కాయక తప్పిందికాదు. అందుచేత జీతాలరోజుల్లో బాబులు ఆఫీసుకి వెళ్ళడు.

బాబులు ముఖం, అప్పులవాళ్ళెక్కడ కనిపిస్తారో అని కనిపెట్టుకు తప్పించుకు తిరిగే యాభయ్యేళ్ళ ముఖంలా ఉంటుంది. అతనిజుట్టు డెబ్భయ్యేళ్ళదాన్లా ఉంటుంది.

అతనెప్పుడూ తోడేళ్ళకి భయపడే ముసిలి కుందేల్లా కనిపిస్తాడు; గడపదాటి వీధిలో కెప్పుడొచ్చి తిరిగినా, పిల్లిఉన్న ఇంట్లో ఎలక తిరిగినట్టు వారవారలంట తిరుగుతాడు. ఎవరైనా అతన్ని ఇంటికి వెళ్ళి పిలిస్తే అతను వెన్వెంటనే బైటకి రాడు. ఆ వచ్చినవక్తి 'క్రూరజంతువు' కాదని నిర్ధారణయితేగాని తలుపుతియ్యడు. ఇంట్లోవాళ్ళని "బాబులున్నాడా?" అని అడిగితే ఎందుకైనా మంచిదన్చెప్పి వాళ్ళెప్పుడూ "లేరు లేర"నే జవాబు చెప్తారు. ఆఫీసుకివెళ్ళే టైంకి బాకీదార్లు దారికాస్తారని భయపడి అతను టైంకి రెండుగంటల ముందే ఆఫీసుకిపోయి కూర్చుంటాడు. లోనికివెళ్ళేక కాఫీక్కూడా మళ్ళీ బైటకి రాడు. ఆఫీసునుంచి ఇంటికి రాడంలో కూడా అతను ఎంతో చాతుర్యం చూపిస్తాడు. అతను ఒక్కొక్కప్పుడు ఇంటికి వెళ్ళనే వెళ్ళకుండా స్నేహితుల ఇళ్ళదగ్గర ఉండిపోతుంటాడు. అతను కత్తులమీద నడిచేవాళ్ళాగా అప్పుల గెంతేవాళ్ళాగా కనిపిస్తాడు. కొత్తగావచ్చే కుర్రగుమాస్తాలతో అతను "ఒరిజినల్ గుమాస్తాగాణ్ణి నేను; కార్బన్ కాపీగాళ్ళు మీరు." అంటూంటాడు.

బాబులనే జగన్నాధానికి నలభయ్యేళ్ళ వయసులో ఇప్పుడీరోజున, పెళ్ళి కాని చదువులేని ఇరవై రెండేళ్ళ కూతురూ, మెట్రిక్కు పాసవని నౌఖరీదొరకని పెళ్ళి కాని ఇరవయ్యేళ్ళ కూతురూ, చదువు సరిగా అబ్బని పద్దెనిమిదేళ్ళ కొడుకూ, పదకొండోయేటనించీ పెళ్ళికోసం తహతహలాడిపోతున్న పదహారేళ్ళ కూతురూ ఎత్తం కాలు ఎండిపోయిన పన్నెండేళ్ళ కొడుకూ నెత్తిమీది భారంతో బుద్ధిలో పండుముసలై పోయిన పదేళ్ళ కూతురూ ఉన్నారు. బాబులుభార్య తరుచు కనిపించదు. ఆవిడ పొగల్లో ఉంటుంది. ఆవిడ మనిషిలా ఉన్నప్పుడెలా ఉండేదో బాబులికే సరిగ్గా గుర్తులేదు.

బాబులెప్పుడూ దుఃఖానికి నవ్వుపూతలు పూసి భద్రంగా దాచుకోడు. దాన్ని చిరాకుతో అణిచేబోతాడు. కోపంతో చంపేబోతాడు.

సాయంకాలం ఆరుగంటలకి బాబులు ఇంట్లో చిరాగ్గా కూర్చున్నాడు. జీతం ఇంకా రాలేదు. సుధవచ్చి పీకలమీద కూర్చొనే టైమవుతోంది. అతన్ని ఎలా తప్పించుకోడం?

"తప్పించుకోడం అవసరవా?" అని కూడా ఆలోచిస్తున్నాడు బాబులు.

సుధంటే బాబులికి అభిమానవూ, కోపవూ కూడా ఉన్నాయి. తన మూడో కూతురికి సుధంటే మోజుందనీ ఆ పిల్లయెడల సుధకి మోజు లేకపోలేదనీ అతనికి తెలుసు. బీదవాడి కూతుర్ని సుధ పాడుచెయ్యకుండా ఊరుకున్నాడనికూడా అతనికి తెలుసు. ఆ పిల్లంటే సుధకుండే మోజు ఆధారం చేసుకొని, తన్ను అతన్దగ్గర్నించి అప్పులు లాగ్గలిగేడని కూడా తెలుసు. అందుకే బాబులు తనని చూసి తను అసహ్యించుకుంటాడు. ఆ అసహ్యాన్ని కోపంగా మార్చి ఆ కోపాన్ని ఆ కూతురిమీదికి ట్రాన్స్ఫర్ చేసి ఆమె ఏ చిన్న తప్పుచేసినా ఆమెని చితక్కొట్టి చివరకి "నా పాపానికి నన్నెవరు కొడతారు? ఇన్ని పాపాలు చేయించే ఆ దేవుడుగాణ్ణి - వాణ్నెవరు కొడతాడు?" అని పళ్ళు పటపట కొరుక్కుంటాడు.

సాయంకాలం చిరాగ్గా కూర్చున్నాడు బాబులు.

సుధ మంచివాడే. అప్పిచ్చి మళ్ళీ అడిగే మనిషికాడు. కాని ఇవాళ పొద్దున్నే వచ్చి అడిగేడు. కావాలంటే ఓ అయిదు, ఇంకా కావాలంటే ఓ పది కొట్టేసుకునైనా ఇస్తే కాని వీల్లేదన్నాడు. అదీ బాగానే ఉంది. న్యాయంగానే చెప్పేడు. (దీన్ని వాడు పెళ్ళాడేసినా బావుణ్ను.") న్యాయంగా చెప్పినప్పుడు మనం మరోలా ఉండే మనకింక అప్పు పుట్టదు. పోనీ ఇచ్చేద్దాం సొమ్ము. కావాలంటే మళ్ళీ వాణ్నే అడగొచ్చు —


అని నిశ్చయించుకున్నాడు బాబులు.

అంతలో అరుంపావుకి తోడి గుమాస్తా వచ్చేడు.

"నువ్వివ్వమన్న వాళ్ళందరికీ ఇచ్చిసేను. ఇవిగో రశీదులు. మిగిలినవి ఘుప్పుడ్. ఇందులో నా అయిదూ ఇదుగో నా అయిదూ ఇదుగో తీసుకుంటున్నాను. మిగతావి పాతిక. లెక్కెట్టుకో." అంటూ అతను పాతికరూపాయలు బాబులి చేతికిచ్చేడు.

"నీ అయిదుకి నాలుగురోజు లాగలేవా?" అని, రాళ్ళు కరిగించే స్వరంతో అడిగేడు బాబులు.

"ఆగలే నాగలేను" నాల్రోజులు పోయేక ఎక్కణ్ణుంచైనా తెచ్చి మళ్ళీ ఇస్తే ఇవ్వగల్నేమోకాని ఇప్పుడుమాత్రం ఆగలేను" అని గాభరాగా అన్నాడు తోడి గుమాస్తా. కరిగిపోతానేమోననే భయంతో గడగడ వణికిపోయేడతను. ఆ అయిదూ ఇవ్వకుండా ఉండడానికి మర్నాడు యాభై వేలిస్తానని ప్రామిస్ చేసిగలడతను ఆ సమయంలో.



"వారంరోజుల్లోపల ఎప్పుడు సర్దినా సరే; నీ దయ?" అన్నాడు బాబులు. ఆ

తరవాత ఎదర వరసలో కొంత దూరంలో కనిపించే మేకమీదిగది చూపించి "చూశారా బాబూ! సుధాకరం రూంలో లైటు వెలుగుతోంది. ఈ ఇరవయ్యో పట్టుకెళ్ళి నేనిచ్చేనన్చెప్పి వాడికిచ్చేద్దూ." అని తోటి గుమాస్తాకి పనీ బెత్తాయించేడు. తోటి గుమాస్తా వెళ్లేడు.

కాస్సేపటికి తోటిగుమాస్తా సుధాకరంతో మాట్లాడ్డం ఆ మేకగది కిటికీలోంచి కనిపించింది బాబులికి. అంతలో ఆ గదిలోకి, "రవిగాళ్ళా ఉన్నాడు రవిగాడేనా? అఁవాదే" వచ్చేడు. ఆ తరవాత దీపం అపుచేసి ముగ్గురూ అటెక్కడికో వెళ్ళినట్టున్నారు.

చలికాలం. సాయంకాలం ఆరుంపావు దాటి పావుగంటయింది. వీధిదీపాలు వెలిగేవున్నాయి. వీధంతా సందడిగా ఉంది. బాబులింట్లో ఇంకా దీపాలు వెలిగించలేదు. చీకటిగా చిరు చలిగా ఉంది. పెద్దకూతుళ్ళు ముగ్గురూ, పక్కవాటావాళ్ళ వారపత్రికలు చదవడానిక్కాబోలు. వెళ్లేరు. మగపిల్లలింకా ఇంటికి రాలేదు. ఆఖరిదానికి రూపాయిపావలా ఇచ్చి "అరువుకొట్టుకివెళ్ళి రేపన్నీ తెస్తాను. అందాకా రెండు శేర్లు బియ్యం పట్రా తల్లీ" అన్చెప్పి దాన్ని బజారుకి పంపించి గదిలో వాలుకుర్చీలో వాలేడు బాబులు. తీర్చవలసినముఖ్యమైన నెలవారీ అప్పులన్నీ తీరాయి. సుధకి ఇవ్వవల్సినదాంట్లో పది కలిసొచ్చాయిబాబులికి. ఇంకా ఏదో బెంగగా ఉంది. ఏదో ముఖ్యమైన ఘోరవిషయం మర్చిపోయి ఏదో మరిచేఁనన్న సంగతప్ప మరేదీ గుర్తుకి రానివాళ్ళా కూర్చున్నాడతను. ఓసారి ఆఫీసుకికార్డు కాఫీహోటేల్లో మర్చిపోయిన్నాడు ఇలాగే గిజగిజ లాడేడు. సరిగ్గా అర్ధరాత్రి గుర్తుకొచ్చిందా సంగతి అనాదతనికి.

అలా ఆలోచిస్తూ కూర్చునేసరికి అలిసిపోయిన ప్రాణానికి విశ్రాంతికోసం అతని వళ్ళంతా రాత్రి తొమ్మిద్దాకా చిన్న కునుకు తీసింది. తొమ్మిదికి అతని పెద్దకొడుకు "భోజనానికి లే నాన్నా?" అంటూ అతన్ని తట్టి లేపేడు. అంతవరకూ మర్చిపోయిన విషయం కొడుకుని చూడగానే అప్పుడు తటాల్న గుర్తుకిరాగా లబో లబో మంటూ కుర్చీలోంచి లేచేడు బాబులు.

రాత్రి పదయింది. ఆలస్యంగా లేచిన చంద్రుడు పాడుబడ్డ డాబాఇంటి వంటరిగది గుమ్మంలోంచి ఆ గదిలోకి విధిలేక చూస్తున్నాడు. చాకింటి తెల్లచీరెలా కాకుండా మాసిన సైనుపంచెలా జాలిగా 'అసహ్యంగా' ఉంది వెన్నెల. వీధంతా నిర్మానుష్యంగా ఉంది. వీధిలో ఎలక్ట్రిక్ దీపాల బల్బులన్నీ అల్లరిపిల్లలు చితగ్గొట్టగా, ఆ స్తంభాలన్నీ కళ్ళుపోయిన బక్కచిక్కిన పెద్దసైజు ముసలికొంగల్లా కనిపిస్తున్నాయి. రవీ అతనిభార్యా వీధిమెట్టుమీద కాళ్ళు పెట్టుకొని గదిగుమ్మంలో పక్క పక్కల కూర్చొని దగ్గరదగ్గరగా అతినెమ్మదిగా ఏదో మాట్లాడుకొంటున్నారు. అద్దెబాధ తీరినా వాళ్ళల్లో ఇంకేవేవో బాధలు కనిపిస్తున్నాయి.కనిపించకుండా దాగుంటున్నాయి. రాత్రివేళ గుడ్డివెన్నెల్లో చెట్లఆకుల చీకట్లో పాములకి భయపడి లేచిపోయి గూటి అంచున ముడుచుకు కూర్చున్న గువ్వపిట్టల్లా ఉన్నారు వాళ్లు.

అంతలో అక్కడికి చింపిరిజుట్టుతో మాడుముఖంతో ఫిడేల్ డొక్కులాంటి ఛాతీతో బాజాకర్రల్లాంటి కాళ్ళూచేతుల్తో, వదులైన ముసిలిచొక్కాతో పదునెక్కిన పాతపంచెతో రవికి వేలువిడిచిన మేనత్తకొడుకు బాబులనే జగన్నాధం గోలుగోలున వచ్చి, "పెద్దవాడి పరీక్షకి ఫీజు కట్టాలి. పెనాల్టీతో రేపే ఆఖ్రరోజు. కట్టకపోతే ఏడాదివేస్టు. లైఫ్‌లో ఏడాది వేస్టంటే ఎంత ఘోరమో ఆలోచించు, నాయందు దయుంచి ఆ సొమ్ము నాకియ్యి, రేపీపాటికి ఎక్కడైనా తలైనా తాకట్టుపెట్టి- ఇప్పుడు మట్టుకు నువ్వేలాగైనా సర్దాలి!" అంటూ గొల్లున గోలపెట్టి తన గోడుగోడంతా చెప్పుకొని రవి తెచ్చుకున్న సొమ్ము తనకి అప్పిమ్మన్నాడు.

"ఒరే బాబులుబావా! సుధదగ్గిర పట్టుకొచ్చిన పాతిక్కీ ఇవిగో ఇవి మిగిలేయి. నాకో రూపాయుంచి నువ్వో రెండు తీసుకో. కావలిస్తే" అని నెమ్మదిగా చెప్తూ మూడు రూపాయికాగితాలు చూపించేడు రవి.

"తేరా బాబూ తే!" అంటూ ఆ రెండు రూపాయలూ తీసుకొని మిగతా సొమ్ము నీ దగ్గరలేదు సుధగాడిదగ్గరలేదు ఎవడి దగ్గిరాలేదు. ఇప్పుడువెళ్ళి మరింక ఎక్కడ ముష్టెత్తడం, ఎవర్నెత్తికొట్టడం, ఏ గంగలో ఉరకడం?" అంటూ బాబులు చేతులు పిసుక్కున్నాడు, జుట్టుపీక్కున్నాడు, గుండె బాదుకున్నాడు. అయిదు నిమషాలలా ఏడ్చేసిన బాబులు ఎందుకో గాని అకస్మాత్తుగా ఆగిపోయి, కొన్ని క్షణాలపాటు అలా నిశ్చలంగా నిశ్శబ్దంగా ఏదో ఆలోచిస్తూ నిల్చొని ఆ తరవాత రవివైపు తలెత్తిచూసి, "రవీ! ఒక్కమాట!" అన్నాడు.

ఏమిటన్నట్టు చూసేడు రవి, "మనల్ని ఇలా ఉంచినవాడు దేవుడే అయితే వాడు దేవుడుకాడు; మనల్ని ఇలా ఉంచినవాళ్లు మనుషులైతే వాళ్లు మనుషులుకారు. మాకు ఈ చావే చాల్నని మనం ఇలా ఉండిపోతే మనం పశువులం కూడా కాము!" అనీ, ఉడుకులెత్తిన మరుగునీళ్ళు కుంపటిదిగి చెప్పినట్టు చెప్పి వెళిపోయేడు బాబులు.

వీధిలో మకిలివెన్నెల ఆరిపోయిన పాత దీపాల స్మృతిలా ఉంది. వీధంతా పాత పట్నపు పాడుబడ్డ వీధిలా నిర్జనంగా నిస్సహాయంగా ఉంది, అంతటా చలిచలిగా అతి చలిగా ఉంది, భార్యముఖంలోకి చూసేడు రవి, ఆమె ఎందుకోగాని దుఃఖాన్ని అణచుకోబోతూ అణచుకోలేక వెక్కివెక్కి ఏడవడం ప్రారంభించింది. అర్థరాత్రివేళ నట్టడవిలో కటిక చీకట్లో కూరుకుపోయిన ఆడపిల్ల ఆర్తనాదంలా ఆ ఏడుపు అతిభయంకరంగా ఉంది. అమిత దీనంగా ఉంది.

అలా ఏదో ఆలోచిస్తూ ఆలోచిస్తూ కూర్చున్న రవి కొంతసేపయాక లేచి నిలబడి భార్యని లేవనెత్తేడు. మరి కొంతసేపటికి మసకచంద్రుడు పశ్చిమానికి దిగేడు.



ఈనెల అత్యుత్తమ అబద్ధం పోటీ.

మొదటి అత్యుత్తమ అబద్ధం

రూ॥ 100/-

సాంఘిక సంక్షేమ కార్యక్రమాలను అడ్డంపెట్టుకుని మదర్ థెరిసా మత మార్పిడులను ప్రోత్సహిస్తున్నారు —కంచి కామకోటి పీఠాధిపతి జయేంద్రసరస్వతి, (ఈనాడు 3-3-88)

జి. సుభద్ర
మ్యా పాల్వంచ

రెండవ అత్యుత్తమ అబద్ధం

రూ॥ 75/-

"ఆర్.టి.సి. బస్‌లో ప్రయాణం సౌఖ్యం!" —కాకినాడ బస్ కాంప్లెక్స్‌లోని ఒకబోర్డు!

అఖిలాష్
ద్రాక్షారామం

మూడవ అత్యుత్తమ అబద్ధం

రూ॥ 50/-

సొంతఖర్చుతోనే లక్షదీవిలో పర్యటించా —ప్రధాని రాజీవ్ (ఉదయం డైలీ 4-3-88)

బి.వి.వి.యస్.యస్. కుమార్
తణుకు

ఇతర ఉత్తమ అబద్ధాలు

భారతదేశంలోని అన్నిభాషాచిత్రాలు సగటు మనిషికి వినోదాన్ని అందిస్తున్నాయి —దిలీప్‌కుమార్ 'ఆహుతి' చిత్రం శతదినోత్సవ వేడుక సందర్భంలో, (ఆంధ్రజ్యోతి 14-3-1988)

యస్.కె. గౌస్ బాషా
కొత్తపేట

"పచ్చేపీటికి నక్సలైట్లని నిర్మూలిస్తాం" —కోడెల శివప్రసాద్ (ఉదయం 31-3-88)

కె.యస్. మావన్న
తాళ్ళపూడి

"రాష్ట్రాభివృద్ధికి రోజుకు కోటిరూపాయలు" —రాష్ట్ర భారీనీటిపారుదలశాఖ మంత్రి (ఉదయం 24-2-88)

కె.బి. కృష్ణమూర్తి
తాడేపల్లిగూడెం

"నటులు తమ చిత్రాలద్వారా 'దేశసేవ' చేస్తున్నారు" —హిందీనటుడు దిలీప్‌కుమార్ (1-4-88 జ్యోతిచిత్ర)

వి. శ్రీనివాసరావు
భీమవరం

"ఎన్‌టిఆర్‌ని దింపేదాక నేను నిద్రపోను" ద్రోణంరాజు సత్యనారాయణ. (ఆంధ్రప్రభ 29-3-1988)

టి. వెంకటేశ్వరరావు
పెదపాడు

"ముఖ్యమంత్రి మాతో చర్చించే నిర్ణయాలు తీసుకుంటున్నారు" —సంక్షేమ మంత్రి నర్సింహులు, ఎంపి. రాధాకృష్ణ. (31-3-88 ఆంధ్రభూమి)

వీల నాగేశ్వరరావు
అవనిగడ్డ

"ప్రజాశ్రేయస్సే బడ్జట్ లక్ష్యం!" (ఈనాడు 1-3-88)

యమ్. కనకదుర్గ
హైద్రాబాద్

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అత్యంత సంతృప్తికరంగా వుంది. —గవర్నర్ అసెంబ్లీలో.

రవీంద్ర ఫణికాంత్
జగ్గంపేట

రాజకీయాలలో మతప్రమేయాన్ని నివారించే విషయమై "మత పార్టీలను" ప్రభుత్వం నిషేధించాలని ఆలోచిస్తోంది. (రేడియో అండ్ టివి ప్రకటన 7-4-88)

అలమల లక్ష్మి
తెనాలి

ఇంకొక జన్మ అంటూఉంటే హరిజనుడిగా పుట్టాలనుకుంటున్నా —ఎన్.టి. రామారావు. (15-4-1988 ఈనాడు దినపత్రిక)

తోకల నారాయణరావు
మచిలీపట్నం

బ్రహ్మదేవుని మహాసభ

కాళ్ళూరి జోగారావు

యీ సృష్టి పుట్టి యెన్నికోట్ల సంవత్సరాలో, యెన్ని యుగాలో, ఖచ్చితంగా మనకి తెలియదు. ఆ సృష్టికర్త బ్రహ్మకుకూడ ఇలాటి సంశయమే కలిగింది. అందుకనే ఒక ప్రభవనామ సంవత్సర చైత్రశుద్ధ దశమి గురువారం రోజున తను సృష్టించినవాటి నన్నింటిని పరామర్శించ దలిచి, ఫలానా స్థలంలో సాయంత్రం 8 గంటలకు హాజరు కావాలని సమన్లు పంపాడు.

ఆ సమన్లు అందుకుని రాళ్ళు, గుట్టలు మొక్కలు, చెట్లు, పిపీలకాది ఏనుగు పర్యంతం ప్రతి జీవరాసి, తమ తమ జాతికి ఒక్కో ప్రతినిధిగా, ఆ మహాసభకు హాజరు కాబోతున్నారు.

జాతికి వకటి చొప్పున బయలుదేరినా 84 కోట్లకుపైగా సమావేశం కాగల అవకాశం వుంది. అందుకనే గంగానదీ తీరాన ఉత్తరంగా హిమాలయాల పాదం వరకు గల ఒక సువిశాలస్థలం యెన్నుకోబడ్డది.

ఆకాశం నిర్మలంగా, అక్కడక్కడ పూలు పొదుగుకున్నట్టు, చిన్న చిన్నని మబ్బుతునకలతో ముస్తాబైనట్టు హాయిగా వుంది.

ప్రతి ప్రాణికోటి తమ తమ పరిధిల్లో అలంకరించుకుని సమావేశానికి హాజరైంది. యీ సమావేశంలోని విశేషవింత యేమిటంటే, చేరిన సమస్త జీవుల్లో చాలా వాటికి పరస్పరద్వేష, శతృత్వాలు ఉన్నప్పటికీ, యీనాడు తమమధ్యవున్న రాగ ద్వేషాలును, భేధాభిప్రాయాలను, శతృత్వాలను విడనాడి, సౌమ్యంగాను, మితృత్వంగాను సంచరిస్తున్నాయి. క్రూరమృగాలు సాధువులుగాను, విషపూరితాలు అమృత తుల్యులుగాను మారాయి. గోవ్యాఘ్రాలు, పాముకప్పలు, పిల్లియెలుకలు, గ్రద్ద పాములు, నరుడు మృగాలు అన్నీ కలిసికట్టుగా, సభ్యతగా, సౌమ్యంగా, సమావేశ స్థలాన్ని ఆక్రమించి, కుతూహలంగా వున్నాయి.

సమయం 8 గంటలు కావచ్చింది. ఆకాశాన్నుంచి యక్ష, గంధర్వ, కిన్నెర, కింపురుషులు, అష్టాది దేవతలు యీ సమావేశాన్ని తిలకిస్తున్నారు. విష్ణుమహేశ్వర్లుకూడా తమ సతీమణులతో తిలకిస్తుండగా బ్రహ్మ భూమిమీద పాదం మోపాడు. 84కోట్ల జీవులు ఆహ్లాదంతో తమతమ భాషల్లో జేజేలు కొట్టుతూ ధన్యవాదాలు పలుకుతుంటే ఆకాశం దద్దరిల్లింది.


బ్రహ్మ అందరిని ఒకసారి పరామర్శగా చూశాడు.

"పుణ్యజీవుల్లారా! నాయనలారా! యీ భూమిని దానిమీద మిమ్మల్ని సృష్టించి అనంతకాలమైంది. సృష్టి ఆరంభంలోనే మీ అందరికి మీ జీవిత విధాలు నిర్ణయించ బడ్డాయి. యీ ఆదేశానుసారం ఇంతకాలం మీరు మీమీ పరిధుల్లో మీ జీవితాలను సుఖమయంగా గడుపుతున్నారనుకుంటాను. కాని మీకు ఈతిబాధలు వున్నట్టు, వాటిని తీర్చి మీకు సుఖశాంతులు చేకూర్చమని మీ ఇష్ట దేవతలను ప్రార్థిస్తున్నట్టు, ఆ దేవతలు నాకు పదే పదే వర్తమానం అందిస్తూనే వున్నారు, అందుకని యెట్టకేలకు యీ రోజున కొంత వ్యవధి సృష్టించుకొని మిమ్మల్నందరిని పరామర్శించటానికి వచ్చాను. కావున నేను పిలిచిన వారే లేచి తమ యోగక్షేమాలతోపాటు మీ సమస్యలను కూడ విన్నవించుకొనగలరు."

ఇలా పలికి బ్రహ్మదేవుడు మొట్టమొదట మానవుణ్ణి పిలిచాడు. మానవుడు సవినయంగా లేచి చేతులు జోడించుకొని దేముని ఆజ్ఞకొరకు చూస్తున్నాడు అప్పుడు:—

"నాయనా, నేను సృష్టించిన వాటి నన్నిటిలో నీకు అగ్రస్థానం ఇచ్చాను నీవు దానిని యెలా ఉపయోగిస్తున్నావు?" అని అడిగాడు బ్రహ్మ.

"అయ్యా! తమరు నన్ను మిగతా జీవకోటి కంటే జ్ఞానిగాను, ఉత్తమంగాను సృష్టించి, నాకు మెదడును ఇచ్చి, దానిని ఉపయోగించి అభివృద్ధి చెందవలసిందిగా శలవిచ్చారు. తమ ఆజ్ఞాను



సారం, దిగంబరంగా, లజ్జావిహీనంగా ఆరంభించిన జీవితాన్ని, బుద్ధినుపయోగించి, క్రమేపీ అభివృద్ధి చెందుతూ నేటికి వస్త్రధారణా స్థితికివచ్చాను. లజ్జావిహీనత స్వార్థపరతనుంచి సామాజిక సౌభ్రాతృత్వాన్ని అలవరచుకున్నాను. మాంసా, కందమూలఫలభక్షం నుంచి, రకరకాల పక్వాన్నాలు తిన నారంభించాను. మూగ సౌంజ్ఞలు, నిరర్థక పలుకుల నుంచి బయట పడేందుకు వాటికి వక అక్షర రూపం ఇచ్చి, అభివృద్ధి పరిచి నానా రకాల శాస్త్రాలను సృష్టించుకొన్నాను. వాటి ఆధారంగా సృష్టిలో మరుగున పడిన రహస్యాలను వెతికి, శోధించి బైటికి తెచ్చాను, నిరుపయోగంగా కన బడే ప్రతి జడ పదార్థాన్ని సహితం ఉపయోగంలోకి తేచ్చాను. చాలా మటుకు అడవి జీవాలను సంస్కరించి మానవ జీవితానికి ఉపయోగిస్తున్నాను. ఇలా తమరు సృష్టించిన ఇంచుమించు అన్నిటి ఉపయోగం తెలుసుకోగలుతున్నాను. సముద్రాలు, నదులు, పర్వతాలు ఇత్యాదివి వాటి పరిధులు దాటకుండా నివారించ గలుగుతున్నాను. సైన్సు అనే విజ్ఞాన శాస్త్రం కనిపెట్టి, దాని ఆధారంగా వన్య మృగాలను ఒక క్రమ బద్ధంతో ఉపయోగించుకో గలుగుతున్నాను. ఇదే సైన్సుతో, కానరాని వాటిని చూడటం, వినపడని విషయాలను వినటం తెలుసుకోగలుగుతున్నాను. మాకు రెక్కలు లేకున్నా గాలిలో పక్షుల్లా వంటరిగాగాక, నా వెంట వందలమందిని సహితం వెంట బెట్టుకొని యెక్కడికంటే అక్కడికి, యెంతదూరమైనా ప్రయాసం లేకుండా యెగురు వేసుకుని పోగల విమానాలని 'సృష్టించాను. ఇలానే జలచరాల్లా వాటి వలే ఏకాకిగా గాక వేలమందినైనా వకే సమయంలో నా వెంట తీసుకొని రేయింబవళ్ళు సముద్రయానం చేయగల ఓడలను సృష్టించాను. భూగర్భ రహస్యాలను శోధించగలుగుతున్నాను. యెండా వానలను కూడా మదింపుచేసి అవసరాన్నిబట్టి ఉపయోగించ గలుగుతున్నాను. నక్షత్రాంతరంలో ఉన్న ఇతర గ్రహాల ఉనికిని కనిపెట్టగలందులకు కృత్రిమ ఉపగ్రహాలను సృష్టించాను రేడియోలు, టెలిఫోన్లు, టివిలు సృషించి మాలో వకనికి తెలిసిన విద్యను ఈ ప్రపంచంలోని ప్రతి మారుమూల నివసిస్తున్న వారికి తెలియచేయగలుగుతున్నాను. సౌర శక్తినించి విద్యుత్ శక్తిని సృష్టించి చిత్రవిచిత్ర పనులు చేయించ గలుగుతున్నాను కాని ....'' అని ఆగాడు.

''నాయనా ఓడియపడకు. నీ అభివృద్ధి చూడముచ్చటగావుంది. నీ ఇబ్బందులేవైనావుంటే చెప్పు'' అన్నాడు బ్రహ్మ. అప్పుడు మానవుడు ''అయ్యా! మమ్మల్ని సృష్టించినందుకు తమరే మాకు తల్లీ, తండ్రీ. మా ఇబ్బందులు తమతోగాక మరెవరికి చెప్పుకోవాలి? అందుకే మనవి చేస్తున్నాను'' అని మళ్ళీ కొంచెం ఆగి... మా యీ అభివృద్ధిని, మిగతా సృష్టి అంతాచూచి గర్వపడి, ఆనందంతో సహకరించేబదులు, ఓర్వలేక ఈర్ష్యాసూయలతో అడుగడుగునా మా శ్రమ ప్రయాసాలకు అడ్డుపడుటే కాకుండా, నాశనం చేస్తోంది. ఉదాహరణకు మా వ్యవసాయపు రంగంలో మేము సాధించిన పురోగతిని మెచ్చుకొని తోడ్పడేబదులు వరుణదేవుడు తన సామాన్య గతులుతప్పి, యెక్కువో, తక్కువో నడుస్తున్నాడు. తమరు అతనికి పెట్టిన నియమాలను, కాలాలను మేము సృష్టిలో వుంచుకొని, తదనుకూలంగా వ్యవసాయ రంగంలో ముందంజ వేస్తుంటే, పెనుతుఫాన్ల రూపేణా, అనావృష్టి, కరువుల రూపేణా మా కార్యక్రమాలకు నిరంతరం ఆటంకాలు అవాంతరాలు సృష్టించి మమ్మల్ని నష్టకష్టాలపాలు చేస్తున్నాడు. క్రిమి కీటకాదులుకూడ, ఎన్ని విషప్రయోగాలు చేసినా, ఆగక మా పంటలన్నింటిని సర్వనాశనం చేస్తున్నాయి. భూమాత కూడ పక్షపాతం చూపిస్తున్నది. యెన్నిరకాల యెరువులు వేసినా, వాటిని మేము వేసిన పైర్లకు అందించిన పోషణ ఇవ్వక, పైర్లను నాశనంచేసే కలుపు మొక్కలకు అందించి, మాకు పంటలుపండకుండా చేస్తోంది. ఇది పక్షపాతం కాదా?

భూగర్భంలో నిరుపయోగంగా పడివున్న రాళ్ళను, ధాతువులను వెలికితీసి వాటికున్న అసలు విలువలను, వాటి ఉపయోగాలను తెలియజేసి వాటికి అమిత గౌరవం సంపాదించిపెడితే, అవి మాకు శత్రువులై దొరక్కుండా పోతున్నాయి. భూగర్భంలో మైళ్ళలోతులోనున్న కిరసనాయిలు, పెట్రోలు, బొగ్గు, మణిమాణిక్యాలన్ను అతి వ్యయప్రయాసలతో బైటికితీసి, వాటి ఉపయోగాలను చాటిచెప్పి, వాటి బ్రతుకులకు విలువలుకట్టి, అవి లేనప్పుడు మానవుని బ్రతుకే మనజాలదు అన్నంత ప్రాముఖ్యత ఇచ్చినప్పటికీ, అవి మా కృషికి తోడ్పడి, వాటింతటవే సులభంగా లభ్యమయ్యే బదులు, యెందుకోగాని తరిగిపోతున్నాయి. ఇలా వకదేమిటి మహాప్రభో! సృష్టిసాంతం మానవుల కృషికి సంపూర్ణ సహకారాలందించి యీ పృథ్విని దివ్యస్వర్గం చేసే బదులు, అన్నీ ప్రతీకారం పూనినట్టు కనిపిస్తోంది. తమరే మాయీదీనస్థితిని చూచి వాటిని, మాకు సహకరించ వలసిందిగా ఆజ్ఞాపించండి ప్రభో!'' అని సవినయంగా నమస్కరించి కూర్చున్నాడు.

తరువాత బ్రహ్మ వనమూలికలు, వృక్ష జాతిని పలకరించాడు.


''అయ్యా! తమరు మా జాతిని యెన్నో రకాలుగా సృష్టించారు. గడ్డి మొదలుకొని మహా వృక్షంవరకు వక జాతిగాను. సన్న తీగ మొదలుకొని యా





దాల తీగపరకున్నూ. నీళ్ళల్లో నాచు ఇత్యాది రూపాల్లో మమ్మ సృష్టించారు. అదీగాక మాలో కొన్నిటిని ఫలవృక్షాలు తీగలుగాను. కొన్నిటిని కేవలం పూలు పూచేందుకుగాను, మరికొన్నిటిని కేవలం నీడ గాలినిచ్చేట్టుగాను సృష్టించారు. మాకు ఔషధశక్తినిచ్చి, వ్యాధిగ్రస్తులకు ఉపయోగ పడుతున్నాము. మేము తమ ఆజ్ఞానుసారం అలానే చేస్తున్నాం. కాని ఈ మానవుడు మా జాతిమీద చాలా దురాక్రమణ చేస్తున్నాడు. ఔషధాలుగా పెరిగేందుకు అనువైన భూమినిదున్ని తనకిష్టమొచ్చిన పైర్లు వేసుకుంటున్నాడు. అవి కూడ మా జాతివే అని సహిస్తున్నాం. కాని మిగతా జీవరాసుల్ని వాటిని ముట్టనివ్వడు. యెప్పుడైతే మాకని కేటాయించిన భూమిని మానవుడు తన స్వార్థం కొరకు తీసుకున్నాడో, మిగతా జీవాలకు ఆహారం కొరత యేర్పడ్డది. అవి తమ ఆకలిబాధను తీర్చుకోదలిచినా, తన భూమిలో అడుగు పెట్టనివ్వడు. నిర్దాక్షిణ్యంగా వాటిని సంహరించటమో, నిర్మూలించటమో చేస్తాడు. అయినా అతని ఈ దారుణాన్ని సహించి మేమే మా అడవుల్లో వాటికి అవసరమైనంత ఆహారాన్ని సృష్టింపచేస్తున్నాం. ఇంతటితో తృప్తిపడక మానవుడు తన పరిధుల్ని దాటి మా వన్య పరిధిలోనికివచ్చి, మమ్మల్నందరిని పాపభీతిలేకుండా నరకివేస్తున్నాడు. అంతటితో వూరుకొనక తను సృష్టించుకున్న రంపాలు, వులులు, బాడిసెలు, బర్మాలు ఇత్యాది అనేకవాటితో మమ్మల్ని ముక్కలు ముక్కలుగా నరికి భేదించి అతనికి ఉపయోగపడేలా అమర్చుకుంటున్నాడు. గుట్టల్లో గుహలున్నాయి. నీడనిచ్చేందుకు మేమున్నాం. ఇవేమీ అతనికి పనికిరావట. గుహలు, మేమిచ్చే కందమూల ఫలాలమీద ఇంకా ఆధారపడే తన మానవజాతిని చూచి ఆటవికులని, అనాగరికులని పరిహసించి, తనే నిర్మించుకున్న ఇళ్ళకొరకు మమ్మల్ని ఉపయోగించుకుంటున్నాడు. అయినా ఓర్పుతో వున్నాం. మానవునియొక్క ఈ అకృత్యాలను అతని తెలివితక్కువ పనులుగా భావించి, అతనిని క్షమించి అలవాటు ప్రకారం పూలుపూచి, కాయలు కాచి, ఇంకా అందిస్తూనేఉన్నాం. కాని మళ్ళీ ఇతడు పూలు కోసుకోటం కాకుండా మా కొమ్మలను, చిగుళ్ళను త్రుంచుతాడు. మాకు యెంతబాధ కలుగుతుందో పట్టించుకోడు. పరాకతో మా సంతతిని అభివృద్ధి కానివ్వకుండా పక్కటి మిగలకుండా కోసేసుకుంటాడు. పారేస్తాడు. ఇలా మాలో కాలాభాగం ఇప్పటికే వంశనాశనమైనాయి. ఈ మానవుణ్ణి ప్రతిబంధం చేయకపోతే అతని అత్యాచారంతో మా వంశాలు నిర్మూలం అవుతాయి. అనవసరంగా మమ్మల్ని హింసించవద్దని ఆజ్ఞాపించండి ప్రభో."

తల పంకించి తరువాత పక్షిజాతిని ఉద్దేశించి ప్రశ్నించాడు బ్రహ్మ.



పక్షిజాతికి ప్రతినిధిగా చిలుక చెప్పనారంభించింది.

"అయ్యా! సాధారణంగా మా జాతి వాయుగమనంతో వుంటుంది. క్రింద భూమి మీదికొచ్చినా వృక్షాలమీద నివసిస్తుంది. మాలోని వక తెగ నీటి ఆధారంగా జీవిస్తుంది. మా ఆహారం క్రిమికీటాదులు మొదలుకొని అడివి జీవరాసులు. సర్పాల వరకున్నూ. చెట్టు పూలలోని మధువు మొదలుకొని ఫలాల వరకు వుంటుంది. యెన్నడు మానవుని జోలికిపోము. అతనికి యెన్నడు హాని తలపెట్టలేదు. అటువంటి మమ్మ అతడు బంధించి. తన ఆనందంకొరకు పంజరాల్లో బంధిస్తాడు. మాకు దాంపత్య విరహబాధను కలిగిస్తాడు. శిక్షణ అన్న నెపంతో మమ్మల్ని హింసిస్తాడు. అహింసాత్మక చర్యలకు భయపడి అణిగి మణిగి వుంటాం. అయితే మాలోమాకు పందాలనిపెట్టి, మమ్మల్ని పురియెక్కించి కొట్లాడిస్తాడు ఆనందిస్తాడు. యీ పందాలతో మాకు మారణాయుధాలు కట్టుతాడు. తత్కారణంగా మాలో ఒకరు చస్తారు. ఇంకొకరు గాయపడుతారు. అప్పుడు చచ్చినదానిని వండుకొని తింటాడు. మా గాయాలకు నామమాత్రం చికిత్స చేస్తాడు. వెంటనే నయం కాకుంటే బలవంతాన మళ్ళీ మమ్మల్ని కూడ చంపి తినేస్తాడు. అతని ఆనందంకొరకు మా ప్రాణాలను బలికొన్నా, మా జాతిమీద యే ప్రత్యేకత చూపడు. ఒక జీవికి ఆహారంగానైనా మా బ్రతుకులు వుపయోగపడుతున్నాయని, సహిస్తున్నాం ప్రభో!" అంది పక్షి.

ఇది విన్న తరువాత బ్రహ్మ దృష్టి చతుష్పాదుల మీదికి పోయింది. వాటి ప్రతినిధిని అడుగుదామంటే వేటికవే ప్రత్యేకంగా తమ కష్టాలను చెప్పుకోదలిచాయి.

ఇది విన్నతరువాత బ్రహ్మ దృష్టి చతుష్పాదులమీదికి పోయింది. వాటి ప్రతినిధిని అడుగుదామంటే వేదికవే ప్రత్యేకంగా తమ కష్టాలను చెప్పుకోదలిచాయి. అందుకని బ్రహ్మ మొదట గోమాతనుద్దేశించి ప్రశ్నించాడు.

"మమ్మల్ని మానవుడు పట్టుకొని ఆశలుజూపి, మెల్లగా దువ్వి తమ నివాసగృహాలకు తెచ్చుకున్నాడు. క్రమేపీ అతని స్వార్థచింత, దురాగతాలు తెలియవచ్చాయి. మేము ఈనిన తరువాత మా మురుగుపాలను సహితం మా సంతానాన్ని తాగనివ్వడు. తనే పితుక్కొని త్రాగేస్తాడు, ఒక్కనాడుకూడా మా సంతతికి కడుపునిండా, తృప్తిగా పాలు ఇవ్వనివ్వడు. ఉదయం, సాయంత్రం మా దూడలను వదులుతాడు. అవి మా పాలపొదుగులను చేపుతే మాకు పాలు చేపుకువస్తే, వెంటనే మా కళ్ళముందే ఆ పసికందులను విలవిలలాడుతున్నా, లాగి దూరాన కట్టేసి మా పాలన్నీ అతడే పిండుకుంటాడు. మేము మా పిల్లలకొరకు దాచుకుందామని దొంగచేపితే, పాలు కార్చేవరకు మమ్మల్ని కర్రలతో కొడతాడు. మా పసికందులు అతను పితుక్కోగా మిగిలిన వాటినె చాలీచాలకున్నా త్రాగి, ఆకుఅలములు తినుకుంటూ పెద్దగవుతాయి. గర్భం ధరిస్తాం. ఒకవేళ అవి మగవైతే వాటి అగచాట్లు, బాధలకు అంతువుండదు. మెడమీద కాడిపెట్టి నిర్దాక్షిణ్యంగా, భూమిని దున్నిస్తాడు. బండికి కడుతాడు. ఆ బండపై మేము మోయలేనంత బరువులు వేస్తాడు. బండిని లాగమంటాడు. లాగలేకపోతే తోలు వూడేట్టు కొడతాడు. చచ్చినా అతనికి ఖరవాలేదు. మేము లాగవలసిందే. మరొకరు సవారీబండ్లు చేయించుకొని, దానినిండా జనాన్నెక్కించుకొని, తను ముందర కూర్చొని యెంత దూరమైనా పరుగెత్తుకుంటూ ఆ బండిని లాగమంటాడు. పురికి పురికి అలిసి దారి మధ్యలో చచ్చినా ఖరవాలేదు. చచ్చినదాన్ని వదిలి ఇంకోదానిని తెచ్చికట్టి లాగిస్తాడు.

బ్రహ్మ యీ గోరు లేని శాఖాహార జంతు జాలంమీద జరుగుతున్న అత్యాచారాన్ని విని చలించనట్టయినట్టు కనపడ్డాడు. అయినా యేమీ అనక అడవి క్రూరమృగాలనుద్దేశించి "మీ ఈతిబాధల్ని విన్నవించుకోండి" అని చెప్పాడు. క్రూరమృగాలకు ప్రతినిధిగా సింహం చెప్పనారంభించింది.

సింహం:- అయ్యా! అడవిలో చతుష్పాదక్రూర మృగాల ప్రతినిధిగా సవినయంగా మనవి చేయనేమనగా. అనాదినుంచి మమ్ము శాఖాహార మృగాలను భక్షించి జీవించమని శలవిచ్చినందున ఇంత వరకు అలానే బ్రతుకుతున్నాం. మాకు ఆహారమైన మృగాలను మానవుడు నశింపుజేస్తున్న కారణంగా మాకు ఆహార కొరత యేర్పడ్డది. అందుకని మాదృష్టి పక్షిజాతి మీదకు మరలింది. కాని అవి కూడ మానవుని దురాశయాలకు భీతిచెంది తమ జన్మభూములు, తమ నివేశ స్థలాలను వదిలి విదేశాలకో, దేశ దిమ్మరిగానో వెళ్ళిపోతున్నాయి. అందుకని అవి కూడ మాకు లభ్యంకాని కారణంగా మాజాతి పస్తులతో జీవిస్తున్నది. ఇలా ఎన్నాళ్ళని వుండగలుగుతాం గత్యంతరం లేక మానవుల నివాస స్థలాలకు వెళ్ళి, వారు సాదుకునే జంతువుల్ని భక్షించక తప్పటం లేదు ప్రభో! కాని యీ సదర మానవునికి, తను మాపై చేసిన దురాక్రమణ పాప ఫలితం అని తెలియక, మమ్ములనే దోషులుగా నిరూపించుకొని, మామీద దండెత్తి మమ్ములను హతమారుస్తున్నాడు. అదీగాక మానవుడు తన ఆనందం కొరకు, ఆహ్లాదం కొరకు మమ్మల్ని పట్టుకొని, బోనుల్లో పెట్టి నిర్బంధిస్తున్నాడు. శిక్షణాశాలల్లో పెట్టి నానా రకాల చిత్ర విచిత్ర బంధాలల్లో శాసిస్తూ తను ఇంపైన పనులను మాచే చేయించి సర్కసుల్లో ధనార్జన చేస్తున్నాడు. అడివికి చక్రవర్తినైన నన్నుగాని రాజు అయిన పెద్దపులినిగాని, మంత్రి అయిన యెలుగు బంటుగాని వదలడు. మమ్మల్నందరిని నీచంగా చూస్తాడు. అదీగాక మా చర్మాలకు ఏవో విలువ కట్టి, వాటిని సమకూర్చుకునేందుకు కూడ నిర్దాక్షిణ్యంగా మమ్మల్ని చంపేస్తున్నాడు ప్రభో.

బ్రహ్మదేవుని మొఖంమీద జాలి వుట్టిపడేట్టు కనపడుతున్నది. బ్రహ్మ మానవుణ్ణి ఉద్దేశించి.

"నీవు అన్నీ విన్నావు. నీ సమాధానం ఏముంది" అని ప్రశ్నించాడు.

మానవుడు లేచి బ్రహ్మకు నమస్కరించి "అయ్యా! తెలిసో తెలియకనో మావలన ఇతర ప్రాణకోటికి జరిగే ఈతిబాధలను, ఇప్పుడు తెలుసుకోగలిగాను. నేను చెప్పవలసిన సంజాయిషీ యేమీలేదు. మా అకృత్యాలకు సిగ్గుపడుతున్నాను" అని తల వంచుకున్నాడు.

బ్రహ్మదేవుడు యీ సభ ఇంతటితో పరిసమాప్తం. మళ్ళీ యీ తడవ కలుసుకున్నప్పుడు ఇంకేమైనా వుంటే చర్చిద్దాం. అని లేచి అందరినీ "సుఖీభవ" అని దీవించి సభాస్థలంనుంచి మాయమైనాడు.



జరిగిన కథ:—

రుద్రయ్య ఇబ్రహీంఖాన్ దగ్గర పని చేస్తుంటాడు. ఓ రోజు భూమి తవ్వుతున్న ప్పుడు ఓ చోట ధనరాసులున్నట్లు అనుమానం కలుగుతుంది. రుద్రయ్య హైద్రాబాద్‌లో ఓ చోట ఖాన్‌చేత పొలం కొనిపించి, దాన్నే మళ్ళా ఎక్కువ ధరకు అమ్మేస్తాడు. రుద్రయ్యను ఖాన్ చావగొడతాడు. హాస్పిటల్లో అతనిమీద జరిగిన హత్యాప్రయత్నాన్ని. తెలివిగా తప్పించు కొంటాడు రుద్రయ్య.

అమోలక్‌సింగ్, అతని సెక్రటరీ తేజశ్వికి రుద్రయ్యపై కోపంగా ఉంటుంది. ఖాన్‌నెలాగైనా దెబ్బ కొట్టాలని రీటాతో చేతులు కలుపుతాడు రుద్రయ్య.

రుద్రయ్య రీటా నగలమ్మి ఆ డబ్బుతో కొంతమంది రాజకీయ నాయకులను కొని ఖాన్‌పై ఎంక్వైరీ కమిషన్ ఏర్పాటు చేయిస్తాడు. తేజశ్వినితన సెక్రటరీగా చేర మని కోరతాడు.

కేంద్రమంత్రి కొండలరావుకి తన కిరాయి అనుచరులతో ఘనంగా స్వాగత మిస్తాడు ఏర్‌పోర్ట్‌లో. రుద్రయ్య పట్టభద్రుడై, నిరుద్యోగిగా ఉన్న విక్కీని తనతో చేర్చుకుంటాడు.

—ఇకచదవండి

సూర్యదేవర రామ్మోహనరావు



రుద్రయ్య ముందిప్పుడు పదికిలో మీటర్ దగ్గరున్న పొలాల మేప్ ఉంది. దాన్నే పరిశీలనగా చూస్తూ ఆలో చిస్తున్నాడు అతని గది బయట ఓ యాభై మంది గూండాలు సివిలియన్స్‌లా సిపాయిల్లా నించుని ఉన్నారు,

అంతలో అక్కడకు విక్కీ వచ్చేశాడు. వస్తూనే హడావిడిగా రుద్రయ్య గదిలోకి దూసుకుపోయాడు.

"మంత్రి శ్రీలలిత ఈ రోజు సాయంత్రం నాలుగు గంటలకు ఒక వుమెన్ కల్చరల్ ఆర్గనైజేషన్ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా వెళ్తున్నారు ..."

రుద్రయ్య విక్కీకేసి ప్రశంసాపూర్వకంగా చూస్తూ "శెభాష్ .... అయితే రెండొందలమందిని అరేంజ్ చేయ్..." అంటూ జేబులోంచి రెండువేలు తీసిచ్చాడు.

"సరిగ్గా నాలుగు గంటలకు ఆమె తిలక్ ఆడిటోరియమ్ముందు కారు దిగుతుంది ... ఆమెకు పూర్ణకుంభంతో ఆహ్వానం పలుకుతారు. ఆమె వెనుక ఇద్దరు గన్‌మెన్‌లు, ఒక సెక్రెటరీమాత్రమే ఉంటారు..." విక్కీ చెప్పుకుపోతున్నాడు.

రుద్రయ్య తనముందున్న మేప్‌కేసేచూస్తూ విక్కీ చెప్పేది శ్రద్ధగా వింటున్నాడు.

సరిగ్గా పావుగంటకు ఏమేంచేయాల్సింది పూర్తిగా చెప్పేసాడు రుద్రయ్య. విక్కీ తలూపి బయటకు నడిచాడు.

రుద్రయ్య బెల్‌కొట్టి బయట నించున్న ఒక చోటా లీడర్‌ని లోపలకు పిలిపించాడు.

"ఇప్పుడు నువ్వు జనాల్ని తీసుకొని కేంద్రమంత్రి కొండలరావు ఇంటికి వెళ్ళాలి. ఆయనకో విజ్ఞాపన పత్రాన్ని అందించి నేను చెప్పిన స్లోగన్స్ వదలాలి ... అర్థమయిందా ? సరిగ్గా ఆ సమయానికి పేపర్‌వాళ్ళు ఒకరిద్దరు అక్కడకు వచ్చేలా చేస్తాను. స్టోర్‌రూమ్‌లో మీరు ప్రదర్శించాల్సిన బోర్డ్స్ ఉన్నాయ్. పొరపాటు వచ్చిందో ప్రాణాలు తీస్తాను..." రుద్రయ్య మాటలింకా పూర్తికాలేదు...

"అన్నయ్యా ..." అనుకుంటూ పదహారేళ్ళ రుద్రయ్య చెల్లెలు అమ్మాజి లోపలకు వచ్చింది.

"ఏంటమ్మా ... ఏంకావాలి ?" చెల్లెల్ని దగ్గరకు తీసుకొని, ఆప్యాయంగా ఆమె తల నిమురుతూ అడిగాడు.

ఇప్పుడతని కళ్ళలో కాఠిన్యం లేదు. మొఖంపై సీరియస్‌నెస్‌లేదు.

"మా కాలేజీలో అందరూ కాశ్మీర్ వెళ్తున్నారు. నేనుకూడా వెళ్ళనా ? తాతయ్యేమో వద్దంటున్నాడు.


"తాతయ్యకు భయమూ, చాదస్తమూ – నువ్వెళ్ళుతల్లి. ఎంతకావాలి ?"

ఆమె అడిగితే సప్తసముద్రాల అవల ఉండే చిలక ప్రాణం కావాలన్నా తెచ్చిచ్చేవాడిలా ఉన్నాడు రుద్రయ్య.

"వెయ్యిరూపాయలు" అంది అమ్మాజి రుద్రయ్య జుట్టును కెలికిపడేస్తూ.

"అలాగేతల్లీ !" అంటూ రెండువేలు తీసిచ్చాడు రుద్రయ్య జేబులోంచి.

అమ్మాజి అమాయకంగా రుద్రయ్య నుదుటమీద ముద్దుపెట్టుకొని బయటకు



పరుగుతీసింది ఆనందంగా.

"మేమిక బయలుదేరమా ?" ఛోటాలీడర్ రుద్రయ్యను అడిగాడు.

అతనికి మరికొంత డబ్బిచ్చేసి వెళ్ళిరమ్మన్నట్టుగా తలూపాడు.

* * * *

అసమర్థుడైన మంచివాడికన్నా, సమర్థుడైన చెడ్డవాడే నయమా ?

అసమర్థుడైన మంచివాడ్ని సమర్థుడ్ని చేయటం ఎంత కష్టమో సమర్థుడైన చెడ్డవాణ్ణి మంచివాణ్ణి చేయటమూ అంతేకష్టం.

తనకు తెలీకుండానే తను రుద్రయ్య సెక్రటరీగా చేరటానికి ఇష్టపడుతోందా ? చదువులేని నిరక్షరాస్యుడి దగ్గర పెద్దపెద్ద చదువులు చదివి పనిచేయటం అవమానం కాదుగదా ? తను పొరపాటున నోరు జారిందా ? అని ఒక్కక్షణమే సందేహపడి తిరిగి అంతలోనే తనను తాను సమర్థించుకుంది. ఒకసారి రేటుపెరిగి, తిరిగి అది మోసమని తగ్గిపోయాక మరలా పెరగటం అసాధ్యం.

ఒకవేళ నిజంగానే ఆ అసాధ్యాన్ని సుసాధ్యంచేయగలిగితే అతను చదువుకోక పోయినా తనకన్న తెలివికలవాడే అవుతాడు. అప్పుడతని దగ్గర సెక్రటరీగా చేరినా తప్పులేదు.

తేజశ్వి తన ఆఫీస్ రూమ్‌లో కూర్చుని ఆలోచిస్తోంది.

* * * *

ఒకప్పుడు ఖాళీ స్థలాల చీకటి ప్రపంచానికి రారాజులా బ్రతికిన ఖాన్‌కి ఇప్పుడు తప్పని సరిగా ప్రతిరోజు ఎంక్వైరీ కమీషన్ ముందు హాజరు కాక తప్పటం లేదు,

దాంతో రెగ్యులర్‌గా రీటా ఇంటికి రాలేక పోతున్నాడు.

రీటాకి విషయాలన్నీ క్షణంగా తెల్సిపోయాయి.

తన నగలు రుద్రయ్య చేతిలో డబ్బుగా రూపాంతరం చెంది ఖాన్‌కి ఉచ్చుగా మారబోతున్నాయని, రుద్రయ్యను రియల్ ఎస్టేట్ బిజినెస్‌కి ఎంపరర్‌ని చేయ బోతున్నాయని ఆమె గ్రహించింది.

త్వరలోనే తనకు ఖాన్ చెఱ నుంచి విముక్తి లభించబోతోందని ఆమెకు ఆనందంగా ఉంది,

ఖాన్‌కి వాళ్ళ తాత నుండి లభించిన అపూర్వమైన నిజాం వంశపు కళాత్మక వస్తువులు కొన్ని ఆ బిల్డింగ్‌లో చాలా కాలంగా ఉంటున్నాయి.

అందులో పాలరాతి విగ్రహాలు, పర్షియన్ కార్పెట్స్, ఏనుగు దంతంతో చేసిన బొమ్మలు' శిల్పాలు, బంగారపు పూతతో బిగించిన ఫ్రేమ్‌లో మెరిసిపోయే లక్షలాది రూపాయలు ఖరీదు చేసే మొనాలిసా పెయింటింగ్, అతి ఖరీదైన వజ్రాలు పొదిగిన ఆరవ నిజాం చిన్నప్పటి సింహాసనం ... అలాంటివి ఎన్నో ఖాన్ తాత అప్పట్లో కొట్టేసిన అపూర్వ కళా సంపదపై ఇప్పుడు రీటా కన్ను పడింది.

వాటిని ఒక్కొక్కటిగా ఆ భవనం నుంచి దాటించి రుద్రయ్యకు అందజేసి అతని వ్యాపారంలో వాటా కలవాలనే నిర్ణయాన్ని కొచ్చేసింది.

ఆ రాత్రికే ఆమె ఆ ఆపరేషన్‌ని ప్రారంభించాలని నిర్ణయించుకొంది.

ఆ వ్యవహారాన్ని ఖాన్ పసిగడితే కత్తికో కండ క్రింద తనను నరికి పోగే స్తాడు.

పోలీసుల దృష్టిలో పడితే నిజాం వంశస్థులకు, ప్రభుత్వానికి మధ్య నడు స్తున్న వివాదంలో, భాగమైన ఆ నిజాం కళా సంపదను సీల్ చేసి తనను అరెస్ట్ చేస్తారు.

చాలా జాగ్రత్తగా ఆపని జరిగిపోవాలి. ఆమె ప్రస్తుతం ఆ వస్తువుల పరి మాణాన్ని, బరువును అంచనా వేస్తోంది.

* * * *

సరీగ్గా 9.30 గంటలకు కేంద్రమంత్రి కొండలరావు ఇంటిముందు ఓ వంద మంది చేతుల్లో బోర్డ్సుతో ప్రత్యక్షమైపోయారు.


"రంగారెడ్డిజిల్లా అన్యాయమైపోయింది-వెనుకబడిపోయింది. అదుకొనే దిక్కు లేదా ? మా జిల్లాకు పరిశ్రమలు కావాలి .... కేంద్రమంత్రి జిందాబాద్ ...."

ఒక్కసారి స్లోగన్స్ పెటిల్లుమన్నాయి.

అప్పుడే బయటకు వెళ్ళేందుకు ఉద్యుక్తుడవుతున్న మంత్రి కొండలరావుగారు ఆశ్చర్యపోతూ బయటకొచ్చి చూసారు.

పరిస్థితిని అంచనా వేసారు.

సరీగ్గా అప్పుడే అక్కడ రుద్రయ్య బుల్లెట్ ఆగింది.



ఎంతోకాలంగా ఆ ఇంటితో, ఆ ఇంటి యజమానితో పరిచయం ఉన్నవాడిలా చనువుగా ఆ ఇంటి గేట్‌దగ్గరకు వచ్చి అక్కడ గుమిగూడిన జనాన్ని ఉద్దేశించి "మీ సమస్యను మంత్రిగారికి మనవి చేస్తాను .... సావధానంగా ఉండండి. మంత్రిగారు చాలా మంచివారు, మీకు న్యాయం జరిగేలా చూస్తారు" అని పెద్దగా అంటూ గేట్ తీసుకొని లోపలకు వెళ్ళిపోయాడు రుద్రయ్య.

మంత్రిగారు రుద్రయ్యను చూస్తూనే చిరునవ్వుతో ఎదురువచ్చి "రండి ... రండి..." అన్నాడు ఎయిర్‌పోర్ట్‌లో తనకు లభించిన ఘనస్వాగతాన్ని జ్ఞప్తికి తెచ్చు కుంటూ.

రుద్రయ్య మంత్రిగార్కి నమస్కరించి "మీతో ఓవిషయం మాట్లాడి రమ్మని...." ఒకింత సందేహిస్తున్నట్లుగా ఆగిపోయాడు రుద్రయ్య.

మంత్రిగారు ఏదో అర్థమయినట్లుగా మర్మగర్భంగా తలాడిస్తూ పర్సనల్ రూమ్‌లోకి తీసుకెళ్ళాడు రుద్రయ్యను.

"ఇప్పుడు చెప్పండి ... ఏమిటి విషయం ?" అన్నాడు మంత్రి శ్రీలలిత మనిషి తనదగ్గరకు వచ్చాడంటే శ్రీలలిత వచ్చినట్లేగదా అని ఆయన సంబరపడి పోతున్నారు.

"సూటిగా విషయంలోకి వస్తాను. మనకు డబ్బు చాలా అవసరం. మీకు గెలిచేందుకు కావాలి. మిమ్మల్ని గెలిపిస్తూ బతికేందుకు మాకు కావాలి...."

"అవునవును" అన్నారు మంత్రిగారు.

"నేనో పథకం సిద్ధం చేసాను ..." రుద్రయ్య తన అదృష్టాన్ని తలచు

కొంటూ అన్నాడు.

"చెప్పు ... చెప్పు ... కాని ఒక్కటి గుర్తుంచుకో - ప్రధాని దగ్గర నన్ను దోషిని చేసే పథకం మాత్రం కాకూడదు ...." మంత్రి ఒకింత భయపడుతున్నట్లుగా అన్నాడు.

లేదు ... లేదు ... అలాంటిదేం కాదు ... పైగా మనకు డబ్బేకాక ఓట్లు కూడా వచ్చే పథకం అది"

"చెప్పు ..." అన్నాడు మంత్రిగారు చప్పున.

"మీ ఇంటి ముందున్న జనాల్ని చూసారుగా"

"చూసాను"

"వాళ్ళు రంగారెడ్డి జిల్లా వాళ్ళు, వాళ్ళ కోరిక తీర్చామనుకోండి మన పథకం పారుతుంది"

"ఎలా ?" మంత్రిగారితో అర్థం కానట్లు ప్రశ్నించాడు.

"వాళ్ళ జిల్లాను కొత్తగా పరిశ్రమలు పెట్టి వారికి సబ్సిడి ఇచ్చే జిల్లాగా ప్రకటింప జేయాలి ..."

"అది వాళ్ళకు లాభమే. మనకెలాక్కి అయినా అది చాలా కష్టం ..." అన్నాడు మంత్రిగారు కేంద్ర పరిశ్రమల మంత్రిగార్ని తలుచుకుంటూ.

"ఇప్పుడా జిల్లాలో ఎకరం రెండువేల నుంచి పదివేల వరకు పలుకుతోంది. మనం ఇప్పుడే ఓ ఐదారువేల ఎకరాలు కొనేస్తాం, మీరు ఢిల్లీ వెళ్ళి సబ్సిడీ వచ్చేలా చేయగానే దానిరేటు అమాంతం పెరిగిపోతుంది. అప్పుడు మనం దాన్ని అమ్ముకొని కోట్లు గడిస్తాం .... ఏమంటారు ....?"

మంత్రిగారు ఆశ్చర్యంగా చూసారు రుద్రయ్యవేపు.

రుద్రయ్య మౌనంగా మంత్రిగారి నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నారు.

అంతలో బయటనుంచి తిరిగి స్లోగన్స్ వినిపించసాగాయి.

మంత్రిగారు ఆలోచిస్తున్నారు. కొద్ది నిమిషాలు మౌనంగా ఉన్నారా యిద్దరు.

"మరినాకు టైమవుతోంది. అవతల మా శ్రీలలితగారు అటెండ్ అయ్యే ఫంక్షన్ ఒకటుంది అక్కడకు వెళ్ళాలి, త్వరగా చెప్పేస్తే వెళ్ళిపోతాను ..." రుద్రయ్య కావాలనే తొందర చేసాడు.

"ఓ.కే" అన్నారు మంత్రిగారు. అంతే ఒక్కసారి "ఎకరం పాతికవేలు" అంటూ ఆనందంగా కేకేసేసాడు రుద్రయ్య. (సశేషం)

గుస్స

శంకరమంచి పార్థసారథి




వెంకటనారాయణకి కోపంఎక్కువ. ఈ విషయం అందరితోపాటు వెంకట నారాయణగూడా అంగీకరిస్తాడు- కోపంలో లేనప్పుడు. సరిగ్గా అటువంటి సమయంలోనే ఇంకాస్త ఓపిగ్గా, కోప్పడతాడేమోనన్న భయం లేకుండా తరిచి తరిచి అడిగితే, అసలీకోపరసానికి, వాళ్ళ వంశవృక్షానికి వున్న అవినాభావ సంబంధం గురించికూడా చెప్తాడు.

వెంకటనారాయణ తాతగారికి పుట్టెడు కోపం వుండేదిట. ఎప్పుడు చూసినా బుసలు కొడుతూ వుండేవాట్ట. ఎవరన్నా శ్రీరామ అంటే కర్రపుచ్చుకు వెంటపడేవాడట. అంతమాత్రంచేత వారికి పిసరంత పిచ్చిగాని, నయాగరా అంతా నాస్తికత్వంగాని ఉండేవేమోనన్న అనుమానం సహజంగా కలగక మానదు. కాని దేవుడి దయవల్ల పిచ్చి, నాస్తికత్వంలాటి రుగ్మతలేం వుండేవికావు. కోపంతప్ప - వుప్పు కారం వెర్రిగా తినటంచేత కోపం ప్రకోపించి వుండుంటుందని తాతగారి తర్వాత తరాల వాళ్ళు సర్ది చెప్పుకున్నారు. మొత్తానికి తన కోపంతో ఇంట్లోవాళ్ళని, బయట వాళ్ళనిగూడా సమంగా కాల్చుకు తిన్నాడని చెప్పుకోటానికి చరిత్రలో ఆధారాలు, ఇంకా బ్రతికున్న సాక్షులు వున్నారు.

వెంకట నారాయణ తండ్రికూడా ఆయన పితృపాదులకున్నంతా (కోపం) వుండేది. కాకపోతే తలెత్తిన కోపాన్ని తప్పనిసరిగా మింగివేసి చిరునవ్వులతో కాలక్షేపం చెయ్యాల్సిన పరిస్థితి వృత్తిరీత్యా ఏర్పడింది. ఆయన పగలంతా శాంతిసంఘానికి జీతం పుచ్చుకునే అధ్యక్షుడిగాను, సాయంకాలాల్లో గీతాసారాన్ని ఓపిగ్గా వుపన్యాస రూపాల్లో చెప్పే పెద్ద దిక్కుగాను వుండేవాడుట. అంచేత బయట ఎక్కడా కోపాన్ని ప్రదర్శించే వీలు లేకపోవటంచేత చిరాకుపడిపోయి, ఇంటికి వచ్చీరాగానే పెళ్ళాంమీద విరుచుకు పడేవాడు. ఆయన కోపాన్ని ప్రదర్శించటంలో రకరకాల ప్రక్రియలు, ప్రయోగాలు చేసేవాడని వెంకటనారాయణ స్వయంగా చెప్తాడు.

చిరునవ్వులు చిందిస్తూనే ముక్కచివాట్లు పెట్టటం, మొహం కందగడ్డలాగా ఎర్రబర్చుకుని పెళ్ళాన్ని పడగ్గదిలోకి ఆహ్వానించటం-పందిరిమంచం పైకెక్కి





ధడేల్న దూకటం, మంచం క్రిందకి పరుపేసుకుని లారీ మెకానిక్కులాగా రోజుల్లు తెల్లవార్చుకోవటం, పెళ్ళాం జరీచీర లుంగీలాగా చుట్టుకుని వీధివసారాలో పదార్లు చెయ్యటం, ఇవన్నీ వారి కోపాయణంలో కొన్ని మచ్చుతునకలు.

కోపంలో తనపెద్దవాళ్ళకేం తీసిపోడు వెంకట నారాయణ. కాని కోపం అనేది మనిషికి ప్రథమ శత్రువని గాంధీగారు చెప్పిన మాట గురించి గట్టిగా ఆలోచించి దాన్ని తగ్గించుకోటానికి నిజాయితీగా ఎన్నో ప్రయత్నాలు, సాధనలు పట్టుబట్టి చేసాడు. దానివల్ల కోపం మూడొంతుల్ని కంట్రోలయింది. ఇప్పుడు అతడికోపం ఎప్పుడోగాని రాదు. వచ్చినా పదినిమిషాలకిమించి అస్సలుండదు. కాని వచ్చిన చిక్కల్లా కోపం వచ్చిన ఆ పదినిమిషాల్లు అతడు అతడుకాడు. వేరే మనిషి. ఏం చేసాడో, ఏం వాగేడో గుర్తుండి చావదు. తర్వాత ఎవరన్నా చెప్పినా నమ్మడు. పుట్టుకతో సహజంగా వచ్చిన కోపాన్ని మొరటు పద్ధతుల్లో అణిచేవేసే ప్రయత్నాలవల్ల తల నరాలు తారుమారయినాయని, అంచేతనే వాటి కోపం కక్కినప్పుడు మెదడు మొద్దుబారి మొరాయిస్తుందని, పరీక్ష చేసిన డాక్టర్లు సెలవిచ్చేరు.

ఒకసారి వెంకట నారాయణకి, భార్యకి ప్రకృతి సహజంగా మాటా మాటా వంటగదిలో భోజనాలముందు పెరిగింది. అతడు చాలాసేపు ఓపికపట్టి కోపం రాకుండా జాగ్రత్త పడుతూ వచ్చేడు. కాని ఎప్పుడూ శాంతంగావుండే శాంతమ్మకూడా ఆరోజు కోపం రావటంచేత అతడ్ని బాగా రెచ్చగొట్టింది. దాంతో వెంకట నారాయణకి కోపం పాలపొంగులా వచ్చేసింది. కూర్చున్న వాడల్లా చివాల్న లేచి అందుబాటులోవున్న ఆవకాయ జాడీని అవలీలగా పైకెత్తి ధామ్మని నేలకేసి కొట్టేడు. అంతే! నేలంతా ఎర్రటివూట-నెత్తుర్లాగా. తెగిపడ్డ తలకాయల్లాగా చిందరవందరగా ముక్కలు. వంటగది యుద్ధభూమిలాగాను, శాంతమ్మ శోకిస్తున్న భూదేవిలాగాను, వెంకట నారాయణ వీరవెంకట్నారాయణలాగాను తయారయ్యేరు.

మళ్ళీ కొద్దిక్షణాల్లో మెదడు యధాస్థితికి రావటంచేత, కోపం పోయి మామూలు మనిషయ్యేడు. కనిపిస్తున్న దృశ్యాన్ని కళ్ళు నులుముకుని చూసి, ఏమిటిదంతా? అంటూ భార్యని గద్దించి మరీ అడిగేరు. 'నరాలేం' చచ్చుపడ్డాయా? అనిగూడా వాకబు చేసారు. దానికావిడ దీనిక్కారణం నేకాదు. మీరే మహాప్రభో అంటే నమ్మక, కళ్ళెర్రచేసి చేసింది చాలక అబద్ధాలాడతావాని పైపైకొస్తుంటే ఆవిడేదో అంటే, ఈయనేదో అని, మాటలు పెరిగి, ఘర్షణ జరుగుతుండగానే, ఆయనకేదో బుర్రలో టప్పుమంటూ శబ్దం వినబడటం, వెంటనే-మళ్ళీ కోపం రావటం-

వెంకట నారాయణ వెంటనే మధ్యగదిలోకి వెళ్ళి టేబిలుపైన పాట పాడు

తున్న ట్రాన్సిస్టర్ని చేతిలోకి తీసుకుని ఇంటి పైకప్పుకేసి కొట్టారు. భూమ్యాకర్షణ శక్తి ఆ యింట్లోగూడా వుందికాబట్టి అతి వేగంగా తిరిగొచ్చి నేలకరిచింది. ఆ రేడియో ఇప్పటికీ వుంది. చూట్టానికి భలే ముద్దొస్తుంటుంది. కాని కుయ్ కయ్ అనదు. ఎవరన్నా వెనకాముందూ బాదేసి మరీ మొహమాట పెట్టేస్తేమాత్రం వాతం కమ్మినట్లు గుర్ గుర్ మంటూ మూలిగి వూరుకుంటుంది అంతే.

ఆఇంట్లో సామాన్లన్నిగూడా ఆయన కోపాన్ని ఏదోఒకప్పుడు చవిచూసినవి కావటంచేత అలంకార ప్రాయంగానే వుంటాయిగాని వుపయోగార్థంకావు. ఇంత అనుభవంవున్న శాంతమ్మగూడా ఇంకా మొగుడనే పదార్థంపైన ప్రేమని చంపుకోలేక వుత్సాహంకొద్దీ ఏదో వొకటిచేసి అతడికి కోపం తెప్పిస్తూనే వుంటుంది,

ఆరోజు ... సాయంత్రం...

ఇంకా ఆరుగంటలు కాలేదు. అయిదు గంటల యాభై అయిదు నిమిషాలు కాబోలు అయింది.

వెంకట నారాయణ అప్పుడే ఆఫీసునించి వచ్చేడు. రాగానే పడక్కుర్చీలో వాలిపోవటం అలవాటు. కాబట్టి వాలిపోయేడు. శ్రీవారురాగానే మంచినీళ్ళగ్లాసుతో రావటం శాంతమ్మ అలవాటు. అంచేత వచ్చింది. రావటమే కాకుండా గ్లాసుని అందించటంగూడా అలవాటు కాబట్టి అందించింది. అందిస్తూనే అలవాటులోని మరోపనొకటి చేసింది. నీళ్ళగ్లాసు వెనకే ఒక పెద్ద పొట్లంగూడా అందించింది. నీళ్ళగ్లాసుని ప్రక్కనపెట్టి పొట్లం తెరిచి చూసేడు.

ప్యాంటూ, షర్టూ - కుట్టించి మరీ వున్నాయ్!

వెంకట నారాయణకేం అర్థం కాలేదు. ఏవిటివి ? అనడిగాడు. బట్టలని సమాధానం రాబట్టి, ఏ బట్టలు, ఎవరి బట్టలని వివరణ కోరేడు. మనవేనన్న సమాధానంతో తృప్తి పడక, నీవా నావాని కరుగ్గా అడగ్గా, శాంతమ్మ పెద్దాడు తొలిజీతంలోంచి పంపిన డబ్బుల్తో తనే అతడికోసం కుట్టించినట్లు చెప్పేసరికి అతడిలో సంచలనం లాంటి అశాంతిలాంటి కోపం మొదలయింది.

వెంకట నారాయణ ఆడవాళ్ళకి స్వాతంత్ర్యం వుండకూడదన్ని నమ్మటవే కాకుండా పైకి చెప్తాడుకూడా. ఈ దేశానికక్కడా స్వాతంత్రం పనికిరాదనిగూడా అంత గట్టిగానూ అనుకుంటాడుగాని పైకి ఆ మాట చెప్పే సాహసం చెయ్యడు. అంచేత పెద్దాడు నేరుగా తల్లికి డబ్బు పంపటం, ఆవిడేమో ఏకపక్ష నిర్ణయం తీసుకోవటమే కాకుండా, దాన్ని అమలు పర్చటం- అతడి బుర్రలో టప్పుమంటూ శబ్దాలు రావటానికింకేం కారణం కావాలి?

(మాటొచ్చింది కాబట్టి ఓ సలహా - మీ బుర్రలోంచి మీకెప్పుడైనా శబ్దాలు సంగీతాలు వినిపిస్తాయో మోగమనించండి సంగీతం అయితే తిలకించిఆనందించండి గాని, శబ్దాలొస్తేమాత్రం రెండోకంటివాడికక్కడా తెలీకుండా నిశ్శబ్దంగా డాక్టర్ని సంప్రదించండి. ఎంచేతనంటే, ఈ మధ్యన జపాన్నించి అదేదో కొత్తరకం బుర్రలకి సంబంధించిన జబ్బు రవాణా అయిందని బ్రెయిన్ స్పెషలిస్టు రమేష్ పాండే చెప్పారు. అయన ఇంకా చెప్పిన

కొంతసమాచారం, ప్రతి మనిషి తలకాయలోపల టేప్‌రికార్డరులాంటి వస్తువొకటి ఎడంపక్కగా వుంటుందిట. దానిపనల్లా దృష్టి ప్రసరించిన ప్రతి సంఘటన రికార్డు చెయ్యటం. దీనికి రీప్లే అంటే జ్ఞాపకం తెచ్చుకోవటం అన్నమాట) సదుపాయం గూడా వుంటుంది. జపాన్‌జబ్బు ఈ టేపు రికార్డర్‌ని పాడుచేస్తుంది. దీనివల్ల సొంత పెళ్ళాన్ని 'ఏవమ్మా! కులాసాగావున్నావా అనడగటవో, భోంచేసావా? అంటే గుర్తు లేదనటం' సంభవించవచ్చు. అంచేత జాగ్రత్తగా వుండాలని, ఎప్పుడయితే భార్య పరాయి వ్యక్తిలా కనిపించి, పక్కింటి ఇల్లాలు బాగా పరిచయం వున్నవారిలాగా అవుపిస్తారో వెంటనే డాక్టర్ని సంప్రదించమని పాండేగారు నొక్కివక్కాణించేరు. ఇదంతా బుర్రంటూవున్నవాళ్ళకి కాబట్టి, అదిలేనివాళ్ళు ఎటువంటి ఆందోళన చెందనక్కర్లేదనిగూడా హామీ ఇచ్చేరు. దీన్నిబట్టిచూస్తే వెంకట నారాయణ బుర్రలో టేప్‌రికార్డర్ పూర్తిగా పాడవలేదుగాని, కోపం వచ్చినపుడు, టప్పుమని శబ్దంచేసి ఆగిపోతుంది కొద్ది నిమిషాలు. అంచేత ఆ కాస్సేపు అతడికంతా బ్లాంక్ - ఏమీ తెలీదు. తర్వాత గుర్తుకూడా రాదు.)

వెంకట నారాయణ బుర్రలోపల ఆ సాయంత్రం టప్‌మంటూ శబ్దం అయినపుడు సరిగ్గా ఆరుగంటలయింది. సూర్యుడు అస్తమించేడు. చీకట్లు వ్యాపిస్తున్నాయి. ఆ నియోజకవర్గం ముష్టివాడు ఇంటిముందు నిల్చుని గొంతెత్తి అరుస్తున్నాడు.

నిశ్శబ్దాన్ని తలంతా నింపుకున్న వెంకట నారాయణకి చేతిలోవున్న పొట్లాన్ని ఏంచెయ్యాలో అర్థం కాలేదు. గోడకా? నేలకా? పై కప్పుకా? భార్య మొహానికా? దేనికేసి కొడితే ధర్మంగా న్యాయంగా వుంటుందాని ఆలోచిద్దామనుకుని ఆలోచించలేక అనుకోకుండా, అప్రయత్నంగా శబ్దం వస్తున్న వీధిలోకి వెళ్ళాడు.

శాంతమ్మకేంఅర్థంకాక పిచ్చిచూపులు చూస్తూ నిల్చుండిపోయింది.

ఇంటిముందు నిల్చుని గొంతు చించుకుంటున్న ముష్టి మహారాజు పేరు పేరిగాడు. సన్నాఫ్ వీరిగాడు. యాచక వృత్తిలో ఆరితేరిన వంశం వాళ్ళది. చదువుకుని దగాపడటం ఇష్టంలేక ఆ జోలికే పోలేదావంశీయులు. అడుక్కోవటం, దోచుకు తినటం ఈ రెండే బ్రతకటానికి రాజమార్గాలని వాళ్ళ పూర్వీకులు చెప్పటంచేత, పేరిగాడితోసహా అంతా అడుక్కోవటమే పరమావధిగా పెట్టుకున్నారు. పేరిగాడు వెంకట నారాయణంత ఎత్తుగావుంటే, ఆయనకంటే బలంగా కూడా వున్నాడు. కాకపోతే వృత్తిరీత్యా హాకీస్టిక్కులాగా వొంగి నిల్చోవటంచేత పొట్టిగా అవుపిస్తాడు.

వెంకటనారాయణ ఇంట్లోంచి నిద్రలో నడుస్తున్నవాడిలాగా చేతిలో పొట్లంతో సహా రావటం అరుస్తున్న పేరిగాడుచూసి అవాక్కయిపోయేడు. అయన పేరిగాడికి అంగుళం దూరంవరకు వచ్చి ఎంచేతనో ఆగిపోయి, చేతుల్ని కాస్త ముందుకు చాచటంతో అందుకోవటం అలవాటు చేసుకున్న పేరిగాడు ఆయన చేతుల్లోని పొట్లాన్ని అందుకుని వుండబట్టలేక విప్పి

చూసేడు.

ప్యాంటు, బుల్లికోటు (సఫారీ)!

వెంకట నారాయణ తెలుగు నిక్షిప్త కళాప్రాంగణంలో మరో బొమ్మలాగా నిల్చుండిపోయాడు.

పేరిగాడుమాత్రం సంతోషపడిపోయి 'దరమ పెబువులు. బట్టలు కుట్టించి మరీ ఇచ్చేరు. నూరేళ్ళు (నీ కోపం) సల్లంగుండాల.' అనుకుంటూ హాకీకర్ర లా వున్నవాడల్లా బెండుకర్రలా వ్యాకోచించి వెళ్ళిపోయేడు.

శాంతమ్మ బయటికొస్తుంటే, వెంకట నారాయణ లోపలికొస్తూ ఎదురయ్యేడు. అప్పటికే పేరిగాడు ఆ పేట దాటి వెళ్ళిపోవటం, వెంకట నారాయణ బుర్రలోని టేపురికార్డరు తిరిగి పన్చెయ్యటం, అయనంతా మర్చిపోవటం జరిగిపోయింది.

'అయ్యో! బట్టలేంచేశారండీ?' అనడిగింది మొగుడ్ని కంగారుగా. భార్య ప్రశ్నకి ఆయన బోల్డంత ఆశ్చర్యపడి, వొంటికున్న బట్టలవంక చూసుకుని 'వున్నాయిగా! బట్టలేవిటీ?' అంటూ అమాయకంగా అడిగారు. "ఇవికావండి, కొత్తవి. ఇప్పుడు మీకిచ్చేనే - అవ్వి". అంటూ ఇంకేదో అనబోతుంటే వెంకట నారాయణకి కోపం రాబోగా తమాయించుకునేటందుకు తమాషాగా నవ్వి 'చాల్లే! కొత్తబట్టలెక్కడివి? నాకివ్వటం ఏవిటి? వెళ్ళు, వెళ్ళి రెస్టతీసుకో, అన్నట్లు ఆ క్యాప్సిల్స్ వాడుతున్నావా? రెస్ట్ చాలా అవసరం అని డాక్టరు చెప్పాడు' అంటూ సానుభూతిగా మంచంలో వున్నవాడికి ఆదేమంచం చివర్న కూర్చున్నవాడిలాగ సలహా ఇస్తూనే లోపలికి వెళ్ళిపోయాడు.

శాంతమ్మకి వాదించి లాభం లేదని అర్థం అవటంచేత ఆదుర్దాగా వీధిలోకెళ్ళి అటూ ఇటూ చూసింది. భావిలోకి తొంగి చూసింది. భావిలో నీళ్ళే వుండవ్. ఇహ బట్టలు, ఆభరణాలు ఎక్కడుంటాయ్?

ఏవైనట్లు? ఏంచేసినట్లు?

ఆరాత్రి భోజనం దగ్గర, పడగ్గది లోనూకూడా అడిగి చూసింది. ఆయన అడిగిన ప్రశ్నకి సమాధానం ఇవ్వకుండా ఆవిడ ఆరోగ్యం గురించి విచారణ చెయ్యటంతో ఆశ వదులుకుంది. కాని మానవ ప్రయత్నంమాత్రం మాన్లేదు. నాలుగొందలు బూడిదపాలయ్యేయన్న బాధకన్నా కొడుకు పంపిన తొలిజీతం ఇలా అదృశ్యమైందేవిటన్న ఆదుర్దా, వాడి జీవితవంతా జీతాలు ఇలాగే అయిపూ అజా లేకుండా అంతర్థానమవుతాయేమోనన్న బెంగ - ఎక్కువ బాధపెట్టసాగేయ్.

ఆ మర్నాడుకాక, ఆ మర్నాడు - వెంకట నారాయణకి ఆఫీసుకి సెలవు. అంచేత వసారాలో కూర్చుని పేపరు చదూకుంటున్నాడు. శాంతమ్మ పక్కింటి పిన్నిగారింటికెళ్ళొస్తానని ప్రక్క వీధిలో వున్న ఆంజనేయస్వామి భక్తుడి వద్ద కెళ్ళింది. ఆ భక్తుడు చాలా గొప్పవాట్ట. అరడజను అరటిపళ్ళో, యాపిల్ కాయలో ఆయన చేతిలో పెట్టి మీ సమస్యలేమిటో చెబితే, ఆయన పళ్ళు చేత్తోపుచ్చుకుని, కళ్ళు మూసుకుని సమాధానం ఇట్టే చెబుతాట్ట. పశువులు, మొగుళ్ళు, పిల్లలు, వస్తువులు ఏంపోయినా, చేతులుమారినా ఎక్కడున్నాయో చూసినట్లు తీసి దాచినట్లు కరక్టుగా చెప్తాడట.

శాంతమ్మ వెళ్ళిన పదినిమిషాలకి వచ్చేడు పేరిగాడు. మొహం విషాదంగా వుంది. అడుక్కోవటం నిషేధిస్తూ ఆర్డినెన్సు రాబోతోందన్న సంగతి ఎమ్మెల్యే క్వార్టర్సులో విని ఇలా వచ్చినట్లుంది వాడి వాలకం. చేతిలో పొట్లంగూడా వుంది. దాన్ని వాడు పాము బుట్టని పుచ్చుకున్నంత భయంగా పుచ్చుకున్నాడు.

వసారా కుర్చీలో మూడోపేజీలోని 'నగర నేరాలు' చదువుతున్న వెంకట నారాయణని 'బాబూ! ఇలా ఓసారి రండ'ని ఎంతో మర్యాదగా ఆహ్వానించాడు. కాని పేపర్లో లీనమైపోయిన వెంకట నారాయణ ఆ ఆహ్వానాన్ని మన్నించక 'అమ్మగారు లేరు తర్వాత కనపడు' అన్నాడు విసుగ్గా.

ఆ సమాధానానికి పేరిగాడు నిజంగా పిలుచుకుడు. అడుక్కుతినే వాళ్ళయినా అప్పుడప్పుడు ఓరి వస్లమీదగూడా వస్తారన్న ప్రాథమిక జ్ఞానంలేని ఆయనని చూస్తే జాలీ, కోపం కలిగినా, తమాయించుకుని 'మీతోనేబాబూ నా పని - ఓ నిమిషం ఇలా దయచెయ్యండి' అంటూ దుళ్ళి ఆహ్వానించేడు.

అయినా వెంకట నారాయణ కదలకపోవటంతో, ఇలా కాదని పేరిగాడే మెట్లెక్కి వసారాలోకెళ్ళి, చేతిలో పొట్లాన్ని ఆయనకందించి 'తీసుకోండి తవరే కట్టుకోండి' అన్నాడు నమ్రతగా.

వెంకట నారాయణకి ఏంతీసుకోమంటున్నాడో, ఏం కట్టుకోమంటున్నాడో అర్థంకాక, పేపరు పక్కనపడేసి, పొట్లం విప్పి చూసేరు. ప్యాంటు, బుల్లికోటు!

ఆయనకి అహం దెబ్బతినగా, ఆవేశంగా 'ఏరా - ఈమధ్యన ముష్టివెధవలు కూడా బట్టలూ అవీ పెడుతున్నారా? వాళ్ళుగాని కొవ్వెక్కిందా? నీ ముష్టి బట్టలు నే కట్టుకోవాలా?' అరిచేరు.

పేరిగాడుమాత్రం తాపీగా 'ఆ బట్టలు మీవేబాబూ-తవరే నాకిచ్చేరు' అన్నాడు.

'నేను - వీటిని నీకిచ్చానా? ఎందుకిచ్చాను? నాకేమన్నా పిచ్చా?'

"[illegible] దండి - [illegible]మాత్రం సన్ను [illegible]కంగానే [illegible] సూసింగా [illegible] సంతోసపడిపోయి, బట్టలు తీసుకుని [illegible]కండి... అంతేనండి. ఇదు [illegible] మిమ్మల్ని సంపుకు తిన్నంత [illegible]. అంతా ఎగాదిగా చూసాలేగాని సేతులి ముందుకు రాలేదండి. నిన్న రోజంతా పస్తండి. అంచేత తవరే వాటి నుంచేసుకోండి" అంటూ ముగించేడు.

'అబద్ధం' అంటూ అరిచేడు వెంకట నారాయణ.

'నిజం' అన్నాడు పేరిగాడు.

"కాదు - అబద్ధం - అబద్ధం"

"ఏంకాదు - నిజం - నిజం - నిజం"

వెంకట్నారాయణకి వాడి రెట్టింపుతో రెట్టింపు ఆవేశం వచ్చింది. చేతిలోని, ప్యాకెట్టుని నేలకేసి కొడుతుండగా తలకాయ లోపల టప్ మన్న శబ్దం.

సరిగ్గా అదేసమయానికి పేరిగాడికి కోపం వచ్చేసింది. వాడికి ఏడాదికి లెక్క ప్రకారం ఒక్కసారి మాత్రమే వస్తుందిట చిత్రంగా వాడిక్కోపం వచ్చినపుడు వెయ్యేనుగులబలం వస్తుందిట. తనేంచేస్తున్నాడో తెలుస్తూనేవుంటుందిటగాని శరీరం

మాత్రం వాా ఆధీనంలో వుండదుట.

ఒకసారి హోటల్లో కాఫీ త్రాగుతుండగా కోపం వస్తే వంటగదిలోకి రివ్వున బాణంలాగా దూసుకెళ్ళి వచ్చి ఫిండితో సహా పదార్థాలన్నీ తినేసాట్ట. తర్వాత బాధపడ్డాడు. అలాగే ఇంకోసారి సినిమా హాలుముందు నిల్చుసుండగా కోపంవస్తే ఓ సిక్కులాల్చీ పెద్దమనిషిని అమాంతం గాల్లోకి లేపి గిరగిరాతిప్పి విసిరేసాట్ట. ఆయనెళ్ళి 'మీ వీధులని శుభ్రంగా వుంచండి' అని రాసున్న లారీలో ధభీమంటూ పడ్డాట్ట. తర్వాత తెల్సింది ఆయన ఆ హాలు యజమానని.

వెంకట నారాయణ తన నిజాయితీని గుర్తించకపోగా, పొట్లాన్ని నేలకేసికొట్టి, పైగా పొట్లగిత్తలాగా ఎగిరెగిరి పడటం చూసేసరికి పేరిగాడికి ఆ సంవత్సరం కోపం అక్కడే వచ్చేసింది.

దాంతో పొట్లాన్ని జామ్మని చించేసి ప్యాంటూ, బుల్లి కోటూ ఆయనపైకి గిరాటేసి 'కట్టుకో' అంటూ పెద్దగా అరిచేడు.

ఆ అరుపుతో వెంకట్నారాయణకి కోపం మరింత పెట్రేగగా పేపరు చించేసి కుర్చీలన్ని టిని పేరు పేరువరసనా తన్ని ఇంకా ఏదో కార్యక్రమం తలపెడుతుండగా, పేరిగాడు రెట్టింపుగా పేట్రేగి, మేకపైకి పులి దూకినట్లు ఆయనపైకి లంఘించి, నేలపైకి పడగొట్టి గుండెలపై కూర్చుని పంచెలాగి, ప్యాంటు ఎక్కించి బుల్లికోటుగూడా తొడిగి, తిరిగి అవలీలగా ఆయనెత్తి కుర్చీలో కూలేసి 'ఊం. బొత్తాలు పెట్టుకో' అంటూ ఆజ్ఞాపించేడు.


ఇద్దరూ ఆవేశం చేత అబ్నార్మల్గా రొప్పుతున్నారు. ఇద్దరూ కోపంలో వున్నారు. ఏంజరిగిందో పేరిగాడికి తెలుసు. వెంకట్నారాయణకి తెలీదు. అంతేతేడా ?

వెంకట్నారాయణ సుశిక్షితుడైన సైనికుడిలాగా పేరిగాడి ఆజ్ఞమేరకు బొత్తాలు పెట్టుకుంటుండగా -'జాగ్రత్త-అడుక్కునే వాళ్ళకైనా ఆవేశంవస్తే ఇలాగే వుంటుంది' ఒక కఠిన సత్యాన్ని ప్రబోధించి, వెళ్ళిపోయేడు.

వెంటనే శాంతమ్మవచ్చింది. గుమ్మంలోనే ఆగిపోయింది. పేపరంతా చిరిగిపోయుంది. కుర్చీలన్నీ తిరగబడ్డాయ్, పతిదేవుడు పిచ్చిచూపులుచూస్తూ ఫ్రీజయి వున్నాడు. శాంతమ్మకి గుండె దడదడలాడింది. ఎవరో మొగుడ్ని మృదంగం వాయించేసి కొంపంతా దోచుకు పోయుంటారని వూహించి, అరవబోయి, ఆయన వొంటిపైనున్న బట్టల్ని చూసి ఆగిపోయి ఆశ్చర్యపడింది.

"ఏవండీ! ఈ బట్టలెలా వచ్చేయండీ? వీటిగురించే ఇన్నాళ్ళూ నేనడిగింది". వగైరా ఆవిడ ప్రశ్నలకి వెంకట్నారాయణ, పసిపిల్లవాడిలాగా అమాయకంగా 'నాకేంతెలీదు. నాకేంతెలీదు. అబ్బ... వొళ్ళంతా కుస్తీపట్టినట్టు -' కళ్ళుమూసుకోగా, శాంతమ్మ మరేం విసిగించక స్వామివారి బండారు మొగుడి మొహాన దిద్ది 'అంతా స్వామివారి చలవ - స్వామివారి చలవ' అనుకుంటూ లోనికెళ్ళింది.

Edited & Published by V. Leelavathy Raghavaiah at 1-8-519/11, Chikkadapalli, Hyd-20, & Printed by P. Ramakrishna at Raghava Printers 1-8-4/1/1, Chikkadapalli, Hyderabad-20.


అరణ్య
మరణం
కౌదుంబరి
కిరణ్‌కుమార్

రప్ .... రప్ ... రప్ రప్ రప్
పెద్దచప్పుడు ... భయంకరమైన చప్పుడు ...

ఆ నిర్జీవ నిశ్శబ్ద ప్రదేశంలో అప్పటివరకూ లేని ఆ చప్పుడు అంతకంతకూ ఎక్కువవుతోంది —

ఆ చప్పుడుతో ఆ ప్రదేశమంతా అతి భీభత్సంగా తయారయింది.

మరణ రోదనగా వినిపిస్తున్న ఆ చప్పుడు, నలుదిశలా ప్రతిధ్వనిస్తున్న ఆ చప్పుడు ... రాబందుల రెక్కల చప్పుడు !

ఆకలిగొన్న రాబందులు తమ రెక్కలతో భయంకరమైన చప్పుడుచేస్తూ పొడవాటి ఇనుప కత్తుల్లాఉన్న ముక్కులతో ఒక నిర్జీవ శరీరపు మాంసాన్ని పీక్కుతింటున్నాయి.

కొన్ని రాబందులు ఆకాశంలో తిరుగుతూ-తమ తమ సంబంధీకుల్ని 'ఇక్కడ ఆహారముంది రండహో' అన్నట్టుగా పెద్దగా గోల చేస్తున్నాయి.

'రయ్' మంటూ దూసుకుపోయిందో గుడ్లగూబ, రాబందుని తాకుతూ.

దూరంగా ఎక్కడో నక్కల అరుపులు ...

అడవి కుక్కలు మొరలూచాచి అరుస్తున్న శబ్దాలు ...

అతి భీభత్సకరమైన వాతావరణం అలుముకుంది ఆ ప్రదేశమంతా.

సరిగ్గా ఆ ప్రదేశానికి వందగజాల దూరంలో నిద్దట్లో ఉలిక్కిపడి లేచినట్టుగా భయంతో, దిక్కుతోచక పరుగెడుతోందో అడవి పందిపిల్ల.

ఉన్నట్టుండి 'బుస్సు'మంటూ గాలిలోకి లేచింది ఓ నల్లనాగు పడగ. విలవిలా తన్నుకుంటూ అప్పటికప్పుడే, నల్లగాఉన్న ఆ పందిపిల్ల శరీరం నీలం రంగులోకి మారిపోతూ నేలకొరిగి పోయింది. పొదల్లోంచి అలా ... అలా... జర్రున పాకిపోయిందా కసితీరిన నాగు.

నగరానికి రెండువందల కిలోమీటర్ల దూరంలో, సుదూరంగా వ్యాపించివున్న అడవి ప్రాంతమది –

ఒకేఒక గెస్ట్‌హౌస్, అక్కడికి యాభై కిలోమీటర్ల దూరంలో ఒక చిన్న గూడెంతప్ప, ఆ అడవిలో చెప్పుకోతగ్గ జనాభా లేదు.

ఆరోజు పూర్ణిమ తెల్లారుతున్నరోజు !

సూర్యుడింకా కనిపించకపోయినా లేత సిందూర వర్ణం అలముకొనుందా ప్రదేశంలో !

అది గెస్ట్‌హౌస్ ప్రాంతం. గెస్ట్‌హౌస్‌లో ఒక గదిలోమాత్రం లైటు వెలుగుతోంది.

అంతలో —

ఆ గదికి కొంచెం ఎడంగాఉన్న గదిలోంచి మెల్లగా చప్పుడు కాకుండా .... నక్కి నక్కి బైటకి మెడపెట్టి చూశాడో వ్యక్తి.

ఎవ్వరూలేరు —

నిశ్శబ్దం – !

హాలుకి అటువైపునున్న విశాలమైన గదివేపు చూశాడతను. ఆ గదితలుపులు వారగా వేసి వున్నాయి.

రెండు క్షణాలు అలానే ఉండిపోయాడతను. మార్పులేదు. అదే వాతావరణం నిశ్శబ్దం ! !

అతని గాభరా తగ్గింది.

పిల్లిలా కాలు ఎత్తి ఎత్తి వేసి నడుస్తూ గేటుదగ్గరకొచ్చాడు.

గేటు తెరిచుంది !

అతనిగుండె ఝల్లుమంది.

అరక్షణంలో అతని ఆలోచనలు సుదూరం పరుగులెట్టాయి – 12 గంటల వెనక్కి –

'గేటు వేసే పడుకున్నానే !' అనుకున్నాడతను.

ఆఖరిసారిగా మళ్ళీ పరికించి చూశాడు. ఎవరూ నిద్రలేవలేదని నిర్ణయించుకోగానే – 'ఎక్కడో పొరపాటు జరిగుంటుంది!' అనుకుంటూ నిశ్శబ్దంగా బైటకొచ్చి గేటు దగ్గరగా వేసేశాడు.

నడుంచుట్టూ ఓసారి తడుముకున్నాడు. చాకు, రివాల్వర్‌లు భద్రంగా ఉన్నాయి. రివాల్వర్ తీసి కుడిచేతితో పట్టుకుని, ఎడంచేతిలో చిన్న కుండని పట్టుకుని మరొక్క అడుగేశాడు –

అంతే !

అప్పటివరకూ అతని మనసులోని సంఘర్షణవల్ల, బెదురువల్లా అతనికి వినిపించని అక్కడి వాతావరణపు శబ్దం ... చప్పుడు ఒక్కసారిగా అతని చెవుల్లో

మారుమ్రోగింది – భీకరంగా !

అంతలోనే ఓ పెద్ద రాబందు హఠాత్తుగా వెనగ్గావచ్చి అతని భుజంమీద 'ఠప్' మని కొట్టిపోయింది ముందుకు —

ఎలర్ట్‌గా ఉన్న అతని కుడిచేతి చూపుడువేలు బిగుసుకుంది.

రివాల్వర్‌నుండి దూసుకుపోయిందో గుండు ...

దూరంగా రెక్కలు కొట్టుకుంటూ నేలకొరిగిందా రాబందు !

గిరుక్కున వెనుదిరిగి చూశాడు రాబందు వచ్చిన దిశగా – ఎన్నో రాబందులు గుమిగూడాయక్కడ. అప్రాంతం కూర్చుంటూ గోడ పక్కకి పరుగుతీశాడు.

మెల్లగా చూశాడతను – సరిగ్గా పదిగజాల దూరంలో – అతి భయంకరమైన ఆ దృశ్యం ...

అదిచూసి ఒక్కసారి భయకంపితుడై అడవి ప్రతిధ్వనించేలా గొంతు చించుకుని అరిచాడతను !

అతను ఆ గెస్ట్‌హౌస్ సెక్యూరిటీగార్డు జస్వంత్. 30 సంవత్సరాలుంటాయతనికి. మనిషి చాలా బలిష్టి. ఆ అడవిలో ఎలుగుబంట్లతో సయితం ఒంటరిగా, నిరాయుధుడై పోరాడిన మనిషి –

ఇంకా ప్రతిధ్వనిస్తూనేఉన్న అతని అరుపుకి గెస్ట్‌హౌస్‌లోని లైట్లన్నీ ఒక్కసారిగా వెలిగాయి. బిలబిలమంటూ ఓ నలుగురు మనుషులు వచ్చారక్కడికి. వాళ్ళు రెండో సెక్యూరిటీగార్డ్ రంజిత్, పనివాడు రంగా, జస్వంత్, రంజిత్‌ల భార్యలు.

అదృశ్యంచూసి కెవ్వుమని అరిచి కుప్పకూలిందొకామె. రెండోఆమె ఆమె నడుంచుట్టూ చెయ్యేసి లోపలికి తీసుకుని వెళ్ళిపోయింది.

అందరూ నోళ్ళు తెరిచి చూస్తున్నారు. తమ ఎదురుగ్గా, అతి దగ్గరగా, చెల్లాచెదురుగా పడున్నాయి మాంసం ముక్కలు .... నరాలూ ... కొద్దికొద్దిగా మాంసం ఉన్న ఎముకలు, అక్కడక్కడా చింపిరి చింపిరి అయిన గుడ్డముక్కలూ –

రంజిత్ వొంగుని తళతళా మెరుస్తున్న ఒక వాచీని తీశాడు నేలమీంచి.

'అది తన బాస్‌ది !'

తనకేమిటి ? ఈ బిల్డింగ్‌కీ, ఈ పరిసరాలకీ, అసలు ఈ అడవికే అతనుబాస్. రంజిత్‌కి అయోమయమయ్యింది. "జస్వంత్ ... బా ... స్ ... బాస్ ..." అరుస్తూనే గెస్ట్‌హౌస్‌లోకి పరిగెట్టాడు. ఆ గది తలుపులు తెరిచున్నాయి. మొత్తం అంతా వెతికాడు. చివరికి బాత్రూంలో కూడా ! ఎక్కడా బాస్ అలికిడి లేదు. మళ్ళీ అంతే వేగంగా వెనక్కి వచ్చాడు.

రంగా తన తువ్వాలు పరిచి అక్కడ పడున్న మాంసంముక్కలన్నింటినీ అందులోకి ఏరుతున్నాడు.

సందేహం లేదు –

అందరూ ఆ నిర్ణయానికే వచ్చారు —

ఆ మాంసం ముక్కలు ... ఆవాచ్ ... ఆ గడ్డపీలికలు అన్నీ తమ దొరవే! తమ బాస్‌వే!!

"అంతే .... బాస్ ... భా ... స్‌స్!" దుఃఖం ఆపుకోలేక బావురుమన్నాడు రంజిత్.

జస్వంత్‌పని తేలుకుట్టిన దొంగలాగుంది. అతని నోటివెంట ఒక్క మాట కూడా రావడంలేదు.

2

అప్పటికి సుమారు పది గంటలముందు

ఇక్కడ...

రాజా మనస్సెంతో ఆనందంగా ఉంది. కారణం ఎప్పుడూ బిజినెస్ వ్యవహారాలతో బిజీగా, దూరంగా ఉండే తన అన్నగారు తన పెళ్ళికి వస్తానని ఫోన్‌చేయడమే!

ఆ ఆనందంలో అతని మధురభావాలు, మల్లెపొదల్లో ఒదిగి మధురశ్వాసలు పీలుస్తున్నాయి. అతని మనోఫలకంపై సువర్ణాక్షరాలతో నిండిన ఓ సుందర రూపం లీలగా మెరిసింది.

చిరునవ్వులు నవ్వుతున్న అతని కళ్ళముందు సంవత్సరంక్రితం పరిచయమైన ఆ రూపం ..., ఆ అయిదక్షరాల 'కరుణప్రియ' రూపం మెదిలింది!

* * * *

భావన, ప్రత్యూష, రాజా ఒకే కాలేజీలో చదువుతున్నారు. వాళ్ళ ముగ్గురిదీ ప్రాణస్నేహం. అరమరికలు లేని స్నేహం!

భావన చాలా తెలివైన పిల్ల. మంచి సాహిత్యాభిరుచి ఉందామెకి. ఒయ్యారంగా కలవరపడే అమాయకపు గోదారిని తదేకంగా చూడటం, నీటిమీదకి ఒంగిన కొమ్మపై ప్రేయసికోసం విరహబాధతో గొంతెత్తికూసే కోయిలరాగం వినడం .. ఇలాంటివే ఆమెకు కాలక్షేపణలు. స్నేహితులే తక్కువామెకు.

ప్రత్యూష పక్కా తొందరపిల్ల - ఆమెకు భావనంటే ప్రాణం. ఏ విషయమైనా భావనతో చర్చించనిదే ఓ నిర్ణయానికి రాదామె. వారిద్దరి సాహిత్యాభిరుచే - రాజాని వాళ్ళకి కలిపింది. ఒకతల్లి బిడ్డల్లా ... ఒకేఇంటి పిల్లల్లా ఆ ముగ్గుర్నూ మెలుగుతారు. భావన ఇంట్లోనే తరచూ సాయంత్రం పూట కలుసుకుంటూ ఉంటారువాళ్ళు.

రామనాథం, పార్వతమ్మగార్ల రెండోకుమారుడు రాజా. పేరుకు తగ్గట్టే చిన్నతనంనుంచీ రాచరికం అనుభవించాడు. తల్లి తండ్రి చనిపోయాక, తనను అత్యంతంగా ప్రేమిస్తూ, తన భవిష్యత్తుకోసం పెళ్ళికూడా చేసుకోకుండా ఉండిపోయిన తన అన్న శశి అంటే ఎంతో భయభక్తులున్నాయతనికి. తను ఆడపిల్లల్తో స్నేహం చేయడం అన్నగారికి ఇష్టముండదు. ఆయన దృష్టిలో తనో అల్లరి పిల్లాడు. అందుకే అన్నగారికి తెలీకుండావచ్చి తన నేస్తాలని కలుసుకుంటూ ఉంటాడతను.

మనిషిలోని భావుకత బాధల్నీ, ఆలోచనల్నీ దూరంచేసి చక్కని రిలీఫ్ ఇస్తుందని అతని నమ్మకం. అందుకే తనకు మనసు బాగోలేనప్పుడు తప్పనిసరిగ్గా భావన ఇంటికి వచ్చేస్తాడతను –

ఒకరోజు రాజు వచ్చేటప్పటికి —

భావన, ప్రత్యూష కూర్చుని ఏదో ఆలోచిస్తున్నారు.

ఇంటిముందు లాన్స్‌లో రెండు కుర్చీలేసుకుని నాలుగు కాయితాలూ, చెస్‌బోర్డ్లూ పెట్టుకొని వున్నారు వాళ్ళు.

"హే! రచయిత్రులిద్దరూ ఏదో వండుతున్నట్టున్నారూ?" నవ్వుతూ లోపలికొచ్చాడతను.

"రా ... రా ... ఏమిటీమధ్య అసలు రావడమే మానేశావ్?" అంటూ కుర్చీ దగ్గరకు లాగింది భావన.

"అర్జెంటుగా అన్నయ్యతో ఫారెస్ట్‌కి వెళ్ళాల్సి వచ్చింది."

"అడవుల్లోకి వెళ్ళావా ... యూ?" కోపంగా అందామె.

అలా అడవికి వెళ్ళానని చెప్పినప్పుడల్లా ఆమె కోప్పడుతూనే ఉంటుంది. అతనితో అడవికి వెళ్ళాలనీ, అక్కడ ప్రకృతినీ, ఆహ్లాదాన్నీ ఆనందించాలనీ ఆమె కోరిక.

"ఈసారి వెళ్ళినప్పుడు తప్పకుండా తీసుకు వెళతానన్నానుగా ..." బ్రతిమాల సాగాడతను. బుంగమూతి పెట్టిందామె -

"పోనీలేవే ...." సర్దబోయింది ప్రత్యూష.

"ఆడపిల్లలతోటి స్నేహం చేయడానికే ఒప్పని అన్నగారి సమక్షంలో ఈ పిల్లని అడవుల్లోకి తీసుకెళ్తే ఇంకేమైనా ఉందా? చంపేయడు."

"ఏమిటాలోచిస్తున్నావ్?" ఆమెకోపం ఎప్పుడూ సెకన్లపాటే!

"అబ్బే! నువ్వెప్పుడు శాంతిస్తావా అని ...."

"ఇదిగో ఇది చదివి, ఇంకా ఏమిరాస్తే బాగుంటుందో చెప్పు...." తను అప్పటివరకూ రాయబోయిన కాయితాల్ని అతనికి అందిస్తూ అంది భావన.

"వద్దంటే కోయిల కూస్తోంది మళ్ళీ" చదివాడతను.

"వెళ్ళిపోయిన వసంతం రాదంటే మళ్ళీ" మరోవాక్యం అందించిందామె -

అది పూర్తిగా చదివి, ఆ కాయితాలపై ఇలా రాశాడు -

"వయసుడిగిన మనిషి నవయవ్వనం కోరి
వైద్యుని ఇంటిచుట్టూ మందుకి తిరిగినట్టు!"

"శభాష్‌రాజా!" అరిచిందామె ఆనందంగా -

"బాల్లే మరీక పొగడబోకు మేడపెక్కేయగల్ను...." అంటూ అప్రయత్నంగా ఎదురుగ్గా ఉన్న మేడకేసి చూశాడతను. అతని నుదుటున ముడతలు పడ్డాయి. మేడ మీది కిటికీ కర్టెన్ చాటునుంచి ఎవరో కదిలినట్టయింది.

మాటల సందర్భంలో మళ్ళీ కొంతసేపటికి ఆ కిటికీవంక చూశాడు. అప్పుడు కూడా అలాగే ఎవరో వ్యక్తి కిటికీ చాటుకి తప్పుకున్నట్టు తోచిందతనికి –

"భావనా! అక్కడెవరో ఉన్నారు ...." తర్జనితో చూపించాడామెకు.

"ఓ! అదా నీ అనుమానం – ఎవ్వరూకాదు. మన కరుణే!"

"మన కరుణా ...?"

"అబ్బబ్బ ... మా స్నేహితురాలు కరుణ" ప్రత్యూష అందుకుంది.

"అయితే అక్కడనుండి దొంగచూపులు చూడకపోతే, ఇక్కడికే రావచ్చుగా! 'మన' కరుణేగా!" రెట్టించాడు రాజా!

"తనకి పాపం సిగ్గూ భయమూనూ!" అంది భావన.

"నేనేవన్నా అడవి మృగాన్నా? నన్నుచూసి భయపడటానికి?"

"ఆఁ! మర్చిపోయాను – అడవిలోకి మళ్ళీ ఎప్పుడెళ్తావ్?" టాపిక్‌ని కట్ చేసింది భావన.

ఆ తర్వాత కొంతసేపు పిచ్చాపాటీ మాట్లాడుకున్నాక లేచి వెళ్ళిపోయాడతను. అతను వెళ్ళాక కరుణప్రియని కిందకి పిలిచి బ్రెయిన్‌వాష్ చేశారిద్దరూ. ఆమె రాజా సాహిత్యాభిమానురాలు. కానీ డబ్బున్నవాళ్ళమీదా, మొగకుర్రాళ్ళమీద కొన్ని నిర్దిష్టాభిప్రాయాలతో పెరిగిందామె. అవన్నీ తుడిపేసుకునివచ్చి తమసర్కిల్లో కలిసిపొమ్మని భావన, ప్రత్యూషలు ఆమెకి ఏకబిగిన క్లాసు తీసుకున్నారు.

మరొకరోజు –

అదేచోట భావన, ప్రత్యూష రాజా కూర్చుని మాట్లాడుకుంటున్నారు. "రాజా! స్నేహంగురించి మాంచిది ఏదైనాచెప్పు ..." అంది ప్రత్యూష. మేడమీది కిటికీకేసి ఓసారిచూసి ఇలా అన్నాడు రాజా –

"నే అల్లరిచేస్తా ఎప్పుడుబడితే అప్పుడు –
నే నవ్వుతూఉంటా ఎప్పుడూ –
నే నవ్విస్తుంటా ఎల్లప్పుడూ –
నే ఏడుస్తూంటే అప్పుడప్పుడూ –

కానీ ఏంచేసినా నేస్తమనేదొకటేంటే! నేస్తం సాయంతోటే అదీమనసుతో స్నేహించిన నేస్తం అయితేనే! ఎందుకోతెల్సా? నే నవ్వితే ఆనందించేది, నేనేడిస్తే ఓదార్చేది నేస్తం! ఆ ఓదార్పులో ఎంత మాధుర్యం? అది అందరికీ లభించదు. అందునా నిజమైన ఓదార్పు 'బ్లాక్'లో కూడా దొరకదు?"

"సింప్లీ సూపర్బ్ రాజా!" రెండు గుప్పిళ్ళు గాలిలో ఆడిస్తూ ఆనందాన్ని కనబర్చింది భావన –

"ఏయ్! అటుచూడు" ప్రత్యూష గేటుకేసి చూపించింది.

మౌనంగా, అదురుతున్న మనసుతో అడుగులో అడుగు వేసుకుంటూ ముగ్ధ మోహన రూపిణై ఉదయాకిరణ తరుణిమలా, తూరుపు మంటపంలో ప్రాతఃకాలాన

నర్తించే నాట్యకత్తె కాలి అందియలా ... భీతహరిణేక్షిణిలా ... అలా ... అడుగు లేసుకుంటూ వచ్చింది కరుణప్రియ.

భావన పోయి ఒక కుర్చీ తెచ్చి వేసిందామెకి.

"రాజా! ఈమె ..." పరిచయం చేయబోయింది ప్రత్యూష. గభాల్న చేతులు జోడించిందామె.

హలో! కరుణప్రియా! బాగున్నారా?" రాజా పలకరించాడు.

"తనపేరు ఎలా తెలిసిందబ్బా?" అనే ఆలోచనతో అరక్షణం జోడించిన చేతుల్ని అలానే ఉంచేసిందామె –

అదేంటండీ? తల పగలగొడ్తారా?" ఆ చేతుల్ని చూపిస్తూ నవ్వాడు రాజా! తత్తరపాటుగా రెండు అర చేతుల్ని వెనక్కి తీసేసుకుంది – భయం భయంగా ఉందామెకి. పరాయి మగవాడికితను. పరిచయమవ్వడమూ, ఇలాఎదురెదురుగ్గా కూర్చోడమూ పూర్తిగా కొత్త ఆమెకి.

భావన లోపలికెళ్ళి నాలుగు కప్పులతో కాఫీ తీసుకొచ్చింది.

"రాజా! ఈమె కరుణప్రియ అనీ..." పరిచయం చేయబోయింది.

"నువ్విప్పుడు మళ్ళీ పరిచయం చేస్తున్నావా?..."

"ఓహో! యూ ఆర్ టూ ఫాస్ట్ ..."

"నావరకే!" అన్నాడు రాజా –

"ఆఁ! మీరేంచేస్తున్నారు? ఏమేంచేస్తుంటారు?" కదలేశాడామెని.

"ఇంటర్వ్యూ చేస్తున్నావా?" అంది ప్రత్యూష,

ఆమెకేంచెప్పాలో తెలియక భావన, ప్రత్యూషలవంక బిత్తర చూపులు చూసింది.

"నువ్వే తెల్సుకుని చెప్పరాదూ?" అంది భావన రాజాతో.

"నేను ప్రయత్నించానుగానీ చెప్పలేక పోతున్నాను ..." సాలోచనగా అన్నాడతను.

"ప్రయత్నించావా! ఎప్పుడు? ఎలా?" అంది ప్రత్యూష –

"మనం కూర్చున్నప్పుడల్లా, కర్టెన్ చాటునుంచి వింటూన్నప్పటినుంచీ ..."

కరుణప్రియకు చచ్చేసిగ్గయ్యింది. తను చాటుగా వాళ్ళని గమనిస్తున్నట్టు రాజా గ్రహించాడని ఆమెకు తెలియదు. ఆమెకు అక్కడ ముళ్ళమీద కూర్చున్నట్టుంది. నిజాయితీగల దొంగ తనింట్లోనే దొంగతనం చేస్తూ దొరికిపోయినట్టుందామె ఫీలింగ్.

ఆమె పరిస్థితి అర్థమైంది రాజాకి–

"ఏనీవే – పాతదైన ఒక కొత్త నేస్తం కలిసినందుకు చాలా ఆనందంగా ఉంది అన్నాడతను.

ఓరగా చూసిందామె, కళ్ళకొనలనుండి, కళ్ళు కళ్ళు కలిశాయి. మెరుపు మెరిసింది. భావం సిగ్గయింది. భావన, ప్రత్యూషలు ఒకరి మొహాలొకరు చూసు

కున్నారు. రాజా బుగ్గల్లోకి పొడిచి చిలిపిగా చూశాడామెని. ఇన్నాళ్ల మనసు పొరల్లో ఎక్కడో ఉన్న ఒకభావానికి ఆ క్షణాన కరుణ ప్రియలో స్పందన కలిగింది మౌనంగా వుండి ఓ క్షణం - మరుక్షణం పారిపోయిందామె. ఆనందం పాదాల్లో నర్తిస్తూండగ మేడపైకి - కిటికీ దగ్గరికి - కర్టెను చాటున కురిసే అతని కళ్ళల్లోకి చూసిందాయే. అతనూ కిటికీకేసే చూస్తున్నాడు.

ఆమె కళ్ళల్లో ఆకర్షణ, సిగ్గు,ఆహ్వానం, అమాయకత్వం అభిమానం.... ఇవన్నీ కలిసి తళుక్కున మెరిసినయి.

3

రాత్రంతా స్వప్నాలలోనే గడిపేశాడు రాజా !

తెల్లారుతోంది-

ఆరోజే రాజా కరుణప్రియల పెళ్ళి. అదీ రాజా వాళ్ళు కొత్తగా కట్టిన భావనంలో సువిశాలమైన ఆ భవనం రంగురంగుల దీపాల్తో కళకళలాడుతోంది. విశాలమైన గేటుపై ఆర్చికి పూతోరణాల మధ్యగా, చిన్న చిన్న బల్బులతో 'రాజా వెడ్స్ కరుణ' అని ఉంది. అతిథుల్తో నిండిపోయిందా భవంతి -

భావన, ప్రత్యూష ఒకేరంగు పట్టుచీరెలు కట్టుకొని గేటుపక్కగా నిలబడి అతిథుల్ని ఆహ్వానిస్తున్నారు.

పెళ్ళిపీటల పక్కగా నిలబడి ఉన్నాడురాజా.

పెద్ద పెద్ద బిజినెస్ మాగ్నెట్స్, నగరంలోని లీడింగ్ పెర్సనాలిటీస్ అఫీషియల్స్ అందరూ వచ్చి రాజాని అభినందిస్తున్నారు.

రాజా అనాలోచితంగా ఉన్నాడు. అదేస్థితిలో అందరినీ రిసీవ్ చేసుకొంటున్నాడు. అతని రెండుకళ్ళు గేటుమీదనే వున్నాయి.

దేనికోసమో, ఎవరికోసమో ఆత్రంగా అదుర్దాగా ఎదురుచూస్తున్నాడు. మధ్య మధ్య చెమరుస్తున్నాయి.

స్వర్గస్తులైన తల్లిదండ్రులు గుర్తొచ్చారు. మనస్సొకసారి బాధగా మూలిగింది

రామనాథంగారు ఫారెస్ట్ కాంట్రాక్ట్స్ చేసేవారు. ఆ బిజినెస్‌లో కోట్లు గడించారాయన. ఆయన తరువాత పెద్దబ్బాయి శశి ఆ వ్యాపారం చేస్తున్నాడు. తల్లీ, తండ్రీ చనిపోయేనాటికి రాజాకి పదిహేనేళ్ళయినా పూర్తిగా నిండలేదు. అప్పటికే శశి వ్యాపార సుళువులన్నీ ఆకళింపు చేసుకున్నాడు. రాజా ఇంకా పసివాడవడంవల్ల అతన్ని చక్కని దారిలోకి తీసుకురావాలనే ఉద్దేశంతో అతను వివాహంకూడా చేసుకోలేదు.

ఆయింటి వారికి తెలిసి అదే మొదటిపెళ్ళి. అందుకే రాజావాళ్ళ ఇంట్లోనే జరుగుతున్నదావివాహం.

అతని కళ్ళ కొసలనుంచి రెండు కన్నీటిబొట్లు వేలజారాయి.

కరుణప్రియకు అతన్ని చూస్తే భయంగా ఉంది. పెళ్ళిపీటలమీద కూర్చున్నా అతన్నే చూస్తోందామె. పురోహితుడు రాజాని పీటలమీదకి పిలిచాడు. అయినా అతను వినలేదు.

కరుణప్రియకి కుతూహలానికి అయోమయం తోడయింది. భావన, ప్రత్యూష ఆమెకిరువైపులా కూర్చుని ధైర్యం చెప్తున్నారు.

ముహూర్త సమయం దగ్గరయ్యేకొద్దీ రాజాలో ఆత్రుత ఎక్కువవుతోంది. మనసు కీడుని శంకిస్తోంది.

తన అన్న శశికోసమే అతని నిరీక్షణ - "తనకు తల్లి, తండ్రీ, గురువు, దైవం ... అన్నీ అన్నయ్యే ! మరి అంత ముఖ్యుడైన అన్న రాకుండా కరుణమెళ్ళో మూడుముళ్ళు వేయడమా ? నో ! నెవ్వర్ ! !"

పెళ్ళికొడుకులా మిసమిసలాడాల్సిన అతని వదనం - వారంనుండీ పెళ్ళిహడావిడితో - ఆరోజు ప్రొద్దుటినుంచీ అన్నగారికోసం నిరీక్షణతో నీర్సంగా తయారయింది.

మరికొద్దిసెకన్లలో ముహూర్తం —

పురోహితుడు మరోసారి గట్టిగా పిలిచాడు. కరుణప్రియ తండ్రి 'దాసు'గారు వచ్చి అతన్ని నడిపించుకుంటూ పెళ్ళిపీటలమీద కూర్చోబెట్టారు. అన్యమనస్కంగా అడుగులేశాడు రాజా ... పురోహితుడు చెప్పేవన్నీ యాధాలాపంగా చేస్తున్నాడతను. అతని దృష్టిమాత్రం గేటులోంచి .... తిన్నగా .... దూరంవరకూ కనిపిస్తున్న రోడ్డుమీదే ఉంది.

శశి రాకుండా రాజా సూత్రధారణ చేస్తాడా, చేయడా అనే అనుమానమే అక్కడున్న అందరిలోనూ ఉంది. భావన, ప్రత్యూష కరుణప్రియకి ధైర్యం చెప్తున్నారు.

పురోహితుడు మంగళసూత్రాలు అతని చేతికిచ్చాడు -

నెమ్మదిగా పైకిలేచాడు రాజా ...

సన్నాయి వణుకూ, భజంత్రీల శబ్దాలూ స్థాయి పెంచాయి.

మరుక్షణంలో —

దూరంనుంచీ దుమ్ము రేపుకుంటూ 'రయ్'న దూసుకొస్తోందో అంబాసిడర్ కారు. శశి కారది.

చూడగానే ఒక్క ఉదుటున పీటలమీంచి లేచి గేటువగ్గరకి పరుగెత్తాడు రాజా—

కారు గేటులో ఆగింది.

కానీ ... కానీ .... శశిలేడు - రాలేదు.

రంజిత్ కారుడోరుకొట్టి, స్పీడుగా దిగొచ్చాడు -

"రాజాబాబూ ! ఈపూట బాస్ రాలేనన్నారు. అక్కడ అర్జెంట్ పనుందట. తనగురించి వెయిట్ చేయొద్దన్నారు. ఈ విషయం చెపుదామనే .... ఆఘమేఘాలమీద

వచ్చాను ..." అతని గొంతులో వణుకు -

"తన ప్రాణానికి ప్రాణంగా ప్రేమించే తమ్ముడిపెళ్ళికి అన్నగారు రాకపోవడమూ, పైగా పనుందంటూ కబురంపటమూ ...." అందరూ మొహమొహాలు చూసుకున్నారు.

రాజా నిర్ణయం ఎలా ఉంటుందో అని జయదాసుగారి గుండెల్లో రైళ్ళు పరుగెడుతున్నాయి. కరుణప్రియ కళ్ళవెంట జరజరా జారాయిరెండు నీటిబొట్లు.

"ఈమధ్య అన్నయ్యకి డబ్బుపిచ్చి బాగా పట్టింది. చివరికి నేను చచ్చినా చూడటానికి రాడన్నమాట" గొణుక్కుంటూ పీటల దగ్గరకి వచ్చాడు రాజా.

నేరుగావచ్చి పీటలమీద కూర్చున్నాడు -

అందరిమొహాల్లోనూ ఆనందం -

ఒక మూలగా నిల్చున్న రంజిత్ కళ్ళు నీళ్ళతో మండుతున్నాయి - కర్చీఫ్‌తో మొహం తుడుచుకుంటున్నాడతను —

పెళ్ళయిపోయింది- !

అతిధులందరూ ఒక్కొక్కరే వచ్చి, రాజాని కలిసి వెళుతున్నారు మరోగంట గడిచింది. రాజాకి పూర్తి నిస్సత్తువగా ఉంది. డైరెక్టుగా రూంవైపు నడిచాడతను. అతన్నే గమనిస్తున్న రంజిత్ అతడి వెనుకే లోపలికిదూకి, తలుపు దగ్గరగా వేశాడు.

గిరుక్కున వెనుదిరిగాడురాజా.

అతని బెడ్‌రూంలోకి రావడమే కాకుండా తలుపులుకూడా వేయడంవల్ల అతనికి కోపం గట్లు తెగింది. పిడికిళ్ళు బిగుసుకున్నాయి.

"బాస్ ... బాస్ ... ఘోరం జరిగిపోయింది ...

"యూ బ్రూట్" అనుకుంటూ అడుగు ముందు కేశాడు రాజా.

"మీకొక్కరికే చెప్పాలని వచ్చాను బాస్ .... వినండి పూర్తిగా ..." భయపడ్డాడతను -

రాజా ఎడంకన్ను అదిరినట్టయింది.

"ఏమిటి... చెప్పు ... చెప్పు" అతన్ని పట్టుకుని కుదిపేశాడు రాజా !

బిక్క మొహం వేశాడతను.

"రంజిత్ ! అసలేమైందో చెప్పిచావు" అరిచాడు రాజా.

అక్షరాలు కూడగట్టుకుంటూ, అరక్షణం తర్వాత చెప్పాడతను -

అసలైన ఆవార్త ...

భయంకరమైన వార్త ....

గుండె పగిలే వార్త ...

దాదాపు రాజాని నిర్జీవంగా మార్చేస్తున్న వార్త ...

అతని సర్వస్వం అయిన అన్న 'శశి' దారుణ మరణ వార్త !

వింటూనే నోదక్కిజారి, మెల్లగా .... ఎవరో జారవిడుస్తున్నట్టుగా నేలకొరిగిపోయాడు రాజా !

4

శశికి ముప్పై అయిదు సంవత్సరాలపైనే ఉంటుంది వయసు.

నగరంలోని ఫారెస్ట్ కాంట్రాక్టర్స్ అందరిలోకీ పెద్దగా ఎదిగాడతను. ఎంతో మంచి పేరుంది అతనికి. ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌లోగానీ, ఆ చుట్టుపక్కల అడవుల్లోగానీ శశిమాటంటే వేదవాక్కు. క్రూరమృగాలు సైతం అతని పేరువింటే తోకముడుస్తాయి. ఫారెస్ట్ కాంట్రాక్టర్స్‌లోగానీ, ఫారెస్ట్స్‌లోగానీ, శశికి శత్రువులనే వాళ్ళుగానీ, పోటీదారులు గానీలేరు.

ఆరడుగుల పొడవు, అందమూ - ఐశ్వర్యమూ ఉన్న శశి మీసాలు దువ్వుకుంటూ ఆ అడవుల్లో జీపు డ్రైవ్ చేసుకుంటూ పోతుంటే, అనాగరికులైన అడవి యువతులు సైతం అతన్ని పూలతో కొట్టి పిలిచేవారు, తమ వాంఛలు తీర్చుకోడానికి.

తమ్ముని భవిష్యత్ తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో పెళ్ళయితే చేసుకోలేదుగానీ, శశి వాంఛలను మాత్రం అదుపు చేసుకోలేకపోయేవాడు. దానికితోడు ఇటు నగరంలోనూ, అటు అడవుల్లోనూ అతనికి తమ వయస్సులను పూల పానుపుల్లా పరచి స్వర్గ సుఖాలందించడానికి యువతులు పోటీ పడేవారు.

విషయం విన్నరాజా దాదాపు గంటసేపటి వరకూ తేరుకో లేకపోయాడు. చివరికి తెలియనివ్వకూడదనే నిశ్చయించుకున్నాడు.

జయదాసుగారిని పిలిపించాడు రంజిత్‌తో.

ఆ గదిలో అడుగు పెట్టిన జయదాసుగారి గుండె ఝల్లుమంది.

రాజా రాజాలాలేడు ! పెళ్ళికొడుకులానేలేడు ! నీరసంగా, ఒథలిపోయినట్టుగా ... తల వేలాడేసుకొని ... పిచ్చిగా చూస్తున్నాడు -

"ఏమైందిబాబూ ?"

"చెప్తాను - తలుపులు దగ్గరగావేస్తి, చెమటలు పడుతున్న అరచేతుల్ని షైకండువాతో తుడుచుకుంటూ, దగ్గరకొచ్చారు.

విషయం చెప్పాడు రాజా -

ఆయన ముసలి గుండె ఆగిందోక్షణం -

నిస్సహాయమైన గొంతు సంశయంకోసం అగాధాల లోతుల్లోంచి పిలిచిన భ్రమ - తను దూకుతున్న ఊహ .... రాలే ఆకుల మూగరోదనవంటి శ్వాసల చప్పుడు .... అరనిమిషం .... సరిగ్గా అరనిమిషం - ఎదురుదెబ్బలతో, అనుభవాలతో తలపండి, ముగ్గుబుట్ట రంగుకొచ్చిన వయస్సాయనది - మెల్లగా శక్తిని కూడగట్టుకున్నారాయన. రాజా ఆయన దగ్గరకొచ్చాడు.

"మావగారూ..."

"ఏమిటిబాబూ ?" అన్నట్టు చూశారాయన.

ఎట్టిపరిస్థితులలోనూ కరుణకి ఈ విషయం అప్పుడే చెప్పొద్దు - అసలు ఎవరికీ చెప్పొద్దు. నేను ఇప్పుడే ఫారెస్ట్‌కి వెళ్తున్నాను. ఎవరికైనా ఈ విషయం తెలిస్తే - తర్వాత మీ అమ్మాయినే అంటారు ...." రాజాలోని నిస్త్రాణత తెరలు తెరలుగా విడిపోయింది. మొండితనం, ధైర్యం వేటిస్థానాల్లో అవివచ్చి చేరాయి.

మరికొద్దిసేపటికే గేటులోంచి ముందుకురికింది అంబాసిడర్‌కారు. డ్రైవింగ్ సీట్లో రాజా ఎలర్ట్‌గా కూర్చున్నా, అతని ఆలోచనలుమాత్రం అన్నగారి స్మృతుల్నే స్పృశిస్తున్నాయి —

5

ఆకాశం నిర్మలంగా ఉంది. అక్కడక్కడా లేతనీలిమేఘాలు కదులుతున్నాయి. సమయం సాయంత్రం అయిదుగంటలు దాటుతోంది.

మెయిన్ రోడ్డుమీద మెల్లగా కారు నడుపుకుంటూ వెళ్తున్నాడు రాజా. ప్లాట్‌ఫాం మీద తలవంచుకొని నడుస్తోంది కరుణప్రియ.

"హలో !" తనని దాటుకుంటూ పోతున్న కరుణప్రియని పలకరించాడతను. ఎప్పటినుండి ఫాలో అవుతున్నావ్ ?"

"నీ కరుణ కిరణాలకోసం ఫాలోకాక తప్పుతుందా !"

"ఇంతకీ ఎటెళ్తున్నావ్ ?" దగ్గరగా వచ్చిందామె.

"నువ్వు తోడొస్తానంటే ఆకాశపుటంచులదాకా ... రానంటే లోతులలోతుల్లోకి ఎటెళ్ళమంటావ్ ?"

"ఏయ్ ! ఏమిటీరోడ్డుమీదామాటలూ ? కారెక్కు" కోపం నటించిందామె.

కిమ్మనకుండా డ్రైవింగ్‌సీట్లోకి చేరాడతను. కరుణప్రియ అతనిపక్కనే కూర్చుంది. కారు కదిలింది. నాలుగయిదు నిమిషాలవరకూ ఎవరూ మాట్లాడలేదు.

"మౌనం, నిశ్శబ్దాలు నా శత్రువులు..." అన్నాడు రాజా.

"ఎప్పుడూ మౌనంగానే ఉండాలి"

"ఆ తమర్నేమనుకోవాలో తెలుసా ?..."

"ఏమని ?"

"నీకు నీడిగాని
నా ఊసులు తప్ప
నాకు నావిగాని
నీ తలపులు తప్ప
ఏం మిగిలాయీ జీవితానికి ..." అని.

"భేష్. ఈమధ్య ఆశువుగా చెప్తున్నావే కవిత్వం" మనసులో ఎంత అభిమానిస్తున్నా, ఆమె రాజాని అలానే అంటుంది.

"ఎవరో అన్నది గుర్తొచ్చింది. అంచేత, జీవితం అతి చిన్నదని వీలయినంత తక్కువ కాలంలో దాన్ని అనుభవించాలనీ మర్చిపోకూడదు."

"అనుభవించాలి" అనేమాటకి తలతిప్పి కోపంగా చూసిందామె.

"అహహ ... అదికాదూ ... ఇప్పుడు మనమేమీ మాట్లాడుకోకుండానే ఇల్లు వచ్చేస్తోంది చూశావా ? అందుకనే అలా అన్నా ..." సర్దిచెప్పాడు రాజా.

"నువ్వన్నవన్నీ ఒప్పుకుంటానుగానీ, మరి అన్నగారిదగ్గర త్వరగా పర్మిషన్ తీసుకో..." 'అన్నగారి' పదాన్ని నొక్కి చెప్పిందామె.

"ఈమధ్య అన్నయ్యతో సరిగా మాట్లాడటం కుదరలేదు కరుణా ! ఆయన చాలా సీరియస్‌గా ఉంటున్నాడు. మనిద్దరిగురించి ఆయనకు ఎవరైనా చెప్పేశారేమోనని నా అనుమానం .... కొంచెం మంచి మూడ్‌లో ఉన్నప్పుడు తప్పకుండా చెప్పేస్తా ... చెప్పడమేమిటి పర్మిషన్ లెటర్ తెచ్చి నీకు చూపించనూ ..." కరుణ ఇంటిదగ్గర కెళ్ళి కారు ఆగింది.

"గొప్పే ..." నాలుకని బుగ్గల్లో పొడుచుకుని వెక్కిరింపుగా అంది. కారు డోరులోంచి కరుణని చూస్తున్న రాజాకి, గొంతు తడారిపోయింది. కరుణకి వెనకాలే నిలబడి 'రాజా' కోపంగా ఇటే చూస్తున్నాడు. రాజా ముఖకవళికల్ని గమనించిన కరుణప్రియ వెనక్కి తిరిగింది. అనుమానంగా. మరుక్షణం భయంతో ఇంట్లోకి పరుగెత్తింది.

భావన తమ ఇంటి అరుగుమీద నిలబడి భయంగా చూస్తోంది.

రెండుచేతులూ వెనగ్గా పెట్టుకుని, మెల్లగా నడిచివస్తున్నాడు శశి, కారుదగ్గరకి అతనికళ్ళు ఎర్రగా ఉన్నాయి. రాజా నోరు మెదవలేకపోయాడు.

అన్నగారు అలా ఎదురుపడతాడనీ, రెడ్‌హేండెడ్‌గా తమని పట్టుకోడానికి ప్రయత్నిస్తాడనికానీ రాజా ఊహించలేదు.

రాజాగురించి నలుగురూ చెప్తూండడంవల్ల ఆరోజు శశి భావన ఇంటికి డైరెక్టుగా వచ్చేశాడు.

"రాజా ! రాజా !" గట్టిగా అరిచాడు శశి.

"రాజా రాలేదండీ ! లోపలకొచ్చి కూర్చోండి" అంది భావన.

"సంతోషం" అన్నాడు శశి. భావనకి ఆయన రాజావాళ్ళ అన్నయ్యేనని అర్థమైపోయింది. ఆయన గురించి, ఆయన మాటల గాంభీర్యం గురించి రాజా ఎప్పుడూ చెపుతుంటాడు.

అతను తిరిగి వెళ్ళిపోదామనుకుంటుండగా రాజా, కరుణప్రియ కలిసి అక్కడకు చేరుకున్నారు.

ఆశ్చర్యంతో నోరు మెదపక కూర్చున్న రాజా, శశి కారులో కూర్చోగానే అప్రయత్నంగా గేరు మార్చాడు. వాళ్ళ కారు వెనకే శశి వచ్చిన కారుకూడా కదిలింది.

"ఎవరాఅమ్మాయ్ ?"

"........."

"నీకు ఆ అమ్మాయి వ్యక్తిత్వం, నడవడికలమీద గురివుందా?"

"............"

"నువ్వు పెళ్ళి చేసుకోడానికే నిశ్చయించుకున్నావా?"

"............"

మూడేమూడు ప్రశ్నలేశాడుశశి. ఒక్కదానికీ రాజా సమాధానం చెప్పలేదు. అసలతనికి ఎలా మాట్లాడాలో తెలియడంలేదు.

శశి ఆ అమ్మాయి గురించి తెలుసుకున్నాడు. ఆ అమ్మాయి చదువు, వ్యక్తిత్వం, కులం, గోత్రం, స్థితి ... అన్ని వివరాలూ శశికి తెలుసు. ఆఖరికి ఈ రోజు ఆమెను చూడటం కూడా జరిగింది, కానీ, రాజా ఆమెను మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నాడా - లేక కేవలం 'స్నేహం మాత్రం చేస్తున్నాడా' అనే విషయమే తెలుసుకోవాల్సి ఉంది.

"అన్నయ్యా! నేను మనస్ఫూర్తిగా ఆ అమ్మాయిని ప్రేమిస్తున్నాను. నీ అంగీకారంతో పెళ్ళిచేసుకోవాలనుకుంటున్నాను. మన సాంప్రయాదాలకి ఆమె తగ్గ అమ్మాయని నా నమ్మకం ... ఎటొచ్చి స్థితి ..."

ఇంట్లోకెళ్ళిన తర్వాత మెల్లగా కదలేశాడు రాజా.

"ఇక నువ్వెళ్ళు ..."

అన్నగారి అంతరార్థమేమిటో అవగతమవ్వడంలేదు రాజాకి. ఆలోచనలతోనే అన్నగారి కేసి బేలగా చూశాడు. తమ్ముడి మొహంలోని ఆవేదనని చూసి శశికి బాధ అనిపించింది.

"ఆల్‌దబెస్ట్ రాజా!" మెల్లగా, నిరాశగా అడుగులు వేస్తూ వెళ్తున్న రాజాకి తన అంగీకారాన్ని తెలియజేశాడు శశి. గిరుక్కున వెను దిరిగి వచ్చేశాడతను.

"అన్నయ్యా ....థాంక్స్.... థాంక్స్" ఆ చిన్న మాటలోనే తన ఆనందాన్ని, కృతజ్ఞతనీ చూపించి, కరుణప్రియ ఇంటివేపు పరుగు తీస్తున్న రాజాని చూసి తృప్తిగా నవ్వుకున్నాడు శశి.

6

అతి గంభీరమైన అన్నగారి ముఖవళికల వెనుక తన కోసం, తన భవిష్యత్తు కోసం ఉన్న ఆరాటాన్ని, అతని అభిమానాన్ని తల్చుకుంటే రాజా కళ్ళు లేతనీటి పొరలతో అలుక్కుపోతున్నాయి.

గుండెని ఎవరో చేత్తో నలిపేస్తున్నట్టుందతనికి.

కారు చాలా స్పీడ్‌గా వెళ్తోంది. రంజిత్ ఆలోచనలు అతనివి.

వాళిద్దరి మధ్యా నిశ్శబ్దం విచ్చలవిడిగా రాజ్యమేలుతోంది. రంజిత్‌కు రాజాని మాట్లాడించాలనివుంది. కానీ అతని గంభీరత రంజిత్ ధైర్యాన్ని తగ్గిస్తోంది.

రాజా వదనంమీద - ఎవరో తెలీని వ్యక్తులపై కసి, ఈ విషయం అవునా-

కాదా? అనే సందేహాలు, నర్తిస్తున్నాయి. ఎంతో టెన్షన్‌తో కారు నడుపుతున్నాడతను. రంజిత్ - ఆ స్థితిలో రాజా కారు నడపడం ఇష్టంలేదు. ఆ విషయం చెప్తే ఏమంటాడోననే భయం. మొత్తానికి ధైర్యంచేసి అన్నాడు రంజిత్.

"నేన్నడిపిస్తాబాస్ కారుని ..."

"షటప్!"

ఆ గజందూరంలో రాజా అరచిన అరుపుకి పక్కన బాంబు పడ్డంత ఉలిక్కిపడ్డాడు రంజిత్. ఎందుకంత గట్టిగా అరిచాడో, అనుకున్నాడతను 'ఈ పరిస్థితిలో కారు నడపడం ఏ మాత్రం మంచిదికాదు' అనికూడా అనుకున్నాడు.

కారు, నగరపు విశాలమైన రోడ్డు మీదనుంచి, అడవులలోకి వెళ్ళే ఇరుకైన రోడ్డుమీదకి సర్రున తిరిగింది.

శశికి కాంట్రాక్టులున్న ఆ చుట్టుప్రక్కల అడవులలో వాళ్ళకి అయిదు గెస్ట్ హౌసులున్నాయి, ప్రతిదీ అత్యాధునికంగా కట్టబడిందే. ప్రతిగెస్ట్‌హౌస్‌కి టెలిఫోన్ సౌకర్యంవుంది. ప్రతిచోటా సమర్థులైన, నమ్మకస్తులైన ఇద్దరు సెక్యూరిటీ గార్డులు తన కుటుంబాలతో ఉండటానికి సౌకర్యాలు ఉన్నాయి.

తమ గెస్ట్‌హౌస్ లన్నింటిలోనూ రంజిత్, జస్వంత్‌లుండే గెస్ట్‌హౌస్ దగ్గర్లోనే జనసంచారం ఉండదు. అక్కడికి పదిహేను ఇరవై కిలోమీటర్ల దూరంలో ఒకే ఒక్క గూడెంతప్ప మరేదీలేదు. ఆ గూడెంపేరు 'బందీలబర్రి'

అదేగెస్ట్‌హౌస్‌లో గతరోజు శశి చనిపోయాడు.

"అసలు శశికి ఏవిధమైన అనారోగ్యమూలేదే. ఒకవేళ వంట్లో బాలేకపోతే తనకు ఫోన్‌లో చెప్పి ఉండేవాడుగా! మరి అంత హఠాత్తుగా ఎలా చనిపోయాడు?"

"శశి చనిపోయాడా? లేక చంపబడ్డాడా?" ఎన్నో ఆలోచనలు అతన్ని వేధిస్తున్నాయి.

శశి చంపబడ్డాడని అనుకోడానికి కారణం ఉంది. అతను ప్రతి గెస్ట్‌హౌస్ లోనూ లెఖ్ఖలేనంతగా డబ్బు ఉంచుతుంటాడు. వారం రోజులక్రితం రాజాకు మాటల సందర్భంలో చెప్పినదాన్నిబట్టి దాదాపు అయిదారు లక్షలరూపాయలు 'బందలబర్రి' గెస్ట్‌హౌస్‌లో ఉండాలి.

"ఒకవేళ ఆ డబ్బుకి ఆశించి, సెక్యూరిటీగార్డులే ఈ పని చేయలేదుకదా?!"

ఆ అనుమానం రాగానే 'టక్' మని తలతిప్పి రంజిత్‌వంక చూశాడురాజా. రంజిత్‌కూడా ఏదో ఆలోచనలలో ఉన్నట్టున్నాడు. రాజా చూపుకి తత్తర పడ్డాడతను.

"ఏది ఏమైనా ముందు అన్నగారి దేహాన్ని చూస్తేగానీ ఏ నిర్ణయమూ తీసుకోకూడదు" అని నిర్ణయించుకున్నాడు రాజా. అతనిచూపు రోడ్డుమీదకి సాగింది.

గతుకుల దారిలో అతివేగంగా ఉరుకుతోంది అంబాసిడర్ కారు. స్పీడ్ మీటర్‌లో ముల్లు పచ్చపరిధిదాటి ఇంకా కుడివైపుకు వంగుతోంది.

రోడ్డంతా నిర్జనంగా ఉంది. పొడుగ్గా సుదూరంవరకూ వంపులు తిరిగిన ఆ దారి బలవంతుడి బలానికి లొంగిపోయి నమస్కరిస్తున్న స్త్రీలా, తలొంచుకుని రాజా ముందుకొస్తోంది – అంతలో పెద్ద మలుపు .... ఎడంవైపు .... అతి లాఘవంగా కట్ చేశాడు రాజా. ఆ మలుపు వెనుకే దారి ఇరుకైపోయింది. మరికొద్దిదూరం పోగానే రోడ్డుపక్కగా .... చిన్నగా, తెల్లగా కనిపిస్తోందో జంతువు. అది కుందేలుపిల్ల.

కుడివేపు పొదల్లోంచి ఎడమవేపుకి పరుగెడుతోంది. బలాన్నంతా పాదంలోకి తీసుకుని బ్రేకును నొక్కాడురాజా. ఎడం చేత్తో గేరు మార్చాడు.

అప్పటికే ఆలస్యమైపోయింది.

కుందేలుపిల్ల మీదనుండి కారు చక్రాలు దేక్కుంటూ పోయి పదడుగులు దాటాక ఆగాయి. తెల్లటి రంగులో ఎరుపు కలిపినట్టుగా చిన్న ముద్దలా అంటుకుని ఉంది, రోడ్డుమీద.

కారులోంచి ఒక్క దూకుదూకి వెనక్కి పరిగెత్తుకుంటూ వచ్చాడు రాజా.

పొదలమాటు నుండి ఒక పెద్ద కుందేలు, పిల్లకుందేలు, తల్లి కళ్ళవెంట నీళ్ళు కార్చుతూ....భయం భయంగా .... బేలగా చూస్తోంది –

చనిపోయిన పిల్ల స్థితినీ, పొదలమాటున మాటలురాని, నోరుపెగలని ఆ తల్లి మూగ రోదననీ చూసినరాజా – తన గుండెని ఎవ్వరో ఇనుప పాదాలక్రింద పడేసి తొక్కి తొక్కి హింసిస్తున్నట్టుగా కృంగిపోయాడు.

ఒక్క క్షణం అతని హృదయం బావురుమంది. కళ్ళనుండినీళ్ళు కారుతున్నాయి.

అప్పటి వరకూ గుండెరాయి చేసుకుని, అన్నగారి నిర్జీవ శరీరాన్ని చూడటానికి మొండిగా బయలుదేరి ధైర్యంగా ఉన్న రాజాకి, ఆ క్షణంలో మహా సాగరాన నిస్సహాయంగా మునిగిపోతున్నట్టనిపించింది. బాధని ఆపుకోలేక, తన పక్కనే బెరుకు బెరుగ్గా నిలబడ్డ రంజిత్‌ని కౌగలించుకొని బావురు మన్నాడు రాజా.

ఆ ఏడుపుకి భయపడి స్పృహవచ్చిన దాన్లా పెద్దకుందేలు పొదల్లోకి పరుగు తీసింది.

రంజిత్‌కి రాజాని ఎలా ఓదార్చాలో తెలియడంలేదు.

"బాస్ ... ఊరుకోండిబాస్ .... బాస్ ..." నోటికొచ్చిన ప్రతిమాట ఎంతో వినయంగా, సానుభూతితో అన్నాడతను.

"బాస్ .... రండిబాస్ .... ముందు గెస్ట్‌హౌస్ చేరుకుందాము...." రాజాని నడుంచుట్టూ చేతులేసి, నడిపించుకుంటూ కారు వెనకాలసీట్లో కూర్చోబెట్టి, తను డ్రైవింగ్ సీట్లోకి మారాడు రంజిత్.

అలసటతో సీటు వెనక్కి జారగిలబడి, కళ్ళు మూసుకున్నాడు రాజా.

కారు కదిలింది —

మరికొంత సేపటికి మరో పదిపదిహేను కిలోమీటర్ల దూరంలో గెస్ట్‌హౌస్

ఉందనగా .... కారు ఆగింది.

రోడ్డువారగా వందేళ్ళు పైనేసుకుని విచ్చలవిడిగా విస్తరించిన వేలాది శాఖలతో ఉన్న ఊడలమర్రి నీడకి పోనిచ్చి కారులోంచి దిగాడు రంజిత్. రాజావంక చూశాడతను. అలసటగా నిద్రపోతున్నాడు రాజా. మరోసారి చుట్టూ కలయజూసి చెట్టు వెనక్కి అడుగులేశాడు.

ఆ చెట్టునీడల్లో .... ఆ సహజ ప్రకృతి సౌందర్యంమధ్య మనసు ఆహ్లాదకరంగా మారడానికి సెకన్ల సమయం చాలు.

చల్లగాలి అల ఒకటి లయగా వీచింది. ఆ గాలితాకిడికి మెల్లగా కళ్ళుతెరిచాడు రాజా.

కారు పార్కుచేసి ఉండటం, రంజిత్ కార్లో లేకపోవడంతో అతని భృకుటి ముడుతలు పడింది. ఆశ్చర్యం మొహాన్న నర్తించసాగింది. చుట్టూ చూశాడతను. కారుదిగి అంతటా చూపులు సారించాడు.

కొంచం ఎడంగాఉన్న ఒక పెద్దచెట్టుకొమ్మల గుబురుల్లో అలికిడి....

కనుబొమ్మలు రెండు నిటారుగా నిలబడ్డాయి రాజాకి —

సరిగ్గా తన ఎదురుగ్గా ...

చెట్టుకొమ్మల మధ్యగా ....

ఆకులని అలుడిపాళ్లేస్తూ ...

తదేకంగా చూస్తోందో ఆకారం ....

ఆ ఆకారం ఒక స్త్రీది. ఆటవిక స్త్రీది.

పరువపు ప్రాయాన్ని ప్రకటిస్తున్న లేలేత కళ్ళు –

చెంగున దూకిందామె కిందకి.

కళ్ళుచెదర్చే అందమామెది. కళ్ళు విప్పార్చి పరిశీలనగా చూస్తోందామె రాజాని.

తత్తరపాటుగా ఒక్క అడుగు వెనక్కివేసి, కారుకు గుద్దుకొని నిలబడ్డాడు రాజా. నోరుతెరచి అలానే చూస్తున్నాడతను.

వయసుతో పోటీపడుతున్న ఆమె అందాలు శరీరాన్ని కప్పుతున్న చిన్నివస్త్రాలను నెట్టుకుంటూ ముందుకొచ్చి దర్శనమిస్తున్నాయి. బొడ్డుకిందగా జానెడుమేర ఒక తోలువస్త్రం చుట్టుకుందామె. గుండెలచుట్టూకూడా ఒకవస్త్రం కట్టుకుంది.

రాజాని చూస్తున్న ఆమె చూపులు చెట్టువెనక్కిసాగి తత్తరపడ్డాయి. ఆమె పెదాలమీది చిరునవ్వు నిల్చి మాయమైంది. వచ్చినంత వేగంగా మర్రిచెట్టు కొమ్మల్లోకి ఎగబాకిందామె.

రాజాకు మతిపోయింది.

ఆపిల్ల ఎవరు? తను శశి తమ్ముణ్ణని గుర్తుపట్టగలిగే ఆటవిక స్త్రీయేనా? తనను అంత పలకరింపుగా నవ్విందేమిటి? ఆ నవ్వు గౌరవానికి చిహ్నమా? లేక

వాంఛాప్రకటితమా ?

కారు కదిలింది -

అప్పుడుగానీ, అతను - రంజిత్ వచ్చి డ్రైవింగ్‌సీట్లో కూర్చున్నట్లు గ్రహించ లేదతను.

"అంటే .... రంజిత్‌నిచూసి ఆమె వెనక్కిపోయింది! లేకుంటే .... తనదగ్గ రగా వచ్చేదా ? ఏమో ? !"

కారు ముందుకి ఉరికిపోతుంటే, రాజా వెనక్కే చూస్తున్నాడు.

ఆశ్చర్యం !

ఉన్నట్టుండి ఆమె మాయమయ్యింది. అచెట్ల గుబురుల్లోలేదు !

ఆ ఆలోచనల్ని అక్కడే తుడిచేసుకుని - గెస్ట్‌హౌస్‌ని చేరుకోవాలనే ఆతృతి అప్రయత్నంగా కలగజేసుకున్నాడతను.

7

కారు గెస్ట్‌హౌస్ చేరుకుంది -

గేటు వరకూ ఎదురు పరుగెత్తుకొచ్చి వినయంగా నమస్కరించాడు రెండవ సెక్యూరిటీ గార్డు జస్వంత్.

పనివాడు రంగా వచ్చి కారుడోర్ తీశాడు. కారులోంచి ఒక్క ఉదుటన దిగి లోపలికి పరుగుతీశాడు రాజా. రంజిత్, జస్వంత్, రంగాలు అతని వెనుకే లోనికి పరుగు తీశారు.

ఎక్కడా శవం ఉన్నట్టులేదు ! గదిలో సుగంధాల వాసన !! హాలుమధ్యగా పెద్ద బాక్స్‌ఉంది. ఆ బాక్స్‌మూత తెరిచాడు జస్వంత్.

శవం ఉంటుందనుకున్న రాజా - ఆ చుట్టుపక్కలంతా చూసి, బాక్స్ దగ్గరకు వచ్చాడు.

ఆ బాక్స్ నిండా పెద్ద పెద్ద ఐస్ ముక్కలను ఉంచి, వాటి మధ్యగా ఉంచారు శవ శరీరపు ముక్కల్ని.

గజంపొడవు, అరగజం వెడల్పు మాత్రమే ఉన్న ఆ బాక్స్‌లోకి అన్న రూపం చూద్దామని తలగుచ్చిన రాజాకి జుగుప్సాకరమైన దృశ్యం కనబడింది.

ఎర్రటి రంగులోకి మారిపోయిన ఐస్ ముక్కల మధ్యగా ... చిన్న చిన్న మాంసం ముక్కలు ... యముకలు .... పుర్రె దానికి కొద్దిగా అతికించినట్టున్న జుట్టు, ఒక కన్ను ... !

ఆ పుర్రె యముకలు తప్ప, మానవ రూపంలేదు ఆ బాక్స్‌లో ....

నోట మాటలేదు రాజాకి.

మనసున ఆలోచనలూ లేవు

దుఃఖం కట్టలు తెంచుకుని పొంగుతుంటె కళ్ళు మాత్రం వర్షిస్తున్నాయి ...

రాజా ఏడుస్తున్నాడు

ఒక్కసారి గొంతుచించుకుని "అన్నయ్యా అన్నయ్యా" అంటూ అరుస్తూ ఏడుస్తున్నాడు బాక్స్ చుట్టూ తిరుగుతున్నాడు.

ఉన్మాదిలా అరుస్తున్నాడు -

(మరోసారి గొంతులోంచి పెద్ద పిచ్చికేక వెలువడిందతనికి. ఆ బాక్స్‌ని రెండుచేతులతోనూ బలవంతాన పైకిఎత్తి ఆ నీళ్ళని, ఆ మాంసపు ముక్కల్ని, ఆ యముకలని తనమీద గుమ్మరించేసుకున్నాడు -)

అక్కడ ఎవరికీ ఏమి చేయడానికి తోచడంలేదు.

బిక్కచచ్చి చూస్తున్న ఆడవాళ్ళు ఇద్దరూ తమ బాటాలలోకి పోయి కిటికీల చాటునుంచి చూస్తున్నారు భయంగా !

అందరి ముఖాలలోనూ విషాదం, కళ్ళల్లో సానుభూతి.

రంగా ఒకడుగు ముందుకేశాడు. రంజిత్ అతన్ని వారించాడు. జస్వంత్‌కి రంజిత్ అలా ఎందుకన్నాడో అర్థం కాలేదు. రంజిత్‌వంక అనుమానంగా చూస్తున్నాడతను.

మరోకేకపెట్టాడు రాజా ....

అందరూ కళ్ళు విప్పార్చి చూస్తున్నారతన్ని.

తన చేతుల మధ్యనున్న ఆ బాక్స్‌ని బలవంతాన నలిపేస్తూ ఆ నేలమీద ... చిందర వందరగా పడిఉన్న తన అన్నగారి శరీరపు ముక్కలమీద పొర్లుతున్నాడు రాజా.

పిచ్చిగా ... పిచ్చి పిచ్చిగా .... ఏడుస్తున్నాడతను.

గెస్ట్‌హౌస్‌అంతా గందరగోళం !

"తమ్ముని భవిష్యత్తుకోసం తన సర్వసుఖాలనూ త్యజించిన ఏ అన్నగారికైనా ఆ అభిమానం దక్కుతుందేమో !"

అది అభిమానము !- తన నీడని కోల్పోయినందుకు రాజాకనబరుస్తున్న బాధే !

హాలంతా అలానే పొర్లి పొర్లి మరికొంత సేపటికి - సొమ్మసిల్లి అలా .... అలా ... తల పక్కకి వేలాడేశాడతను - మగతగా మూలుగుతూ !

జస్వంత్, రంజిత్‌లు అతన్ని లేవనెత్తి పక్కనున్న పెద్ద టేబుల్‌మీద పరుండ బెట్టారు.

రంగా ఒక గుడ్డతో అతన్ని శుభ్రంచేస్తున్నాడు.

ఆడవాళ్ళు రెండు చీపుర్లు, గోనెగుడ్డలూ తీసుకొచ్చి హాలు శుభ్రం చేస్తున్నారు.

ఆ గెస్ట్ హౌస్‌లో ఉన్న వారందరికీ తమ సొంత అన్నగారు చనిపోయినంత బాధగాను ఉంది .... !

8

కరుణప్రియకు మనస్సంతా ఆందోళనగా ఉంది.

కాలు నిలవడంలేదు ... గందరగోళంగా ఉన్న ఇంట్లో - బంధువులు...

స్నేహితులు ...

రాత్రి - పది కావస్తోంది.

ఆ రోజు ఆ నూతన వధూవరులకు శోభనం రాత్రి.

"నాన్న, అమ్మా ... అందరూ .... అందరూ ఎవరి హడావిడిలో వాళ్ళున్నారు. తన నసలు పట్టించుకోవడంలేదు. ప్రొద్దుట నుండీ రాజా తన కంటికే కనబడలేదు. ఎక్కడికెళ్ళాడు ? ఎందుకెళ్ళాడు ? కనీసం తనకో మాట చెప్పి వెళ్ళొచ్చుగా ?"

పరి పరి విధాల ఆలోచిస్తోందామె -

జయవాసుగారికి అక్కడ గెస్ట్‌హౌసులో పరిస్థితి ఎలాఉందోననే బాధ ఒకవైపు కూతురికి ఎలా చెప్పాలో అనే బాధ మరోవైపు చేసి అయోమయంగా చేస్తున్నాయి.

మరో అరగంటకి ...

రాజా వస్తాడులెమ్మని కరుణప్రియని ఒక గదిలోకి పంపేశారు వాళ్ళు. ఆమె ఆ గదిలోకి అడుగు పెట్టిన వెంటనే తలుపులు 'ఛళ్ళు'న మూసుకున్నాయి. ఆమెతల్లి దేవకి చేసినపనది.

అక్కడ వున్నవారందరినీ దూరంగా తీసుకెళ్ళి అసలు విషయం చెప్పిందామె. వాళ్ళందరూ వాళ్ళ కుటుంబానికి అతి ముఖ్యులు. వాళ్ళు కరుణప్రియకి ఆ విషయం తెలియనివ్వరని ఆమెకి తెలుసు.

కరుణప్రియ బెడ్‌పక్కనున్న స్టూల్‌మీద కూర్చుని మంచానికి ఆనుకుంది. ఆమె మనస్సంతా ఆలోచనలు.

ఒకవైపు – ఆ ఆలోచనల్లో కొన్ని కోరికలు ముళ్ళై మనసుని గిల్లుతుంటే ఒళ్ళంతా పులకరింతలు –

మరోవైపు – రాజామీద కోపం! అంతగా ఈ శోభనం అతనికి ఇష్టం లేకపోతే ముందు తనకి చెప్పచ్చుగా !

కాలం దొర్లుతోంది భూతకాల పల్లాలలోకి –

కళ్ళు అరమోడ్పులై కలలకి తావిచ్చాయి.

శ్వాసలు బరువై ఆ కలలకి తియ్యదనాన్ని తెచ్చాయి –

ఓ రాత్రివేళ ....!

టక్ .... టక్ .... టక్ ....

తలుపులమీద చిన్న చప్పుడు.

మెల్లగా కళ్ళు తెరిచిందామె. ఒళ్ళు విరుచుకుంటూవెళ్ళి తలుపులు తీసింది. ఎదురుగా రాజా! తెల్లని బట్టలలో ఉన్నాడతను.

అందంగా నవ్వుతూ, చిలిపిగా చూస్తున్నాయి అతనికళ్ళు. ఆశ్చర్యంగా చూస్తోందామె –

"ఏం ? నన్ను లోపలికి రానీయవా ?

ఉలికిపాటుగా పక్కకి తొలిగింది –

లోపలికొస్తూనే తలుపులు గడియ పెట్టాడతను.

"సారీ కరుణా! ఆలస్యానికి క్షమించవూ ?".

అంతవరకూ, అతను రాకపోయినందుకు ఆమె ముఖం ఎర్రగా ఉంది. ఇప్పుడతను వచ్చేసరికి సిగ్గులన్నీ ఆ ఎరుపులోకేపోయి చెక్కిళ్ళు ఎరుపెక్కాయి.

రెండు చేతులనూ ఆమె నడుంచుట్టూ బిగించి, ముద్దులతో ముంచాడామెని. ఒకక్షణం – ఆమెకి కోపమింకా తగ్గలేదు. అందుకే వయసు తనచేతుల్ని అతని వీపు చుట్టూ వేసినా, సిగ్గు ఆ చేతులకి సత్తువ నివ్వడంలేదు.

రాజా ఆమెనలాగే ఒడిసి పట్టుకొని, గాలిలోకి ఎత్తి బెడ్‌దగ్గరకి అడుగులేశాడు. సిగ్గుతో ఆ చివరికి దొర్లిందామె. పాన్పున పరచిన మల్లెలు గలగలమని నవ్వుతున్నాయి. ఏదో అనబోయిన కరుణప్రియ పెదాల్లో, కిందపెదవి రాజా పెదాలమధ్య ఇరుక్కుపోయింది. మధురమైన అనుభవం ... అప్పటివరకూ వద్దనుకుంటూ ఎదురుచూసిన అవకాశం ... నిద్రపోబోయిన కోరికలను సుతిమెత్తగా మీటినట్లయిందామెకి. ఫలితంగా భౌతిక దేహ వేదికపై ఆనంద నర్తనం ఆరంభమయింది. మరికొన్ని క్షణాలకి 'అతనితో ఆమెలో అతను'

మరికొన్ని క్షణాలని తృప్తిగా నవ్వి ఆమె అరమూసిన కళ్ళు- అతన్ని తనకు తెలియకుండా చుట్టేసిన తనచేయి పక్కకు ఒరిగిపోయింది.

'ధన్' మని శబ్దించిందాగది –

ఉలిక్కిపడి కళ్ళు తెరిచిందామె –

నిద్రలో తనచేయి తగిలి కిందపడి ముక్కలైన గాజుగ్లాసులోని 'పాలు' పల్లానికి పరుగులు తీస్తున్నాయి.

చుట్టూ చూసిందామె.

ఎవ్వరూ లేరు ...

తన కలలకి తనకే సిగ్గయింది.

అంతలోనే —

కోపం ... ఆశ్చర్యం ... ఆలోచన ...

ఆమె మెదడు చురుగ్గా పనిచేసిందోక్షణం ... ఎన్నో ప్రశ్నలడుగుతోంది.

"ఏడి ? రాజాఏడి ? ఇంకా రాకపోవడమేమిటి? ఇవ్వేళ తమకు మొదటి రాత్రనికూడా మర్చిపోయాడా ?

విసురుగా తల విదిల్చి లేచింది – గడియారం చూసింది.

గుండె ఆగినట్టయిందామెకి – ఏదో కీడు శంకించింది కరుణప్రియకి. ఆమె భయాన్ని పెంచుతూ గడియారం అయిదుగంటలు కొట్టింది. ఠంగ్ ఠంగ్ ఠంగ్ ఠంగ్ ఠంగ్.

మల్లెల పానుపుమీద .... మనసులు విరిసే వేళల్లో భర్తకు తీగలా అల్లుకుపోవాల్సిన ఆ రాత్రి ...

తను ఎన్నోరోజులుగా ... ఎంతో ఆశతో ... కన్నెతనపు కోరికతో కవ్వించే పులకరింతలతో ఎదురుచూసిన ఆరాత్రి ....

తామిద్దరూ ఏ హద్దులూలేక ఒకరిలో ఒకర్ని దాచుకుని వసంతాలాడుకుంటూ స్వర్గద్వారాలుదాటి ప్రేమైక వాహినిలో .... కాముని అలలపైన సాగుతూ పోవాల్సిన ఆరాత్రి ....

వారి తొలిరాత్రికి ముహూర్తమైన ఆ రాత్రి -

కన్నకలలన్నీ కల్లలుకాగా, విసురుగా, బద్ధకంగా, ఒళ్ళు విరుచుకుంటూ తూర్పుకి చేరిందని హెచ్చరిస్తూ కూసిందోకోడి .... ఎక్కడో !

కోపంగా వెళ్ళి తలుపులు తెరిచింది కరుణప్రియ.

అంత ప్రొద్దుటే పిల్లాపాపలతోసహా అందరూ నిద్ర మేల్కొని 'ఎలర్ట్'గా కూర్చున్నది ఒక ఆశ్చర్యకరమైన విషయమైతే - ప్రతి ఒక్కరూ దీనంగా పెట్టిన తమ మొహాన్ని ఆమెనిచూసి తిప్పుకోవడం మరోవిషయమైంది.

"ఏంజరిగింది ?" హూంకరించిందామె - ప్రతిధ్వనించిందా అరుపు —

జయదాసు పరుగున వచ్చి, కూతుర్ని తిరిగి రూంలోకి తీసుకుపోయారు. అప్పటివరకూ దుఃఖాన్ని ఆపుకున్న ఆమె తల్లి దేవకి గట్టిగా బావురుమంది. ఆ ఏడుపుకూడా కూతురికి వినపడకుండా కొంగుసు నోట కుక్కుకుని లోపలికి వెళ్ళిపోయింది.

విషయం తెలుసుకున్న కరుణప్రియ తండ్రిని కౌగిలించుకొని ఏడ్చేసింది. తను వెంటనే గెస్ట్‌హౌస్‌కి వెళ్తానంది. ఆ విషయం ఆమెకు తెలియనివ్వద్దని - ఆ విషయాన్ని మర్చిపొమ్మనీ ఎంత బతిమాలినా విన్పించుకోలేదామె.

ఆమె ఆయింట కాలుమోపిన మరుక్షణమే ఇంతటి ఘోరం జరిగిపోవడంతో తమ కూతురి 'పాదం మంచిది కాద'నే అపవాదు వస్తుందేమోనని ఆ పెద్దహృదయాలు కృంగిపోతున్నాయి.

కరుణప్రియకి ఆలోచించడానికి మెదడు పనిచేయడంలేదు. రాజా పరిస్థితి తలుచుకుని కృంగిపోతోందామె. కానీ ఏమీ చేయలేనిస్థితి. అడవులకి వెళ్తానని తల్లిదండ్రుల్ని బ్రతిమాలింది. వాళ్ళు వీల్లేదన్నారు.

మరోగంటదాకా గోడకి జారపడి కూర్చుని అనాలోచితంగా రోదిస్తూనేఉందామె. మరి కాసేపటికి ఆమెలో ఓ తెగింపు. ఓ నిర్ణయం !

తన ప్రియుడు, భర్త, దైవం అయిన రాజా కష్టాలలోఉంటే తను నిక్షేపంలా కూర్చోడమా ?

"నో ! వీల్లేదు !"

తాను తీసుకున్న నిర్ణయాన్ని అమలు పర్చేందుకు వడివడిగా లేచి కాలకృత్యాలు తీర్చుకుంది.

పునఃప్రయత్నంగా మళ్ళీ తండ్రినడిగింది. ససేమిరా వీల్లేదన్నారాయన.

పెళ్ళికాకముందు రాజాదగ్గర తెలుసుకున్న కొన్ని అడవితాలూకు వివరాలు, కారు డ్రైవింగ్ ఆ సమయంలో ఆమెకు ధైర్యాన్ని కలిగించాయి.

హాల్లోకి వచ్చిందామె - గట్టిగా అరిచింది.

"నన్నెవరైనాగానీ ఆపడానికి అనర్హులు. నేను ఇప్పుడు రాజా భార్యని. ఒకవేళ నన్ను కాదని ఆపడానికి ప్రయత్నిస్తే, లేదా నన్ను వెంబడించడానికి ప్రయత్నిస్తే నా శవాన్ని కళ్ళజూస్తారు... టేక్ఇట్ సీరియస్‌లీ !" వడివడిగా అడుగులేసుకుంటూ వచ్చి షెడ్‌లో ఉన్న నలుపు అంబాసిడర్ మార్క్ఫోర్‌లో డ్రైవింగ్‌సీట్లో కూర్చుంది కరుణప్రియ.

అందరూ నిశ్చేష్టులై చూస్తూ ఉండిపోయారు.

ఆమెను కాదని ఏపని చేయడానికీ వాళ్ళకి ధైర్యం చాలలేదు.

9

కొంతదూరం వెళ్ళేసరికి మళ్ళీ మరో ఆలోచనలో పడింది కరుణప్రియ.

"పెద్దలు వద్దన్నాక వెళ్ళడం ఒక తప్పయితే - పరిచయంలేని ఆ అడవుల్లోకి ఒంటరిగా వెళ్ళడం మరోతప్పు" అనుకుందామె.

అనుకున్నదే తడవుగా వెనక్కి - నగరంవేపు వేగంగా మరల్చింది కారు.

తిరిగి ఇంటికి వెళ్ళడం ఆమెకి ఇష్టంలేదు. వెళ్ళినా ఎవరూ తనవెంట రారని ఆమెకి తెలుసు. కారణం - రాజా ఆజ్ఞాపించాడు కాబట్టి.

అలా అనుకున్న అరసెకనుకి తళుక్కున ఓరూపం మెరిసింది ఆమె మనస్సులో.

ఆరూపం ఒక యువతిది —

ఆ యువతి - ఫైటర్ బేబీ !

కారును తిన్నగా పోనిచ్చి - నగరంలో పేరెన్నికగన్న 'లాలిగూడా' బస్తీలో ఒక చిన్న గల్లిదగ్గర ఆపుజేసింది.

తలొంచుకుని పోతోందో యువతి —

"ఎక్స్‌క్యూజ్ మీ !"

ఏమిటన్నట్లు చూసిందామె.

"ఇక్కడ ఒక ఆడగూండా ఉంటుందికదా ? ఆమె ఇల్లు ఎక్కడుంది ?"

"ముందుకెళ్ళి కుడిచేతివేపు రెండవ వీధిలో అడగండి - చెప్తారు"

థాంక్స్ చెప్పి కారును ముందుకు పోనిచ్చింది కరుణప్రియ.

చాలా ఇరుగ్గా ఉందాసందు. కారు పోవడానికి ఇబ్బంది అవుతోంది. అందువల్లనే రోడ్డువారగా కారు పార్క్ చేసి ఆ వీధిలోకి నడిచిందామె - కొద్దిదూరం

పోయాక ఒక చిన్న బడ్డీదుకాణం దగ్గర ఆగింది. ఒక ముసల్దిఅవ్వ పాలు, పెరుగు అమ్ముకుంటోంది —

"అవ్వా! ఇక్కడ ఒక ఆడగూండా... ఉందా..."

"ఎవర్వేవ్? అఁయ్! ఏమన్నవ్? మల్లిఅను... ఇగో పిల్లా మంచిగుండద్ గూండా గీండాల్ ఈడ ఎత్తక్మల్ల... మా బేబమ్మ అంటే మాకు 'ఓర్డ' గురుతా?" మీదపడ్డంత పన్జేసిందాఅవ్వ.

నలుగురూ పోగయ్యారు - కరుణప్రియకు ఏంచేయడానికీ తోచలేదు. చప్పున ఆ ముసలిదాని రెండుచేతులూ పట్టుకొని —

"అవ్వా! కోప్పడకు, నేను ఆపదలో ఉన్నాను. కాపాడుతుందేమోనని వచ్చాను. దయచేసి ఆమె ఎక్కడుంటుందో చెప్పవూ?" బతిమాలింది.

"గట్లనాబిడ్డ! మరి గట్ల సెప్పకనేపోతివి. ఉల్టా, గూండా అంటావేంది? 'ఫైటర్ బేబీ' అనాల గురుతా? పో.... పో.... గీ పక్కనే బేబమ్మ ఇల్లు.... పోబిడ్డ...."

"థాంక్స్ అవ్వా..." ఒక్క గెంతులో పోయి పక్కనున్న ఇంటి కాంపౌండ్‌లోకి వెళ్ళిందామె.

'కిర్రుర్ కర్రు' మంటూ శబ్దించిందా గేటు -

పురాతన భవనమది - పదడుగులు నడిచాక గదులు కనిపించాయి. మధ్యగా ఓ పెద్ద హాలులోంచి నాలుగుమూలలా నాలుగు తలుపులు ఉన్నాయి.

కుడివైపు నున్న గది తలుపులు తప్ప మిగిలినవన్ని మూసేసి ఉన్నాయి. ఆ తలుపుల సందులోనుండి లోపల ఎవరో ఉన్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది.

ప్రాణం లేచివచ్చినట్లయింది కరుణప్రియకు -

టకటకమని చెప్పులు శబ్దంచేసుకుంటూ నడిచిందటు -

నగరంలో కిరాయి గూండాగా పేరుపొందిన యువతీ ఫైటర్‌బేబీ. మనిషి చాలా క్రూరాత్మురాలని పేరు. ఏకేసుకైనా ప్రతిఫలం సరిగా అందనప్పుడు ఒప్పందాలు కుదుర్చుకున్న ఆ పార్టీలని అదేబస్తీకి తీసుకొచ్చి, ఆ హాల్లోనే చిత్రహింసలు చేస్తుందని అంటారు. ఆ నగరంలో పేరు పొందిన మొగ గూండాలనుండి, చిన్న చిన్న వీధి గూండాల దాకా ఆమె పేరు చెప్తేనే హడలిపోతారు. పోలీసు డిపార్ట్‌మెంట్లో ఆమెసంచలనం సృష్టించింది. ఎన్నోసార్లు ఆమెపేరు పేపర్లకిఎక్కింది. అయినప్పటికీ ఆమె మీద ఎటువంటి కేసూ బుక్ కాకపోవడం గమనించాల్సిన విషయం.

తనకు అన్యాయం జరిగినప్పుడు చట్టాన్ని తన చేతుల్లోకి తీసుకుంటుంది. అన్యాయాన్ని ఎదుర్కొనేటప్పుడు ప్రాణాల్ని లెక్కచేయదామె. ఆడాళ్ళకి అన్యాయం జరిగిందని తెలిస్తే ఒంటరిగా వెళ్ళి సహాయం చేస్తుంది. ఆ బస్తీకి మాత్రం ఆమె దేవత? నాయకురాలు! అక్కడి ప్రజలంతా నీరాజనాలు పడతారామెకి.

ఈ మధ్యనే రాజకీయ శక్తులవల్ల ఆమెమీద కొన్ని తప్పుడు కేసులు బనాయించబడ్డాయి. రెయిడింగ్‌లు ఎన్ని జరిపినా ఆమె ఎవరికీ దొరకలేదు. ఆమె ఉనికిని కనుక్కోవడం పోలీస్ డిపార్ట్‌మెంట్‌కి బహుకష్టతరమైంది.

ఆ గది తలుపు మీద చేయివేసి మెల్లగా నెట్టింది కరుణప్రియ.

కరుణప్రియ చేయి తలుపుమీద పడగానే ఫైటర్‌బేబీ చేతులోకి తల్వార్ గొని చీల్చుకుంటూ వచ్చింది.

తల పెట్టి గదిలోకి చూసింది కరుణప్రియ.

నాలుగు గజాల పొడవు: 3 గజాల వెడల్పు ఉన్న ఆ చిన్నగదిలో ఓ మంచం, గోడకి అటునుంచి ఇటు కట్టిన తాడుమీద వ్రేలాడుతూ అయిదారు బట్టలూ ఉన్నాయి. మంచానికి అడ్డంగా ఎవరో పడుకుని ఉన్నారు. ఆ వ్యక్తి చేతిలో పేపర్ ముఖానికి అడ్డంగా ఉంది. పేపరు చదువుతున్నట్టుందా వ్యక్తి.

పేపర్ చాటుగా తల్వార్‌నీ పట్టుకుని ఉంది బేబీ!

సెకను గడిచింది -

"ఫైటర్ బేబీ అంటే నువ్వేనా?" మెల్లిగా అడిగిన ఆ కంఠంలో అధికారం ధ్వనించింది బేబీకి.

"ఎవర్నువ్?" పేపర్ పక్కనుండి దూసుకొచ్చిన తల్వార్ మొన కరుణప్రియ గుండెల దగ్గరుంచి -

తడబాటుగా ఓ అడుగు వెనక్కి వేసిందామె.

లేచి కూర్చుంది బేబీ

"నా పేరు కరుణప్రియ బిజిలీ హిల్స్"లో ఉంటాను. ఫారెస్ట్ కంట్రాక్టర్ శశిగారి తమ్ముడు రాజా భార్యని నిన్న కాకమొన్నే నా పెళ్ళయింది - నా పెళ్ళయిన రోజే మా బావగారు శశిగారు అడవిలో చనిపోయారు. మావారు ఒంటరిగా అడవులకి వెళ్ళారు. నాకూ వెళ్దామని ఆదుర్దాగా ఉంది. నిన్ను సహాయంగా తీసుకెళ్దామని వచ్చాను...!" పాఠం అప్పజెప్పినట్టుగా చేతులు రెండూ కట్టుకొని చెప్పేసింది కరుణప్రియ.

బేబీ ఆశ్చర్యంతో దిగ్గున లేచినుంచుంది. ఆమెకు కరుణప్రియ మీద అనుమానంగా ఉంది. అసలు ఎవరీమె? రాజాగారికి మొన్న పెళ్ళయిన విషయం నిజమే! మరి ఈమె రాజా భార్యేనా? శశి చనిపోయిన మాట నిజమేనా?

ఆలోచనలతో అర నిముషం ఆలశ్యమైంది.

"నీకు ఇష్టం లేదనుకుంటా.... సర్లే... నే వంటరిగానే వెళ్తాను..." కదిలింది కరుణప్రియ.

"ఆగు!... ఆగండి!" తను విన్నది నిజమో కాదో తెలియడంలేదు బేబీకి.

"ఒక్క క్షణం.... డ్రస్ ఛేంజ్ చేసుకుని వచ్చేస్తా..."

మంచం క్రిందనున్న ఒక సూట్‌కేస్ బైటకి లాగిందామె. నీలిరంగు జీన్స్ ప్యాంట్, ఆదేరంగు చొక్కా బైటకి తీసింది.

ఆమె రావడానికి సిద్ధపడటంతో కరుణప్రియ మనసు కుదుట పడింది.

ఫైటర్‌బేబీ తన వంటిమీదున్న చీరని సర్రున తీసేసింది. బ్రాసాంటీస్‌తప్ప ఏమీ లేదామె ఒంటిమీద. పచ్చని ఛాయలో మిసమిసలాడుతోందామె శరీరం. ఒళ్ళు బలిష్ఠంగా ఉంది.

"దాదాపు 30కి పైనే ఉంటుందేమో వయసు. కానీ అంత వయసున్నట్టు పైకి కనబడదామె" పరీక్షగా చూస్తోంది కరుణప్రియ.

"చూపును ఆకట్టుకునే అందం - మంచి శరీరఛాయ - అంతకంటే మంచి శరీరసౌష్ఠవం..."

ముందుకువంగి ప్యాంట్ వేసుకుంటుంటే ఆమె అందాలు ఎగిసి ముందుకొచ్చాయి. 'ఇంత అందమైనపిల్ల చక్కగా పెళ్ళిచేసుకుని సంసారం చేసుకోక, ఈ కిరాయిగుండాతనం ఎందుకు చేస్తోందో ?" అనుకుంది కరుణప్రియ.

"ఈమె ఈ వృత్తిలో లేకపోతే ఈరోజు నాకు సహాయం చేయకపోనుగా" అనే ఆలోచనకూడా ఆ వెంటనే వచ్చిందామెకి.

ఎంత చదువుకున్నప్పటికీ, ఎంతటి లోకజ్ఞానం ఉన్నప్పటికీ అందరి స్త్రీల మనస్తత్వాలూ కొన్ని కొన్ని సందర్భాల్లో ఒకేలా ఉంటాయి. ఆస్థితిలో ఎక్కువ స్వార్థమే గోచరిస్తుంటుంది.

"బయలుదేరదామా ?" బేబీ ప్రశ్నకు కరుణప్రియ ఆలోచనల్లోంచి బైటపడింది.

"పద" దారితీసిందామె.

ఇద్దరూ బైటకి నడిచారు.

ఆ ఇంటి పక్కనున్న బడ్డీలో అవ్వకి ఫైటర్‌బేబీ ఏదో చెవిలో రహస్యంగా చెప్పింది.

'సరే' నన్నట్టు తలూపింది అవ్వ - ఆ తరువాత ఓచూపు చూసిందామె కరుణప్రియను.

మరికొంతసేపటికి ఫైటర్ బేబీ నడుపుతున్న ఆ బ్లాక్ అంబాసిడర్ మార్కాపోర్ నగరపు పొలిమేరలు దాటి ముందుకు ఉరుకుతోంది.

10

బెడ్‌రూమ్ కిటికీలోంచి లేత సూర్యకిరణాలు రాజా మొహంమీద పడుతున్నాయి. అంతకంతకూ వాటి తీవ్రత ఎక్కువవుతోంది. ఉదయం 8 గం॥ లు అవుతుండగా బదలికగా కళ్ళు తెరిచాడు రాజా !

జస్వంత్, రంజిత్‌లు ఇద్దరూ బెడ్‌కి ఇరువైపులా నిలబడి ఉన్నారు. "బాబో! బాగా పొద్దెక్కిపోయింది -" నిద్ర లేవమన్నట్టుగా అన్నాడు రంగా.

మెల్లగా లేచి కాలకృత్యాలు తీర్చుకునేందుకు సిద్ధపడ్డాడు రాజా -

మరికొంతసేపటికి హాలులోకి వచ్చి కూర్చున్నాడు రాజా.

వినయంగా వచ్చి చెప్పాడు రంగా -

"రాజాబాబూ! ఆ పెట్టెని సీల్ చేసేశాము. ఇక తరువాయి కార్యక్రమం...."

మధ్యాహ్నం వేళకు శశి దేహానికి అంత్యక్రియలు జరిగినయి.

తన అన్నగారి మరణంకంటే ఎట్లా చనిపోయాడనే ప్రశ్న రాజాని కృంగదీస్తోంది. ఏదీ ఏమైనా అసలు విషయం తెలుసుకోవాలనే పట్టుదల ఎక్కువగా ఉందతనికి. మరికొంతసేపటికి జస్వంత్, రంజిత్‌లను దగ్గరగా పిలిచాడతను -

"ఈ దారుణం ఎలా జరిగిందంటారు ?" అతి గంభీరంగా ఉందతనిగొంతు.

"అదే మాకూ అర్థం కావట్లేదుబాస్ ...." వెంటనే సమాధానం చెప్పాడు జస్వంత్. రంజిత్ మొహంలో చిరాకు కోపం !

"ఎక్కడ జరిగింది ?" వాళ్ళు సమాధానం చెప్తున్న తీరునుబట్టి ఎంత వద్దనుకున్నా, రాజాకంఠంలో వారిమీది అనుమానం స్పష్టంగా కనిపిస్తోంది.

"గెస్ట్‌హౌస్ గేటుదగ్గరేబాస్ ...." అన్నాడు రంజిత్. జస్వంత్ మొహం వివర్ణమౌతోంది. అది రాజా గ్రహించాడు.

రాజాలో క్యూరియాసిటీ ఎక్కువౌతోంది. కానీ దాన్ని కనపడనీయకుండా, సిగరెట్ వెలిగించుకుని మెల్లగా అడిగాడతను.

"డెడ్‌బాడీని ముందుగా ఎవరు చూశారు ?"

ఒకరి మొహాలొకరు చూసుకున్నారు.

రాజాకి చిరాకు ఎక్కువైంది - "ఇద్దరూ చూశారా ?"

"లేదుబాస్ జస్వంత్ చూశాడు ...." తేల్చిపారేశాడు రంజిత్.

జస్వంత్ మొహం చెమటలు పట్టేసింది. ఆ ప్రశ్న వస్తుందనికానీ, అతనంత ఖచ్చితంగా చెప్పేస్తాడనికానీ అనుకోలేదతను. అతనిమొహం కోపంతో ఎర్రగా అయింది.

అరనిమిషం ఆలస్యమైనా అతని సమాధానంకూడా వినాలని కుతూహలంగా ఉన్నా - ఆ ప్రశ్నపట్ల పూర్తి నిర్లక్ష్యతను కనబరుస్తూ కుర్చీలోంచి లేచి కిటికీవైపు నడిచాడు. రెండుచేతులూ వెనగ్గా కట్టుకుని, కిటికీలోంచి తదేకంగా చూడసాగాడు.

జస్వంత్ మనసు కుదుటపడింది. ఇకపై ఏ ప్రశ్నా వేయడని అతని ఉద్దేశం. కానీ రంజిత్‌మీద అతనికి కోపం పోలేదు.

రాజాకి వాళ్ళ అనుమానపు చూపులు, మౌనం ... అంతా అదంతా ఓ మిస్టరీలాగుంది. వారిమీది అనుమానం అంతకంతకూ ఎక్కువవుతోంది. వాళ్ళ ప్రవర్తన చూస్తే వాళ్ళేదో ముఖ్యమైన విషయం దాస్తున్నారనిపిస్తోంది -

ఏమిటావిషయం ?

ఆ రహస్యం ఏమిటి ?

ఒకవేళ అన్నగార్ని హతమార్చేరా ?

ఈ ప్రశ్నలు తలెత్తగానే వెనగ్గా కట్టుకున్న అతని రెండుచేతులూ అప్పుడే ప్రాణమొచ్చినట్టుగా ...., నరాలు బిగుసుకుంటూ ముందున్న కిటికీ ఊచలకు గట్టిగా అతుక్కున్నాయి.

అక్కడ జరిగిన ఏ విషయమూ తనకు తెలియదు. ఏదైనా పూర్తిగా తెలియాలంటే వాళ్ళిద్దరిలో ఎవరో ఒకరు తనకు చెప్పాలి. తాను వాళ్ళనే అనుమానిస్తున్నట్టు వాళ్ళు గ్రహిస్తే ఏ ఒక్కవిషయమూ సరిగా చెప్పరు. అంతేకాకుండా వాళ్ళు ఉద్యోగాలు మానేసే ప్రమాదంకూడా వుంది.

రాజా ఆలోచిస్తూనే ఉన్నాడు.

అటు బిజినెస్ గురించీ, ఇటు అన్నగారి మరణం గురించీ ఒకేసారి సాగుతున్నాయతని ఆలోచనలు.

మెల్లగా వెనక్కి తిరిగాడతను.

అప్పటివరకూ తనవంక చూస్తున్న వారిద్దరూ - తాను చూసేసరికి మొహాలు దించేసుకున్నారు-ఎంతో వినయం ప్రదర్శిస్తున్నారు-వాళ్ళని చూడగానే మళ్ళా అతని మీద కోపపు మరకలు - జస్వంత్ దగ్గరికి వచ్చాడతను.

"ముందుగా చూసినప్పుడు అన్నయ్య ఆకారం ఎలావుంది ?"

"వెంటనే నువ్వేం చేశావ్ ?"

"అసలు నువ్వక్కడకి ఎందుకెళ్ళావ్ ?"

"ఎన్ని గంటలకు చూశావ్ ?"

"వెంటనే ఫోనులో ఎందుకు చెప్పలేదు ?"

ఎన్నో...ఎన్నెన్నో ప్రశ్నలు వేయాలనుంది రాజాకి. కానీ ... కానీ ... ఈ ముక్కసూటిగా ప్రశ్నిస్తే సమాధానాలు సరిగా వస్తాయను కోవడం లేదతను.

తాను ఒక పథకం ప్రకారం ప్రవర్తించకపోతే అసలు జరిగిన విషయమే తెలియకుండా పోవచ్చు.

రాజాబాబూ ! రాజాబాబూ ! పెదబాబు చచ్చి పడున్న దగ్గర్లో ఒక పందిపిల్ల పడుంది బాబు, దాన్ని ఏదో పాము కాటేసింది బాబూ ...." జరిగిన విషయం గుర్తు చేసుకుంటూ చెప్పాడు రంగా.

"పెదబాస్‌ని కూడా పాము కాటేసి ఉండొచ్చు బాస్ ..." తన అనుమానాన్ని వ్యక్తం చేశాడు రంజిత్.

జస్వంత్‌మాత్రం మౌనంగా ఉండిపోయాడు. రంగా మాటలమీద గురి కుదిరినా, రాజాకి మనసులో సెక్యూరిటీ గార్డులమీద నమ్మకం కుదరడంలేదు.

"జస్వంత్ !" కిటికీలోంచి బైటకిచూస్తూ సౌమ్యంగా పిలిచాడు రాజా.

"బాస్ ... !" వణికిందతనిగొంతు.

"ఎన్నిగంటలకు పెదబాస్ శవాన్ని చూశావు ?"

"తెల్లవారుజామున బాస్ ...." కూడబలుక్కున్నట్టు ఒక్కొక్క అక్షరం చెప్పాడు జస్వంత్.

"ఆ సమయంలో నువ్వు బైటకెందుకెళ్ళావ్ ?"

"యు ... యూ ... యూరినల్స్ ...."

ఎటాచ్‌డు బాత్స్ ఉన్నాయిగా మీకు"

"అ .... అదీ ... అ .... అ ...."

"జస్వంత్ !" గర్జించినట్టుంది రాజా గొంతు. ఒక్కుదుటున జస్వంత్ దగ్గరికి వచ్చాడతను.

అంత వేగంగా వచ్చి .... అతి సామాన్యంగా ... సౌమ్యంగా ఎంతో ఆదరంగా .... భుజంమీద తడుతూ ...

"అయామ్ సారీ జస్వంత్ ! నిన్ను అనుమానించాల్సి వచ్చినందుకు సారీ !"

అలా మారితే ప్రయోజనం లేదనే విషయం అర సెకనులో తట్టిందతనికి మళ్ళీ.

రాజా అంత సాదరంగా అలా అనేసరికి జస్వంత్‌కి దుఃఖం పొంగుకొచ్చింది-

"బాస్ ... బాస్ ... ఎంత మాటన్నారుబాస్ ! మీ ఉప్పుతిని బతికేవాళ్ళం. మాకు మీరు క్షమాపణలు చెప్పడమేమిటిబాస్? .... పెదబాస్ అంటే నాకెంత గౌరవం భయం, భక్తి ఉన్నాయో మీకు తెలియనిదాబాస్ ...." ఏడుస్తున్నాడతను. "జరిగిన ఘోరాన్నిబట్టి ఎవరినైనా అనుమానించాల్సి వస్తోంది. రంజీ....రంజీ ...." అంటూ సిగరెట్ వెలిగించి లోపలికి నడిచాడు రాజా.

రెండేరెండు నిమిషాల్లో మళ్ళీ బైటకి వచ్చాడతను. అతని కోపం మటుమాయమయింది.

—"ఆఁ ! సరే .... మీరిద్దరూ గూడెంలో ఈ విషయం చెప్పారా ?"

"లేదుబాస్ ...." రంజిత్ అన్నాడు.

"పోయి చెప్పేసిరండి ...."

మరో రెండునిమిషాల్లో ఎవరి ఆయుధాలు వాళ్ళు ధరించి, జీపుమీద గూడెంవైపు ప్రయాణమయ్యారు వాళ్ళు.

11

బ్లాక్ అంబాసిడర్ మార్క్‌ఫోర్ అడవి దారుల్లో దుమ్ము రేపుకుంటూ పరుగెడుతోంది - కరుణప్రియ, బేబీలతో !

ఫైటర్‌బేబీకి ఆదారి చాలా సుపరిచయమయినట్టుంది. చాలా ఈజీగా, స్పీడులో పోనిస్తోందామె కారుని.

"బేబీ ! నువ్వెప్పుడైనా ఈ గెస్ట్‌హౌస్‌కి వెళ్ళావా ?"

"ఓ ! చాలాసార్లు ..." దారిమీదనుండి దృష్టి మరల్చకుండా కాజువల్‌గా

చెప్పింది బేబీ.

"ఒక్కదానివేనా ?" చెవులకున్న పెద్ద పెద్ద రింగులు చెంపలకు తపతపమని తాకుతున్నాయి కరుణప్రియ తల కదలికలకి. ఎంతో అమాయకంగా ఆమె కళ్ళు విప్పార్చి మరీ అడుగుతోంది.

"మరీ ...?" కించిత్ గర్వం తొంగి చూసిందామె గొంతులో -

"ఎందుకొచ్చావ్ ?"

"శశిగారి కోసమ్ !" యధాలాపంగా అందామె.

"శశిగారి కోసమా ? ఆశ్చర్యం దారిమళ్ళి అనుమానంగా మారింది కరుణప్రియ మెదడులో.

ఆమె అనుమానాన్ని గ్రహించిన బేబీ నవ్వింది. విలాసంగా : ఆ నవ్వు కరుణప్రియకి ఇబ్బందిగా అనిపించింది - ఎందుకడిగానా ! అనుకుందామె.

"శశిగారికి బిజినెస్ పార్టీలను తీసుకొచ్చేదాన్ని ! అంది బేబీ.

మరి కొంతసేపటి వరకూ మళ్ళీ మౌనం -

నిశ్శబ్దంగా, మౌనంగా ఉంటే కరుణప్రియ ఆలోచనలు పరిపరివిధాల పోతున్నాయి. అందుకే మళ్ళీ కదిలించింది బేబీని.

"నువ్వింకా పెళ్ళి చేసుకోలేదేం ?" ఎప్పటినుండో అడగాలనుకుంటున్నట్టుందామె గొంతు - ప్రశ్న.

నెమ్మదిగా తల తిప్పి చూసింది బేబీ.

'ఆ ప్రశ్నకి అర్థంలేదు' అనేది ఆ చూపుల భాష్యం !

సన్నగా నవ్విందామె కళ్ళతోనే. కరుణప్రియకి ఆ చూపు కూడా కాస్త ఇబ్బందిగానే అనిపించింది.

"ఈ లోకం గురించి నీకు ఏమీ తెలియదుపిల్లా. నువ్వింకా పసిపిల్లవి" అన్నట్టుందామెనవ్వు.

"పెళ్ళి వరకు ఎందుకు - తృప్తిగా తిని, ప్రశాంతంగా నిద్రపోయే అదృష్టమే లేదు నాకు" - ఆలోచించుకుంటూ కేవలంగా మరోసారి తనలో తానే నవ్వుకుంది బేబీ.

"ఎందుకు నవ్వుతున్నావ్ ?" అడగాలని నోరు తెరిచింది కరుణప్రియ. కానీ కారు రోడ్డు పక్కగా ఆగడంతో "ఎందుకాపావ్ ?" అంది.

ఒక్క నిమిషం. కార్లోనే కూర్చో, ఇప్పుడేవస్తా. డోరుతీసి క్రిందకి దిగింది బేబీ.

పెద్ద మర్రి చెట్టది.

ఆ చుట్టూతా చాలామేరవరకూ వ్యాపించి ఉందది. బేబీ కారుదిగిన వెనుకే కరుణప్రియకూడా దిగింది. చుట్టూ పరికిస్తోందామె. ఎంతో ఆహ్లాదకరమైన ప్రకృతి అందం - ఎటుచూసినా పచ్చని చెట్లు - గాలికి ఆనందంగా తలలూపుతున్న చిటారు

కొమ్మలు -

ఎక్కడో .... ఏచెట్టు చిటారుకొమ్మలలోనో లేమావి చిగుర్లు మేసి మత్తెక్కి కూస్తోందో ఆలకోయిలమ్మ .... "కూ ... కూ ...."

తెరిచిన కరుణప్రియ కళ్ళలోగిళ్ళల్లో స్వప్నాలు నర్తించాయి -

"అక్కడ తనూ .... తన ఆరాధ్యదేవుడు కలిసి మైమరచి సాగిస్తున్న చిలిపి సరసాల రంగులచిత్రం : ఆ రసవాహినిలో బంగారు పడవపై తనూ, తన రాజా అలా .... అలా .... అలా ..."

తన వెనగ్గా అలజడికి గిర్రున వెనక్కి తిరిగి చూసింది కరుణప్రియ - కలలోనుండి తేలివస్తూ :

ఆ చెట్టుకొమ్మ ఒకటి బాగా ఊగుతోంది -

గుండె ఝల్లుమందామెకి -

ఆ కొమ్మల మధ్యనుండి తలపెట్టి వింతగా చూస్తోందో మగ మానవాకారం. కళ్ళు బాగా విప్పార్చి, నాలుక బైటకిపెట్టి చూస్తున్నాడతను.

కరుణప్రియ గభాల్న కారు బాక్‌సీట్లో కూర్చుని డోర్ వేసేసుకుంది. ఆమె గుండెలు గుబగుబలాడుతున్నాయి.

కరుణప్రియ కారులోకి పోగానే మరో క్రింద కొమ్మమీద పాకుతూ, మరింత కిందకొచ్చాడతను. నల్లగా ఉన్నాడతను, చిన్న గోచీతప్ప మరేఆచ్ఛాదనాలేదాతని వంటిమీద.

కరుణప్రియ సీటుకి కరుచుకుపోయింది.

అతని శరీరం బొగ్గు పూసుకున్నట్టుంది. కళ్ళల్లో వింత - మరింతసేపటికి ఓ చిలిపిరేఖ, ఆరాధనాభావం.

మరోక్షణం ఆమె అలానే ఒంటరిగా ఉంటే అతను కారుదగ్గరకే వచ్చేలాగున్నాడు. అంతకంతకూ నేలకి ఉన్న కొమ్మలమీద పాక్కుంటూ దిగుతున్నాడతను.

ఇన్ చేసిన షర్ట్ సర్దుకుంటూ వచ్చిన బేబీ గుర్తుపట్టగించి, వణుకుతూ చూస్తున్న కరుణప్రియను తట్టి -

"ఏమిటాలోచిస్తున్నావ్ ? ఊరికే ఆలోచించి మనసు పాడుచేసుకోకు" అంటూ వచ్చి డ్రైవింగ్ సీట్లో కూర్చుంది.

"ఆ ... అదిగో ... అక్కడ ... అక్కడే..." చూపించింది కరుణప్రియ.

ఎవ్వరు లేరక్కడ ! కొమ్మలలో ఏవిధమైన అలికిడిలేదు ...!

నవ్వింది బేబీ - "భయపడ్డావా ? ఇక్కడ భయ పడవలసింది ఏమీ ఉండదులే !" అంటూ పోనిచ్చింది కారుని.

కరుణప్రియకు ఎక్కడలేని భయమూ కలిగింది. ఆ క్షణంలో తాను చదివినవీ, విన్నవీ దెయ్యాల కథలన్నీ జ్ఞాపకం వచ్చాయి - కారు స్పీడుగా పోతుంటే, విప

శీతమైన గాలి కార్లోకి వస్తున్నా-ఆమె నుదుటన స్వేద బిందువులు తళుక్కు-మంటున్నాయి.

కరుణప్రియ భయంతో కళ్ళు మూసుకుంది -

కారు ఓ పెద్ద మలుపును దాటి సాగిపోయింది !

12

'బందీల బద్రి' గూడెం పేరు తల్చుకొన్నప్పటి నుండి రాజా ఆలోచనలు మళ్ళీ దారి మళ్ళాయి.

జరిగిన ఘోరం ఎలా జరిగిందో తెలుసుకోవడమే అతని ధ్యేయం.

సిగరెట్ వెలిగించుకొని గేటు తెరిచి బైటకి వచ్చాడతను. బంగ్లా చుట్టూ తిరుగుతున్నాడు - అతనికేమీ తోచడంలేదు. దిగాల్గా, సాలోచనగా కాళ్ళతో నేలని తన్నుకుంటూ, మెల్లగా తిరుగుతున్నాడు -

బెడ్‌రూమ్ వెనగ్గా ... కిటికీ దగ్గర - గోడమీద - నల్లగా - ఏదో మరక అది-

దగ్గరగా వెళ్ళి పరీక్షగా చూశాడు. అతని కళ్ళల్లో ఆశ్చర్యం. మరింత పరీక్షగా చూశాడు - తోక చుక్కలా ఉన్న ఆ మచ్చ పక్కనే అరచేతి గుర్తు అస్పష్టంగా ఉంది.

ఆ నల్ల మచ్చని ట్రేస్ చేయడానికి ప్రయత్నించసాగాడు.

ఏదో జంతువు తోకలా ఉందాగుర్తు. బురదతో ఉన్న తోకను గోడకి రాసినట్టుందా మచ్చ.

దానిపక్కనే ఉన్న హస్తం గుర్తుమీద దూరంనుండి తన అరచేతిని ఉంచాడు. తన అరచేతి సైజే ఉందది. "అంటే తన వయసువారిదే అయ్యుండచ్చు. ఇంతకీ ఎవరిదయ్యుంటుంది ? తన అన్నగారిదా ? లేక హత్య చేసిన వాళ్ళదా ? ఇంతకీ ఇది హత్యేనన్నమాట ! ఒకవేళ శశి అడవి జంతువుల బారినేపడి చనిపోలేదుకదా ! మరయితే ఆ విషయం వెంటనే టెలిఫోన్‌లో గార్డులెందుకు చెప్పలేదు ?"

"నో ! ఇందులో ఏదో మోసముంది. అవును ఇందులో ఏదో మోసముంది. ఒకవేళ ఏదో జంతువే అన్నయ్యను చంపేసినట్టుగా సెక్యూరిటీ గార్డులే ఈ మరకలన్నీ చేసి ఉండచ్చుగా !"

"సందేహంలేదు ! ఇది ప్లాన్డ్ మర్డర్ !"

ఆలోచనలలోఉన్న రాజా పళ్ళమధ్య శబ్దం వెలువడింది 'కటకటకట !'

ఇక అక్కడ ఉండలేక బెడ్‌రూంలోకి నడిచాడతను. తర్వాత బాత్‌రూమ్‌కి వెళ్ళి తలారా స్నానం చేశాడు. ఆ తరువాత తిరిగ్గా వచ్చి మళ్ళీ అన్నగారి బెడ్‌రూమ్‌లోకి వెళ్ళాడు - కిటికీలోంచి గెస్ట్‌హౌస్ వెనగ్గా కలకలం వినిపించింది. వెంటనే ఉలిక్కిపడి చూశాడతను.

బరిశెలు, విల్లు - బాణాలు లాంటి ఆటవిక ఆయుధాలు చేతపట్టుకుని గాలిలో ఎగురుకుంటూ వస్తున్నంత వేగంగా పరుగులెత్తుకు వస్తున్నారు బందీలబద్రి గూడెం

వాసులు. వాళ్ళందరికీ ముందు పరుగెత్తుతూ వస్తున్నవాడు వాళ్ళ నాయకుడు. అతని పేరు 'బయ్యాంక్'

వాళ్ళ వేషం, భాష, ఆచారం అన్నీ వాళ్ళవేకానీ. నాగరికులని ఏమాత్రం అనుకరించరు. ఒకవేళ ప్రభుత్వాధికారులుగానీ, వేరే ఎవరైనాగానీ వాళ్ళని మార్చడానికి ప్రయత్నిస్తే ఆ ఛాయలకే రానీయరు.

వాళ్ళకి నాగరికత అంటేనే గిట్టేది కాదు. ఈ మధ్యకాలంలోనే ఒక్క-బయ్యాంక్ నాయకత్వంలో కాస్తంతగా వాళ్ళ నాగరికతని గౌరవిస్తున్నారు. - అదీ శశి సహచర్యం వల్ల. వాళ్ళ ఆచార వ్యవహారాలన్నీ ఎన్నో ఏళ్ళ క్రితకాలం నాటి స్థితిని గుర్తుతెప్పించేదిలా ఉంటుంది.

ఆ గూడెం ప్రజలకి శశి అంటే ప్రాణంకన్న ఎక్కువ, ఏ సమయాననైనా కష్టంగానీ వస్తే ముందు శశికి చెప్తారు. బయ్యాంక్ కంటే శశి తమ నాయకుడుగా వాళ్ళు భావిస్తారు.

బందీలబద్రి గూడెంలోని ఎంతమంది స్త్రీలను అనుభవించాడో శశి. అదీ వాళ్ళ ప్రోద్బలంవల్లనే ! అప్పుడప్పుడూ శశి గూడేనికి వెళ్ళినప్పుడు గూడెం ప్రజలే అతన్ని బయ్యాంక్ ఇంట విశ్రమించమనిచెప్పి అతని దగ్గరకు తమ స్త్రీలని పంపేవారు. అలాచేస్తే తాము గౌరవించినట్టుగా వాళ్ళు భావిస్తారు.

"అంత గాఢంగా శశిని అభిమానించేవాళ్ళకి అతని మరణం గురించి ఇప్పటి వరకూ తెలియకపోవడమా ?"

"ఒకవేళ వాళ్ళే ఏదైనా చేశారా శశిని ?"

"గూడెంవారికీ, శశికీ మధ్య వివాదం ఏదైనా తలెత్తితే - తనకు అంతక్రితమే ఫోన్ చేసినప్పుడు చెప్పకపోనా ? పోనీ సెక్యూరిటీ గార్డులకేనా చెప్పకపోనా ?"

ఇలా ఆలోచిస్తోంటే వారిమీదే అనుమానంగా ఉంది రాజాకి.

"అంత ప్లాన్డ్‌గా శశిని చంపే తెలివితేటలున్నాయా వాళ్ళకి ? "నో ! అలా జరిగుండదు -"

అందుకు సాక్ష్యం తలబాదుకుంటూ, గుండెలవిసేలా ఏడుస్తున్న ఆ అమాయకులే !"

చాలాసేపటి తరవాత రాజా వాళ్ళని సముదాయించి, ఓదార్చాడు.

మరోగంటా, రెండుగంటలకు నిస్సత్తువగా, ఒక్కొక్కళ్ళు లేచి గూడెంవైపు నడక మొదలెట్టారు వాళ్ళు.

ఏవిధంగా ఆలోచించినా రాజా మనసు సరైన నిర్ణయానికి, నిశ్చయానికీ రాలేకపోతోంది.

మెల్లగా లేచివెళ్ళి శశి బెడ్‌రూమ్‌లోకి వెళ్ళాడు. బెడ్ పక్కన ఉన్న టీపాయ్ మీద 'బేగ్‌పైపర్' బాటిల్ కనిపించిందతనికి. అందులో సగంవరకే విస్కీ ఉంది.

"అంటే సగం అన్నయ్య తాగాడన్నమాట." ఆప్యాయంగా బాటిల్ మూతిని పెదాలకానించాడు. ఆ రూమ్‌లోంచి రంజిత్, జస్వంత్‌ల గదుల్లోకి కాలింగ్‌బెల్ కనెక్షన్ ఉంది. స్విచ్ నొక్కాడు రాజా.

రెండుక్షణాల్లో యిద్దరూ ఎలర్ట్‌గా వచ్చి నిలబడ్డారు.

వాళ్ళిద్దరిని కూర్చోమని కుర్చీలు చూపించాడు.

బాస్ ఎదురుగా కూర్చోవడం వాళ్ళకేనాడూ తెలియని విషయం. అటువంటిది టీపాయ్ మీద బాటిల్ ఉంచి, వాళ్ళిద్దరినీ కూర్చోమన్నాడంటే కలిసి తాగడానికి అని వాళ్ళకి అర్థమైంది.

వారిద్దరి మొహాల్లోకి మార్చి మార్చి చూశాడు రాజా!

మౌనంగా కూర్చున్నారు వాళ్ళు.

జస్వంత్‌కి మాత్రం ఆ ఒక్క నిమిషంలోనే మొహమంతా చెమటలు పట్టేసాయి. ఎదురుగ్గా డ్రస్సింగ్ టేబుల్‌కి ఉన్న అద్దంలోంచి తనకు ఎడంవైపున, బెడ్ పక్కగా ఉన్న స్టూలుమీద రివాల్వర్ కనిపించిందతనికి –

'గుండె' గుబుక్కుమందతనికి. వెంటనే అది కొట్టుకునే వేగం ఎక్కువయింది. వెన్నులోంచి సన్నని వణుకు.

"అన్నయ్య వయసూ, పద్ధతులూ, రాయల్టీ అన్నీ వేరు. నాతో మాత్రం స్నేహితులుగా మెలగండి – ముక్తసరిగా, మొత్తం అర్థంవచ్చేలా చెప్పాడు రాజా.

ఈ బాటిల్ అన్నయ్యది. ఇందులో సగం ఆయనే తాగాడు. మిగిలిన సగం నేనొక్కడినీ తాగలేను. అలాగనివేస్ట్ చేయలేను. ఇన్నాళ్ళూ అన్నయ్యకు మీకూ ఎంతో దగ్గిర సంబంధాలున్నాయి. కాబట్టి ఈ ఆఫ్ మనం ముగ్గురం సమానంగా తీసుకోడం సబబనిపించి పిల్చాను. అదీగాక ఒంటరితనంతో నా తల బద్దలయిపోతోంది. ఏ విషయాన్ని ఆలోచించలేక పోతున్నాను. కొంతసేపు రెస్ట్ తీసుకుంటాను, త్వరగా ఫినిష్ చేసేద్దాం ..." రాజా స్వయంగా మూడు గ్లాసులలోనూ విస్కీ పోశాడు.

రంజిత్, జస్వంత్‌లు తలచాటు చేసుకుని తాగేశారు.

గబగబా తాగేసి లేచి నిలబడ్డారు వాళ్ళు,

రాజా నెమ్మదిగా ఒక్కొక్క సిప్ తాగుతున్నాడు.

ట్రిన్ ట్రిన్ : ట్రింగ్ ట్రింగ్ ... ట్రింగ్ ట్రింగ్ ....

రంగా ఫోన్ ఎత్తాడు –

"రాజాబాబూ! ఫోన్ ...." అందించాడతను.

ఏదో జ్ఞాపకం వచ్చిన వాడిలా ఫోన్ తీసుకున్నాడు. ఆ క్షణంలో అతనికి ఒక 'భార్య' ఉందని జ్ఞాపకం వచ్చింది.

"హలో! రాజా స్పీకింగ్"

"బాబూ! కరుణ అక్కడకు చేరిందా?" మామగారి గొంతులో స్పష్టంగా వినిపిస్తోంది ఆతృత.

"లేదే! బయలుదేరి ఎంతసేపయింది? ఎలా రానిచ్చారు? నే వద్దని చెప్పానుగా?" ప్రశ్నల వర్షం కురిపించాడు రాజా – వెంటనే చిరాగ్గా ఫోన్ డిస్‌కనెక్ట్ చేశాడు.

అతన్ని ఆలోచనలు మళ్ళీ ముసిరేసాయి.

13

గెస్ట్‌హౌస్ లోపలికి వేగంగా కారును పోనిచ్చి ఆపుజేసింది ఫైటర్‌బేబీ –

కారుదిగి రివ్వున పరుగెత్తింది కరుణప్రియ – కారు శబ్దానికి బైటకి వచ్చాడు రాజా!

ఆమె వస్తుందని అంతకుముందే తెలిసున్నా – ఆశ్చర్యంతో నోరుతెరిచాడు రాజా.

కరుణప్రియ అమాంతం పోయి అతన్ని చుట్టేసింది. బాధని ఆపుకోలేకపోతోందామె. వెక్కివెక్కి ఏడ్చేసింది.

ఆమెను ఓదార్చేదారి తెలియక లోపలికి నడిపించుకుంటూ వెళ్ళాడు రాజా

ఇద్దరూ ఎదురెదురుగా కూర్చుని ఎంతోసేపు మౌనంగా రోదించారు. కరుణప్రియ అతని జుత్తులోకి వేళ్ళు పోనిచ్చి ఆప్యాయంగా తల నిమురుతోంది.

ఆ స్థితిలో అప్పటివరకూ అతను తన పక్కనే ప్యాంటూ, షర్టు వేసుకుని ఠీవిగా నిల్చున్న అమ్మాయిని గుర్తించలేక పోయాడు.

"బేబీ! నువ్వెప్పుడొచ్చావ్?" గుర్తించాక అడిగాడు.

"ఒంటరిగా వస్తున్న మీ భార్యకి తోడు వచ్చాను"

"థాంక్స్ ఎలాట్"

"నేనింకా నమ్మలేకుండా వున్నాను. అసలెలా జరిగిందీ దారుణం?"

"అదే నాకూ అర్థమవడంలేదు బేబీ!"

"రాజా! నువ్వీ ఫారెస్ట్ కాంట్రాక్టులన్నీ వదిలి పెట్టేయ్." చాలా సేపటికి అంది కరుణప్రియ.

"ఉలిక్కిపడి చూశాడు రాజా – ఆమె వంక.

బీటలోయిన భూమాతను రక్తమే చెమటచేసి దున్నుకుని, అష్టకష్టాలుపడి నారువేసి కంటికి రెప్పలా, కన్నబిడ్డలా కాపాడుకుంటూ పంట చేతి కొచ్చేవరకూ నిద్రాహారాలు లెక్కచేయక శ్రమించే రైతు చేతుల్లోనుండి – ఆఖరు క్షణాలలో రాబందుల్లా వచ్చిఎగరేసుకుపోతాడు కామందు వెన్నులు మాత్రం నవ్వుతూనే నడుస్తాయి ఆ కసాయివాడికంట. ఎందుకో ఆభావమే మెదిలింది రాజాలో –

మనసును తాకి రోజులే అయింది –

శరీరాన్ని తాకనైనాలేదు –

ఒక్క ముహూర్త సమయానికి మాత్రంజీలకర్రతో నెత్తినచేయి ఉంచాడంతే!

ఇంత తక్కువ సాహచర్యంలోనే ఎన్నో జన్మల ఆత్మీయత చూపిస్తోందామె.

బయలు దేరి వచ్చేటప్పుడు ఆమెకు కనీసం చెప్పలేదు సరికదా. వచ్చాక ఆమె క్షేమాలైనా రాలేదు. ఎంత కసాయి మనసు తనది!

అత్తింటికి కొత్తగా వచ్చిన కోడలును ఎంత చక్కగా వర్ణిస్తారు కవులు - జన్మ నిచ్చిన వాళ్ళనూ, జన్మనూ కూడా మరిచి, ఎన్నో ఆశలతో, ఆశయాలతో, క్రొంగొత్త కోరికలతో ప్రవేశిస్తుందామె - సరికొత్త జీవితంలోకి.

ఎందుకో రాజాకి ఆమె వదనాన్ని చూసేసరికి ఎవరో గుండెని నలిపేస్తున్నంత బాధ ...!

తనపై ఉన్న ఆప్యాయతతోనే ఆమె ఆమాట అంది. కానీ తమని ఇంత వాళ్ళను చేసిన ఈ వ్యాపారం వదిలిపెట్టడం సాధ్యమయే పనేనా ?

తరచి తరచి చూస్తే ఈ విషయం ఆలోచించ తగ్గదే అనిపిస్తోంది - ఈ బిజినెస్ తమకు అన్నం పెడ్తున్న మాట నిజమే! తమని ఇంతగా పెంచిన మాట నిజమే. కానీ చివరికి ఇదే బిజినెస్ తన ప్రాణానికి ప్రాణమైన అన్నగారి ప్రాణాల్నే బలి తీసుకుంది కదా !

రేపన్నాడు తన భర్తకే ఏమైనా అపాయం జరగవచ్చనే కరుణప్రియ భయపడటంలో తప్పులేదు.

రెండే రెండు నిమిషాల్లో అతని మెదడు కంప్యూటర్‌లా పనిచేసింది.

ఆఖరిగా అన్నాడు -

"అవును! ఈ కాంట్రాక్ట్, ఈ బిజినెస్ .... అంతా వదిలిపెట్టేస్తే అనే ఆలోచననే చెప్పాడు -

"కొద్దిగా సరుకు ఉండిపోయింది కరుణా! అది క్లియర్ చేసేసి, ఈ బిజినెస్ వదిలిపెట్టేస్తాను .... ఇక్కడేకాదు మొత్తం మనకున్న ఫారెస్ట్ కాంట్రాక్ట్స్ అన్నీ వదిలేసుకుంటాను. చాలా ...." సముదాయించాడు.

తరువాత కరుణప్రియని లేవదీసి వాష్‌బేసిన్ దగ్గరకు తీసుకెళ్ళాడు -

ఫైటర్‌బేబీ ఒక్కుదుటున లేచి సెక్యూరిటీ గార్డుల రూములకేసి పరుగు తీసింది. వాళ్ళిద్దరూ ఆశ్చర్యంతో స్థాణువులై పోయారు.

మరుక్షణంలో రయ్‌మంటూ దూసుకొచ్చాయి కొన్ని కార్లు, జీపులు. అందులో ఒకటి పోలీస్‌జీపు. వచ్చిన వాహనాలతో గెస్ట్‌హౌస్ ప్రాంగణం నిండిపోయింది.

ఒక్కో వాహనంలోంచి ముగ్గురు నలుగురు చొప్పున దిగి లోపలికి రాసాగారు.

వాళ్ళందరూ శశి మరణవార్త విని రాజాని పలకరించడానికి వచ్చిన నగరవాసులు. వారిలో పోలీసు అధికార్లుకూడా ఉన్నారు. ఆ పోలీసు జీపులను చూసినందువల్లే ఫైటర్‌బేబీ జారుకుంది.

రంజిత్, జస్వంత్, రంగా కలసి వారందరికీ కాఫీలు, టిఫిన్లు అమర్చారు.

ఒక గంటసేపు ఉన్నాక ఒక్కొక్కరే తిరుగు ప్రయాణమవ్వసాగారు.

వచ్చిన వారిలో కొంతమంది ఫారెస్ట్ కాంట్రాక్టర్సుకూడా ఉన్నారు. వారిని కొంతసేపు ఉండమని చెప్పాడు రాజా -

హాల్లో వాళ్ళందరూ సమావేశమయ్యారు. రంగా వారికి కాక్‌టైల్ అమర్చాడు.

"ఫ్రెండ్స్! నేను ఈ బిజినెస్ వదిలేద్దామనుకుంటున్నాను." అసలు టాపిక్ ఎత్తాడు రాజా.

మొత్తానికి మాటలయ్యాయి. ఒకపెద్ద కాంట్రాక్టర్ రాజా బిజినెస్‌ని తాను తీసుకోడానికి ముందుకొచ్చాడు - నెలాఖరువరకూ టైమిచ్చాడు రాజా - అప్పటివరకూ బిజినెస్ హేండోవర్ చేసుకోమని చెప్పాడు.

ఆ తరువాత వాళ్ళుకూడా వెళ్ళిపోయారు,

అందరూ వెళ్ళిపోయారు —

ఫైటర్ బేబీ పరుగెత్తుకుంటూ వచ్చింది.

"రాజాగారూ! శశిగారు జంతువు చేతుల్లోనే చనిపోయారు,

"ఎలా ?" ఉలిక్కిపడి అన్నాడతను.

"ఎలా చెప్పగలవు బేబీ?" కరుణప్రియ అడిగింది.

"చెప్తా ... చెప్తా ... ఈజీమూడ్‌లోకి రండి ...." కాస్త ఊపిరి పీల్చుకుంది మిగిలిన వాళ్ళెవరూ వారి మాటలు వినకూడదని ఆమె ఉద్దేశం.

"మీ చెప్పులు ఇటియ్యండి" అని రాజా కాలి చెప్పులు తీసుకుని జాగ్రత్తగా పరీక్షించ సాగింది. రాజాకి, కరుణప్రియకి అంతా అయోమయంగా, కుతూహలంగా ఉంది.

"నక్కగానీ, తోడేలుగానీ శశిగార్ని చంపాయి" అంది బేబీ ఊపిరి తీసుకుంటూ రహస్యంగా —

ఎవ్వరినోటా మాటలేదు. మళ్ళీ తనే అంది —

"ఈ రూమ్ వెనకభాగంలో గోడమీద ఒకచోట ఒక జంతువు తోక గుర్తు, దాని పక్కనే అరచేతిగుర్తు ఉన్నాయి చూశారా?" ప్రశ్నించిందామె రాజాని.

"ఆ ... ఆ ... చూశాను. ఆ చేయిగుర్తు అన్నయ్యదే అయివుంటుందని అనుకున్నాను. మరి నువ్వెలా అంత నిక్కచ్చిగా చెప్పగలుగుతున్నావ్?"

"ఆ పరిసరాలలో మీ చెప్పుల గుర్తుతప్ప మరేం ఇతర గుర్తులు లేవు. అంటే అక్కడికి మీరు ఒక్కరే వెళ్ళారన్నమాట - అంతేగాక అక్కడ ఒక జంతువు కాలి గుర్తులున్నాయి. అవికూడా కుక్క, నక్క, తోడేలు ఈ మూడింటిలో దేనివైనా అయ్యుండాలి. ఇక తోక గుర్తునిబట్టిచూస్తే కుక్కతోక అలా ఉండదు. అది నక్కదిగానీ, తోడేలుదిగానీ అయ్యుండాలి. ఆ గుర్తు మట్టి మట్టిగా ఉంది.

నక్కలుగానీ, తోడేళ్ళుగానీ తమ శత్రువుతో పోరాడేటప్పుడు ఒక గొప్ప ట్రిక్కును ఉపయోగిస్తాయి. తోకను తమ మూత్రంతో తడుపుకుని. ఆ తడిసిన

తోకను మట్టిలో బాగా రాసి, ఆ మట్టి అంటిన తోకను శత్రువు మొహాన్నేసి కొడతాయి- అలా చేయడంవల్ల ఆమట్టి శత్రువు కళ్ళల్లోకి, నోట్లోకి విసరబడి శత్రువు ఉక్కిరి బిక్కిరి అయ్యే అవకాశముంది. ఆ క్షణంలో అవి శత్రువుపై విజృంభించడమో, లేక పారిపోవడమో చేస్తాయి..."

ఎలిమెంట్రీ స్కూలు విద్యార్థుల్లా మౌనంగా వింటున్నారు వాళ్ళిద్దరూ.

"ఇంతకీ నే చెప్పేదేమిటంటే - విచారకరమైన విషయమే అయినప్పటికీ, జరిగిందేదో జరిగి పోయింది. దానిపై లేనిపోని అనుమానాలు పెట్టుకుని బాధని ఎక్కువ చేసుకోకుండా, మనసుని దిటవు చేసుకోండి ...."

పదండిమరి అంటూ లేచి కరుణప్రియను చేయిపట్టి లేపుతూ డైనింగ్ టేబుల్ దగ్గరకి నడిచింది బేబీ.

భోజనాలయ్యాయి రాజా బెడ్‌రూమ్ వైపు నడిచాడు. కరుణప్రియను ఆపి బేబీ అంది.

"కరుణా ! ఈ రోజునుంచి రాజాని ఆ ఆలోచనలకు దూరం చేయవలసిన బాధ్యత నీదే ...అ... అంటూ అరచేతిలో గిల్లిందామె.

బేబీ తనకు కేటాయించిన రూమ్ దగ్గరకు నడిచింది.

14

రంగా వచ్చి గ్లాసులో పాలు అందించాడు బేబీకి. అతన్ని చూడగానే బేబీకి ఈ విషయం గురించి కదపాలనిపించింది.

"అదిగాదు గానీ ... రంగా ... శశిగారు ఎలాచనిపోయారంటావు?" పాలు నోటి దగ్గర పెట్టుకుంటూ అడిగిందామె.

"అదే అర్థం కావడంలేదమ్మా. కానీ అనుమానించాల్సి వస్తే మాత్రం జస్వంతనే సెక్యూరిటీగార్డుని అనుమానించాలి. తెల్లవారు ఝామునే బైటకివెళ్ళి శశిగారి శవాన్ని చూసిన వ్యక్తి అతనే. అతను గట్టిగా అరిస్తే ఆ అరుపుకి మాకు అందరికీ నిద్ర మత్తు వదిలిపోయింది - అప్పుడు మేమంతా వెళ్ళి పెదబాస్‌ని గుర్తించాం. అయితే ఆతను అంత తెల్లవారకుండా బైటకి ఎందుకు వెళ్ళాడో, శశిగారు ఎందుకు వెళ్ళారో ఏమీ అర్థం కావడం లేదమ్మ ..."

'పరిశీలనగా' వింటోందామె.

రాజాబాబు అడిగిన ప్రశ్నలు వేటికీ అతను సమాధానం చెప్పలేక పోయాడు. మరో విషయమేమంటే - అయ్యగారు చచ్చిపడున్నచోటే ఒక పాము కాటుకి చచ్చి పడున్న పందిపిల్ల ఉంది-"

శశి మరణంపట్ల బేబీకి అనుమానాలు మళ్ళీ కలిగాయి-జస్వంత్ మీద ఎందుకో తీవ్రమైన కోపం వచ్చిందామెకి. 'అతని ప్రవర్తన మొదటి నుంచీ అనుమానంగా ఉంది.' అనుకుందామె.

సువాసన కోసం వెలిగించిపెట్టిన అగరువత్తులపొగ ఆ గదిలో బాగా అలముకొనుంది - రాజా రెప్పలు వాల్చక సీలింగ్ కేసి చూస్తున్నాడు.

కరుణప్రియ అందాన్ని ఆత్రంగా స్పృశిద్దామన్నట్టుగా ఆ గదిలో లైట్‌కాంతి తాపత్రయ పడుతోంది. తలారా స్నానం చేసి జుట్టంతా విరయ బోసుకుని, తెల్లని చీరలో పాలరాతి శిల్పంలా ఉందామె. రెండు చేతులూ కాళ్ళకి చుట్టుకొని మోకాళ్ళమీద గెడ్డం పెట్టుకుని, అతని కేసే చూస్తోంది కరుణప్రియ.

నగరం నించి తెప్పించుకున్న మల్లెపూలు టేబుల్ మీద గుట్టగా పడున్నాయి. వారిద్దరి రాసలీలలనీ చూడాలన్నట్టుగా ఒక దానిలో ఒకటి తల దాచుకుంటూ సిగ్గు పడుతున్నాయవి.

కరుణప్రియకు మనసు ఇచ్ఛితంగా రెండు భాగాలయింది -

రాజా ఆలోచనలవైపు -

కన్నె తనపు కోరికల వైపు -

మత్తెక్కించే అగరువత్తుల సువాసనలుగానీ, కన్య అయిన తన శ్రీమతి గానీ, మైమరపించే మల్లెల మధుర గుబాళింపులుగానీ, ఇవేవీ పట్టించుకునే స్థితిలో లేడతను-

నిశ్శబ్దం నిశ్శబ్దం ... నిశ్శబ్దం ... !

ట్యూబ్‌లైట్‌ని అఫ్‌చేసి బెడ్‌లైట్‌ని వేసిందామె.

షెల్స్ శోభనం జరుపుకోని ఓ జంట ఆ గదిలో అలా గడపడం ఇష్టంలేనట్టు ఎర్రగా ... కోపంగా ఉంది బెడ్‌లైటు -

"రాజాని ఆలోచనలనుండి దూరం చెయ్యాలంటే తనవైపుకు తిప్పుకోక తప్పదు" స్థిరనిర్ణయానికి వచ్చింది కరుణప్రియ. నెమ్మదిగా తన చేతిని రాజా గుండెలమీద రాసింది.

రాజాలో చలనంలేదు -

కరుణప్రియలో బాధగా మూలుగు - వయసువేడి శరీరాన్ని కాలుస్తోందామెకు. చూపుడు వేలితో అతని నుదుటినుండి పెదాలవరకూ రాసింది -

మెల్లగా చూశాడు రాజా -

"ఆలోచనలలో మునిగి తన ప్రాణానికి ప్రాణమైన ప్రేయసిని, తన భార్యని పైగా ఈ కన్యన్ని ఎంత అశ్రద్ధ చేశాను" అన్నట్టుందాచూపు -

ఆశ్చర్యంగా ... బేలగా .... చూస్తున్న కరుణప్రియ నయనద్వయం అతని పెదాల సాయంతో మూతపడ్డాయి.

వారిద్దరూ తమ పరిసరాలనూ, పరిస్థితులనూ, మరిచి ఆ రాత్రి వారి తొలిరాత్రి సంబరాలు జరుపుకున్నారు. ఆనందాతి తమకాలతో !

15

"రాజా ! మనమొకసారి గూడెం పోయొస్తే ..." అంది ఫైటర్‌బేబీ !

అతనికిప్పటివరకూ ఆ ఆలోచనే తట్టలేదు.

"అవును వెళ్ళాలి. కానీ .... మనమిద్దరం వెళ్ళిపోతే ఎట్లా ? నువ్వు కరుణ ప్రియకి తోడుగా ఉండరాదూ .... నే వెళ్ళి చూసొస్తా ..." అన్నాడు రాజా.

మరో పావుగంటకి తనకు కావలసిన ఆయుధాలతో జీపుమీద గూడెంవైపు సాగిపోయాడతను.

బందిలబర్రి గూడెం ప్రజల ఆచారాలు చాలా విచిత్రంగా ఉంటాయి. వాళ్ళు ఎవరి ఆహారాన్ని వాళ్ళే వేటాడి తెచ్చుకోవాలి. గూడెం నాయకుడు ఎప్పుడూ వేటకి వెళ్ళాల్సిన పనిలేదు. రోగస్తులు, ఆడాళ్ళు వేటకు వెళ్ళరు. తమ అవసరానికి మించి వేటాడినవాళ్ళు - ఆహారాన్ని మిగిలినవారికి పంచుతారు. సుమారు అయిదుపదుల కుటుంబాలు ఉన్నాయాగూడెంలో - ఎవరికీ స్వంత నివాసం ఉండదు. ఒక్క గూడెం నాయకుడికి తప్ప -! స్త్రీలు ఎవరితోనైనా రమించవచ్చు, అదీ నాయకుడి ఇష్టంతోనే సర్వ సాధారణంగా నాయకుడు అభ్యంతరం చెప్పడు. అదేవిధంగా నాయకుడికి తమ స్త్రీలను అర్పించడంద్వారా అక్కడి ప్రజలు తమ గౌరవాన్ని ప్రదర్శిస్తారు. అదే విధంగా నాయకుడు నిర్దేశిస్తే ఏ పరాయి వాడితోనైనా ఆడవారు సుఖాల్ని పంచుకుంటారు. తినడం, శారీరిక సుఖాన్ని పొందడం, నిద్రపోవడమే వారి దైనందిన కార్యక్రమం.

దుమ్ము రేపుకుంటూ వెళ్ళి నాయకుడి గుడిసెముందు ఆగింది రాజా జీపు.

పెద్ద పెద్ద చెట్ల మధ్యగా వృత్తాకారంలో అమర్చినట్లున్న ఆ గుడిసెలు బోర్లించిన కుండల్లా ఉన్నాయి -

గుడిసెముందు చిన్న చెక్కను వేసుకుని వంటికి ఏదో తైలం పట్టిస్తూ, ఎండకి ఎదురు కూర్చున్నాడు నాయకుడు బయ్యాంక్ !

రాజాని చూడగానే గౌరవంగా లేచి ఎదురొచ్చాడతను.

"దొరా ! 'సుగం' కావాలా ?"

సుగం అంటే స్త్రీసుఖం అన్నది వారి అర్థం. తాము దైవసమానంగా భావించేవాళ్ళనే అలా అడుగుతారు వాళ్ళు. అలా అడిగితే తాము గౌరవం చూపించినట్లుగా భావిస్తారు.

"చ .... చ .... ఊరికే వచ్చాను ...." అన్నాడు రాజా -

చుట్టూ కలియజూస్తున్న రాజా కళ్ళు ఒక బండదగ్గర నిలిచి పోయాయి. ఆ బండ వారి కులదైవమయిన ఒక తోడేలు విగ్రహం. ఆశ్చర్యం అతని కనుబొమల్ని ముడేసింది. ఆ విగ్రహం కాళ్ళదగ్గర యముకలూ, రక్తపు మరకలూ ఉన్నాయి.

"తోడేలు .... తోడేలు ...." గొణుక్కుంటున్నాడు రాజా -

"మరిచిపోయ్యారా దొరా ! మా కులదైవమది. గతంలో మీరొచ్చినప్పుడు చిన్నపిల్ల. ఇప్పుడు బాగా ఎదిగింది ..." చెప్పుకుపోతున్నాడతను.

"విగ్రహం ఎదగడమా ! రాయి ఆకృతిలో ఎదగడమా ?"

ఆలోచనలతో ఉన్న రాజా గుడిసెలోంచి వచ్చిన ఒక కన్నెపిల్లని చూసి మరింత అయోమయంలో పడ్డాడు.

ఆరోజు తాను గెస్ట్‌హౌస్‌కి వస్తుంటే .... దారిలో .... చెట్టుదగ్గర కనిపించిన పిల్ల ఈమే !

"నా బిడ్డదొరా ! దీనిపేరు 'గిన్నా'" పరిచయం చేశాడు బయ్యాంక్.

రాజా ఆశ్చర్యంతో కళ్ళప్పగించి చూస్తూనే ఉన్నాడు. అతనలా తన కూతురికేసి చూడటం 'బయ్యాంక్' కి ఆనందంగా ఉంది. అతను తనకూతుర్ని కోరుకోవడం తన అదృష్టమనుకున్నాడతను.

అప్సరసలాగుంది ఆ పిల్ల !

నిండా పదారేళ్ళుండచ్చు. మిసమిసలాడుతున్న ఛాయ - అసలాగూడెంలో ఇంత అందమైన పిల్ల ఉంటుందని ఊహించలేదు రాజా -

"మోకాళ్ళపైన తొడలు నిండుగా, బలంగా, నగ్నంగా కదులుతున్నాయి. గుండెలక్రింద నగ్నమైన పొట్ట ముడుతలు పడింది. తెల్లటి ముద్దొచ్చే లేత పాదాలు- సుందరమైన వదనం, పెద్ద కళ్ళు ..." కిందకీ పైకీ చూస్తున్నాడు రాజా.

విశాలమైన జుట్టు గాలికి ఎగురుతూంటే, ఒకచేత్తో వెనక్కి సర్దుకుంటూ - రెండోచేత్తో ఏదో అందించిందామె రాజాకి.

ఏదో ద్రవపదార్థం ... బహుశ సారాయి అయ్యుండచ్చు.

ఆమె కళ్ళల్లోకి చూశాడతను. చిలిపి ఊహలు తారాట్లాడు తున్నాయి. మనసుని గిల్లే చిర్నవ్వు ఆ కంటి కొసల తొంగిచూస్తోంది.

సన్నగా నవ్విందామె - చేతిలోని పాత్ర రాజా చేతికందించి తుర్రుమంది లోపలికి. ఈ లోపున బయ్యాంక్ రెండుసార్లు గుడిసెలోపలికి పోయొచ్చాడు.

తండ్రి అలాలోపలికి వెళ్ళడంతో గిన్నా ఆనందానికి అవధుల్లేవు. తాను రాజాతో కలియడానికి తండ్రి అంగీకరిస్తాడన్న మాట -

బయ్యాంక్ మళ్ళీ గుడిసెలోకి రాగానే ఆమె మరోపాత్రతో ఏదో ఘనపదార్థం తీసుకొచ్చింది. రాజా ఎదురుగా మోకాళ్ళపై కూర్చుని, తన కుడిచేతి చూపుడువేలుతో అదురుతున్న రాజా క్రింది పెదాన్ని తాకిందామె - "దొరా !" చిన్న మూలుగు ఆమె గొంతులో !

ఉలిక్కిపడి వెనక్కి జరిగాడతను -

గుడిసెలోనుండి వచ్చిన 'బయ్యాంక్' పెదాల చిర్నవ్వు !

ఆదేసమయంలో రాజాకు 'పదిగజాల దూరంలో ఓ చెట్టునుండి దభేల్న దూకిందో 'ఆకారం'-

ఒళ్ళు ఝల్లుమంది - రాజాకి - ఆత్మరక్షణ కోసమన్నట్లుగా ఊహించనంత వేగంగా రివాల్వర్‌తీసి గాలిలోకి పేల్చాడతను. తానున్న ప్రదేశాన్ని మరిచినట్లు, శత్రువులు తమపై దాడిచేయనున్నట్లు ఉందతని ఆలోచన. ఆ దూకిన వ్యక్తి

గూడెంవాడే. ఏదో జంతువుని వేటాడి తెచ్చాడు.

కానీ, రివాల్వర్ శబ్దానికి పెద్దగా అరుచుకుంటూ మళ్ళీ చెట్టెక్కేశాడతను. అల్లుకొనున్న కొమ్మల మధ్యనించి మెడ బైటికిపెట్టి భయంగా - భయంకరంగా చూస్తూన్నాడతను.

తాను రివాల్వర్ పేల్చడంద్వారా తప్పు చేశానని గ్రహించిన రాజా... పక్కనున్న 'బయ్యాంక్'ని చూసి 'సారీ' అన్నాడు. అప్పటికే బయ్యాంక్, గిన్నాని రెక్కపుచ్చుకుని లోపలికి గెంటేశాడు. అతని కళ్ళల్లో నిప్పులున్నాయి. తీవ్రంగా, కోపంగా చూస్తున్నాడతను.

ఆ భయపడిన వ్యక్తి అరిచిన అరుపుకి గూడెంవాళ్ళు అందరూ వచ్చేశారు, చేత ఆయుధాలతో...

రెండు నిమిషాలు నిశ్శబ్దం -

'పోండందరూ' అరిచాడు బయ్యాంక్ - ఆ వెనుకే తనూ గుడిసెలోకిపోయి తలుపులు మూసేశాడు -

రాజాకి అయోమయమైంది. ఏంచెయ్యడానికి తోచలేదు. "బయ్యాంక్ ! సారీ సారీ..." అన్నాడతను.

కానీ, అతన్ని వినిపించుకునే వాళ్ళులేరు. అతను శశి తమ్ముడు అవడంవల్ల బతికి పోయాడుగానీ, లేకుంటే ఈ పాటికి రాజాని చంపి, తమ దైవం 'తోడేలు'కి నైవేద్యం చేసేవారే.

ఆ ప్రాంతమంతా నిశ్శబ్దం -!

ఎవ్వరూ కంటికి కనబడటం లేదు.

రాజా మెల్లిగా లేచిజీపు దగ్గరికి నడిచాడు. ఈఅడవులనుండి శాశ్వతంగా నగరానికి వెళ్ళిపోతున్నానని చెప్పడానికి వచ్చిన రాజా తిరుగు మొఖం పట్టాడు -

16

గంతల దారిలో జీపు పరుగెడుతోంది -

ఆలోచనలతో ఉన్నరాజా దృష్టి డ్రైవింగ్ మీద పూర్తిగాలేదు. ఈ అడవులని వదిలివెళ్ళిపోవడమే ఒక బాధాకరమైన విషయమైతే - ఈగూడెం వాళ్ళకి తన అన్నగారి మీదున్న గౌరవాభిమానాలని కూడా పోగొట్టానే - అనే బాధ కూడా తోడయింది తనికి.

దారి పక్కనే చిన్న చిన్న రాళ్ళు, గుట్టలూ, బండలూ వున్నాయి-స్పీడుగా పోతున్న జీపు సడన్‌బ్రేకుకి బేలన్స్‌తప్పి దారిపక్కనున్న ఒక బండరాయిని గుద్దింది

చెంగున దూకాడు రాజా -

"అంత జాగ్రత్తగా బ్రేక్స్ వేయబట్టిగానీ - లేకపోతే చచ్చిపోను ..." అనుకున్నాడతను.

అంత శబ్దానికి కూడా వెనుదిరగలేదా ఆకారం ! రోడ్డుని అడ్డంగా, అటువేపు మొహం చేసుకుని నిలబడుంది! ఆమె స్త్రీ అని వస్త్రధారణ బట్టి తెలుస్తూనే ఉంది.

దగ్గరగా వెళ్ళాడు రాజా - మీద చేయి వేయబోయి ఆగిపోయాడు -"ఏయ్... ఏయ్ ఎవర్నువ్?"

మెల్లిగా ఇటు తిరిగిందామె - ఆమె 'గిన్నా' -!

అతని ప్రయత్నాన్ని గ్రహించినట్టుంది - నిశ్చలంగా చూస్తోంది.

క్షణమాగి - ఎందుకలా చూస్తున్నావ్ ? నేనే ! అందామె.

తనను చంపమని ఆమెను పంపారేమోననే అనుమానంతో అతని చేయి డాగర్ మీద పడింది.

"నువ్వే! అవును నువ్వే. కానీ ఎలా ఇంత వేగంగా వచ్చావ్? ఎందుకొచ్చావ్? నా జీప్‌కి అడ్డంగా ఎందుకు నిలబడ్డావ్ ?"

"చచ్చిపోదామనే వచ్చాను. ప్రాణాలకు తెగించే నీ దారికి అడ్డంగా నిలబడ్డాను" గలగల నవ్వుతోందామె -

"నీకోసమే వచ్చాను ..." చిలిపిగా చూసిందామె.

ఆరోజు ఆమె కన్పించింది - నవ్వి - మాయమయినప్పుడే తనపై ఆమెకున్న 'వాంఛ'ను గ్రహించాడతను. గూడెంలో తనకెదురుగా కూర్చుని తనమీద వెయ్యేసి తమకంగా 'దొరా' అని పిలిచినప్పుడే ఆ విషయం మరోసారి రుజువయింది. ఇప్పుడిలా రావడంతో ఆమె మాటలపై నమ్మకం కుదిరి అతనిచేయి యధాస్థానానికి వచ్చింది.

కానీ వాళ్ళ ఆచారం ప్రకారం —

"గూడెంలో ఏ స్త్రీ అయినా ఏ పరాయి పురుషుడితోనైనా రమించవచ్చు. కానీ, అందుకు నాయకుడి ఇష్టం ఉండాలి. అలాకాక, నాయకునికి తెలియకుండాగానీ నాయకునికి ఇష్టం లేనప్పుడుగానీ వారు అలా చేయకూడదు. ఒకవేళ చేస్తే ఆ స్త్రీని చంపి తమ దైవంకి నైవేద్యం చేస్తారు వాళ్ళు. పురుషుణ్ణిమాత్రం ఏమీ అనరు" అది వారి ఆచారం.

ఆ విషయాన్నే తలుస్తున్న రాజా చూపులు నలువైపులా చూస్తున్నాయి.

"నేనిక్కడికి రావడం మా అయ్యకికూడా తెలీదు, ఇష్టంకూడా లేదు. కానీ, మా అయ్యకే తెలియకుండా నీకోసం వచ్చానంటే ప్రాణాల్నిసైతం లెక్కచేయలేదని నీకు తెలిసే ఉంటుంది. ఆ ప్రాణాలు నీ చేతుల్లోనే పోవాలని - నీ జీపుకి అడ్డం వచ్చాను." ఆమె మాటల్లో తనపైగల స్వచ్ఛమైన ప్రేమ స్పష్టంగా కనిపిస్తోందతనికి.

"కానీ నువ్వు నన్ను చంపలేకపోయావు. చివరిగా నా కోర్కెనైనా తీర్చి నాకు ఆనందాన్ని ఇవ్వు ... నవ్వుతూ చచ్చేలా చేయి..."

ఒక పురుషుడితో కామాన్ని పంచుకోడానికి ఆమె ప్రాణాల్నేమాత్రం లెక్క చేయడంలేదంటే - అతన్ని ఎంతగా మోహిస్తోందో!

ఏదో చెప్దామని నోరు తెరవబోయాడతను.

"దొరా! అలా చూస్తున్నావేం? నేనై వచ్చానని తక్కువై పొయ్యానా? నా మనసుమీద నమ్మకంలేదా? సర్లే... నా చావేదో నే చూసుకుంటా..." కదిలిందామె. మళ్ళీ ఆగి అతని పాదాలవంకచూసి, చటుక్కున వంగుని ఆ పాదాల్ని స్పృశించింది. ఆమె కన్నీళ్ళు నేల జారాయి.

"శశి మరణం విషయంలో ఈ గూడెంవాళ్ళపై తన అనుమానాన్ని తీర్చుకో డానికి ఈమెని ఉపయోగించుకుంటే....?" అనే ఆలోచన కలిగిందతనికి.

"గిన్నా!" అరిచాడు.

గిరుక్కున వెనుదిరిగిందామె. వేగంగా ఆతని దరికొచ్చేసింది.

నవ్వాడతను -

ఆ నడిదారిలో అతన్ని గట్టిగా వాటేసుకుందామె.

గిన్నాని అనుభవించకుండా తన పని చేసుకుందామనుంది అతనికి. అతనికి నిజంగా ఆమె శరీరంమీద వాంఛ లేదు.

"గిన్నా నువ్వంటే నాకెంతో యిష్టం -"

ఆ మాటకే అతని మొహాన్ని తన అరచేతులతో దగ్గరగా లాక్కుని ముద్దులతో ముంచెత్తిందామె.

"కానీ ఇలా నడిదారిలో మనం కలసి మాట్లాడుకోవడం ఎవరైనాచూస్తే నిన్ను ప్రాణాలతో వదిలిపెట్టరు..."

ఆమె మధ్యలోనే అందుకుంది. "మీకేంకాదు దొరా.... నన్ను చంపుతారు... చంపనీ!"

"ఎంత పిచ్చిదానవు గిన్నా! నాలో ప్రాణం ఉండగా నీమీద చేయి వేయ నివ్వను. కానీ ఒక్కమాట! ఇలా పగటిపూట కాకుండా ఏ రాత్రిపూటో అయితే తీరిగ్గా మాట్లాడుకోవచ్చుననీ...."

"ఓ అలాగే! అలా అయితే వచ్చే పున్నమి రాత్రికే కలుద్దాం. హాయిగా చందమామ వెలుగులో.... అది నాకెంత యిష్టమో!" కన్నెమనసు కోరికని బయట పెట్టింది.

17

భావన, ప్రత్యూష. కరుణప్రియ తల్లిదండ్రుల్ని వెంటబెట్టుకుని వచ్చారు. ఏడుపులతో మ్రోగిపోయిందా గెస్ట్‌హౌస్. ఎవర్ని ఎవరూ ఓదార్చే స్థితిలో లేరు.

రాజా బెంబేలెత్తి పోయాడు.

ఈ అడవులనీ, బిజినెస్‌నీ వదిలి పెట్టేస్తానని రాజా చెప్పిన తర్వాత కొంచం చక్కపడ్డారు వాళ్ళు.

అన్నయ్య ఎలా చనిపోయిందీ తెలుసుకుంటేగానీ ఆ గెస్ట్‌హౌస్‌ను వదలడానికి

రాజాకి ఇష్టంలేదు.

జయదాసుగారు పనివాళ్ళతో కొంచెం కొంచెంగా సామాన్లు నగరానికి పంపిం చేస్తున్నారు -

ఫైటర్‌బేబీ నగరంలో పని ఉందనీ, కరుణప్రియకు సాయంగా ఉండటానికి అందరూ వచ్చారు కదా అనే ఉద్దేశంతో వెళ్ళిపోయింది. జంతువుల చేతుల్లోనే శశి చనిపోయాడని బేబీకి గట్టి నమ్మకం - అంతగా అయితే నగరానికి వచ్చాక ఆ విషయం చూసుకోవచ్చులే అని సర్ది చెప్పింది రాజాకు.

జస్వంత్, రంజిత్‌ల పైన రాజాకి అనుమానం తగ్గింది - అదేవిధంగా 'బందీల ఖర్రీ' గూడెం ప్రజలమీద అనుమానం ఎక్కువైంది రాజాకి.

ఆ అనుమానం కాస్తా కసిలాగా, పగలాగ మారింది.

ఎట్టి పరిస్థితిల్లోనూ గిన్నా ద్వారా ఏదో కొంతయినా సమాచారం రాబట్టాలని అతని ప్రయత్నం -

రాబోయే పున్నమి రాత్రి గురించి ఆత్రంగా ఎదురు చూస్తున్నాడతను.

పున్నమి దగ్గరవుతోంది.

ఏ రోజయినా సరే, ఎట్టి పరిస్థితుల్లోనైనా సరే

తూరుపు తెల్లవారేవరకూ ఏ ఒక్కరూ గెస్ట్‌హౌస్ తలుపులుతీసి బయటకు రాకూడదని అందరికీ చెప్పాడతను.

అదేవిధంగా ఒకవేళ తాను ఏరాత్రి అయినా గెస్ట్‌హౌస్ దాటి బైటకు వెళ్తే తీసుకోవలసిన జాగ్రత్తలన్నీ పరోక్షంగా చెప్పాడు రాజా. "అయిదుసార్లు ఒకేవిధంగా తలుపుమీద శబ్దం చేసేవరకూ తలుపులు తీయవద్దని" కరుణప్రియకుకూడా చెప్పా డతను.

"ఈయనెందుకు బైటికెళ్తార్లే" అనే ఉద్దేశంతో ఆ విషయాన్ని పెద్దగా పట్టించు కోలేదామె.

రంగాని ఒంటరిగా పిలిచి తను ఏదో ఒకరోజు బైటకి వెళ్ళాల్సి వస్తుందనీ - అలా వెళ్ళిన పక్షంలో ఆతని గదిలోనుండే బయటకు వెళ్తాననీ - ఆ స్థితిలో కరుణ ప్రియను జాగ్రత్తగా చూడమనీ మరీ మరీ చెప్పాడు. రంగామీద ఎనలేని నమ్మకం అతనికుంది.

తనూ ఎదురు చూస్తున్న ఆరోజు వచ్చింది —

ఆరోజే పూర్ణిమ —

ఆరోజుకి సరిగ్గా నెలరోజులక్రితం - గత పౌర్ణమి రోజునే శశి చనిపోయాడు.

ఆరోజు రాజా చేసేప్రయత్నం - గిన్నాద్వారాగానీ మరేవిధంగాగానీ సమా చారం రాబట్టాలనే ప్రయత్నం ఆఖరిది. ఆ మర్నాడే రాజా నగరానికి ప్రయాణం అవుదామనుకుంటున్నాడు. ఆ మర్నాటినుంచీ ఈ బిజినెస్సంతా వేరొకళ్ళ పరమౌ తుంది!

చీకటి పడుతూండగానే భోజనం చేసేసి బెడ్‌రూమ్ చేరుకున్నాడు రాజా. కరుణప్రియను రమ్మని కంటితో సైగచేశాడు.

పైకి ఎంత సిగ్గుగాఉండి రానని మొండికేసినా, అతనంత ప్రేమగా పిలిచేసరికి మరో పదినిమిషాలకే కరుణప్రియకూడా మెల్లగా బెడ్‌రూమ్‌కి చేరుకుంది.

సిగ్గులన్నీ బరువులై .... అడుగులు వడియై కరుణప్రియ బెడ్‌దగ్గరకు చేరుకునేసరికి - మరో అయిదు నిమిషాలయింది.

వీలయినంత త్వరగా ఆమెని నిద్ర పుచ్చాలనేది రాజా కోరిక ! అతని కౌగిట్లో చల్లారిన గోదారై ఒదిగి పోవాలని ఆమె మనసు !

తలుపులు మూసేశాడతను -

ఆమెను పసిపాపలా రెండు చేతుల్లో ఎత్తుకొని బెడ్‌పై పడుకోబెట్టాడు.

అతని లాలనలో ఆమెకి ప్రతిరాత్రీ మొదటి రాత్రే ! సిగ్గుతో ఆమె రెండో వేపు దొర్లింది - అలా దొర్లడంలో ఆమెపైట వున్నచోటనే ఉండిపోయింది -

ఎత్తైన వక్షోజాలు - గమ్మత్తయిన ఆ ముడతలు పడ్డ నడుం మత్తుగా-అతన్ని ఆహ్వానిస్తున్నమల్లెల నవ్వులు !

కాలం తెలియనంత సేపు వారిరువురూ కట్టలు తెంచుకున్న సెలయేళ్ళ-శృంగార రాస తరంగిణిలో - ఆనందపు వాహిని ఉత్తుంగ తరంగాల నడుమ -తీరే కోర్కెల చిరు పడవల్లా .... ఎగిసి పడే కెరటాల్లా తీరంవేపు - మళ్ళీ అంతేవేగంగా సాగర గర్భానికి .... అలా ... అలా .... అలా !

స్వర్గ సుఖాలనుభవించారు -

దాదాపు పది గంటలు కావస్తుండగా మత్తుగా, హాయిగా, అమాయికంగా - పెదవులపై చెరగని సన్నని నవ్వు - మూసిన కళ్ళల్లో కదిలే స్వప్నాలకి చెక్కిళ్ళ కెక్కి నిక్కి చూస్తున్న సిగ్గులు !

"కరుణప్రియ నిద్రలోనూ ఎంతందంగా ఉంది. అనుకోక తప్పలేదతనికి

18

ఆదే సమయంలో

అక్కడ

గిన్నా - !

తలార స్నానం చేసింది - సాంబ్రాణి పొగని ఒళ్ళంతా పట్టించుకుంటోంది. తనకు నచ్చిన వస్త్రాల్ని ధరించింది.

స్నానం చేసిన కన్నెపిల్ల శిరోజాలని అఘ్రాణిస్తే వచ్చే గమ్మత్తైన మత్తుకి, ఆ సాంబ్రాణి పొగ జోడిస్తే ఎంత మత్తుగా ఉంటుందో ఆమెకు తెలియక పోయినా.... ఆమె ఆనందంలో ఎన్నో అలంకరణలు చేసుకోవాలో అన్నీ చేసుకుంటూంది.

గుడిసెలో ఓ మూల ఏదో జంతువు చర్మంపై నిద్రపోతున్నాడు బయ్యాంక్ ! కూతురి సింగారాన్ని చూసీచూడనట్టు చూస్తున్నా -

"మనువు కావలసిన పిల్లకి ఆమాత్రం సింగారాలపై మోజు ఉంటుందిలే అని సర్దిచెప్పుకుని వత్తిగిలి పడుకున్నాడతడు. మరోక్షణానికే అతని 'గురక' ఆ గుడిసెలో మ్రోగసాగింది.

అదే అదనుగా ఆమె గుడిసెలోంచి బైటపడింది. ఆ చుట్టుపక్కల వారికి అలికిడి తెలియకుండా నక్కి నక్కి వచ్చి ఓ చెట్టు ఎక్కేసిందామె. సర్వసాధారణంగా వారి ప్రయాణాలు ఎక్కువ చెట్లమీదనించే సాగుతాయి.

• • • •

ఇక్కడ —

నల్లని ప్యాంటు, నల్లని షర్ట్ ధరించిన రాజా, ఒక రివాల్వర్‌నీ, ఒక డాగర్‌నీ నడుంలో అమర్చుకున్నాడు.

అన్నిరకాలైన జాగ్రత్తలూ తీసుకున్నాడతను.

భావన, ప్రత్యూష పడుకున్న రూమ్‌కి, రాజా బెడ్‌రూమ్‌కి మధ్య ఒక తలుపు ఉంది. ఆ తలుపులు తెరిచి ఉంచాడు. అటునుండి రంగా రూమ్‌లోకి దారిఉంది. అక్కడికివెళ్ళి రంగాతో తాను బైటకి వెళ్తున్నాననీ, జాగ్రత్తగా కాపలా కాయమనీ మరీ మరీ చెప్పి బైటకి బయలుదేరాడు.

తన కారునీ, జీపునీ గూడెంవాళ్ళు గుర్తుపడతారనే ఉద్దేశంతో కరుణప్రియ తీసుకొచ్చిన నలుపు అంబాసిడర్ మార్క్‌ఫోర్ కారు తీసుకుని బయలుదేరి వచ్చేశాడు రాజా —

రంగా గేటుని నిశ్శబ్దంగా మూసేసి వచ్చి తన గదిలోకి వెళ్ళిపోయాడు.

ఆ ప్రదేశం వచ్చేసింది -

గిన్నా, రాజా కలుసుకుందామనుకున్న ప్రదేశం అదే. విశాలంగా ఉందా ప్రదేశం. ఒక పెద్ద బండరాయి పక్కగా కారుని పోనిచ్చాడు.

వెన్నెల పుచ్చపువ్వులాగుంది -

అతనాప్రదేశానికి చేరుకునేసరికి గిన్నా కారుకి అడ్డంగా నిలబడి ఉంది. మళ్ళీ అప్పటిలాగే అటువేపు మొహంచేసి నిలబడుందామె, వెనుకగానే ఆమె చాలా ఆకర్షణీయంగా ఉంది.

ఈసారి అతను హారను మ్రోగించలేదు. అంత సడన్‌గా బ్రేకులూ వేయలేదు చిరాకుగా దిగలేదు. మెల్లగా తీరిగ్గావెళ్ళి ఆమెను సమీపించాడు. ఆమెమీద చేయివేయడానికి ఏమాత్రం సంకోచించలేదతను.

మెల్లగా చేయి వేశాడు -

అంతే !

గిర్రున తిరిగిందామె.

సెకను కూడా ఆలోచించకుండా తనకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుని, తన కోరిక మన్నించి, తనను మనసారా అనుభవించడానికి, తాను కోరిన సమయానికి

వచ్చిన రాజాని అమాంతం వాటేసుకుందామె.

అన్నిటినీమించి తనలో ఎప్పట్నుంచో మొగ్గ దొడిగిఉన్న యవ్వన కోర్కెలు పులకించబోతున్నాయనే ఆనందంతో ఆమెలో ఎంతో హుషారుని కలిగించింది - ఆమె మనసు కళ్ళెంలేని గుర్రమయింది.

ఆ సంతోషంలో ఆమె అమాంతం అతన్ని మళ్ళీ కౌగలించుకుని, అతని మొగమంతా ముద్దులతో ముంచెత్తింది.

క్రమంగా రెండు చేతులతోనూ అతన్ని జుట్టుపట్టుకుని ముందుకి వంచి - కాలి బ్రొటన వేళ్ళమీద పైకిలేచి ఠక్కున అతని బుగ్గ కొరికింది.

స్ర్రున మండిందతనికి 'ఇదెక్కడి జంతువురా బాబూ!' అనిపించింది-ఆమె ముద్దులని పొందడానికి, ఆమె శరీరాన్ని అనుభవించడానికి ఏమాత్రం ఇష్టంలేద తనికి అందువల్లనే ఆమె అంతగా తనలో అల్లుకు పోతున్నప్పటికీ అతని మనసునే అనుసరిస్తున్న అతని శరీరం - అచేతనంగానే ఉండిపోయింది.

మత్తెక్కిన కళ్ళతో, బిలిపిగా చూస్తోందామె.

తన స్తబ్ధప్రవర్తనకే ఆమె అలా చూస్తూందేమోనని తత్తర పడిన రాజా, గభాల్న రెండుచేతులతోనూ ఆమె నడుంచుట్టూ పట్టుకుని మరింత దగ్గరగా లాక్కున్నాడు—

మనస్ఫూర్తిగా, శరీరాన్నంతా అతనిముందు పాన్పులా పరిచి స్వర్గం చేరుకోవాలనుందామెకి. రాజాకూడా సహకరిస్తేగానీ అది సాధ్యం కాదని గ్రహించిందామె.

ఆ ఆలోచన రాగానే తన ఛాతిచుట్టూ కట్టుకున్న సన్నని నారతో కట్టిన అల్లికని టుప్న త్రెంచేసిందామె.

ఆబగా ఉందామె - ఆతృతగా ఉందామెకి!

అనుభవించని ఆనందాన్ని ఆక్షణంలోనే వశం చేసుకోవాలనుందామెకి. మరుక్షణంలో తాను బ్రతికుంటానో, ఉండనో బ్రతికుండగానే ఆనందాన్ని జుర్రుకోవాలి అనుభవాల సరస్సున మునకలేయాలని - అందుకే ఆతన్ని ఆత్రుత పరుస్తోందామె. అదే సమయంలో రాజాకి ఆమె బ్రతుకుమీదే ఆలోచన -

"పాపం! పిచ్చిపిల్ల!! అనుకున్నాడతను.

ఆమెని కదిలించి, మాట్లాడించాలనే ఆలోచన ఒక పక్క —

ఎన్నోసార్లు ఆమెను మాట్లాడించడానికి ప్రయత్నించాడు. ఆమె అతని మాటలని వినేస్థితిలో లేదు. మాట్లాడే అవకాశమూ ఇయ్యడంలేదు.

అక్కడినుండి కదిలించి, కారులో కూర్చొబెట్టి మాట్లాడించాలనుంది అతనికి. కానీ ఆమె వినదాయె, విన్పించుకోదాయె. ఆ ఉద్రేకం తగ్గితేగానీ ఆమె పలకదని గ్రహించాడు రాజా —

ఆమెను ముట్టుకోనున్న చేతులతో మరింత వడిసిపట్టి కారుదగ్గరకి నడిచాడు.

రాజా ప్రతిచర్యతో ఆమె ఈ లోకాన్నే వదిలేసింది. ఆమెదోలోకం-అక్కడ ఆమె రాణీ రతీదేవి!

కారు బాక్‌సీట్లో ఆమె కూర్చోలేదు. పడుకొనుంది. ఆమె చేతులురెండూ రాజాచుట్టూ ముడేసుకున్నాయి.

సీట్లోకి చేరగానే ఆత్రంగా అతన్ని పైకిలాక్కుందామె.

రాజాకి ఆమెను కల్మషపర్చటం ఏమాత్రం మనస్కరించడంలేదు. అలాచేస్తే కరుణప్రియకు అన్యాయం చేసినట్టవుతుందనీ, గిన్నా జీవితాన్ని కబళించినట్టవుతుందనీ అతను కలవర పడుతున్నాడు.

ఆనందసాగరపు ఉవ్వెత్తుటలలమధ్య పయనిస్తున్న అతి చిన్న పడవ కదలిక వారిలో మొదలయింది.

ఉద్రేకపు జలపాతాలు పొంగి పొర్లుతున్నాయి. శ్వాశలు బరువయ్యాయి.

సరిగ్గా ఆదేక్షణంలో ...

దూరంగా ...

కలకలం...

అరుపులు ...

గోలగోల ....

గో......ల...!

ఎవరో గుంపులు గుంపులుగా అరుస్తున్నట్టు శబ్దం! అంతా పరుగులెత్తు కొస్తున్నట్టు శబ్దం ... గోల!

రాజాకి నరాలన్ని ఒక్కసారి ఎలర్ట్ అయ్యాయి - !

మెదడు చురుగ్గా పనిచేసిందో సెకను!

చెవులురిక్కించి విన్నాడు - "అవును వాళ్ళే!"

"బందీల బర్రి గూడెం వాళ్ళ!"

ఒక్కసారి గుండె ఆగి మళ్ళీ హెచ్చు వేగంతో కొట్టుకోడం మొదలెట్టింది.

గిన్నా గుడిసెలో కనబడక పోయే సరికి "బయ్యాంక్" కొంత మందిని వెంటేసుకొని ఆమెను వెతుకుతూ వస్తున్నాడు!

గిన్నా రాజా మీద మనసు పడిందనీ, వెళ్తే అతని దగ్గరకే వెళ్తుందని 'బయ్యాంక్' నమ్మకం - అందుకే వాళ్ళు గెస్ట్‌హౌస్ కేసే వస్తున్నారు.

"అయితే ... అయితే ...,తామిద్దరినీ ఇప్పుడు వాళ్ళు పట్టుకోడానికే వస్తున్నారన్నమాట!"

ఆ ఆలోచనరాగానే ఒక్కసారి తలవిదిల్చాడతను -

"తాను అర్జెంటుగా తప్పించుకోవాలి - తామిద్దరూ కలిసి వారికి దొరక కూడదు. కానీ అదిసాధ్యమయే పనేనా? మరికాదో?"

ఆరూము తలుపులు దగ్గరగా వేసున్నాయి - మధ్యలో చిన్న సందు!

ఆ రూమ్ భావన, ప్రత్యూషల బెడ్స్ ఉన్న రూమ్.

"ఆ తలుపులు ఎందుకు తీసి ఉన్నాయ్ -

ఈ రూములో భార్యాభర్తలు ఉన్నప్పుడు ఆ తలుపు తెరిచి ఉంచరా? అంటే... అంటే... ఆ తలుపులు ఇప్పుడిప్పుడే తెరుచుకున్నాయన్నమాట!

రాజా అటే వెళ్ళి ఉండచ్చు!

ఆ రూమ్‌లోకే వెళ్ళుంటాడు. అవును అన్ని తలుపులూ లోపల వేసే గడియలు పెట్టిఉన్నాయి కాబట్టి .... కాబట్టి .... రాజా ఆ రూమ్‌లోకి వెళ్ళి ...!

"ఒకవేళ ...!"

అనుమానం మనిషికి శత్రువు. అందునా ఆడదానికైతే అది నిత్యం మెడలో వ్రేలాడే పదునెక్కిన శూలం. అడుగడుక్కీ గుండెల్లో గుచ్చుకుని, విపరీతమైన మనోక్షోభను గురిచేస్తూనే ఉంటుంది. అసలు ఆడదానికి అదే భయంకరమైన అనారోగ్యం - రోగం! అనుమానానికి మందేలేదు. దాన్ని అరికట్టడానికి ఆయుధమే లేదు!

అటువంటి భయంకరమైన అనుమానం ఆ సెకనులోనే కరుణప్రియ సంస్కారాన్ని, వ్యక్తిత్వాన్ని నిలువునా చీల్చేసింది.

అటే కదిలిందామె.

ఎలుకను పట్టుకోడానికి ప్రయత్నించే గండుపిల్లిలా పాదంలోని మాంసముండే భాగాన్నే నేలపై మోపుతూ, మెల్లగా .... మెల్లమెల్లగా అడుగులేసిందా రూమ్‌వరకూ!

చీర కుచ్చిళ్ళు ఎత్తి పట్టుకుని అలానే నిలబడింది!

అలికిడిలేదు!

అంతా నిశ్శబ్దం -!

ఆ నిశ్శబ్దం మధ్యలో దీర్ఘంగా వినవస్తున్న శ్వాశల చప్పుడు.

తన సమక్షంలోనే ఘోరాతి ఘోరం జరిగిపోతుందన్నమాట!

అణువణువునా ఆవేశం పెరిగిపోతుందామెకు.

గుమ్మం పక్కగా నుంచొంది చాలాసేపు -

అలికిడిలో మార్పులేదు!

డిమ్‌లైట్ కాంతిలో ఆ రూములోపలంతా స్పష్టంగా కనిపిస్తోందామెకు.

మెడవంచి ముందుకు చూసిందామె.

తలుపులు కొద్దిగా తప్పించింది.

కొంచెం ఎడంగా వేసుంది ఓ డబుల్ కాట్‌బెడ్!

మరో అడుగు ముందుకేసిందామె.

ఒక్క అంగలో తలుపులు తెరవడం, పోయి స్విచ్ బోర్డుమీద ఆమె చేయి పడటం జరిగిపోయింది.

ట్యూబ్ లైట్ వెలిగింది.

తెల్లని కాంతి ఆ రూమంతా పరుచుకుంది.

సిగ్గొచ్చి అహాన్ని 'చెళ్ళున' చెంపన చరిచినట్టయిందామెకి

ఆ దెబ్బకి అనుమానం పటాపంచలైంది.

ఆదమరచి నిద్రపోతున్నారు - భావన, ప్రత్యూష!

తన అనుమానానికి తనే తల బద్దలు కొట్టుకోవాలనిపించిందామెకి.

అతితెలివితో ఎక్కడో ఏదో ఉందని ఊహించి, అనక సత్యాన్ని గ్రహించిన ఎవరి పరిస్థితి అయినా అలానే ఉంటుంది.

ఈ సంస్కారవంతుల్నా తను అనుమానించింది.

తనను అత్యంత ప్రేమగా, ప్రాణానికి ప్రాణంగా చూసుకునే తనభర్తనా తను అనుమానించింది?

ఛీ ...! వీళ్ళ సంస్కారంముందు, ఆయన వ్యక్తిత్వంముందూ తనెంత? తన సంస్కారమెంత? తన వ్యక్తిత్వమెంత!

పశ్చాత్తాపంతో కర్తవ్యం మరిచిపోయేలా అందామె.

తప్పుచేసినప్పుడు పశ్చాత్తాపపడితే, పరిహారం జరిగిపోయిందనేగుణం మనిషికో పెద్ద ప్లస్ పాయింట్. ఎంత వెధవపని చేసినా అనక సీక్రెట్‌గా చెంపలేసుకుంటాడు మానవుడు. ప్రస్తుతం ఈ ప్లస్‌పాయింట్ మన రాజకీయ నాయకులకే ఎక్కువ ఉంటోంది. "దేశాన్ని ఎవడికో బేరం పెట్టెయ్యడం అనక అప్పనపల్లికో, తిరపతికో వెళ్ళి చెంపలేసుకోవడం!"

పదిసెకన్లపాటు ఆ ఆలోచననుంచి తేరుకోలేదు కరుణప్రియ -

బెడ్ పక్కగా వెళ్ళింది.

భావనపై చెయ్యేసి తట్టి లేపిందామె.

కరుణప్రియ పరిస్థితిగురించీ, రాజా పరిస్థితిగురించీ - కరుణప్రియకంటే ఎక్కువ ఆలోచించే మనసున్న పిల్లలు వాళ్ళు - పగలంతా ఆలోచనలతోనే గడిపారేమో! అంత త్వరగా లేవలేక పోయారు.

మరో రెండు మూడు సార్లు తట్టిలేపాక, లేచారు వాళ్ళు -

వణుకుతున్న గుండెతో చెప్పింది కరుణప్రియ అసలు విషయం.

ఒకే క్షణం తల తిరిగినట్టనిపించింది వాళ్ళకి - వెంటనే తేరుకున్నారు.

"మరేం చేద్దాం ఇప్పుడు?" ఆదుర్దాగా అడిగింది భావన -

"ముందు లోపలంతా చూద్దాం -" అంది ప్రత్యూష.

"ఈ రూమ్ నుండి మా రూమ్‌లోకి తప్ప మిగత తలుపులన్నీ మూసేసి ఉన్నాయి కదా! మరి ఎటెళ్ళి ఉండచ్చు?" చుట్టూ ఉన్న తలుపులను చూస్తూ అంది కరుణప్రియ.

"మళ్ళీ ఆమెకి సన్నని వణుకు మొదలయింది.

"లేదు! అన్ని తలుపులూ లోపల గడియవెట్టి ఉండకపోవచ్చు. ఏదో ఒక తలుపైనా బైట గొళ్ళెం పెట్టి ఉంటుంది. పదండి చూద్దాం." భావన కదిలింది.

వెంటనే ముగ్గురూ మూడు తలుపుల దగ్గరకూ వెళ్ళారు, మెయిన్ గేటు వేపు ఓ తలుపు, రంగారూమ్ వేపుకే ఓ తలుపు. హాలులోకి ఓ తలుపు కరుణప్రియ బెడ్ రూమ్‌వేపు మరో తలుపూ మొత్తం నాల్గువేపులా తలుపులున్నాయి. రంగా గది వేపుకి ఉన్న తలుపు బైట గొళ్ళెం పెట్టి ఉంది.

గట్టిగా కొట్టబోయింది ఆ తలుపుమీద కరుణప్రియ.

గభాల్న చేయిపట్టి ఆపు జేసింది భావన. కరుణప్రియకి ఆమె ప్రవర్తనకి ఆశ్చర్యమేసింది.

"ఇప్పుడు ఎవర్నీ లేపడానికి ప్రయత్నించవద్దు. ఆ తలుపులుకూడా లోపల వేపున గడియపెట్టి, అందామె.

ప్రత్యూష అలానే చూస్తోంది.

తానే ఆ తలుపులు గడియ పెట్టేసింది శబ్దంకాకుండా.

"ఆ రూమ్‌లోకి పోదాం పదండి" బెడ్‌రూమ్‌లోకి నడిచారు వాళ్ళు.

బెడ్‌మీద కూర్చుని, వాళ్ళని కూడా పక్కన కూర్చోమని సౌజ్ఞ చేసింది కరుణప్రియ.

స్వరం తగ్గించి మెల్లగా మొదలు పెట్టింది—

"శశిగారు ఎలా చనిపోయిందీ ఇప్పటికీ మనకి ఎవరికీ తెలియదు. మనవాళ్ళలోనే ప్రమాదకరమైన మనుషులెవరో ఉన్నారని రాజాకూడా అనుమానిస్తున్నాడు. వాళ్ళెవరో కనుక్కోవాలనే ప్రయత్నంలోనే బైటకి వెళ్ళివుంటాడు. లేకపోతే రాజాకి ఈ టైంలో అతిరహస్యంగా, ఎంతో ప్లాన్డ్‌గా బైటకివెళ్ళే అవసరం లేదు ..."

కరుణప్రియ, ప్రత్యూషలు ఊపిరి పీల్చుకోవడం మానేశారు. మళ్ళీ చెప్పడం మొదలెట్టింది భావన –

"అంత ప్లాన్డ్‌గా వెళ్ళినప్పుడు ఆత్మరక్షణకోసం తక్కువశ్రద్ధ తీసుకునేరకం కాదు, మనరాజా. కాబట్టి మనం అందర్నీ లేపి, అల్లరిచేసి, రాజాప్లాన్‌ని పాడుచేసి, ఫ్లాప్ అయ్యేలా చేయడంకంటే, కొంతసేపు వెయిట్ చేయడం ఎంతైనా మంచిది" చెప్పిందామె.

"మరి తలుపులు ఎందుకు మూసేశాం ?" అడిగింది ప్రత్యూష.

"ఈలోగా ఎవరైనా ఇక్కడ రాజా లేడని తెలుసుకుని, మనకి హానిచేయడానికి రాకుండా, మన ఆత్మరక్షణకోసం అన్నమాట !"

"ఒకవేళ రాజా వస్తే .... ఎలావస్తాడు లోపలికి ?"

"ఆఁ! నాతో చెప్పాడు. ఒకవేళ ఎప్పుడైనా తాను బైటకి వెళ్ళినప్పుడు ఒక విధంగా అయిదుసార్లు తలుపుమీద శబ్దంచేసేవరకూ తెరవవద్దని చెప్పారు."

"కరెక్ట్! చూశావా నే గెస్ చేసింది నిజమన్నమాట! తాను బైటకి ఇంత

ప్లాన్ చేసుకుని వెళ్ళారన్నమాట. అందువల్ల మనజాగ్రత్తలో మనముందాం" తేల్చి చెప్పేసింది భావన.

ఎంత ధైర్యవంతురాలయినా ఆమెకూడా ఓ ఆడపిల్లేకదా – మనసులోమాత్రం రాజాగురించి భయపడ్తూనే ఉంది. ఆ ముగ్గురి పరిస్థితీ దాదాపు అలానే ఉంది.

ముగ్గురూ ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని ఉన్నారు. ఒకరికెదురుగా ఒకరు, మోకాళ్ళ చుట్టు చేతులు కట్టుకుని, ఆలోచనలతో, భయంతో, ఆవేదనతో .... కూర్చుని ఉన్నారు.

20

గెస్ట్ హౌస్ దగ్గరకి సర్రున దూసుకుంటూ వచ్చింది కారు.

రంగాతో గేటు లోపల వేపు తాళం వేయమని చెప్పాడతను వచ్చేటప్పుడు తెల్లవారేవరకూ గేటు తాళం తెరవదు. "రంగా ఇప్పుడు అదమరచి పడుకుని ఉండచ్చు !"

"ఎలా ?"

తానెంత స్పీడుగా డ్రైవ్ చేసుకుంటూ వచ్చినప్పటికీ, ఆ కారు శబ్దానికి, లైట్ల కాంతికి అడ్డదార్లంట పరిగెత్తుకుంటు, తమ వేపు వచ్చేస్తున్నారు గూడెం వాళ్ళు.

"ఇప్పుడెలా ?" అదే ప్రశ్న కొన్ని వందలసార్లు రిపీట్ అయిందతని మనస్సులో.

అతి దగ్గరలో గూడెం వాళ్ళు ... !

పక్కన బేలగా కళ్ళప్పగించి చూస్తున్న గిన్నా ... !

"నేచనిపోతూ కూడా నిన్ను ఆరాధనగా చూస్తూనే చనిపోతా! అన్నట్టున్నాయామె చూపుల భాష్యాలు.

అర సెకనులో అతని మెదడు, కంప్యూటర్ కన్నా వేగంగా పనిచేసింది,

తాను లోపలికి గేటు దూకే సమయంలేదు.

గిన్నాను వదిలిపెట్టే మాటే లేదు.

అవును అదొక్కటే మార్గం ... !

ప్రస్తుతానికి అదే చక్కని ఉపాయం!

ఆమె అయోమయంగా చూస్తోంది. భయం భయంగా చూస్తోంది. నోరెండిపోయినట్లు నాలుక తడారిపోయినట్లు బేలగా, నిర్జీవంగా !

అమాంతం ఆమెని ఎత్తుకొని డిక్కీలో పడేశాడు రాజా! ఆ చర్యకి ఆమె దుబ్బున పడింది డిక్కీలో .... కాళ్ళు రెండూ దగ్గరగా లాక్కుంది. ఆమె పైన తాను పడ్తూనే డిక్కీలోపలవైపు లాక్ చేసేశాడు రాజా! దాదాపు మీటరు పొడవు అర మీటరు వెడల్పు అరమీటరు ఎత్తు ఉన్న ఆ డిక్కీలో .... ఆమె .... అతను .... !

బైట కోలాహలం వినిపిస్తోంది.

బాగా దగ్గరగా వచ్చినట్టున్నారు వాళ్ళు.

చుట్టు వెతుకుతున్నారు - అరచేతులతో బలంగా కారుమీద బాదుతున్నారు - బయ్యాంక్ అందర్నీ ఉద్దేశించి అంటున్నాడు -

"అరవకండి - జాగర్తగా చూడండి - తుప్పల్లోనూ పొదల్లోనూ వెతకండి - ఈ బండిదిగి పారిపోయారు వాళ్ళు ...."

గేటు తాళాం వేసి ఉన్నందువల్ల వాళ్ళు లోపలికి వెళ్ళి ఉండరనే ఆలోచన అతనిది.

తలో పక్కకీ పరుగులు తీశారు వాళ్ళు ...

కారుని చాలా పరీక్షగా చూడ్డం మొదలు పెట్టాడు బయ్యాంక్ కారుకింద, సీట్ల కింద ...

"ఎక్కడ దొరికితే అక్కడ నరికెయ్యండి !" అరిచాడు కోపంతో -

అందరి దగ్గర బరిసెలు, గొడ్డళ్ళు, కర్రలు ఉన్నాయి - ఆ చుట్టు పక్కల అడుగడుక్కీ జాగ్రత్తగా వెతుకుతున్నారు వాళ్ళు.

అందులో కొంతమంది కుర్రాళ్ళకి చాలా కోపంగా ఉంది గిన్నామీద. వాళ్ళు ఆమెని మనువాడదామనుకున్నారు, కానీ ఏ ఒక్కరినీ ఇష్టపడలేదామె.

అప్పటి వరకూ ఆమె చిన్నపిల్లలా అడవుల్లోకి సరదాగా తిరగడానికి పోయేది. ఆమె వయసుకి కోర్కెలు రాజాని చూసిన దగ్గర నుండే మొదలయ్యాయి ఇప్పుడామె జీవితమే వాడిపోబోతోంది. బయ్యాంక్ చాలా క్రూరాత్ముడు. కన్న కూతురైనా సరే, తనను ఎదిరించిన వారిని వదిలిపెట్టడు. ఒకవేళ వదిలి పెడితే తాను నాయకుని పదవినుండి వైదొలగాలి. అలాచేసేకంటే ఆత్మాహుతికే సిద్ధపడటం ఉత్తమమని బయ్యాంక్ భావిస్తాడు.

21

కరుణప్రియ, భావన, ప్రత్యూష ఆ గోలనిలీలగా వినగలుగుతున్నారు.

కానీ తలుపులు తెరవడానికి వాళ్ళకి ధైర్యంలేదు.

"రాజా బైటకి ఎందుకు వెళ్ళాడు ? వెళ్ళినా అంత రహస్యంగా ఎందుకు వెళ్ళాడు ? తనతో ఒక్క మాట చెప్పినా బాగుండేది కదా ! కరుణప్రియకి ఆలోచనలు ముసురుకుంటున్నాయి.

బైట గోల ఏమిటో భావన గ్రహించలేక పోతోంది.

ప్రత్యూష జ్వరం వచ్చినదానిలా వణికిపోతోంది.

ఇక్కడ - అయిదారు నిమిషాలసేపు ఆ వాతావరణపు పరిస్థితికి, భయానికీ, రాజా తేరుకోలేక పోయాడు. గిన్నా మాత్రం వేదాంతిలా చిరునవ్వు నవ్వుతూనే ఉంది రాజావేపు చూస్తూ.

చచ్చిపోతాననే ఆలోచనతప్ప బ్రతుకుతాననే ఆశలేదామెకి ఏ కోశానా. కానీ

తృప్తిగా ఉందామెకి - మరణాన్ని సులువుగా, చిరునవ్వుతో ఆహ్వానిస్తోందామె,

ప్రాణ చింతనలేదు. తీపి తీపి ఆలోచనలులేవు.

కేవలం కామవాంఛవల్లే ప్రాణాన్ని పోగొట్టుకుంటున్నాననే తృప్తి: తన కోరికని మన్నించినందుకు - రాజా సన్నిధిలో ప్రాణాలర్పించాలం చేనే ఆనందంగా ఉందామెకి,

కళ్ళు చెమర్చాయి రాజాకి !

పరోక్షంగా, ప్రత్యక్షంగా కూడా గిన్నా ప్రాణాల్ని తనే బలితీసుకుంటున్న ఫీలింగ్ అతనిది.

బయట కోలాహలం కాస్త తగ్గింది. బయ్యాంక్ ఒక్కడే అక్కడ తారట్లాడుతున్నట్లుగా, మిగిలినవాళ్ళందరూ దూరంగా వెతుకుతున్నట్లుగా స్పష్టంగా తెలుస్తోంది రాజాకి.

ఆ అయిదు నిమిషాలు తామిద్దరూ పడున్న స్థితిని రాజా గమనించలేదు, ఆమెకి ఆ స్థితీ ఆనందంగానే ఉంది.

అణువణువూ ఆమె శరీరాన్ని, అందునా ముప్పావు నగ్న శరీరాన్ని తాకుతూ ఉన్నాడతను.

అమె నునుపైన చెక్కిళ్ళ మీదున్నాయతని పెదాలు, అదురుతూ !

పరీక్షగా ఆమెను, ఆమె పడుండిన స్థితినీ చూశాక సహజంగా ఉద్రిక్తుడయ్యాడతను. మెల్లగా, తనకు తెలియకుండానే తనకోర్కెల బుసలు అతనికి తెలిసొచ్చాయి.

ఆ పరిణామం కోసమే కాచుకొని ఉన్నట్టుగా ఆమె బలంగా హత్తుకొందాతనిని,

బయట కోలాహలం ఇప్పుడు వాళ్ళకి తెలియడంలేదు.

అతిచిన్న గుహలాంటి ఆ కారు డిక్కీలో వాళ్ళ శ్వాసలు బరువుగా మారినయ్. వాళ్ళ శ్వాసలుతప్ప మరేం వాళ్ళకి వినిపించడంలేదు,

మళ్ళీ...

తమకం ...

తన్మయత్వం ...

ఈ రెంటి సంగమాలలో తడిసిపోయాయి వాళ్ళ కోరికలు. ఆ ఆనంద వాహినిలో స్వేచ్ఛగా వాళ్ళు అవని ఆవల తీరాలకి తేలిపోయారు.

* * * *

"ఠంగ్‌గ్‌గ్‌గ్‌గ్" వాల్‌క్లాక్ గంటగొట్టింది.

పిడుగు పడ్డట్టు ఝడుసుకున్నారు వాళ్ళు ముగ్గురూ.

అలా 12 గంటలు కొట్టిందాగడియారం -

బయట కోలాహలం పూర్తిగా తగ్గిపోయినట్టుంది. అంతకంటె భయంకరంగా వాళ్ళ గుండెలు గుబగుబలాడుతున్నాయి.

"ప్లీజ్ ,..." సాయం రమ్మనమని భావనని అడిగింది ప్రత్యూష -

భావన లేచి వెంట నడిచింది. బాత్‌రూమ్‌వైపు నడిచింది.

కరుణప్రియమాత్రం రాజాకోసమే ఆలోచనలో మునిగిపోయింది. బయట ఏదో జరుగుతోందని గ్రహించిందామె. కళ్ళు బాగా విప్పార్చి, చెవులు రిక్కించి వినడానికి బాగా ప్రయత్నిస్తోంది.

గట్టిగా అరిచి బాత్‌రూమ్‌లో స్పృహతప్పి పడిపోయింది ప్రత్యూష.

ఆ అరుపుకి భావన బాత్‌రూమ్‌లో జొరపడింది. ప్రత్యూషను లేవనెత్తి బయటకు తీసుకొచ్చి, వేగంగా మళ్ళీ బాత్‌రూమ్‌లోకి వెళ్ళింది.

బాత్‌రూమ్‌కి ఉన్న వెంటిలేటర్‌లోంచి వినిపించిందో శబ్దం –

బయట ఆరూమ్ వెనుకగా ......

గట్టిగా .... గట్టిగా ....

"గర్‌గర్ గర్‌ర్‌ర్ ...."

అమాంతం అక్కడనుండి ఒక్క అంగలో కరుణప్రియనుజేరి, ఆమెనుకూడా తీసుకెళ్ళింది –

ఈసారి మరింత ఎక్కువయిందా శబ్దం.

గర్‌ర్ .... గర్ ర్రు .... గర్‌ర్ గర్ గర్ .... గర్ గర్ ...

సెకన్లలో ఆ చుట్టుపక్కలంతా అదేశబ్దం ప్రతిధ్వనించ సాగింది –

నిద్దర్లో ఉంటే ఆ శబ్దం వాళ్ళకు వినిపించకపోనేమో–మెలుకువగా భయంతో ఉన్నందువల్ల రెట్టింపు ధ్వనితో వినిపిస్తుంది.

ఆదేసమయానికి అయిదు నిమిషాల్రకితం –

అక్కడ ....

రాజా ...

గిన్నా !

గరిష్ఠస్థాయికి చేరుకున్న వారి కోరికలని సంతృప్తి చల్లార్చింది.

గిన్నా పెదవులనుండి బలవంతంగా తన బుగ్గల్ని పక్కకు తీసుకున్నాడు రాజా. అతనికిప్పుడు ఆమెమీద ఎంతో అభిమానం –

తాను సంతృప్తిపడి, తనను సుఖపెడ్తున్నవాణ్ణి సంతృప్తి పరిచే ఏస్త్రీకిఅయినా మొగాడు అంతే అభిమానం చూపిస్తాడు.

కరుణప్రియకి ఉన్నంత స్థానాన్ని గిన్నాకూడా రాజా మనసులో సంపాదించ గలిగింది.

మరికొంతసేపట్లోనే చనిపోతుందనే సానుభూతి, ఆ అభిమానానికి జోడైంది. ఆ ఆపదనుండి ఆమెను రక్షించగలిగితే నగరానికి తనతో తీసుకు పోవాలనిపించింది రాజాకి.

తనకోసం, తను ఇచ్చే శారీరక సుఖంకోసం ఆత్రులుచూస్తూ వచ్చిన ఆమె సుకుమార సౌందర్య శరీరం – గూడెంవాళ్ళ చేతుల్లో పడితే ముక్కముక్కలైపోతుం

దనే ఆలోచన ముల్లులా గుచ్చుతోందతని మనసుని.

ఆమెనుండి పక్కకు జరిగాడు. ఇద్దరూ ఎదురెదురుగా ఉన్నారు.

దాంపత్య సుఖాన్ని మనసారా చవిచూసిన ఆమె నీలికళ్ళు సంతృప్తి ధారలతో నిండిపోయున్నాయి. సన్నగా మూలిగిందామె.

ఆమె మొహానికి పట్టిన చెమటని తుడుద్దామనే ఉద్దేశంతో కర్చీఫ్ తీసి ప్రేమగా ఆప్యాయతగా, అనురాగంతో చేయివేశాడు రాజా –

అలాంటి చర్యలే మనసులోతుల్లోని ప్రేమ కొలతల్ని తెలియజేస్తాయి. అటువంటి ఆలోచనలు పరిస్థితుల ప్రమేయం లేకుండా – ప్రేమ ఉన్నపుడే వస్తాయి.

అలసటతో చెమటల్లు పట్టేశాయామెకి –

రాజా తన చేతనున్న కర్చీఫ్‌తో ఆమె వదనాన్ని ప్రేమగా తుడిచాడు.

"దొరా ! నేనిక చచ్చినా ఫర్వాలేదు నా ఆశ తీరిపోయింది. నీ మదిలో చోటు చేసుకున్నాను. నీకు నా శరీరాన్నర్పించాను. నాకు ఇంతేచాలు – ఈ బతుకేమయిపోయినా ఫర్లేదు. నాకూ నా అక్కగతే పట్టింది. మా ఇద్దరి చావులూ ఇలాగే రాసిపెట్టాడన్నమాట ఆ దొర –"

ఇంకా ఏమో చెప్పబోతోంది గిన్నా –

"ఏమైంది మీ అక్కకేమయ్యింది !" కుతూహలంగా అడిగాడు రాజా.

"అక్క మీ అన్నదొరమీద మనసు పడింది కాని, మీ అన్నదొర దాన్ని దరి చేరలేదు. మా అయ్యకి ఆ విషయం తెల్సు. అప్పుడు మా అయ్యకూడా దాన్ని కొప్పడ్డాడు. కానీ ఓ రాత్రది చెప్పా చెయ్యకుండా మీ అన్నదొర దగ్గరికి వచ్చేసింది. ఇగో ఈ ఇంటికే ... అప్పుడు మీ అన్నదాన్ని కలిశాడు.

మా ఆయ్యా ఓ సారి వొద్దన్నాక ఇక జన్మకి 'జే'ననడు మా అయ్య మాట ఖాతర చెయ్యనందుకే దాన్ని చంపేశారు మా గూడెపోళ్ళు ..."

"ఎప్పుడు ? ఎప్పుడు జరిగిందిదంతా ? ..." కుతూహలంతో రాజా అడిగాడు, ఆమెని పట్టి కుదుపుతూ –

"సరిగ్గా నెలామె. గత పున్నానికే !"

గభాల్న గిన్నాని వదిలేశాడు రాజు !

అతని గుండాగిపోయినట్టయింది – వెన్నులోంచి చిరు వణుకు –

"ఏవిటిది ? ఏవిటిది ? అన్నని గూడెం వాళ్ళే చంపేశారా ? ..." గొణుక్కుంటూనే పైకి అన్నాడతను.

"చ చ లేదు. గూడెంవాళ్ళు మీ అన్నదొరనేమీ అన్లేదు. మా అక్కనే చంపేశారు. కానీ భయపడిపోయి మీ అన్నదొర అడవుల్లోకి పారిపోయ్యాడు"

నెత్తిన చెయ్యేసుకుని నమ్మకంగా చెప్తోందామె.

అతనికి కడుపులో దేవినట్టవుతోంది –

అతని కళ్ళల్లో నీళ్ళు -

ఆమె జాలిగా చూస్తోంది -

"రాజాదొరా! నిన్ను బాధపెట్టానుకదూ ... నిన్ను భయపెడ్తున్నానుకదూ... దొరా, ఇప్పుడు నేను దొరికిపోయినా, నీవు మాత్రం పారిపోకు దొరా ... మళ్ళీ నిన్ను కూడా ఏదైనా జంతువు చంపేస్తుంది ... చంపేస్తుంది ..." వెక్కి వెక్కి ఏడుస్తోంది గిన్నా .... అతని వాటేసుకుని -

అతనికి అయోమయంగా ఉంది.

ఆమెని ఓదార్చాలని ఉంది - ఆమెని కాపాడాలనివుంది -

ఎవరిమీదో తెలియని కసిగా ఉంది - ఉక్రోషంగా ఉంది -

కానీ అప్పటికే ఆలస్యమైపోయింది.

బాధలో, ఆవేశంలో వాళ్ళిద్దరూ వర్తమానాన్ని మర్చిపోయి గట్టిగా మాట్లాడేసుకుంటున్నారు. ఆ మాటలు గూడెంవాళ్ళకి వినిపించాయి. మరుక్షణంలో డిక్కీమీద బళ్ళెలు తంగు తంగున మోగాయి.

మెరుపులా తెరుచుకుంది డిక్కీ -

రాజా, గిన్నా ఒకరినొకరు కరుచుకుపోయి ఉన్నారు.

గిన్నా గట్టిగా కళ్ళుమూసుకుని 'దొరా దొరా' అంటూ ఆర్తిగా అరుస్తోంది.

రాజా శరీరం అతని అధీనంలో లేదు.

అరసెకనుకూడా కాకముందే ...

గిన్నా భయంకరమైన ఆర్తనాదం ఆ అడవిలో గింగిర్లు తిరిగింది. ఓ గూడెపు మనిషి చేతుల్లోని విషం పూసిన బళ్ళెం గిన్నా కడుపులో దిగబడింది.

ఒకటి, రెండు, మూడు - పదులు ... అన్నీ బళ్ళెలపోట్లే -

నీలం రంగులోకి మారిపోయిన గిన్నా మరుక్షణానికి నిర్జీవంగా పడిపోయింది మరునిమిషంలో ....

"మా అడవితల్లి" "మా తోడేలుదొరా"....అంటూ బిగ్గరగా అరుచుకుంటూ గూడెంవాళ్ళంతా పరుగు పరుగుల్తో వెనుదిరిగి చీకట్లో సాగిపోసాగారు.

"చాంగుభళా - బయ్యాంకుదొరా" "చాంగుభళా తోడేలుదేవా" అంటూ వాళ్ళుచేసే నినాదాలన్నీ ఆ ప్రాంతమంతా మార్మోగుతున్నాయి.

రాజా కళ్ళు తెరిచేఉన్నా అతనికేమీ కన్పడటంలేదు,

అతని చెవులు ఏవీ వినడంలేదు.

అతని చేతుల్లోని గిన్నా శవంనుండి పారుతున్న ఎర్రెర్రటి రక్తం అతనికి తడితడిగా తగలడంలేదు -

అతనింకా ఆ 'షాక్'లోంచి తేరుకోలేదు.

మళ్ళీ ఆ ప్రదేశంలో అతి భయంకరమైన నిశ్శబ్దం -

అక్కడ శవం ఉన్నట్టు ఎలా పసిగట్టాయో ఏమో? అడవి జంతువులొక్కొక్కటే దూరంనుండీ అరుస్తున్నాయ్ -

ఆ అరుపులు అంతకంతకూ దగ్గరవుతున్నాయి —

ఒక్కసారి ఉలిక్కిపడి తల విదిలించాడతను.

జరిగిందేవిటో తెలిసొచ్చిందతనికి -

అడవిమృగాల ఉనికి దగ్గరవుతోంది, అంతకంతకూ -

మరేమీ ఆలోచించకుండా అమాంతం గిన్నా శవాన్ని మళ్ళీ డిక్కీలోకి విసిరేస్తూ, తానుకూడా లోపలికి నక్కి, డిక్కీమూసేశాడు -

డిక్కీఅంతా చొట్టలుపోయి, సరిగా మూతపడటంలేదు. గట్టిగా వొడిసి పట్టుకుని లోపలనుండి సాధ్యమయినంతగా దాన్ని మూసి అలానే గట్టిగా పట్టుకుని కూర్చుండిపోయాడతను. అతని కుడిచేతిలో రివాల్వర్ గర్జించడానికి సిద్ధంగా వుంది.

అలా ఎంతసేపుండిపోయాడో తెలీదు.

కొంతసేపటికి -

'కిర్రు'మంది గెస్ట్‌హౌస్ గేటు.

మరో అరనిమిషానికి అడుగుల సవ్వడి చెవిసోకిందతనికి -

"టక్ ... టక్‌టక్ .... టక్ .... ట...క్...టక్"

సందేహంలేదు!

ఎవరో అక్కడ తచ్చాడుతున్నారు,

రాజాగుండె ఝల్లుమంది -

శరీరమంతా సన్నగా వొణుకు, భయం -

ధైర్యం చేసుకుంటూ -

ఆ అడుగుల శబ్దంలో కలిసిపోయేలా డిక్కీని మెల్లగా పావు అంగుళంమేర పైకెత్తి ఆ సందులోంచి కళ్ళు చిట్లించి చూడ ప్రయత్నించాడు రాజా.

గేటు తాళం అతి కొద్దిగా తెరిచి, శబ్దం కాకుండా నక్కి నక్కి బయటకొచ్చాడో వ్యక్తి -

అతని చేతిలో వృత్తాకారంలో వున్నదోవస్తువు -

కారునిచూసి అతని కాళ్ళు తక్కువ ఆగిపోయాయి -

కారుచుట్టూ తిరిగొచ్చాడతను -

ఎందుకైనా మంచిదనుకున్నట్టుగా అక్కడినుండి వడివడిగా నిశ్శబ్దంగా అడుగులేసుకుంటూ చీకట్లోకి వెళ్ళిపోయాడు -

రాజాకి అదంతా అయోమయంగా ఉంది.

ఓపక్క భయం, మరోపక్క అనుమానం, అయోమయం -

తెల్లారేవరకూ, గెస్ట్‌హౌస్‌లోనిజనం అంతా మేల్కొనేవరకూ అతను డిక్కీలోంచి బయటపడదల్చుకోలేదు -

మరోగంటపైనే గడిచింది -

అతని పరిస్థితి నరకప్రాయంగా ఉంది.

రక్తపు మడుగులో పడున్న ఓ హత్య చేయబడ్డ మనిషి సమక్షంలో, భయంతో బాధతో, అయోమయంతో అలా కూర్చునే వున్నాడతను.

ఇందాకటి అడుగుల సవ్వడి వడివడిగానే దగ్గరవుతున్నది -

మళ్ళీ చాకచక్యంగా, శబ్దం రాకుండా డిక్కీని ఈసారి అంగుళంమేర పైకెత్తాడు రాజా.

వెలుగొస్తోంది -

తెల్లవారబోతోంది -

ఆ వొచ్చేవ్యక్తి గెస్టుహౌస్ సెక్యూరిటీగార్డు జస్వంత్ !

కారునిదాటి, గెస్ట్‌హౌస్ గేటుదగ్గరకి వెళ్ళిపోయాడు జస్వంత్. అతని చేతిలో నల్లటి కుండ ఉంది.

కుడిచేత్తో రివాల్వర్‌నీ, ఎడంచేత్తో డాగర్‌నీ ఎలర్ట్‌గా పట్టుకుని డిక్కీలోంచి ఠంగున బయటకి దూకాడు రాజా !

జస్వంత్ ఠక్కున ఆగిపోయాడు -

రివాల్వర్‌ని గురిచేసి "ఆగు !" అరిచాడు రాజా.

భయంతో గిర్రున వెనుదిరిగాడు జస్వంత్ -

కోపంతో పళ్ళు కొరుకుతూ రెండడుగులు ముందుకేశాడు రాజా. అతని కోపానికి కారణం, అప్పటివరకూ అతననుభవించిన మానసికస్థితే !

రాజాని చూడగానే జస్వంత్‌కి పైప్రాణాలు పైనే పోయినంత పనయ్యింది. వణికేస్తున్నాడతను. వణుకుతున్న అతని చేతుల్లోంచి పట్టుతప్పి ధబ్బున నేలకిపడింది నల్లటి కుండ.

ఆకుండ పగిలిపోయి, అందులోంచి తెల్లటి ద్రవం నురగలతో పల్లానికి పారుతోంది.

"ఏవిటిది ? ఎక్కడికెళ్లొస్తున్నావ్ ? తెల్లారేవరకూ గేటు తెరవద్దంటే ఎందుకు తెరిచావ్ ?... ఏం చేశావ్ ? చెప్పు ..., చెప్పు .... ఒక్కొక్క ప్రశ్నకూ అతని గుప్పిళ్ళు గట్టిపడ్డాయ్ -

విప్లవంగా పెల్లుబికిన కోపంతో జస్వంత్‌ని గుద్దుతున్నాడు రాజా ...

"బాబూ ! నేనే తప్పు చేయడం లేదు బాబూ .... మీకుగానీ, పెదబాబుకి గానీ, తెల్లియకుండా చేసే తప్పు ఇదొక్కటే బాబు, ఇది నా మానుకోలేని అలవాటు బాబూ, కల్లు ... కల్లుబాబూ అంతే .... నన్ను కొట్టకండి ... నన్ను చంపకండి బాబూ..." రాజా కాళ్ళని చుట్టేసి బిగ్గరగా ఏడుస్తున్నాడు జస్వంత్.

"కల్లా ? య్యూ ! ఎంత టెన్షన్ తెప్పించేశావురా" ఉక్రోషాన్ని ఆపుకోలేక అమాంతం జస్వంత్‌ని గాలిలోకి ఎత్తి దూరంగా గిరాటేశాడు రాజా.

కీచుగా అరుస్తూ దుబ్బున పడ్డాడు జస్వంత్

అంతలో తెల్లారిపోయింది.

రంగా మెల్లగా నిద్రలేచి బయటకొచ్చాడు -

గేటు దగ్గర రాజానీ, నేలమీదపడి ఏడుస్తున్న జస్వంత్‌నీ చూసి అందర్నీ నిద్ర లేపుతూ అమాంతం పరిగెత్తుకొచ్చాడు రంగా

కరుణప్రియ, భావన, ప్రత్యూష, రంజిత్, మిగిలిన అందరూ అక్కడికి పరుగు పరుగున వచ్చారు.

అందరిలోనూ అయోమయం -

ఏమీ అర్థంగాని స్థితి -

రాజా ఆజ్ఞమీద, రంగా కారు డిక్కీలోంచి గిన్నా శవాన్ని బయటకు లాగాడు.

కరుణప్రియ చిన్న పిల్లలా అమాంతం రాజాని వాటేసుకుని బావురుమంది.

మిగిలినవాళ్ళంతా అయోమయంగానే బిక్క బిక్కగా చూస్తుండిపోయారు.

• • •

రాజా అనుమానాలన్నీ నివృత్తి అయిపోయాయి - ఎవరూ చంపకుండానే, అడవి జంతువుల వల్లే శశి చచ్చిపోయాడన్నది ఋజువయింది. అతడికిప్పుడు ఎవరి మీద అనుమానం గానీ, కోపంగానీ లేవు. కాపీ గిన్నాని తల్చుకుని మాత్రం విలవిల్లాడి పోతున్నాడు. అన్నగారి వియోగం మాత్రం బాధగానేవుంది.

మరి కొద్ది గంటలకు -

గిన్నా మీది ప్రేమతో, ఆమె శవాన్ని గూడెం వాళ్ళకి అప్పగిస్తే మళ్ళీ ఏ అనర్థం వస్తుందో అనేఅనుమానంతో తానే ఆమె దహన సంస్కారాలన్నీ ముగించాడు.

ఆమధ్యాహ్నానికి -

మిగిలిన సామానంతా ప్యాక్ చేయించి, సెక్యూరిటీ గార్డులు, వాళ్ళ కుటుంబాలతోసహా, అందర్నీ తీసుకుని,

ఆ గెస్ట్‌హౌస్ ఖాళీ చేసేసిన తర్వాత -

కదిలాయి రాజా వాహనాలన్నీ,

వాటిలో వెనగ్గా వెళ్తున్న కారులో ఉన్న కరుణప్రియ, తన పక్కనున్న రాజా ఒళ్ళోకి ఒరిగిపోయి ప్రేమగా, ఆరాధనగా అతని కళ్ళల్లోకి చూస్తోంది -

భావన, ప్రత్యూషలు తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నారు -

ఆ ప్రదేశాన్ని దాటి ఆ వాహనాలు ఊడలమర్రి మీదుగా సాగిపోతున్నప్పుడు మర్రిచెట్టు గుబురుల్లోంచి తలలు బయటికిపెట్టి చూస్తున్నారు కొంతమంది-

వాళ్ళు బందిలబర్రి బయ్యాంక్, అతని అనుచరులు.

తమ ప్రాంతంనుంచి వెళ్ళిపోతున్న రాజాకి వీడ్కోలు చెప్పడానికే వాళ్ళంతా అక్కడ ఉన్నారు.


అందరికళ్ళల్లోనూ నీళ్ళే. కానీ ఏ ఒక్కరూ చెట్టుదిగి క్రిందకి రాలేదు.

రాజా, కరుణప్రియ కార్లోంచి దిగి, వాళ్ళకి అభిమానంగా నమస్కరించారు.

తిరిగి భారంగా కార్లో కూర్చున్నారు -

కార్లు కదిలాయి - భారంగానే!





నవజ్యోతి పబ్లికేషన్స్
ఏలూరురోడ్, విజయవాడ-2